www.andhrajyothy.com
వెల (Price) : Rs. 6.50
వరంగల్
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
సంపుటి (Volume) : 22
సంచిక (Issue) : 266
మంగళవారం | 24-12-2024
పేజీలు: 14
శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, బహుళపక్షం; తిథి: నవమి రా. 7.53 తదుపరి దశమి; నక్షత్రం: హస్త మ. 12.17 తదుపరి చిత్త; వర్జ్యం: రా.9.18-11.07; దుర్ముహూర్తం: ఉ.8.57-9.41, రా.10.00-10.51; అమృతఘడియలు: తె.ఉ.7.18; రాహుకాలం: మ.3.00-4.30; సూర్యోదయం: 6.45; సూర్యాస్తమయం: 5.43
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

క్రిస్మస్‌కు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న చర్చిలు ముస్తాబు అవుతున్నాయి. విద్యుద్దీపాల వెలుగుల్లో మెరిసిపోతున్నాయి. పండుగను వైభవంగా నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. (చిత్రంలో సికింద్రాబాద్‌లో సెయింట్ మేరీ చర్చి)



విచారణకు రండి

ఉదయం 11 గంటలకు రావాలని అల్లు అర్జున్‌కు పోలీసుల నోటీసు

నేటి నుంచి రోజువారీ విచారణ?



బడ్జెట్ పెరిగితే టికెట్ రేట్లు పెంచాలి

సీఎంను కలిసే అంశంపై దిల్ రాజు వచ్చాక నిర్ణయం: నిర్మాత నాగవంశీ

ధరల పెంపు మధ్యతరగతికి భారం

ప్రభుత్వం నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

ఏపీ ప్రభుత్వమూ ఇలాగే చెయ్యాలి

ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ ప్రకటన

శ్రీతేజ్‌కు 'పుష్ప' నిర్మాతల పరామర్శ

కోమటిరెడ్డితో కలిసి ఆస్పత్రికి వెళ్లి అతడి తండ్రికి రూ.50 లక్షల చెక్



తాజా పరిణామాల రీత్యా అల్లు అర్జున్ ఇంటి ముందు పోలీసు బందోబస్తు

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మధ్యంతర బెయిల్‌పై ఉన్న నటుడు అల్లు అర్జున్‌కు చిక్కడపల్లి పోలీసులు నోటీసులు జారీ చేశారు. సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనపై మరింత లోతైన దర్యాప్తు చేసేందుకు మంగళవారం ఉదయం 11 గంటలకు హాజరు కావాల్సిందిగా ఆ నోటీసులో పేర్కొన్నారు. తొక్కిసలాటలో రేవతి అనే మహిళ చనిపోగా.. ఆమె కుమారుడు శ్రీతేజ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సంగతి తెలిసిందే. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు 18 మంది మీద కేసులు నమోదు చేశారు. అల్లు అర్జున్‌ను 11వ నిందితుడిగా చేర్చారు. ఆయన్ను అరెస్టు చేసి కోర్టులో ప్రవేశ పెట్టగా న్యాయస్థానం రిమాండు విధించింది. అల్లు అర్జున్ దీనిపై హైకోర్టును ఆశ్రయించగా రూ.50 వేల వ్యక్తిగత

మిగతా 12వ పేజీలో...

12

1 అల్లు అర్జున్‌పై రాష్ట్ర సర్కారు కక్షసాధింపు: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

1 రేవంత్ నిర్ణయాన్ని సమర్థిస్తున్నా: ఏపీ బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు

1 బన్నీ ఇంటిపై దాడి ఘటనలో నలుగురు కొడంగల్‌వాసులు: డీకే అరుణ

పోలీసు బట్టలూడదీసిన స్మగ్లర్ సినిమాకు జాతీయ అవార్డా?

'జైభీమ్'ను ఎందుకు విస్మరించారు?

'పుష్ప'పై మంత్రి సీతక్క వ్యాఖ్యలు

సినీ తారలది రాతి హృదయం

రూపాయి కూడా ఖర్చు పెట్టరు

సోనూ సూద్, సమంత, మంచు లక్ష్మి నయం: ఎమ్మెల్యే యెన్నం

సినీ పరిశ్రమకు ప్రభుత్వం వ్యతిరేకం కాదు: ఎంపీ చామల

బెయిలుపై ఉన్న అర్జున్ ప్రెస్‌మీట్ ఎలా పెట్టాడు?: బీహెచ్


అర్జున్‌వన్నీ అబద్ధాలే: రోహిన్‌రెడ్డి

గాంధీభవన్‌కు అల్లు అర్జున్ మామ

దీపాదాస్ మున్షీతో సమావేశం

అల్లు అర్జున్ ఇంటిపై దాడికి పాల్పడ్డ ఓయూ జేఏసీ నేతలకు బెయిల్

శ్రీ తేజ్ కళ్లు తెరుస్తున్నాడు: తండ్రి



శ్యామ్ బెనగల్ ఇకలేరు

అనారోగ్యంతో ప్రముఖ దర్శకుడి మృతి

1934లో సికింద్రాబాద్‌లో జననం

ఓయూ నుంచి ఆర్థికశాస్త్రంలో పీజీ

1973లో అంకుర్ చిత్రంతో అరంగేట్రం

8 జాతీయ అవార్డులు సొంతం

పద్మశ్రీ, పద్మభూషణ్, దాదాసాహెబ్ ఫాల్కే, ఏయన్నార్ జాతీయ పురస్కారాల గ్రహీత

భారతీయ సినిమాకు సామాజిక వన్నెలద్దిన దిగ్గజ సినీ దర్శకుడు.. భూదాన్ పోచంపల్లి చేనేత కార్మికుల జీవితాలను తెరకెక్కించిన సృజనశీలి.. తెలంగాణ పల్లె జీవన చిత్రాన్ని ప్రపంచానికి పరిచయం చేసిన కళాకారుడు.. శ్యాంబెనగల్ ఇక లేరు. బాల్యం నుంచే సినిమాలను విపరీతంగా ఆరాధించిన ఆయన భారతీయ సినీ పరిశ్రమకు కేంద్రమైన ముంబైలో కన్నుమూశారు. సికింద్రాబాద్ సమీపంలోని అల్వాల్‌లో పుట్టి, ప్రపంచ ఖ్యాతి గడించిన శ్యాంబెనగల్ మరలిరాని లోకాలకు వెళ్లిపోయారు. కొంతకాలంగా కిడ్నీ సమస్యతో బాధపడుతున్న ఆయన సోమవారం కన్నుమూశారు. శ్యాంబెనగల్ అసలు పేరు బెనగళ్ల శ్యామ్‌సుందరరావు. హైదరాబాద్‌లోని నిజాం కళాశాల, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో విద్యను అభ్యసించారు.

10

5, 8 తరగతులకు నో డిటెన్షన్ రద్దు

విద్యార్థులు ఫెయిలైతే మళ్లీ పరీక్షలు

అయినా విఫలమైతే అవే తరగతుల్లో

కేంద్ర ప్రభుత్వ కీలక నిర్ణయం



న్యూఢిల్లీ, డిసెంబరు 23: విద్యాహక్కు చట్టం-2019కి చేసిన సవరణ ప్రకారం కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ సవరణలో పేర్కొన్న విధంగా 5, 8 తరగతులకు 'నో డిటెన్షన్' విధానాన్ని రద్దు చేసింది. దీనిప్రకారం.. 5, 8 క్లాసుల విద్యార్థులు పరీక్షలు ఫెయిల్ అయితే.. వారిని ఆటోమేటిక్‌గా పైతరగతులకు ప్రమోట్ చేయరు. అదేవిధంగా బడి మాన్పించడం, టీసీ ఇచ్చి ఇంటికి పంపించడం వంటివి ఉండవు. సదరు తరగతుల తుది పరీక్షా ఫలితాలు విడుదలైన తర్వాత రెండు మాసాల మధ్య ఫెయిలైన విద్యార్థులకు పునః పరీక్షలు నిర్వహిస్తారు. వాటిలోనూ విద్యార్థులు మళ్లీ ఫెయిలైతే.. అవే క్లాసుల్లో వారిని కొనసాగిస్తారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులకు రెండు మాసాల

మిగతా 2వ పేజీలో...

రాష్ట్రంలో 'డిటెన్షన్' ఇప్పుడే కాదు!

14

అమలు చేస్తే డ్రాపౌట్లు పెరుగుతాయి

పాఠశాల విద్యపై ప్రభుత్వ ఆలోచన

సంక్రాంతికి వస్తున్నాం!

రైతుల ముంగిట్లోకి రెండు వ్యవసాయ సంక్షేమ పథకాలు

యాసంగి నుంచి రైతు భరోసా అమలుకు సర్కారు నిర్ణయం

యాంత్రీకరణ పథకంతో సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు

కొత్త రేషన్ కార్డుల పంపిణీ కూడా సంక్రాంతి నుంచే

30న మంత్రివర్గ సమావేశం.. కీలక నిర్ణయాలకు ఆమోదం!

గడిచిన ఏడాదిలో రుణమాఫీకి ప్రాధాన్యమిచ్చిన ప్రభుత్వం



పీవీ నరసింహారావు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సీఎం రేవంత్, సుదర్శన్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి

సాగు, సంక్షేమానికి త్వరలో భారీగా నిధులు

రుణ పంపిణీలో వేగం పెంచాలి

వడ్డీ లేకుండా ఏటా 20వేల కోట్లు

కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే యోచన

బ్యాంకర్ల సమావేశంలో భట్టి

13

హైదరాబాద్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తొలి ఏడాది పాలనలో రుణమాఫీ పథకం అమలుకు పూర్తి ప్రాధాన్యమిచ్చిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం.. రెండో సంవత్సరంలో రైతులకు సంబంధించిన ఇతర వ్యవసాయ సంక్షేమ పథకాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించింది. సంక్రాంతి పండుగకు రైతు భరోసా, యాంత్రీకరణ పథకాలను రైతుల ముంగిట్లోకి తీసుకొస్తోంది. రేషన్ కార్డులు లేనివారికి కొత్త కార్డులు పంపిణీ చేసే పథకాన్ని కూడా సంక్రాంతి నుంచే అమలు చేసేందుకు కసరత్తు చేస్తోంది. ఈ నెల 30న రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరగనుంది. ఈ భేటీలో కొన్ని కీలక నిర్ణయాలు తీసుకోనున్నారు. ఇటీవలి అసెంబ్లీ శీతాకాల సమావేశాల్లో చర్చించిన అంశాలతోపాటు మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు, కొన్ని కొత్త సంక్షేమ పథకాలు కూడా సంక్రాంతి నుంచి అమల్లోకి రానున్నాయి. మొదటి సంవత్సరం వ్యవసాయ రంగంలో కీలకమైన రుణమాఫీ పథకాన్ని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేసిన విషయం తెలిసిందే. నాలుగు విడతల్లో 25.36 లక్షల మంది రైతులకు రూ.20,617 కోట్ల రుణాలను ప్రభుత్వం

మిగతా 13వ పేజీలో...

13

ఉపాధి హామీని వాడుకుంటేనే 12 వేలు ఆర్థిక భరోసా!

భూమిలేని కూలీలకు సాయానికి ప్రాతిపదిక

100 రోజులు పూర్తి చేసిన వారికే తొలుత

28న ఖాతాల్లో డబ్బు వేస్తామన్న రాష్ట్ర ప్రభుత్వం

గృహజ్యోతికి రూ.172.58 కోట్లు

డిసెంబరు నెలకు విడుదల చేసిన సర్కారు

జర్నలిస్టుపై దాడి కేసు.. మోహన్‌బాబు ముందస్తు బెయిల్

పిటిషన్ కొట్టివేత

ఆయన హృద్రోగి, వైద్యుల పర్యవేక్షణ అవసరం

హైకోర్టుకు మోహన్‌బాబు లాయర్ల విన్నపం

విలేకరిని కొట్టారు, గొంతు పట్టి పిసికారు

హత్యాయత్నమే: జర్నలిస్టు తరఫు వాదనలు

పోలీసుల ముందు హాజరుకు నేడే గడువు

సుప్రీంలో అదృష్టం పరీక్షించుకొనే అవకాశం





హైదరాబాద్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుపై దాడి కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ సినీ నటుడు మోహన్‌బాబు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసింది. మోహన్‌బాబు ఆయన కుమారుడు మంచు మనోజ్ మధ్య ఘర్షణల నేపథ్యంలో జల్‌పల్లిలో ఉన్న మోహన్‌బాబు ఇంటికి వార్తల కవరేజీ కోసం వెళ్లిన తనపై మోహన్‌బాబు దాడి చేశారని పేర్కొంటూ జర్నలిస్టు రంజిత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పహాడీ షరీఫ్ పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ఈ కేసులో తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ మోహన్‌బాబు దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. మోహన్‌బాబు తరఫున న్యాయవాది వాదిస్తూ, 78 ఏళ్ల వయస్సులో మోహన్‌బాబు గుండె సంబంధిత వ్యాధులతో బాధ పడుతున్నారని, నిరంతరం వైద్యుల పర్యవేక్షణ అవసరమని చెప్పారు. మోహన్‌బాబు దుబాయిలో

మిగతా 3వ పేజీలో...

విష్ణుతో నాకు ప్రాణహాని

3

నేను లేనప్పుడు మా అమ్మను మాయ చేశారు

సంతకం తీసుకొని..

పోలీసులకు తప్పుడు లేఖ

రాచకొండ పోలీసులకు మంచు మనోజ్ ఫిర్యాదు



సిద్దిపేటలో మాట్లాడుతున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

ఏబీవీపీ కార్యక్రమానికి గవర్నర్ హాజరు

సిద్దిపేట మహాసభల్లో పాల్గొన్న జిష్ణుదేవ్ వర్మ

విద్యార్థులు వినూత్నంగా ఆలోచించాలి..

దేశ పునర్నిర్మాణంలో ముందుండాలని పిలుపు

సిద్దిపేట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) 43వ రాష్ట్ర మహాసభలను సోమవారం సిద్దిపేటలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రారంభించారు. అనంతరం ఆయన ప్రసంగిస్తూ.. విద్యార్థులు, యువకులు సరికొత్తగా ఆలోచించాలని, భారతదేశ పునర్నిర్మాణంలో ముందుండాలని సూచించారు. కలలు కనడంతోనే ఆగకుండా ఆ కలలను సాకారం చేసుకునేలా యువత శ్రమించాలన్నారు. దేశాన్ని విశ్వగురుగా

మిగతా 3వ పేజీలో...

ఇద్దరు ఆదివాసీలకు ఉరి

ఇన్‌ఫార్మర్ల నెపంతో మావోయిస్టుల చర్య

ప్రజాకోర్టులో మరొక గిరిజనుడి హత్య

ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో ఘటన

ఆర్కే స్మారక స్తూపం కూల్చేసిన బలగాలు



కోమటిపల్లి అడవుల్లో పోలీసులు కూల్చివేసిన మావోయిస్టు నేత ఆర్కే స్మారక స్తూపం

2



బరితెగించిన సైబర్ నేరగాళ్లు

ఏడాదిలో రూ.1,866.9 కోట్లు హాంఫట్

రికవరీ రూ.176.71 కోట్లు మాత్రమే

2024లో మోసాలు 18% పెరుగుదల

అత్యధికం షేర్ మార్కెట్ పేరుతోనే..

పార్ట్‌టైమ్ కొలువులు, డిజిటల్ అరెస్టులు..

ఫేక్ కస్టమర్ కేర్, క్రెడిట్ కార్డు నేరాలూ

సైబర్ నేరాల వార్షిక నివేదిక

3

హోండా, నిస్సాన్ విలీనం

మేమూ మీతోనే..: మిత్సుబిషి

చేయి కలిపిన జపాన్ ఆటో దిగ్గజాలు

ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆటోమొబైల్ కంపెనీగా అవతరణ

టొయోటా, ఫోక్స్‌వేగన్‌ను తట్టుకునేందుకే

భారత్‌లో అవకాశాలు అపారం

MITSUBISHI MOTORS

NISSAN MOTOR CORPORATION

HONDA

11

కార్ల మార్కెట్లో మహా విలీనం. పోటీని తట్టుకునేందుకు అత్యంత కీలక నిర్ణయం. జపాన్ ఆటో దిగ్గజాలైన హోండా, నిస్సాన్ ఒకటి కానున్నాయి. మిత్సుబిషి వీటితో కలవనుంది.

Application fee	GST@18%
1000/-	180/-
1000/-	180/-
600/-	108/-

ఉద్యోగ దరఖాస్తుపైనా జీఎస్టీ బాదుడు?

అగ్నివీర్ సహా అన్ని అప్లికేషన్లపైనా 18%

బీసీ, ఎస్సీ, ఎస్టీలకూ మినహాయింపు లేదు

యూపీలోని సూపర్ స్పెషాలిటీ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ నోటిఫికేషన్‌లో పన్నుపోటు

పేదల ఆశలే కేంద్రం పెట్టుబడి: ప్రియాంక

దరఖాస్తుపై జీఎస్టీని ప్రస్తావిస్తూ ధ్వజం

2

పరస్పరం ఢీకొని పిట్టల్లా రాలిన డ్రోన్లు

» అమెరికాలోని ఫ్లోరిడాలో పలువురికి గాయాలు

ఫ్లోరిడా, డిసెంబరు 23: క్రిస్మస్ సందర్భంగా నిర్వహించిన వేడుకల్లో అమెరికాలోని ఫ్లోరిడాలో ఊహించని ప్రమాదం జరిగింది. వేడుకల్లో భాగంగా నిర్వహించిన ప్రదర్శనలో డ్రోన్లు పరస్పరం ఒకదానికొకటి ఢీకొని ప్రదర్శన తిలకిస్తున్న వారిపై పడ్డాయి. ఈ ప్రమాదంలో ఓ ఏడేళ్ల బాలుడు సహా పలువురు గాయపడ్డారు. గాయపడిన బాలుడి ఫోటోలను అతని తల్లి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసింది. డాక్టర్లు తన చిన్నారి గుండెకు శస్త్రచికిత్స నిర్వహించబోతునట్లు తెలిపి తీవ్ర విచారం వ్యక్తం చేసింది. డ్రోన్లు కూలిపోతున్న వీడియోను ఓ నెటిజన్ సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయడంతో అది వైరలయింది. ఓర్లాండ్ సిటీ భాగస్వామ్యంతో స్కై ఎలిమెంట్స్ సంస్థ డ్రోన్ల ప్రదర్శనను నిర్వహించినట్లు అధికారులు వెల్లడించారు. ప్రమాదానికి గల కారణాలను తెలుసుకుంటున్నామని వారు తెలిపారు.



ఫ్లోరిడా డ్రోన్ షోలో ఒకదానికొకటి ఢీకొని రాలుతున్న డ్రోన్లు

సన్నీ లియోనికి నెలకు రూ.1000 ప్రభుత్వ సాయం!

» ఛత్తీస్‌గఢ్‌లో నకిలీ బ్యాంకు ఖాతాతో డబ్బులు కాజేసిన ప్రబుద్ధుడు

రాయ్‌పూర్, డిసెంబరు 23: ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఓ సంక్షేమ పథకంలో సినీ నటి సన్నీ లియోని పేరు ఉండటం చర్చనీయాంశమైంది. ఆర్థికంగా వెనుకబడిన వివాహిత మహిళల కోసం మహతారీ వందన్ యోజన పేరుతో ఓ పథకాన్ని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తోంది. అర్హులైన లబ్ధిదారులకు ప్రతినెలా రూ.1000లను వారి బ్యాంకు ఖాతాలో జమ చేస్తోంది. ఇటీవల సాధారణ తనిఖీల్లో భాగంగా లబ్ధిదారుల జాబితాను పరిశీలిస్తుండగా సన్నీ లియోని పేరు ఉండడం, ఆ బ్యాంకు ఖాతాకు ప్రతినెలా వెయ్యి జమవుతున్నట్లు అధికారులు గమనించారు. బస్తర్ జిల్లా తాలార్ గ్రామానికి చెందిన వీరేంద్ర జోషి అనే ప్రబుద్ధుడు సన్నీ లియోని పేరుతో నకిలీ ఖాతా తెరిచి.. ప్రతి నెలా రూ.1000 కాజేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ వ్యవహారంపై బస్తర్ జిల్లా కలెక్టర్ హరీశ్ దర్యాప్తుకు ఆదేశించారు. వీరేంద్ర జోషిపై కేసు నమోదు చేసినట్లు, లబ్ధిదారుల వెరిఫికేషన్‌కు బాధ్యులైన అధికారినీ విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా, ఛత్తీస్‌గఢ్ బీజేపీ ప్రభుత్వంపై రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు దీపక్ బైజ్ తీవ్ర విమర్శలు చేశారు. ఈ పథకంలో అనేక అవకతవకలు జరిగాయని, సగం మంది అనర్హులే ఉన్నారని ఆరోపించారు.

లోకం తీరు



మానవ హక్కుల కమిషన్ చైర్మన్‌గా జస్టిస్ రామసుబ్రమణియన్



న్యూఢిల్లీ, డిసెంబరు 23: జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్ఆర్‌సీ) చైర్మన్‌గా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ వి.రామసుబ్రమణియన్ నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉత్తర్వులు జారీ చేశారు. మానవ హక్కులను ఉల్లంఘించినట్లు ప్రభుత్వం, అధికారులపై ఫిర్యాదులు వస్తే వాటిపై విచారణ జరపడం ఈ కమిషన్ ప్రధాన బాధ్యత. ఇంతవరకు ఆ పదవిని నిర్వహించిన జస్టిస్ అరుణ్ కుమార్ మిశ్ర జూన్ నెలలో పదవీ విరమణ చేశారు. అప్పటి నుంచి విజయ భారతి సాయాని తాత్కాలిక చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. ఎన్‌హెచ్ఆర్‌సీ చైర్మన్ నియామకంపై ఈ నెల మొదట్లో ప్రధాని మోదీ అధ్యక్షతన ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. ఈ భేటీకి ఉభయ సభల్లో ప్రతిపక్ష నాయకులైన రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేలు హాజరయ్యారు.

డిజిటల్ అరెస్ట్ పేరుతో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌కు రూ.11.8 కోట్లు టోకరా

బెంగళూరు, డిసెంబరు 23: ఆధార్ కార్డును మనీలాండరింగ్ కోసం దుర్వినియోగం చేశాడని బెదిరిస్తూ బెంగళూరుకు చెందిన ఓ టెకీ నుంచి రూ.11.8 కోట్లు కొల్లగొట్టారు సైబర్ నేరగాళ్లు. నవంబరు 11న బాధితుడికి మొదటిసారి వచ్చిన ఫోన్‌కాల్‌లో ట్రాయ్ అధికారినంటూ ఓ వ్యక్తి పరిచయం చేసుకున్నాడు. బాధితుడి ఆధార్‌కార్డుకు లింక్ అయిన సిమ్ కార్డును అసాంఘిక అడ్వర్‌టైజ్‌మెంట్లకు వాడారని, ముంబైలోని కొలాబా సైబర్ పోలీస్ స్టేషన్‌లో కేసు రిజిస్టర్ అయిందని, వర్చువల్ ఇన్వెస్టిగేషన్‌కు సహకరించకపోతే నేరుగా వచ్చి అరెస్టు చేస్తామని బెదిరించాడు. ఆ తర్వాత స్కైప్ వీడియోకాల్‌లో ముంబై పోలీస్ యూనిఫామ్ ధరించిన వ్యక్తి బాధితుడి ఆధార్ కార్డు ద్వారా తెరిచిన బ్యాంక్ అకౌంట్ ద్వారా రూ.6 కోట్ల లావాదేవీలు జరిగినట్లు ఎఫ్ఐఆర్ నమోదైందని అబద్ధాలు చెప్పాడు. నవంబర్ 25న నిందితులు బాధితుడిని డిజిటల్ అరెస్ట్ చేశామని చెప్పి అతడి అకౌంట్ నుంచి తమ అకౌంట్లలోకి రూ.11.8కోట్లు ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నారు. ఇంకా డబ్బులు డిమాండ్ చేస్తుండటంతో అనుమానం వచ్చిన టెకీ చివరకు పోలీసులను ఆశ్రయించి జరిగింది చెప్పి భోరుమన్నాడు. పోలీసులు విచారణ జరుపుతున్నారు.

యూపీలో ముగ్గురు ఖలిస్థానీ ఉగ్రవాదుల హతం

పిలిభిత్/చండీగఢ్, డిసెంబరు 23: ఉత్తరప్రదేశ్‌లోని పిలిభిత్‌లో సోమవారం జరిగిన పోలీసుల ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు ఖలిస్థానీ ఉగ్రవాదులు హతమయ్యారు. పంజాబ్‌లోని గురుదాస్‌పూర్ జిల్లాలో ఇటీవల చోటుచేసుకున్న గ్రెనేడ్‌ దాడిలో వీరి ప్రమేయం ఉన్నట్లు తెలుస్తోంది. పిలిభిత్‌లోని పురనాపూర్ ఏరియాలో ఖలిస్థాన్ జిందాబాద్ ఫోర్స్ (కేజెడ్ఎఫ్) ఉగ్రవాదులకు, పంజాబ్-ఉత్తరప్రదేశ్ ఉమ్మడి భద్రతా బలగాల మధ్య కాల్పులు చోటు చేసుకున్నాయని పంజాబ్ డీజీపీ గౌరవ్ యాదవ్ తెలిపారు. మృతిచెందిన ఖలిస్థానీ ఉగ్రవాదులను వీరేందర్ సింగ్ అలియాస్ రవి (23), గుర్విందర్ సింగ్ (25), జషన్‌ప్రీత్ సింగ్ అలియాస్ ప్రతాప్ సింగ్ (18)గా గుర్తించినట్లు వెల్లడించారు. ఈ టెర్రర్ మాడ్యూల్‌ను కేజెడ్ఎఫ్ చీఫ్ రంజిత్ సింగ్ నీతా నియంత్రిస్తున్నారని, గ్రీస్ నుంచి జస్విందర్ సింగ్, యూకే నుంచి జగ్జీత్ సింగ్ పర్యవేక్షిస్తున్నారని పేర్కొన్నారు. ఉగ్ర సంబంధాలను మరింత వెలికి తీసేందుకు దర్యాప్తు జరుగుతోందని, రికవరీలు, అరెస్టులు ఉంటాయని తెలిపారు. కాగా, ఎన్‌కౌంటర్‌లో మరణించిన వారు పంజాబ్‌లోని గురుదాస్‌పూర్ జిల్లా కలనౌర్ తాలూకా పరిధిలోకి వారని తెలిపారు.

పూజా ఖేడ్కర్‌కు ముందస్తు బెయిల్ నిరాకరణ

న్యూఢిల్లీ, డిసెంబరు 23: ఫోర్జరీ కేసులు ఎదుర్కొంటున్న మాజీ ట్రైనీ ఐఏఎస్ పూజా ఖేడ్కర్‌కు ఢిల్లీ హైకోర్టు సోమవారం ముందస్తు బెయిల్ నిరాకరించింది. మానసిక, శారీరక వైకల్యం ఉన్నట్టు, ఓబీసీకి చెందినట్టు తప్పుడు ధ్రువపత్రాలు సమర్పించి ఉద్యోగం పొందడంతో యూపీఎస్సీ ఆమెను తొలగించింది. కేసు కూడా నమోదు చేసింది. దాంతో అరెస్టు చేయకుండా అడ్డుకోవాలని కోరుతూ ఆమె హైకోర్టును ఆశ్రయించారు. వాదనలు విన్న ధర్మాసనం ఆమె అధికారులనే కాకుండా మొత్తం సమాజాన్నే మోసం చేసినట్టు కనిపిస్తోందని అభిప్రాయపడింది. ఈ కుట్రపై లోతుగా విచారణ జరగాల్సి ఉన్నందున ముందస్తు బెయిల్ ఇవ్వలేమని పేర్కొంది.

అర్థం లేని పనిగంటలు వ్యర్థమే: కార్తీ చిదంబరం

న్యూఢిల్లీ, డిసెంబరు 23: వారానికి 70 పని గంటలు ఉండాలన్న ఇన్ఫోసిస్ కోఫౌండర్ నారాయణ మూర్తి ప్రతిపాదనను కాంగ్రెస్ ఎంపీ కార్తీ చిదంబరం తప్పుబట్టారు. సామర్థ్యంపై దృష్టి పెట్టాలి తప్ప అర్థంలేని సుదీర్ఘ పని గంటలపై కాదని కార్తీ చెప్పారు. అసలు వారానికి నాలుగు పనిదినాలే ఉండాలన్నారు. సోమవారం మధ్యాహ్నం 12 నుంచి ప్రారంభమై శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకల్లా పని గంటలు ముగిసిపోవాలని సూచించారు. వృత్తి జీవితంతో వ్యక్తిగత జీవితానికి సమతుల్యత పాటించడం చాలా ముఖ్యమని ఎక్స్‌లో ఆయన సోమవారం పోస్ట్ చేశారు. గతనెలలో సీఎన్‌బీసీ నిర్వహించిన సదస్సులో పాల్గొన్న సందర్భంగా నారాయణ మూర్తి వారానికి 70 పని గంటలు ఉండటం దేశాభివృద్ధికి ఎంతో ముఖ్యమన్నారు.

'ఎక్స్' ప్రీమియం ప్లస్ ధరలు 35% మేర పెంపు!

న్యూఢిల్లీ, డిసెంబరు 23: ప్రముఖ సామాజిక మాధ్యమం 'ఎక్స్' తన ప్రీమియం ప్లస్ ధరలను భారత్‌తో పాటు ప్రపంచవ్యాప్తంగా పెంచినట్లు ప్రకటించింది. దేశంలో 35 శాతం మేర ఈ ధరలు పెరగ్గా.. అమెరికాలో 38 శాతం పెరిగాయి. ఈనెల 21 నుంచే ఈ నిర్ణయం అమల్లోకి వచ్చినట్లు ఎక్స్ పేర్కొంది. దేశంలో ప్రీమియం ప్లస్ ధరను నెలకు రూ.1,300 నుంచి రూ.1,750, ఏడాదికి రూ.13,600 నుంచి రూ.18,300కు పెంచినట్లు వెల్లడించింది. ఎక్స్ అందించే వివిధ ప్రీమియం సేవల్లో అత్యుత్తమ సేవలను ప్రీమియం ప్లస్ ద్వారా పొందవచ్చు. ప్రకటనలు లేకుండా కంటెంట్‌ను వీక్షించవచ్చు. అలాగే కంటెంట్ క్రియేటర్లు ఎక్కువ ఆదాయం సంపాదించేందుకు వీలుంటుంది. గ్రోక్ ఏఐ మోడల్ యాక్సెస్, కీవర్డ్‌పై సూచనలకు రాడార్ వంటి ప్రత్యేక సదుపాయం అందుబాటులోకి రానుంది.

సిరియా మాజీ అధ్యక్షుడు అసద్‌కు భార్య విడాకులు

» రష్యాలో ఆశ్రయం ఇష్టం లేక పుట్టి పెరిగిన లండన్‌కు



మాస్కో, డిసెంబరు 23: అధికారాన్ని కోల్పోయిన సిరియా మాజీ అధ్యక్షుడు బషర్ అల్ అసద్‌కు వ్యక్తిగతంగానూ ఎదురుదెబ్బ తగలనుంది. రష్యాలో ఆశ్రయం పొందుతున్న అసద్ నుంచి విడిపోవాలని ఆయన భార్య అస్మా అల్ అసద్ నిర్ణయించుకున్నట్లు సమాచారం. అస్మా.. లండన్‌లో స్థిరపడిన సిరియన్ దంపతులకు పుట్టారు. అక్కడే పెరిగారు. అసద్ కూడా అక్కడే చదువుకున్నారు. ఆ సమయంలోనే ఇద్దరికీ పరిచయం ఏర్పడింది. 2000 సంవత్సరంలో అసద్ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించారు. అస్మా కూడా సిరియా వచ్చేసి అసద్‌ను వివాహం చేసుకున్నారు. సిరియాలో తిరుగుబాటుతో అనంతరం వారు రష్యాలో ఆశ్రయం పొందుతున్నారు. అయితే, రష్యాలో ఉండడం ఇష్టం లేని అస్మా లండన్ వెళ్లిపోవాలని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు రష్యా కోర్టును ఆశ్రయించారని జాతీయ మీడియా పేర్కొంటోంది. అస్మా ఐదేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. 2019లో ఆమెకు రొమ్ము క్యాన్సర్ నిర్ధారణ అయింది.

గత ఏడాదిన్నరలో..

10 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలిచ్చాం

» వీరిలో అత్యధిక మంది మహిళలే

» ఇదో రికార్డు: ప్రధాని మోదీ

» ఢిల్లీ రోజ్‌గార్ మేళాలో 71 వేల మందికి నియామక పత్రాలు



కేథలిక్ చర్చిలో క్రిస్మస్ వేడుకల్లో ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, డిసెంబరు 23: కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం గత ఏడాదిన్నర కాలంలో 10 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చిందని ప్రధాని మోదీ తెలిపారు. ఇదో రికార్డు అని.. ఇంతవరకు ఏ సర్కారూ ఇన్ని ఉద్యోగాలు ఇచ్చిన దాఖలాల్లేవని చెప్పారు. సోమవారమిక్కడ 'రోజ్‌గార్ మేళా'కు ఆయన వర్చువల్‌గా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో 71 వేల మందికిపైగా నియామక పత్రాలు అందజేశారు. తన ప్రభుత్వ పాలసీలు, కార్యక్రమాలన్నీ యువత కేంద్రకంగానే ఉన్నాయని ప్రధాని చెప్పారు. రోజ్‌గార్ మేళాలతో వారికి సాధికారత లభిస్తోందని.. వారి సామర్థ్యం వెలికివస్తోందని అన్నారు. 'పది లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు పొందినవారిలో అత్యధికులు మహిళలే. అతివలు తమ కాళ్లపై తాము నిలబడేలా చేసేందుకు మా ప్రభుత్వం కృషిచేస్తోంది. 26 వారాలు మాతృత్వ సెలవులివ్వాలన్న నిర్ణయం వారి కెరీర్లకు ఎంతో ఉపకరిస్తోంది. ప్రధాని ఆవాస్ యోజన కింద నిర్మించే ఇళ్లకు వారే యజమానులు. దేశంలో వారి నేతృత్వంలోనే అభివృద్ధి సాగుతోంది. మన యువత శక్తి సామర్థ్యాలను గరిష్ఠంగా వినియోగించుకోవడానికి ప్రాధాన్యం ఇస్తున్నాం. వారి కోసమే పలు పథకాలు తెచ్చాం. స్టార్టప్ ఇండియా, డిజిటల్ ఇండియా, అంతరిక్ష, రక్షణ రంగాల్లో సంస్కరణలు ఈ కోవలోవే. యువత అభివృద్ధికి జాతీయ విద్యావిధానం చర్యలు తీసుకుంటోంది. ముఖ్యంగా మాతృభాషల ఉపయోగానికి పెద్దపీట వేస్తోంది' అని వివరించారు. సోమవారం మాజీ ప్రధాని చరణ్‌సింగ్ జయంతి అని.. దేశ పురోగతికి గ్రామీణ భారతం అభివృద్ధి అని ఆయన గట్టిగా చెప్పేవారని.. దానినే తన ప్రభుత్వం పాటిస్తోందని తెలిపారు. గ్రామాల్లో ఉపాధి అవకాశాలు సృష్టిస్తున్నామని.. స్వయం ఉపాధి కల్పిస్తున్నామని చెప్పారు. ఈ ఏడాది ఆరంభంలో చరణ్‌సింగ్‌కు భారతరత్న ప్రకటించడం తమ అదృష్టమన్నారు. కఠోర శ్రమ, సామర్థ్యం, యువత నాయకత్వంపై దేశాభివృద్ధి ఆధారపడి ఉంటుందన్నారు. 2047నాటికి అభివృద్ధి చెందిన దేశంగా ఆవిర్భవిస్తామని తెలిపారు. భారత్ ఇప్పుడు ఐదో పెద్ద ఎకానమీగా ఉందని.. వివిధ రంగాల్లో పరివర్తన దిశగా కదులుతోందని చెప్పారు.

కేథలిక్ చర్చిలో క్రిస్మస్ వేడుకలకు హాజరు

భారతీయ కేథలిక్ బిషప్స్ కాన్ఫరెన్స్ (సీబీసీఐ) సోమవారం ఢిల్లీలోని తమ హెడ్‌క్వార్టర్స్‌లో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో మోదీ పాల్గొన్నారు. భారతీయ కేథలిక్ చర్చి హెడ్‌క్వార్టర్స్ ఇది. ఇక్కడి వేడకల్లో దేశ ప్రధాని పాల్గొనడం ఇదే ప్రథమం. ఈ సందర్భంగా మోదీ ప్రసంగించారు. ప్రేమ, సామరస్యం, సౌభ్రాతృత్వంతో మెలగాలని ఏసుక్రీస్తు ప్రబోధించారని.. కానీ సమాజంలో హింస, అనైతికతల వ్యాప్తికి జరుగుతున్న ప్రయత్నాలు తనను బాధిస్తున్నాయని తెలిపారు. పోప్ ఫ్రాన్సిస్ పవిత్ర రోమన్ కేథలిక్ చర్చి కార్డినల్‌గా కేరళకు చెందిన జార్జ్ కూవకడ్‌కు పదోన్నతి కల్పించడం గర్వంగా ఉందన్నారు. (వాటికన్‌లో మాన్‌సైనర్ హోదాలో ఉన్న కూవకడ్ సహా 21 మందికి పోప్ అక్టోబరు 6న కార్డినల్స్‌గా నియమించారు. టర్కీలోని టైట్యులార్ ఆర్చ్‌బిషప్ ఆఫ్ నిసిబి స్‌గా ఆయన్ను ప్రకటించారు). వేడుకల సందర్భంగా చర్చి ముఖ్య అధికారులు, కార్డినల్స్, బిషప్స్‌తో మోదీ ముచ్చటించారు.

ఉద్యోగాలివ్వరు కానీ.. దరఖాస్తులపై జీఎస్టీ వేస్తారా?



న్యూఢిల్లీ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): యువతకు ఉద్యోగాలివ్వడం చేతకాని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం.. ఉద్యోగ నియామక దరఖాస్తు ఫారాలపైనా జీఎస్టీ వసూలు చేస్తోందని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ మండిపడ్డారు. అగ్నివీర్‌తో సహా మిగిలిన ఉద్యోగ నియామకాల దరఖాస్తు ఫారాలపై 18 శాతం జీఎస్టీ వసూలు చేస్తోందని 'ఎక్స్' వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని కల్యాణ్ సింగ్ సూపర్ స్పెషాలిటీ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లోని పలు ఖాళీల భర్తీకి జారీ చేసిన నోటిఫికేషన్‌ను షేర్ చేసి పోస్టు చేశారు. అందులో దరఖాస్తు ఫీజుతో పాటు దానిపై జీఎస్టీ వేసిన విషయాన్ని ప్రస్తావించారు. నోటిఫికేషన్‌లో అన్‌రిజర్వ్‌డ్, ఓబీసీ/ ఈడబ్ల్యూఎస్ క్యాటగిరీల వారికి 1,000, ఎస్సీ/ఎస్టీలకు రూ.600 దరఖాస్తు ఫీజు ఉండగా.. దానిపై జీఎస్టీ 18% ఉంది. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి చెమటోడ్చి తమ పిల్లలను చదివిస్తున్నారని, కానీ బీజేపీ ప్రభుత్వం వారి కలలను కల్లలు చేస్తోందని ప్రియాంక విమర్శించారు. కేంద్రం పేదల ఆశలను పెట్టుబడిగా మార్చుకుంటోందని దుయ్యబట్టారు. ఫీజు కట్టి పరీక్షలు రాస్తే, చివరికి పేపర్ లీకేజీలతో అవినీతి జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

5, 8 తరగతులకు నో డిటెన్షన్ రద్దు

(మొదటి పేజీ తరువాయి)

వ్యవధిలో టీచర్లు, తల్లిదండ్రులు వారిని మరింత గైడ్ చేయాలని సూచించింది. ఏ ఒక్క విద్యార్థీ ప్రాథమిక విద్య పూర్తయ్యే వరకు పాఠశాలకు దూరం కాకూడదన్నదే సవరణ చట్టం ప్రధాన ఉద్దేశమని పేర్కొంది. కాగా, 5, 8 తరగతులకు ఇప్పటికే ఈ సవరణ చట్టాన్ని దేశవ్యాప్తంగా 16 రాష్ట్రాలు, రెండు కేంద్ర పాలిత ప్రాంతాలు అమలు చేస్తున్నాయి. తాజా ఉత్తర్వులు దేశంలోని 3 వేలకు పైగా ఉన్న కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ, సైనిక్ స్కూళ్ల సహా కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని పాఠశాలలకు వర్తించనున్నట్టు సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. విద్య అనేది రాష్ట్రాల జాబితాలో ఉన్నందున ఆయా రాష్ట్రాలు ఈ విషయంపై నిర్ణయం తీసుకునే వెసులుబాటు కల్పించింది. ఇదిలావుంటే, రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ నో డిటెన్షన్ విధానం కొనసాగుతోంది.

పర్భాణీలో దళిత యువకుడి మృతి పోలీసులే హత్యే: రాహుల్

పర్భాణీ, డిసెంబర్ 23: మహారాష్ట్రలోని పర్భాణీలో పోలీసుల అదుపులో ఉన్న సోమనాథ్ సూర్యవంశి అనే దళిత యువకుడి మృతి కస్టోడియల్ డెత్ అంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు చేశారు. రాజ్యాంగాన్ని పరిరక్షిస్తున్నందుకే సూర్యవంశీ బలయ్యారని రాహుల్ అన్నారు. పోలీసులే చిత్రహింసలకు గురిచేసి అతడిని చంపేశారని, ఇది వంద శాతం వాస్తవమని చెప్పారు. సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించిన రాహుల్ ఆ తర్వాత మీడియాతో మాట్లాడారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన రాజ్యాంగం నమూనాను ధ్వంసం చేయడంతో చెలరేగిన అల్లర్ల నేపథ్యంలో సూర్యవంశీ సహా మొత్తం 50 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న సూర్యవంశీ.. ఛాతీలో నొప్పిగా ఉందని చెప్పడంతో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ ప్రాణాలు కోల్పోయాడు.

హసీనాను మాకు అప్పగించండి

భారత్‌ను కోరిన బంగ్లాదేశ్

» లేఖ అందిందన్న భారత అధికార వర్గాలు

ఢాకా, డిసెంబరు 23: మాజీ ప్రధాని షేక్ హసీనాను తమకు అప్పగించాలని బంగ్లాదేశ్ ప్రభుత్వం భారత్‌ను కోరింది. ఈ మేరకు భారత్‌కు దౌత్య లేఖను పంపామని బంగ్లాదేశ్‌లోని తాత్కాలిక ప్రభుత్వం సోమవారం వెల్లడించింది. విద్యార్థుల ఆందోళన తీవ్ర రూపం దాల్చడంతో ఈ ఏడాది ఆగస్టు 5న బంగ్లాదేశ్‌ను వీడిన హసీనా అప్పటి నుంచి భారతదేశంలో నివసిస్తున్నారు. విద్యార్థుల ఆందోళన సందర్భంగా నరమేధానికి పాల్పడ్డారంటూ హసీనాతో పాటు నాటి కేబినెట్ మంత్రులు, సలహాదారులు, మిలిటరీ, పౌర అధికారులు అనేకమందిపై బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం కేసులు నమోదు చేసింది. వారందరిపై బంగ్లాదేశ్‌లోని అంతర్జాతీయ నేరాల ట్రైబ్యునల్(ఐసీటీ) అరెస్టు వారెంట్లు కూడా జారీ చేసింది. హసీనాపై 42 హత్య కేసులు సహా మొత్తం 51 కేసులను నమోదు చేశారు. కేసుల విచారణ నిమిత్తం హసీనాను తిరిగి బంగ్లాదేశ్‌కు పంపాలని భారత ప్రభుత్వానికి సందేశం పంపామని బంగ్లాదేశ్ విదేశీ వ్యవహారాల సలహాదారు తౌహీద్ హొస్సేన్ సోమవారం విలేకరులకు తెలిపారు. ఇరుదేశాల మధ్య నేరస్థుల అప్పగింత ఒప్పందం ఇప్పటికే ఉందని, ఆ ఒప్పందం ప్రకారమే హసీనాను వెనక్కి తీసుకొస్తామని తెలిపారు. నేరస్థుల అప్పగింత ఒప్పందంపై 2013లో ఇరుదేశాలు సంతకాలు చేశాయి. బంగ్లాదేశ్ లేఖ పంపిన విషయాన్ని భారత్ కూడా ధ్రువీకరించింది. 'బంగ్లాదేశ్ రాయబారి కార్యాలయం నుంచి ఈరోజే లేఖ అందింది' అని భారత అధికార వర్గాలు తెలిపాయి.

ఇరాన్ జోలికొస్తే తొక్కేస్తాం: ఖమేనీ

టెహ్రాన్, డిసెంబరు23: రంగంలోకి దిగితే తమకు ఏ పరోక్ష శక్తుల సహకారం అవసరం లేదని ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా ఖమేనీ చెప్పారు. సిరియాలో రెబల్స్ దెబ్బకు అసద్ పాలన అంతమై ఇరాన్ అనుకూల హెజ్‌బొల్లా, హమాస్, హౌతీ తదితర మిలిటెంట్ గ్రూపులకు ఆయుధాల సరఫరా నిలిచిపోయిన తరుణంలో ఖమేనీ వ్యాఖ్యలకు ప్రాధాన్యత ఏర్పడింది. ఇరాన్ తన పరోక్ష శక్తులను కోల్పోయిందన్న అమెరికా ఆరోపణలను ఆయన కొట్టిపారేశారు. తమకు ఏ పరోక్ష శక్తులూ లేవని ఖమేనీ స్పష్టం చేశారు. హమాస్, హెజ్‌బొల్లా, హౌతీ తమ ముసుగు సంస్థలు కాదని, స్వచ్ఛందంగా ముందుకొచ్చి పోరాడుతున్నాయన్నారు. ఇరాన్‌ను అస్థిరం చేసేందుకు అమెరికాతో చేతులు కలిపే శక్తులను కాళ్ల కింద వేసి తొక్కేస్తామని పరోక్షంగా సిరియాలోని హయత్ తహరీర్ అల్ షామ్ తిరుగుబాటుదారులను ఖమేనీ హెచ్చరించారు.

అమెరికాతో డీల్..ఫిలిప్పీన్స్‌పై చైనా గుర్రు

బీజింగ్, డిసెంబరు 23: అమెరికా నుంచి మధ్యశ్రేణి టైఫూన్ క్షిపణి వ్యవస్థను కొనుగోలు చేయాలన్న ఫిలిప్పీన్స్ నిర్ణయంపై చైనా మండిపడింది. ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో అమెరికా తమను లక్ష్యంగా చేసుకుంటోందని పరోక్షంగా విమర్శించింది. ఇటీవల అమెరికా-ఫిలిప్పీన్స్ సంయుక్తంగా వార్షిక మిలటరీ ప్రదర్శనలు నిర్వహించిన విషయం తెలిసిందే.! ఆ సందర్భంగా దక్షిణ చైనా సముద్రంలో 480 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించగలిగే టైఫూన్ క్షిపణులను మోహరించింది. వాటిని అలాగే కొనుగోలు చేయాలని ఫిలిప్పీన్స్ నిర్ణయించింది. దీనిపై ఫిలిప్పీన్స్ మిలటరీ చీఫ్ రాయ్ గాలిడో ఓ ప్రకటన చేశారు.

పనామా కాలువను స్వాధీనం చేసుకుంటాం!

నౌకలపై రుసుముల పేరుతో పనామా అమెరికాను దోచుకుంటోంది

» గతంలో అమెరికా మూర్ఖంగా ప్రవర్తించి నియంత్రణను వదులుకొంది

» డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు

» కాలువలోని ప్రతీ చదరపు మీటరు మాదే: పనామా అధ్యక్షుడు రౌల్



ఫీనిక్స్, డిసెంబరు 23: తాను అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత పనామా కాలువ నియంత్రణను అమెరికా ఆధీనంలోకి తీసుకువస్తానని డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. పనామా దేశం అమెరికా కార్గో నౌకల నుంచి అడ్డగోలుగా రుసుములు వసూలు చేస్తోందని ఆయన ఆరోపించారు. ఈ రుసుములను తగ్గించాలని లేకపోతే మరో మాట లేకుండా కాలువ నియంత్రణను తమకు అప్పగించాలని పనామా దేశాన్ని ఆయన డిమాండ్ చేశారు. ఆదివారం అరిజోనాలోని టర్నింగ్ పాయింట్ వద్ద రిపబ్లికన్ పార్టీ మద్దతుదారులతో ఆయన మాట్లాడారు. గతంలో అమెరికా మూర్ఖంగా ప్రవర్తించిందని, కాలువ నియంత్రణను పనామా దేశానికి అప్పగించిందని అన్నారు. అప్పటి నుంచి పనామా దేశం రుసుముల పేరుతో అమెరికాను దోచుకుంటోందన్నారు. దీంతో పాటు తన కలల క్యాబినెట్ అమెరికా ఆర్థిక వ్యవస్థను ఉత్తేజితం చేస్తుందన్నారు. సరిహద్దుల్లో నిఘాను పెంచి అక్రమవలసదారులను అడ్డుకుంటామన్నారు. ఇజ్రాయెల్, ఉక్రెయిన్ యుద్ధాలు ఆగేలా చర్యలు తీసుకుంటామన్నారు. ట్రంప్ వ్యాఖ్యలపై పనామా అధ్యక్షుడు జోస్ రౌల్ ములినో స్పందించారు. "పనామా కాలువలోని ప్రతి చదరపు మీటరు మాదే. పనామా సార్వభౌమాధికారం విషయంలో రాజీ పడబోం" అన్నారు. పనామా కాలువ నుంచి ప్రయాణించే నౌకల రుసుములను నిపుణుల కమిటీ నిర్ణయిస్తుందని, సప్లై-డిమాండ్ ఆధారంగా ఇది పని చేస్తుందని చెప్పారు. 82 కిలోమీటర్ల పొడవైన పనామా కాలువ అట్లాంటిక్, పసిఫిక్ మహాసముద్రాలను కలుపుతుంది. 1914లో దీనిని ప్రారంభించారు. 1977 వరకు ఈ కాలువపై అమెరికా నియంత్రణ ఉండేది. 1977 జిమ్మీ కార్టర్ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు చేసుకున్న ఒప్పందం ప్రకారం.. 1999లో అమెరికా తన నియంత్రణను పూర్తిగా పనామాకు వదులుకొంది. పనామా దేశానికి ఐదింట ఒక వంతు ఆదాయం ఈ కాలువ నుంచే వస్తోంది. పనామా కాలువ మీదుగా ఏటా రూ.23లక్షల కోట్ల వాణిజ్యం జరుగుతోంది. మరోవైపు, 2017లో తైవాన్‌తో పనామా దౌత్య సంబంధాలను తెంచుకొంది. చైనాతో సంబంధాలను ఏర్పర్చుకుంది. భారీ పెట్టుబడులతో చైనా పనామాకు ముఖ్యమైన మిత్రదేశంగా మారింది. ఈ నేపథ్యంలో పనామా కాలువ ఉన్నది చైనా కోసం కాదని ట్రంప్ ఆదివారం వ్యాఖ్యానించారు. ఈ కాలువ అక్రమార్కుల చేతుల్లోకి వెళ్లిందన్నారు. అయితే, ఈ కాలువపై ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా చైనా నియంత్రణ లేదని పనామా అధ్యక్షుడు జోస్ రౌల్ ములినో బదులిచ్చారు. ట్రంప్ పేరు ప్రస్తావించకుండా ఆయన ఎక్స్‌లో ఈ మేరకు వీడియో పోస్టు చేశారు.

డెన్మార్క్, కెనడా, మెక్సికోలతోనూ కయ్యం!

డెన్మార్క్ ఆధీనంలోని గ్రీన్‌ల్యాండ్‌ను కూడా కొనుగోలు చేస్తామని ట్రంప్ పునరుద్ఘాటించారు. ఆయన 2016లో అధ్యక్షుడిగా ఉన్న సమయంలో కూడా ఇదే ప్రతిపాదన చేశారు. మరోవైపు, వాణిజ్య లోటు భర్తీ కోసం పొరుగుదేశాలపై భారీగా సుంకాలు విధిస్తామన్న ట్రంప్ ఒక దశలో కెనడా, మెక్సికోలను తమ దేశంలో రాష్ట్రాలుగా చేరుస్తామని ఎద్దేవా చేశారు. ట్రూడో విషయంలో మరో అడుగు ముందుకేసి అమెరికా 51వ రాష్ట్రం కెనడా, గవర్నర్ ట్రూడో అని వ్యాఖ్యానించారు. అమెరికా ఏటా కెనడాకు 100బిలియన్ డాలర్లు, మెక్సికోకు 300బిలియన్ డాలర్లు రాయితీలు ఇస్తోందన్నారు. ఆయా దేశాల నుంచి అమెరికాకు అక్రమ వలసదారులు, డ్రగ్స్ వస్తున్నాయని ఆరోపించారు.

ఇన్‌ఫార్మర్ల నెపంతో ఇద్దరు ఆదివాసీలకు ప్రజాకోర్టులో ఉరి

చర్ల, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో ఇన్‌ఫార్మర్ల పేరుతో ఆదివాసీలను మావోయిస్టులు ఉరి వేస్తున్నారు. తాజాగా బీజాపూర్ జిల్లా గంగలూరు అడవుల్లో సోమవారం ఇద్దరు గిరిజనులను మావోయిస్టులు ప్రజాకోర్టులో ఉరివేసి హత్య చేశారు. కొద్ది రోజుల క్రితం బీజాపూర్ జిల్లా గంగలూరు గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులను కిడ్నాప్ చేసిన మావోయిస్టులు ఇన్‌ఫార్మర్లుగా ఆరోపిస్తూ సోమవారం వారిని ఉరివేసి హత్య చేశారు. మృతదేహాల వద్ద వారు పోలీస్ ఇన్‌ఫార్మర్లుగా పేర్కొంటూ లేఖను వదిలారు. అలాగే ఇన్‌ఫార్మర్ నెపంతోనే గంగలూరు ప్రాంతంలోని రెడ్డి గ్రామానికి చెందిన ముఖేష్ హేమ్ల అనే యువకుడిని మావోయిస్టులు సోమవారం హత్య చేశారు. గత కొంత కాలంగా ఆదివాసీలను ఉరివేయడం మావోయిస్టుకు పరిపాటిగా మారింది. గత ఏడాది కాలంగా ఉరివేసి సుమారు 10 నుంచి 15 మంది ఆదివాసీలను మావోయిస్టులు హత్య చేసినట్లు తెలుస్తోంది. స్థానికుల్లో భయం కలగాలనే ఉద్దేశంతోనే ఇన్‌ఫార్మర్లను స్థానికుల సమక్షంలో ఉరి వేసి మావోయిస్టులు హత్య చేస్తున్నట్లు తెలుస్తోంది.

ఆర్కే స్మారక స్థూపం కూల్చివేత

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా కోమటిపల్లి అడవుల్లో సోమవారం మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు అక్కిరాజు హరగోపాల్ అలియాస్ ఆర్కే స్మారక స్థూపాన్ని డీఆర్‌జీ, ఎస్టీఎఫ్, కోబ్రా బలగాలు కూల్చివేశాయి. ఆర్కే మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడిగా పని చేశారు. 2021 అక్టోబరు 14న తీవ్ర అనారోగ్యంతో ఆయన మృతి చెందారు. మరోవైపు, సీనియర్ మావోయిస్టు నేత ప్రభాకర్ రావు అలియాస్ బల్మూరి నారాయణ రావు (57)ను ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కంకేర్ జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రభాకర్ రావు స్వస్థలం జగిత్యాల జిల్లా బీర్‌పూర్ గ్రామం. దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడైన ప్రభాకర్ రావును అంతగఢ్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం ఉదయం అదుపులోకి తీసుకున్నారు. ఈయనపై రూ.25 లక్షల రివార్డు ఉంది. ఈయన ఇంటర్ వరకు ధర్మపురిలో చదివారు. 1984లో మావోయిస్టుల్లో చేరారు.

ట్రంప్ సలహాదారుగా శ్రీరాం కృష్ణన్

» కృత్రిమ మేధ విధానం రూపకల్పనకు నియామకం



వాషింగ్టన్, డిసెంబరు 23: అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికయిన డొనాల్డ్ ట్రంప్ సలహా మండలిలో మరో ఇండియన్-అమెరికన్ చేశారు. వెంచర్ క్యాపిటలిస్టుగా పనిచేస్తున్న శ్రీరాం కృష్ణన్‌ను శ్వేత సౌధం సీనియర్ సలహాదారునిగా ట్రంప్ నియమించారు. కృత్రిమ మేధ (ఏఐ) విధానం రూపకల్పన, అమలుకు ఆయన సమన్వయకర్తగా వ్యవహరిస్తారు. చెన్నైలో జన్మించిన కృష్ణన్ కాంచీపురంలోని ఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగంలో బీటెక్ చదివారు. 21 ఏళ్ల వయసు ఉన్నప్పుడు 2005లో అమెరికా వెళ్లి మైక్రోసాఫ్ట్‌లో చేరారు. ట్విట్టర్, యాహూ, ఫేస్‌బుక్, స్నాప్‌లలో టీం లీడర్‌గా వ్యవహరించారు.

మరణశిక్ష ఖైదీలకు బైడెన్ క్షమాభిక్ష

పదవీ విరమణ సమయం దగ్గర పడుతుండడంతో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ మరణశిక్ష పడ్డ పలువురు ఖైదీలకు క్షమాభిక్ష ప్రసాదించారు. ఫెడరల్ కోర్టులు మొత్తం 40 మందికి మరణశిక్ష విధించగా అందులో 37 మంది శిక్షను తగ్గించారు. వాటిని యావజ్జీవ కారాగార శిక్షగా మార్చారు. ఉపశమనం పొందిన వారిలో మిలటరీ అధికారుల హంతకులు, గజదొంగలు, మాదక ద్రవ్యాల స్మగ్లర్లు ఉన్నారు.

మేడిగడ్డ బ్యారేజీ కేసు కొట్టేయండి

» భూపాలపల్లి జిల్లా కోర్టుకు అధికార పరిధి లేదు
» హైకోర్టులో కేసీఆర్, హరీశ్‌రావు క్వాష్ పిటిషన్




హైదరాబాద్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటుపై భూపాలపల్లి జిల్లా కోర్టులో ఉన్న కేసును కొట్టేయాలని కోరుతూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు హైకోర్టులో సోమవారం క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ కుంగుబాటు అంశంపై వివరణ ఇవ్వాలని కేసీఆర్, హరీశ్‌రావు, అప్పటి నీటి పారుదల శాఖ కార్యదర్శి రజత్ కుమార్, అప్పటి సీఎంవో కార్యదర్శి స్మితా సబర్వాల్, ఇంజినీరింగ్ ఉన్నతాధికారులు హరిరామ్, శ్రీధర్, మేఘా నిర్మాణ సంస్థ అధినేత మేఘా కృష్ణారెడ్డి, ఎల్ అండ్ టీ సంస్థలకు భూపాలపల్లి జిల్లా కోర్టు నోటీసులు జారీ చేసింది. మేడిగడ్డ కుంగుబాటుకు కేసీఆర్ సహా ఇతరులు కారణమని పేర్కొంటూ నాగవెల్లి రాజలింగమూర్తి అనే వ్యక్తి మొదట మేజిస్ట్రేట్ కోర్టులో ప్రైవేటు ఫిర్యాదు దాఖలు చేశారు. తమకు పరిధి లేదని పేర్కొంటూ మేజిస్ట్రేట్ కోర్టు సదరు పిటిషన్‌ను కొట్టేసింది. దాంతో ఆయన జిల్లా కోర్టులో రివిజన్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ రివిజన్ పిటిషన్‌లోనే భూపాలపల్లి జిల్లా కోర్టు కేసీఆర్ సహా ఇతరులకు నోటీసులు జారీ చేసింది. రివిజన్ పిటిషన్‌ను స్వీకరించే అధికార పరిధి భూపాలపల్లి జిల్లా కోర్టుకు లేదని, దాన్ని కొట్టేయాలని కోరుతూ కేసీఆర్, హరీశ్‌రావులు హైకోర్టును ఆశ్రయించారు. ఒక్కసారి మేజిస్ట్రేట్ కోర్టు తనకు పరిధిలేదని ప్రైవేటు ఫిర్యాదును కొట్టేసిన తర్వాత రివిజన్ పిటిషన్ విచారణకు స్వీకరించి ప్రైవేటు ఫిర్యాదును తిరిగి తెరిచే అధికారం జిల్లా కోర్టుకు లేదని అన్నారు. కోర్టుకు అధికారమే లేనిచోట తమకు నోటీసులు జారీ చేయడం అనే సమస్యే తలెత్తదని చెప్పారు. సీఆర్పీసీకి విరుద్ధంగా రివిజన్ పిటిషన్‌ను జిల్లా కోర్టు స్వీకరించిన విధానం తప్పుడు సంకేతాలను పంపుతుందని తెలిపారు. ఒకవేళ జిల్లా కోర్టు విచారణ పూర్తి చేసి ఈ అంశాన్ని మళ్లీ మేజిస్ట్రేట్ కోర్టుకు పంపినా తన ఉత్తర్వులను తానే మళ్లీ పునః పరిశీలించే అధికారం మేజిస్ట్రేట్ కోర్టుకు ఉండదని చెప్పారు. భూపాలపల్లి జిల్లా కోర్టులో ఉన్న కేసుతో పాటు జూలై 10న ఇచ్చిన ఆదేశాలను కొట్టేయాలని కోరారు. కేసీఆర్, హరీశ్‌ల పిటిషన్ త్వరలో హైకోర్టు సింగిల్ జడ్జి ఎదుట విచారణకు రానుంది.

మరో కేసులో పట్నం నరేందర్‌రెడ్డికి ముందస్తు బెయిల్

లగచర్ల ఘటన నేపథ్యంలో దాఖలైన మరో కేసులో మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డికి హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. భూసేకరణ విచారణకు వెళ్తున్న స్థానిక కాంగ్రెస్ నాయకుడిని అడ్డుకోవడమే కాకుండా ఆయన కారును ధ్వంసం చేశారని పేర్కొంటూ బొమ్రాస్‌పేట పోలీసులు ఎఫ్ఐఆర్ నెంబర్ 145 నమోదు చేశారు. ఈ కేసులో ప్రస్తుతానికి నరేందర్‌రెడ్డి నిందితుడిగా లేకపోయినప్పటికీ తర్వాత నిందితుడిగా చేర్చి పోలీసులు అరెస్ట్ చేసే అవకాశం ఉన్న నేపథ్యంలో నరేందర్‌రెడ్డి హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం పలు షరతులతో నరేందర్‌రెడ్డికి ముందస్తు బెయిలును మంజూరు చేసింది. దర్యాప్తునకు సహకరించాలని, ప్రతి సోమవారం పోలీస్ స్టేషన్‌లో సంతకం పెట్టాలని, రూ.25 వేల పూచీకత్తు, రెండు ష్యూరిటీలు సమర్పించాలని కోరుతూ తుది ఉత్తర్వులు జారీ చేసింది.



ధరలేక టమాటాలను కోయకుండా పొలంలోనే వదిలేసిన రైతులు

టమాటా రైతుకు ధరాఘాతం

» మార్కెట్‌లో కిలో రూ.5 నుంచి రూ.6 పలుకుతున్న వైనం

తిరుమలగిరి/ యాచారం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కొన్ని రోజుల క్రితం భారీగా పలికిన టమాట ధర ఇప్పుడు ఒక్కసారిగా తగ్గడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలా అయితే పెట్టుబడిలో పదోవంతు కూడా రాదని గగ్గోలు పెడుతున్నారు. పంటను మార్కెట్‌కు తరలిస్తే అక్కడ రేటు లేక వారే ఊరూరా తిరిగి విక్రయిస్తున్నారు. జనగామ జిల్లా పాలకుర్తి మండలం మంచుప్పలకు చెందిన రైతు ఉప్పల మల్లయ్య తాను పండించిన టమాట పంటను సోమవారం ట్రాక్టర్ ట్రాలీ నిండా పోసుకుని తిరుమలగిరి కూరగాయల మార్కెట్‌కు తీసుకొచ్చాడు. అక్కడి వ్యాపారుల వద్దకు వెళితే కిలో రూ.5నుంచి రూ.6కు మించి కొనలేమని చెప్పటంతో, ఆ ధరకు అమ్మితే పెట్టుబడి కూడా రాదని అక్కడి నుంచి వెనుదిరిగాడు. తన భార్యతో కలిసి టమాటాలను ట్రాక్టర్ ట్రాలీలో ఉంచి తిరుమలగిరి పట్టణంలోని కూడళ్లలో తిరుగుతూ కిలో రూ. 15 నుంచి రూ. 20 చొప్పున విక్రయించాడు. మరోవైపు పంటకు తెగుళ్లతో పాటు వర్షాల కారణంగా టమాటా తోటలు పాడయ్యాయని పలువురు రైతులు చెబుతున్నారు.

పెంచికలపేటలో పులి సంచారం

» ఆసిఫాబాద్ మండలంలో చిరుతపులి!

పెంచికలపేట, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికలపేట మండలంలోని కొండపల్లి, ఎర్రగుట్ట, పోతెపల్లి, దర్గపల్లి, లోడ్‌పల్లి గ్రామాల్లోని అటవీ ప్రాంతాల్లో సోమవారం పులి కదలికలు కలకలం రేపాయి. అటవీ అధికారులు తెలిపిన సమాచారం మేరకు.. ఆదివారం రాత్రి కొండపల్లి అటవీ ప్రాంతంలో ట్రాకింగ్ చేస్తుండగా పులి పాదముద్రలను గుర్తించారు. వాటిని అనుసరిస్తూ వెళ్లగా ఎర్రగుంట గ్రామశివారులోని ఓ కుంట వద్ద పులి నీళ్లు తాగి మళ్లీ సమీప అటవీ ప్రాంతంలోకి వెళ్లిపోయినట్లు గుర్తించారు. సోమవారం ఉదయం అధికారులు సిబ్బందితో కలిసి పులి సంచరించిన ప్రాంతాన్ని పరిశీలించారు. పలు ప్రాంతాల్లో పులి పాదముద్రలను గుర్తించారు. మరోవైపు, ఆసిఫాబాద్ మండలంలోని మాణిక్‌గూడ పరిసర ప్రాంతాల్లో చిరుత పులి సంచరిస్తున్నట్లు అటవీరేంజ్ అధికారి గోవింద్‌చంద్ సర్దార్ తెలిపారు.

విద్యార్థినులతో హెడ్ మాస్టర్ అసభ్య ప్రవర్తన

సీరోలు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పాల్సిన ప్రధానోపాధ్యాయుడు దారి తప్పి విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడు. దాంతో తల్లిదండ్రులు అతడికి దేహశుద్ధి చేసి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో వారు విచారించి ప్రధానోపాధ్యాయుడిని సస్పెండ్ చేశారు. మహబూబాబాద్ జిల్లా సీరోలు మండలం సక్రాం నాయక్‌తండాలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న ధరంసోత్ శ్రీను తన సెల్‌ఫోన్‌లో విద్యార్థినులకు అశ్లీల దృశ్యాలను చూపిస్తూ.. వారితో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడు. ఈ విషయాన్ని శనివారం విద్యార్థినులు తల్లిదండ్రులకు చెప్పడంతో వారు సోమవారం పాఠశాలకు చేరుకొని ప్రధానోపాధ్యాయుడు శ్రీనును పట్టుకుని దేహశుద్ధి చేశారు. అనంతరం ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా వారు విచారణ చేసి హెచ్ఎం శ్రీనును సస్పెండ్ చేశారు.

అప్పుల బాధతో అన్నదాత ఆత్మహత్య

» విద్యుదాఘాతంతో రైతు మృతి

కొల్చారం, వెల్దుర్తి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయం కోసం చేసిన అప్పులు పెరిగిపోయి.. జీవితంపై విరక్తితో ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం రామాయిపల్లిలో రైతు బత్తుల రాజు (40) అప్పులు చేసి బోర్లు వేయగా ఫలితం దక్కలేదు. దీంతో సోమవారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం ఓ రైతు నిండు ప్రాణాలను బలిగొంది. ఈ ఘటన మెదక్ జిల్లా కొల్చారం మండలం సంగాయిపేట శివారులో సోమవారం జరిగింది. గ్రామానికి చెందిన రైతు మెట్టు మల్లయ్య(60) తన వ్యవసాయ భూమి వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు ఫ్యూజ్ వైర్ లేకపోవడంతో విద్యుత్ అధికారులకు సమాచారమిచ్చి వైర్ వేయడానికి ఉపక్రమించాడు. ఇదే సమయంలో విద్యుత్ సరఫరా కావడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. అధికారుల నిర్లక్ష్యం వల్లే రైతు చనిపోయాడని స్థానికులు, రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

బొగ్గు రంగంలో సవాళ్లను అధిగమిస్తాం

» సింగరేణి ఆవిర్భావ వేడుకల్లో సీఎండీ బలరాం
» మరో వందేళ్లు ఉజ్వలంగా నిలబడాలి: సీఎం

కొత్తగూడెం, హైదరాబాద్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా బొగ్గు రంగంలో వస్తున్న సవాళ్లను అధిగమించి సింగరేణి సంస్థను ప్రగతిపథంలో నడిపిస్తామని ఆ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బలరాం విశ్వాసం వ్యక్తం చేశారు. సింగరేణి ఆవిర్భావ వేడుకల్లో భాగంగా సోమవారం కొత్తగూడెంలోని ప్రకాశం గ్రౌండ్‌లో సింగరేణి జెండాను ఆయన ఆవిష్కరించారు. అనంతరం సంస్థ ఏర్పాటు చేసిన స్టాళ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మాట్లాడుతూ.. కొత్తగూడెం ఏరియాలోని వీకే-7 ఓపెన్‌క్యాస్ట్, ఇల్లెందు ఏరియాలోని రొంపేడు ఓపెన్ క్యాస్ట్, రామగుండంలోని కోల్‌మైన్, గోలేటి ఓపెన్ క్యాస్ట్‌లకు సంబంధించిన అనుమతులు సాధించి త్వరలోనే బొగ్గు ఉత్పత్తిని ప్రారంభిస్తామని తెలిపారు. 2030 నాటికి 100 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు ప్రకటించారు. 540 మెగావాట్ల సౌర విద్యుత్‌ను తయారుచేసేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. రాజస్థాన్ రాష్ట్రంలో సైతం సౌర విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేసే దిశగా ముందుకు సాగుతున్నామన్నారు. మణుగూరు ప్రాంతంలోని పగిడేరులో 300 మెగావాట్ల జియోథర్మల్ విద్యుత్ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్లు వెంకటేశ్వరరెడ్డి, సత్యనారాయణరావు, జనరల్ మేనేజర్లు, గుర్తింపు కార్మికసంఘం కార్యదర్శి రాజ్‌కుమార్, ప్రాతినిధ్య సంఘం కార్యదర్శి జనక్ ప్రసాద్‌తో పాటు డీజీఎంలు, ఏజీఎంలు, తదితరులు పాల్గొన్నారు. సింగరేణి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆ సంస్థ కార్మికులు, వారి కుటుంబసభ్యులు, అధికారులకు శుభాకాంక్షలు తెలిపారు. 135 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన సింగరేణి ప్రగతి పథాన సాగుతూ దేశానికి వెలుగులు పంచుతుండటం రాష్ట్రానికి గర్వకారణమని పేర్కొన్నారు. మరో శత వసంతాలు ఉజ్వలంగా దేశంలోనే అగ్రగామి సంస్థగా నిలవాలని ఆకాంక్షించారు.

బరితెగించిన సైబర్ నేరగాళ్లు

ఏడాదిలో 1,866.9 కోట్లు హాంఫట్.. రికవరీ రూ.176.71 కోట్లు మాత్రమే

» సైబర్ నేరాల్లో 18% పెరుగుదల
» షేర్ మార్కెట్ పేరుతో ఎక్కువ మోసాలు
» పార్ట్‌టైమ్ కొలువులు, డిజిటల్ అరెస్టులు
» ఫేక్ కస్టమర్ కేర్, క్రెడిట్ కార్డు నేరాలూ
» తెలంగాణ సైబర్ నేరాల వార్షిక నివేదిక
» విడుదల చేసిన సీఎస్‌బీ డైరెక్టర్ శిఖాగోయల్



హైదరాబాద్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే సైబర్ నేరాల్లో టాప్-5లో ఉన్న తెలంగాణలో.. బాధితులు ఈ ఏడాది ఏకంగా రూ.1,866.9 కోట్ల సొమ్మును పోగొట్టుకున్నారు. రికవరీలు మాత్రం పట్టుమని పదిశాతం కూడా లేకుండా.. రూ.176.71 కోట్లకు పరిమితం కావడం గమనార్హం..! రూ.244.56 కోట్లను సైబర్ సెక్యూరిటీ బ్యూరో(సీఎస్‌బీ) అధికారులు ఫ్రీజ్ చేశారు. ఈ ఏడాది సైబర్ నేరాలపై మొత్తం 1,14,174 ఫిర్యాదులు అందినట్లు సీఎస్‌బీ డైరెక్టర్ శిఖాగోయల్ వెల్లడించారు. గత ఏడాది ఈ సంఖ్య 91,652గా ఉన్నట్లు తెలిపారు. సోమవారం ఆమె ఈ మేరకు 'తెలంగాణ సైబర్ నేరాల వార్షిక నివేదిక'ను విడుదల చేశారు. గత ఏడాదితో పోలిస్తే.. ఈసారి సైబర్ నేరాల పెరుగుదల 18% పెరిగినట్లు స్పష్టం చేశారు. రోజుకు సగటున 316 మంది బాధితులు రూ.5.4 కోట్ల మేర నష్టపోతున్నారని నివేదిక స్పష్టం చేస్తోంది. ఈ ఏడాది సైబర్ నేరాల్లో అత్యధికంగా షేర్‌మార్కెట్ మోసాలున్నాయని.. ఆ తర్వాతి స్థానాల్లో పార్ట్‌టైం ఉద్యోగాలు, డిజిటల్ అరెస్టు, నకిలీ కస్టమర్ కేర్ సర్వీస్‌లు, క్రెడిట్ కార్డు మోసాలు నమోదైనట్లు శిఖాగోయల్ వివరించారు.

ప్రైవేటు ఉద్యోగులే బాధితులు

సైబర్ నేరాల బాధితుల్లో అధికంగా అక్షరాస్యులు, ప్రైవేటు ఉద్యోగులే ఉంటున్నారని తాజా నివేదిక స్పష్టం చేస్తోంది. ఈ ఏడాది నమోదైన మొత్తం కేసుల్లో 56% మంది బాధితులు ప్రైవేటు ఉద్యోగులే. వీరిలో చిరుద్యోగులు మొదలు.. సాఫ్ట్‌వేర్ నిపుణుల దాకా ఉన్నారు. మిగతా బాధితుల్లో స్వయం ఉపాధిలో ఉన్నవారు(10%), వ్యాపారులు(9%), విద్యార్థులు(9%), ప్రభుత్వోద్యోగులు(5%), గృహిణులు(5%), ఇతరులు(6%) ఉన్నట్లు సీఎస్‌బీ నివేదిక చెబుతోంది.

186 మంది అరెస్టు

నేరం జరిగిన వెంటనే ఫిర్యాదు చేస్తే.. రికవరీలు పెరిగే అవకాశాలుంటాయని, ఈ ఏడాది 186 మంది సైబర్ కేటుగాళ్లను అరెస్టు చేశామని శిఖాగోయల్ వివరించారు. వీరంతా తెలంగాణలో నమోదైన 823 కేసులు.. దేశవ్యాప్తంగా 3,637 కేసుల్లో నిందితులని పేర్కొన్నారు. "మొదటిసారి మేము రాజస్థాన్‌లో అంతర్రాష్ట్ర ఆపరేషన్ నిర్వహించి, 27 మంది సైబర్ నేరగాళ్లను అరెస్టు చేశాం. వీరికి బ్యాంకు ఖాతాలను సమకూరుస్తున్న 11 మందిని అరెస్టు చేశాం. ఆయా 2,194 కేసుల్లో 37 ఖాతాల నుంచి నగదు బదిలీ జరిగినట్లు గుర్తించాం. సైబర్ నేరాల కట్టడిలో భాగంగా 14,885 సిమ్ కార్డులు, 9,811 ఐఎంఈఐ నంబర్లను బ్లాక్ చేయించాం. 1,825 వెబ్‌సైట్లను తొలగించేలా చేశాం. సైబర్ నేరాల కట్టడి, నిందితుల అరెస్టులకు తెలంగాణ పోలీసులకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది" అని ఆమె వివరించారు. బ్యాంకుల ద్వారా నగదు బదిలీ చేయడంతో పోలీసులు పట్టుకుంటున్నారనే ఉద్దేశంతో కేటుగాళ్లు రూటుమార్చి.. నగదు విత్‌డ్రా చేస్తున్నారని తెలిపారు. సైబర్ నేరాల్లో కొల్లగొట్టిన మొత్తాన్ని క్రిప్టోకరెన్సీగా మార్చి.. దుబాయ్‌లో ఉండే ప్రధాన సూత్రధారులకు చేరవేస్తున్నట్లు గుర్తించామన్నారు. ఈ తరహా ముఠాలకు చెందిన 21 మంది నిందితులను సైబరాబాద్, హైదరాబాద్, రాచకొండ, కరీంనగర్, జగిత్యాలల్లో అరెస్టు చేశామని తెలిపారు.

టాప్-5 నగరాలు ఇవే!

నగరం	నేరాల సంఖ్య
సైబరాబాద్	25,112
హైదరాబాద్	20,299
రాచకొండ	14,815
వరంగల్	3,531
సంగారెడ్డి	3,132



వేడుకల్లో పాస్నెట్ కుటుంబ సభ్యులు

మెదక్ చర్చి స్థాపకుడు పాస్నెట్‌కు కృతజ్ఞత సభ

» వందేళ్ల ఉత్సవాల్లో నిర్వహణ.. హాజరైన పాస్నెట్ మునిమనవళ్లు

మెదక్ కల్చరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆసియా ఖండంలోనే అతి పెద్దదైన మెదక్ చర్చ్ వందేళ్ల ఉత్సవాల్లో భాగంగా చర్చి స్థాపకుడు పాస్నెట్‌కు కృతజ్ఞత సభ నిర్వహించారు. సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో మెదక్ చర్చిలో గతంలో పనిచేసిన బిషప్‌లు, పాస్నెట్ మునిమనవళ్లు పాల్గొన్నారు. ఉదయం శిలువ ఆరాధన నిర్వహించిన అనంతరం వారంతా చర్చి వేదిక వద్ద ఏర్పాటు చేసిన పాస్నెట్ చిత్ర పటానికి పూలమాలలు వేసి కొవ్వొత్తులు వెలిగించారు. ఈ సందర్భంగా చర్చ్ ఇన్‌చార్జి బిషప్ రూబెన్ మార్క్ మాట్లాడుతూ చర్చి వందేళ్ల సంబురాల్లో పాస్నెట్ రక్తసంబంధీకులు పాల్గొనడం శుభ పరిణామమన్నారు. మెదక్ చర్చి వందేళ్ల ఉత్సవాలకు సోమవారం మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు హాజరయ్యారు. అనంతరం చర్చి ప్రధాన ద్వారం ముందు కేక్ కట్ చేసి క్రైస్తవ సోదరులకు తినిపించారు. హరీశ్ వెంట మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఏబీవీపీ కార్యక్రమానికి గవర్నర్ హాజరు

(మొదటి పేజీ తరువాయి)

చేయాలన్న వివేకానందుడి లక్ష్యందిశగా పయనించాలని పిలుపునిచ్చారు. ధర్మం అనేది మతం కాదని, ప్రతీ ఒక్కరిలోనూ జాతీయభావం ఉండాలన్నారు. ఏబీవీపీ వ్యక్తి వికాసం కోసం కాకుండా జాతీయ వికాసం కోసం పని చేస్తున్నదని చెప్పారు. ఏబీవీపీ నుంచి ఎంతోమంది గొప్ప నాయకులుగా ఎదిగి దేశానికి సేవ చేస్తున్నారని గవర్నర్ వివరించారు. ప్రతీ విద్యార్థి భరతమాత సేవలో తరించాలని, విద్యార్థి శక్తి జాతీయ శక్తిగా బలపడుతుందని అన్నారు. విద్యార్థులు శారీరక దారుఢ్యాన్ని కలిగి ఉండాలని ఏబీవీపీ జాతీయ సంఘటన కార్యదర్శి ఆశిష్ చౌహాన్ సూచించారు. నక్సలిజాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనే శక్తి ఏబీవీపీకి ఉందన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి గవర్నర్ జాతీయ గీతం ఆలపించారు. కార్యక్రమంలో మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, ఏబీవీపీ రాష్ట్ర అధ్యక్షుడు జానారెడ్డి, కార్యదర్శి మాచర్ల రాంబాబు, మహాసభల కన్వీనర్ చంద్రోజు శ్రీనివాస్ పాల్గొన్నారు.

గవర్నర్‌ను కలిసిన సమగ్ర శిక్షా ఉద్యోగులు

సిద్దిపేట అర్బన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సమగ్ర శిక్షా ఉద్యోగులు సోమవారం సిద్దిపేటకు వచ్చిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను కలిసి వినతిపత్రం అందజేశారు. కాగా, సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు చేస్తున్న సమ్మె 14 రోజుకు చేరింది. కలెక్టరేట్ వద్ద ధర్నా శిబిరంలో బోనాలు, అమ్మవారి వేషధారణలో నిరసన తెలిపారు.

ఏపీకి వరుస అల్పపీడనాలు!

» ప్రస్తుతం దక్షిణ కోస్తా దిశగా ఒకటి.. 26 తర్వాత మరొకటి

విశాఖపట్నం, అమరావతి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో అల్పపీడనాలు ఒకదాని వెనుక మరొకటి వెంటవెంటనే వస్తున్నాయి. ఈ నెలలో ఇప్పటికే రెండు అల్పపీడనాలు/వాయుగుండాలు రాగా మూడోది ఐదు రోజుల నుంచి బంగాళాఖాతంలో అటు తిరిగి ఇటు తిరిగి చెన్నై, శ్రీహరికోటలకు సమాంతరంగా సముద్రంలో కొనసాగుతోంది. మరోవైపు ఈనెల 26వ తేదీ తర్వాత ఆగ్నేయ బంగాళాఖాతం, దానికి ఆనుకుని భూమధ్యరేఖ పరిసరాల్లోని హిందూ మహాసముద్రంలో అల్పపీడనం ఏర్పడుతుందని అంచనా వేశారు. ఆ ప్రభావంతో రానున్న ఐదారు రోజుల వరకు కోస్తా, రాయలసీమల్లో వర్షాలు కొనసాగుతాయని వివరించారు.

విష్ణుతో నాకు ప్రాణహాని

రాచకొండ పోలీసులకు మంచు మనోజ్ ఫిర్యాదు

» పహాడీషరీఫ్ స్టేషన్‌లో ఏడు పేజీల లేఖ అందజేత



హైదరాబాద్ సిటీ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సినీ నటుడు మంచు మోహన్‌బాబు కుటుంబంలో తలెత్తిన వివాదం మరో మలుపు తిరిగింది. తన అన్న విష్ణు, ఆయన అనుచరుల నుంచి తనకు, తన కుటుంబానికి ప్రాణహాని ఉందంటూ మోహన్‌బాబు చిన్న కుమారుడు మంచు మనోజ్.. రాచకొండ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు ఏడు పేజీల లేఖను పహాడీషరీఫ్ పోలీసులకు అందజేశారు. కుటుంబంలో గొడవలు మొదలైనప్పటి నుంచి ఇప్పటివరకు జరిగిన పరిణామాలన్నింటినీ వివరంగా రాసి, కొన్ని సీసీటీవీ ఫుటేజీలను, ఇతర టెక్నికల్ ఆధారాలను పోలీసులకు సమర్పించడంతోపాటు ఫిర్యాదు లేఖను విడుదల చేశారు. ఈ లేఖలో.. మోహన్‌బాబు యూనివర్సిటీలో అక్రమాలు జరుగుతున్నట్లు, విద్యార్థులకు అందాల్సిన సంక్షేమ నిధులు దుర్వినియోగం అవుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని మనోజ్ తెలిపారు. దాంతో ఈ ఏడాది సెప్టెంబరు 11న యూనివర్సిటీ బాధ్యతలు చూస్తున్న వినయ్ మహేశ్వరిని ఆ అక్రమాలపై నిలదీశానని పేర్కొన్నారు. అయితే ఆయన తనపైనే ఆగ్రహం వ్యక్తం చేశారని, వివిధ ఫోన్ నంబర్‌ల నుంచి ఫోన్ చేసి బెదిరించారని చెప్పారు. "అనంతరం సెప్టెంబరు 13న మా నాన్న మోహన్‌బాబు ఫోన్ నుంచి విష్ణు, వినయ్ తప్పుడు మెసేజ్ పంపారు. ఆస్తికోసం గొడవ పెట్టుకుంటున్నావా? అంటూ నా వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేలా మెసేజ్ చేసి, నన్ను దోషిలా నిలబెట్టారు." అని లేఖలో మనోజ్ వివరించారు.

అమ్మను మాయ చేశారు..

"నేను ఇంట్లో లేని సమయంలో మా అమ్మ వద్దకు వచ్చిన విష్ణు, అతని మనుషులు నాపై తప్పుడు ఆరోపణలు చేస్తూ.. వారికి అనుకూలంగా లేఖ రాశారు. ఆ తర్వాత అమ్మను మాయచేసి ఆ లేఖ అమ్మ రాసిందని పోలీసులకు పంపించి మీడియాకు తెలిసేలా చేశారు. నన్ను అందరి దృష్టిలో చెడ్డవాణ్ని చేయాలని ప్రయత్నించారు." అని లేఖలో మనోజ్ తెలిపారు. డిసెంబరు 14న తమ తల్లి పుట్టినరోజును ఆసరాగా చేసుకొని తన కుటుంబసభ్యులకు హాని చేసే ప్రయత్నం జరిగిందని మనోజ్ ఆరోపించారు. అమ్మ పుట్టినరోజుకు కేక్ ఇచ్చే నెపంతో విష్ణుతోపాటు అతడి అనుచరులు రాజ్ కొండూరు, కిరణ్, విజయ్ రెడ్డితోపాటు కొంతమంది బౌన్సర్‌లు ఇంటికి వచ్చారని, ఈ సమయంలో వారు తన జనరేటర్‌లో పంచదార కలిపిన డీజిల్ పోశారని తెలిపారు. దాంతో కరెంట్ సరఫరాలో తీవ్ర అంతరాయంతోపాటు జనరేటర్ నుంచి నిప్పు రవ్వలు ఎగిరిపడ్డాయని చెప్పారు. నిప్పు రవ్వల కారణంగా అగ్ని ప్రమాదం జరిగి ఉంటే.. ఇంట్లో ఉన్న తన 9 నెలల పాప, వృద్ధురాలైన తల్లి, అంకుల్, ఆంటీల ప్రాణాలకు ముప్పు వాటిల్లేదని మనోజ్ తెలిపారు. నిత్యం ఏదో ఒక ఇబ్బంది సృష్టిస్తున్నారని, కరెంట్ కట్ చేస్తూ, నీటి సరఫరా నిలిపివేస్తూ తన కుటుంబాన్ని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. డిసెంబరు 9న డీజీపీని కలిసి ఇంటికి వచ్చిన తర్వాత ఇంట్లోకి రానివ్వకుంటే గేటు ధ్వంసం చేసి లోపలికి వెళ్లానన్నారు. ఆ సమయంలో విష్ణు కత్తులు, గన్నులు తేండిరా అంటూ భయభ్రాంతులకు గురిచేశారని, అందుకు సంబంధించిన వీడియో ఎవిడెన్స్ ఉందని తెలిపారు.

జూనియర్ ఎన్టీఆర్.. నా బిడ్డను ఆదుకోండి

» దాతలూ మాకు సాయం చేయండి
» బ్లడ్ క్యాన్సర్ నుంచి కోలుకున్న బిడ్డ డిశ్చార్జి
» అయ్యేందుకు సాయం కోసం ఓ తల్లి వేడుకోలు

తిరుపతి (వైద్యం), డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతూ దాతల సాయంతో ఆసుపత్రిలో చికిత్స పొంది కోలుకున్న తన కుమారుడు ఇప్పుడు డిశ్చార్జి అయ్యేందుకు దాతలు సహకరించాలని ఓ తల్లి కోరారు. తన కుమారుడిని అన్ని విధాలా ఆదుకుంటానని భరోసా ఇచ్చిన సినీ హీరో జూనియర్ ఎన్టీఆర్ కూడా ఆదుకోవాలని ఆమె విన్నవించారు. తిరుపతికి చెందిన కౌశిక్ జూనియర్ ఎన్టీఆర్ వీరాభిమాని. 'బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న అతడ్ని ఏపీ ప్రభుత్వం, టీటీడీ దాతలు ముందుకొచ్చి సాయం అందించడంతో వైద్యం అందింది. అందుకుగాను దాదాపు రూ.70 లక్షల వరకు ఖర్చయింది. ఇప్పుడు ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయ్యేందుకు మరో రూ.20 లక్షలకు పైగా అవసరం ఉందని, ఇందుకు గతంలో తమకు భరోసా ఇచ్చిన సినీ హీరో జూనియర్ ఎన్టీఆర్ ముందుకు వచ్చి సాయం అందించాలని కౌశిక్ తల్లి సర్వసతి కోరారు. అలాగే దాతలు కూడా ముందుకొచ్చి తన బిడ్డను ఆదుకోవాలని ఆమె అభ్యర్థించారు.



విలేకరులతో మాట్లాడుతున్న కౌశిక్ తల్లి సరస్వతి

మోహన్‌బాబు ముందస్తు బెయిల్ పిటిషన్ కొట్టివేత

(మొదటి పేజీ తరువాయి)

మనుమడిని చూసి వచ్చాక, ప్రస్తుతం తిరుపతిలో ఉన్నారని వెల్లడించారు. తన విద్యా సంస్థల పర్యవేక్షణ కోసం తిరుపతి వచ్చారని చెప్పారు. ముందస్తు బెయిలు పిటిషన్‌ను ప్రభుత్వ న్యాయవాది వ్యతిరేకించారు. డిసెంబరు 10న మోహన్ బాబు తనయుడు మంచుమనోజ్ విజ్ఞప్తి మేరకు ఆయన వెంట మీడియా మోహన్‌బాబు ఇంటికి రాగా ఆయన ఒక విలేకరి దగ్గరున్న మైక్‌ను లాక్కొని తల మీద కొట్టారు. తీవ్ర గాయాల పాలైన విలేకరిని ఆస్పత్రిలో చేర్చారు. రాచకొండ పోలీసులు మోహన్‌బాబుపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. సోమవారం వాదనల సందర్భంగా జర్నలిస్టు రంజిత్ తరఫు న్యాయవాది వాదిస్తూ, మోహన్‌బాబుకు ముందస్తు బెయిల్ ఇవ్వరాదని కోరారు. జర్నలిస్టుపై దాడి చేయడమే కాకుండా గొంతు పట్టి నులిమారని చెప్పారు. ఈ మేరకు ఇరు వర్గాలు అఫిడవిట్లు దాఖలు చేశాయి. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం మోహన్‌బాబు ముందస్తు బెయిల్ పిటిషన్‌ను డిస్మిస్ చేస్తూ తుది ఉత్తర్వులు జారీ చేసింది. క్రిమినల్ కేసు కావడంతో డివిజన్ బెంచ్‌కు అప్పీలు చేసే అవకాశం లేదు. ముందస్తు బెయిలు కోసం మోహన్‌బాబు సుప్రీంకోర్టును ఆశ్రయించడం తప్ప మార్గం లేదు. మోహన్‌బాబు ఈ నెల 24 లోపు పోలీసుల ముందు హాజరు కావాలని గతంలోనే హైకోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో మంగళవారం సుప్రీంకోర్టులో ప్రయత్నం చేసిన అనంతరం మోహన్‌బాబు పోలీసుల ముందు హాజరవుతారని భావిస్తున్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

జీఎస్టీ తకరారు...!

నాలుగు నెలల క్రితం, కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌తో జరిగిన ఓ సమావేశంలో, తమిళనాడులోని ఓ హోటల్ యజమాని చేసిన వ్యాఖ్యలు ఎంతో ప్రాచుర్యం పొందాయి. స్వీట్లమీద 5శాతం జీఎస్టీ ఉంటే, కారం చిరుతిండిమీద 12శాతం ఉంటోంది... క్రీమ్ బన్ మీద 18శాతం జీఎస్టీ ఉంటే, విడిగా బన్‌మీద అస్సలు లేదు..., మా హోటల్‌కు వచ్చిన కస్టమర్లు, బన్ విడిగా, క్రీమ్ విడిగా ఇస్తే మేమే దాని మీద పూసుకొని తింటామని అంటున్నారు మేడమ్ అంటూ ఆయన వివిధరకాల ఆహారపదార్థాలమీద జీఎస్టీ రేట్లు విభిన్నరకాలుగా ఉండటాన్ని ఎత్తిచూపాడు. ఒకేబిల్లులో అన్ని రకాల రేట్లను వేర్వేరుగా నమోదుచేయడం కష్టమన్నది కూడా ఆయన బాధ. జీఎస్టీ విషయంలో కస్టమర్ల కష్టాలూ తనబోటి యజమానుల బాధలూ ఆయన సులభంగా అర్థమయ్యేట్టు వివరించాడు. నిజమూ నిష్ఠూరమూ సమానపాళ్ళలో మేళవించి ఉన్న ఆ వ్యాఖ్యలు క్రీమ్‌బన్ విడియోగా విస్తృతప్రచారంలోకి రావడంతో, ఏమైందో ఏమో, సదరు వ్యాపారి వెంటనే ఆర్థికమంత్రిని విడిగా కలిసి క్షమాపణలు చెప్పకున్న మరో విడియో వెలుగుచూసింది. స్థానిక బీజేపీ ఎమ్మెల్యే సమక్షంలో ఆర్థికమంత్రితో ఆయన ఎంతో వినయంగా మాట్లాడుతున్న ఆ విడియోను తమిళనాడు బీజేపీ శాఖ విడుదల చేయడంతో కాంగ్రెస్ సహా విపక్షపార్టీలన్నీ మండిపడ్డాయి. వేర్వేరు జీఎస్టీ రేట్లను లెక్కగట్టలేక కంప్యూటర్లు క్రాష్ అవుతున్నాయంటూ ఆ హోటల్ యజమాని చేసిన వ్యాఖ్యల్లో అతిశయోక్తి ఉండవచ్చునేమో కానీ, మన జీఎస్టీ స్లాబుల మీద ఈ తరహా విమర్శలు కొత్తేమీ కాదు.

ఇకపై, పాప్‌కార్న్ ఫ్లేవర్ ఆధారంగానో, అందులో ఉన్న చక్కెర, మసాలా స్థాయిని బట్టో మూడురకాల పన్నులు వేయడం మీద సామాజిక మాధ్యమాల్లో నెటిజన్లు విమర్శలు చేస్తున్నారు. రాజస్థాన్‌లోని జైసల్మేర్‌లో జరిగిన 55వ జీఎస్టీ సమావేశంలో ఈ పాప్‌కార్న్ కనుక లేకుంటే మరో విశేషమే ఉండేది కాదు. అత్యంత కీలకమైన నిర్ణయాలు చేయాల్సిన ఈ సమావేశం ప్రజలకు మళ్ళీ అన్యాయం చేసింది. విద్యుత్ వాహనాలు సహా పాత వాహనాల క్రయ విక్రయాలమీద జీఎస్టీని పెంచడం ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగే లావాదేవీతో సంబంధం లేనిదని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, మొత్తంగా కొత్త, పాత వాహనాల మార్కెట్‌మీద ఇది చూపబోయే ప్రభావంపై విభిన్న విశ్లేషణలు జరుగుతున్నాయి. రాబోయే రోజుల్లో కొత్తకార్ల కంటే వాడిన కార్ల మార్కెట్ బాగా వృద్ధి చెందుతుందన్న అంచనాలున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఇక, జీవిత, ఆరోగ్య బీమా ప్రీమియంపై జీఎస్టీ తగ్గించాలన్న అంశం ఈ సమావేశంలోనూ చర్చకు రాలేదు. ప్రధానంగా ప్రభుత్వరంగ బీమా కంపెనీల ఉద్యోగసంఘాలు సుదీర్ఘకాలంగా ప్రీమియంపై తక్కువ జీఎస్టీని డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే. సామాన్యులకు బీమాను చేరువచేయడానికి ఇది ఉపకరిస్తుందని, వారి హక్కుల పరిరక్షణగా దీనిని చూడాలని సంఘాలు వాదిస్తూ, ఎంతోకాలంగా నాయకులకు విన్నపాలు చేస్తున్నాయి. ప్రీమియం చెల్లింపులపై జీఎస్టీని పూర్తిగా రద్దు చేయాలని పార్లమెంట్‌లో విపక్షాలు డిమాండ్ చేసినప్పుడు జీఎస్టీ రాక మునుపు కూడా ఈ పన్ను ఉన్నదంటూ ప్రభుత్వం ప్రతివిమర్శ చేసింది. అప్పటి చర్చలూ, రచ్చలూ అటుంచితే, ఆ తరువాత ప్రభుత్వం నియమించిన కమిటీ బీమారంగంలో జీఎస్టీ తగ్గింపు విషయంలో ఏవో కొన్ని సూచనలు చేసినట్టుగా వార్తలు వచ్చాయి. కానీ, ఐఆర్‌డీఏ ఇంకా తన అభిప్రాయం చెప్పలేదన్న కారణంతో ఈ మారు కూడా నిర్ణయం వాయిదాపడటం ఆశ్చర్యం కలిగిస్తోంది. జీఎస్టీ రేట్ల హేతుబద్ధీకరణ విషయంలోనూ ఇదే జరిగింది. 148 ఉత్పత్తులపై రేట్లను క్రమబద్ధీకరించేందుకు ఉద్దేశించిన మంత్రుల బృందం నివేదికపై చర్చ జరుగుతుందని అనుకుంటే, ఆ నివేదిక సమర్పణ తదుపరి సమావేశానికి వాయిదాపడింది.

న్యాయంగా, సమానంగా, పారదర్శకంగా, హేతుబద్ధంగా, సరళంగా ఉన్నప్పుడే చక్కని పన్ను విధానం అనిపించుకుంటుంది. జీఎస్టీ ఇప్పటికీ అమ్మకందారులనుంచీ, వినియోగదారులనుంచీ విమర్శలు ఎదుర్కొంటూనే ఉంది. ఈ వ్యవస్థను గాడినపెట్టడం ఇప్పటికీ సాధ్యం కావడం లేదు. పెట్రోలియం ఉత్పత్తులను జీఎస్టీ పరిధిలోకి తెచ్చి మంటను కాస్తంత తగ్గించడం ఎలాగూ జరగడం లేదు. కానీ, పిల్లలు వాడుకొనే పెన్సిళ్ళు, రబ్బర్ల నుంచి నిరుద్యోగులు ఎదుర్కొనే పరీక్షల వరకూ సమస్తమూ పన్నుపోటుకు గురవుతూండటం సామాన్యులకు ఆగ్రహాన్ని కలిగిస్తోంది. ప్రజల కనీసావసరాలను దృష్టిలో పెట్టుకొని, రేట్లను తగ్గించి, స్లాబులను కుదించవలసిన పని వెంటనే జరగాలి.

పాపం.. పుణ్యం.. రాజ్యాంగం!

రాజకీయాలకు అతీతమైన చరిత్ర ఉండదు! అది రోజూ రుజువవుతూనే ఉంది. నేటి రాజకీయ అవసరాలు ఏనాటి చరిత్రనో ప్రభావితం చేస్తూనే ఉంటాయి. అందుకే చరిత్రను మారని కఠినశిలగా భావించలేం. నిన్నటిదాకా ఘనమైనది నేడు హీనం అవుతుంది. మొన్నటి స్మరణీయం నేడు విస్మరణీయం అవుతోంది. ప్రధాని మోదీ, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు చూస్తే ఇదే అర్థమవుతుంది. గడిచిన పదేళ్లలో వందేళ్లకు మించిన విధ్వంసాన్ని తెలంగాణ చూసిందని రేవంత్ పదేపదే చెబుతున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఎన్నో ప్రాజెక్టులు, మౌలిక సదుపాయాలు, భారీ సంస్థలు ఏర్పాటై తెలంగాణ అభివృద్ధికి తోడ్పడ్డాయనీ అంటున్నారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిందని చెబుతున్న 'పదేళ్ల విధ్వంసానికి' ముందు తెలంగాణ అభివృద్ధికి గట్టి పునాదులు పడ్డాయన్న భావనను రేవంత్ తన వాగ్ధాటితో బలంగా వినిపిస్తున్నారు. చరిత్రలో సొంత పార్టీ నిర్వహించిన ఘనమైన పాత్రను చెప్పుకోవటం ఏ నేతకైనా అవసరమే! కానీ ప్రత్యేక రాష్ట్రం కోసం జరిగిన వాదోపవాదాల్లో ఈ తరహా వ్యాఖ్యలు మనకు అంతగా కనపడవు. గతాన్ని గురించి అప్పుడు అందించిన చిత్రం పూర్తిగా భిన్నమైంది! కొంచెం తేడాలతో అన్ని పార్టీల నేతలు ఆంధ్ర పాలకుల విధానాలతో జీవన విధ్వంసం జరిగిందన్న చిత్రాన్నే అందించారు. ఇక ప్రత్యేక రాష్ట్రం కోసం ఎందరో చేసిన త్యాగాలకు సముచిత స్థానం ఇవ్వకుండా పదేళ్లు అధికారం చలాయించిన వాళ్ల చరిత్రనే అసలుసిసలు చరిత్రగా ప్రచారం చేస్తున్నారనీ ఇకనైనా దానికి వీడ్కోలు చెప్పాలనీ కూడా రేవంత్ గట్టిగా సూచించారు.

రాజకీయ దృష్టి.. చరిత్రను చూసే తీరును మార్చుతుందనటానికి ఈ వ్యాఖ్యలకు మించిన నిదర్శనం ఉండదు. నిజమైన ప్రజానుకూల పాలన రేవంత్ దృష్టి నుంచి చూస్తే తెలంగాణలో 2023 డిసెంబర్ నుంచే మొదలైంది! ఇక బీఆర్ఎస్ దృష్టి నుంచి చూస్తే 2014 నుంచే అసలైన తెలంగాణ చరిత్ర ఆరంభమవుతుంది. అంతకు ముందు అంతా విధ్వంసం.. వనరుల దోపిడి.. సాంస్కృతిక జీవన విచ్ఛిన్నం.. అంతర్గత వలసవాద విధానాల వైపరీత్యం.. 2014 నుంచి 2023 వరకూ తెలంగాణకు స్వర్ణయుగమైతే ఇప్పుడు కటిక చీకటి యుగం నడుస్తోంది.

పరస్పరం కత్తులు దూసుకునే పార్టీలు.. చరిత్రను ఇంతటి విరుద్ధ దృష్టితో చూస్తున్నాయి. ఎవరి దృష్టికి భవిష్యత్తులో ఆమోదం లభిస్తుంది? అసలు భవిష్యత్తులో ఈ రెండు విపరీత దృష్టికోణాలకు సముచిత స్థానం ఉంటుందా? వీటికి పూర్తిగా భిన్నమైన మరో సముచిత, సహేతుక దృష్టికోణం ముందుకొస్తుందా? అన్నవి కీలక ప్రశ్నలు. భవిష్యత్తులో కూడా రాజకీయాలే వాటికి జవాబులను నిర్దేశిస్తాయి. వాటిని బట్టే జవాబులు ఆధారపడి ఉంటాయి. ఏదోలా అధికారాన్ని దక్కించుకోవటమే పరమ లక్ష్యమై.. విపరీత అసమానతలతో కూడిన ఇప్పుడున్న సమాజాన్నే కొనసాగించే పోటీ రాజకీయాలదే పైచేయి అయితే పక్షపాత చరిత్రలే రాజ్యమేలతాయి. స్వర్ణ, చీకటి యుగాల స్వరాలను వైరివర్గాలు వినిపిస్తాయి! జన జీవితాల చరిత్రకు చెందిన అసలు స్వరాలు మాత్రం అట్టడుగున పడిపోతాయి.

రాజకీయ అవసరాలు నిర్దేశించే చరిత్రనే అసలైనదిగా ప్రచారం చేయటంలో ప్రధాని మోదీకి ఎవరూ సాటిరారు. ఆయన దృష్టిలో 2014 తర్వాతే దేశం అన్నిరంగాల్లో సొంత అడుగులు వేస్తోంది. వాజ్‌పేయి నేతృత్వంలోని ప్రభుత్వానికి (1998–2004) కొంత మినహాయింపు ఉన్నా 2014 తర్వాతి పాలనతో దాన్ని పోల్చలేం. కేంద్రంలో ఒకనాటి కాంగ్రెస్ పాలన తప్పులతడకల మయం.. అన్ని విధానాల్లోనూ అపసవ్యతలే.. విదేశీ విధానంలోనూ అదే ధోరణి.. బానిస ఆలోచనల నుంచి బయటపడలేదు.. భారతీయ సంస్కృతి గొప్పతనాన్ని గుర్తించలేదు.. ముస్లింలను బుజ్జగిస్తూ హిందువులను చిన్నబుచ్చారు.. సోషలిస్టు విధానాలతో ఆర్థిక వ్యవస్థను భ్రష్టుపట్టించారు.. వ్యాపార చొరవను నీరుగార్చారు.. రాజ్యాంగాన్ని బలహీనపర్చారు.. అవినీతిని వ్యవస్థీకృతం చేశారు.. కుటుంబ పాలనకు తెర తీశారు.. హిందుత్వ జాతీయవాదాన్ని ఎదగనీయలేదు.. కుహనా లౌకికవాదాన్ని ప్రోత్సహించారు.. ఇలా చెప్పుకుంటూపోతే మోదీ పేర్కొనే వైపరీత్యాల చిట్టాను ఒక పట్టాన ముగించలేం. ఇవన్నీ ఒకరకమైన చరిత్రనే మనకు చెబుతాయి.

రాజ్యాంగ 75వ అవతరణ దినోత్సవాల సందర్భంగా మోదీ చేసిన విమర్శలూ వ్యాఖ్యలూ చాలా తీవ్రమైనవి. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని మార్చివేసి రిజర్వేషన్లను రద్దుచేయటానికి మోదీ ప్రయత్నిస్తున్నారనే ప్రచారమే కాంగ్రెస్‌కు ఇటీవల ప్రధాన అస్త్రంగా మారింది. అందుకే రాజ్యాంగం కేంద్రంగానే కాంగ్రెస్‌పై మోదీ విమర్శలను ఎక్కుపెట్టారు. రాజ్యాంగ సవరణల పాపమంతా కాంగ్రెస్‌దేనని మోదీ బలంగానే వాదించారు. అందుకోసం 75 ఏళ్ల రాజ్యాంగ చరిత్ర నుంచి చాలా విషయాలను తవ్వితీశారు. రాజ్యాంగ మొదటి సవరణనే మహాపాపంగా వర్ణించారు. లేని అధికారాన్ని ఉపయోగించి అక్రమంగా మొదటి రాజ్యాంగ సవరణకు నెహ్రూ పాల్పడి తాత్కాలిక పార్లమెంటులో దాన్ని ఆమోదింపచేసుకున్నారనీ ఆరోపించారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత జరిగిన తొలి సార్వత్రిక ఎన్నికలు 1952లో పూర్తయ్యాయి. అనంతరమే రాజ్యసభ ఉనికిలోకి వచ్చింది. 1952కు ముందు ఉన్నది రాజ్యాంగ పరిషత్తు మాత్రమే. రాజ్యాంగరచన పూర్తయిన తర్వాత దాన్నే తాత్కాలిక పార్లమెంటుగా వ్యవహరించారు.


తాత్కాలిక పార్లమెంటుకు రాజ్యాంగాన్ని మార్చే హక్కు ఎక్కడిది అని మోదీ వేసిన ప్రశ్నలో ఔచిత్యాన్ని తేల్చుకోవాలంటే చరిత్రలోకి వెళ్లాల్సిందే. మొదటి సవరణ చాలా ముఖ్యమైంది. దేన్ని ఆశించి దాన్ని చేశారన్నది నిశితంగా చూడాలి. మన రాజ్యాంగ చరిత్రపై ఇప్పటికే వేల పుస్తకాలు వచ్చాయి. గ్రాన్‌విల్ ఆస్టిన్ రాసిన 'వర్కింగ్ ఎ డెమక్రాటిక్ కానిస్టిట్యూషన్' పుస్తకం వాటిల్లో ఎన్నతగినది. ఆస్టిన్ అభిప్రాయం ప్రకారం మొదటి రాజ్యాంగ సవరణ చేయటానికి మూడు అంశాలు ప్రధాన కారణాలు అయ్యాయి. మొదటిది భావప్రకటన సమస్యలకు సంబంధించినది. రెండోది జమిందారీ వ్యవస్థ రద్దు–భూసంస్కరణలకు సంబంధించినది. మూడోది విద్యా, ఉద్యోగాల్లో రిజర్వేషన్లకు సంబంధించినది. వీటిపై 1950 నాటికి కోర్టులు ఇచ్చిన తీర్పులను దృష్టిలో ఉంచుకుని మొదటి సవరణను తీసుకువచ్చారు. భావప్రకటన స్వేచ్ఛకు పరిమితులు విధించటాన్నీ జమిందారీ రద్దు చట్టాలనూ సర్దార్‌పటేల్ సమర్థించారు. రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు తీర్పువచ్చే నాటికి పటేల్ చనిపోయారు. ఇక న్యాయశాఖ మంత్రిగా ఉన్న అంబేడ్కర్ ఈ మూడు అంశాలకు సంబంధించిన సవరణలను పూర్తిగా సమర్థించారు. అప్పటికే కొన్ని రాష్ట్రాలు తీసుకువచ్చిన భూసంస్కరణల బిల్లులను వ్యతిరేకిస్తూ జమిందార్లు కోర్టులకు వెళ్లారు. తమ ప్రాథమిక హక్కులకు భంగం కలిగిందనీ వాదించారు. అనుకూల తీర్పులూ వచ్చాయి. ఎన్నో జాగ్రత్తలు తీసుకుని రూపొందించిన బిహార్ భూసంస్కరణల చట్టాన్ని హైకోర్టు కొట్టివేసింది. ప్రభుత్వ రవాణా సర్వీసులను వ్యతిరేకిస్తూ కూడా కేసులు దాఖలయ్యాయి. దీంతో ప్రభుత్వ రంగ సంస్థలను పెద్దఎత్తున ఏర్పాటు చేయబోయే మొత్తం ప్రక్రియకే ఆటంకం కలుగుతుందని ప్రభుత్వం భయపడింది. 1948లో రూపొందించిన పారిశ్రామిక విధానాన్ని అమలు చేయలేని పరిస్థితి తలెత్తుతుందని ఆదుర్దా చెందింది. మరోవైపు మద్రాస్ రాష్ట్రంలోని రిజర్వేషన్లను హైకోర్టు కొట్టివేసింది. సుప్రీంకోర్టూ సమర్థించింది.

సామాజిక, ఆర్థిక వ్యవహారాలకు సంబంధించి కోర్టుల నుంచి తగులుతున్న ఎదురుదెబ్బలు ఒకవైపు ఉంటే మరోవైపు మత, ప్రాంతీయ తత్వాల ప్రచారం ఊపందుకుంది. అప్పటికే కొన్ని రాష్ట్రాలు తీసుకువచ్చిన ప్రజాభద్రతా చట్టాలను కోర్టులు కొట్టివేశాయి. వామపక్ష అనుకూల 'క్రాస్‌రోడ్స్' మ్యాగజీన్‌ను నిషేధించిన ఉత్తర్వును కొట్టివేస్తూ మద్రాస్ ప్రజాభద్రతా చట్టాన్ని రాజ్యాంగ వ్యతిరేకమైందిగా సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. మరోవైపు శ్యామప్రసాద్ ముఖర్జీ దేశవిభజనను రద్దు చేయాలనే డిమాండును వినిపించటం ప్రారంభించారు. వీటన్నిటిని దృష్టిలో పెట్టుకుని భావప్రకటనా స్వేచ్ఛను (ఆర్టికల్ 19) మరింతగా పరిమితం చేయాలని నిర్ణయించారు. ప్రజాభద్రతకు భంగం కలిగించే ప్రమాదం, నేరానికి పురికొల్పే అవకాశం ఉన్నప్పుడు భావప్రకటన స్వేచ్ఛపై సహేతుక పరిమితులు విధించవచ్చంటూ సవరణ సందర్భంగా చేర్చిన నిబంధనలను తర్వాతి కాలంలో ప్రభుత్వ వ్యతిరేక అసమ్మతిని అదుపులో పెట్టటానికి విస్తృతంగా ఉపయోగించారు. అలా కొంత దుర్వినియోగమూ జరిగింది.

మొదటి సవరణతో రాజ్యాంగంలో తొమ్మిదో షెడ్యూలు అదనంగా చేరింది. భూసంస్కరణల చట్టాలను కోర్టుల నుంచి రక్షించటానికి దాన్ని తీసుకువచ్చినా తర్వాత వేరే అవసరాలకూ వాడారు. ఇక అప్పటి రాష్ట్రపతి రాజేంద్ర ప్రసాద్ తొలి రాజ్యాంగ సవరణ బిల్లుని అడ్డుకోటానికి చాలా ప్రయత్నించారు. గత్యంతరంలేని పరిస్థితుల్లోనే దానికి ఆమోదముద్ర వేశారు. హిందూ కోడ్ బిల్లు విషయంలోనూ అలాగే వ్యవహరించారు. మొదటి సవరణను తీవ్రంగా వ్యతిరేకించిన వారిలో శ్యామప్రసాద్ ముఖర్జీ ప్రముఖులు. ఒకరకంగా చూస్తే ముఖర్జీ, రాజేంద్ర ప్రసాద్‌ల అభిప్రాయాలనే మోదీ పునరుద్ఘాటించారు. వాటిని ఆనాటి తాత్కాలిక పార్లమెంటే ఖాతరు చేయలేదు. సవరణకు అనుకూలంగా 228 ఓట్లు వస్తే వ్యతిరేకంగా 20 ఓట్లు మాత్రమే వచ్చాయి. సుప్రీంకోర్టు కూడా చివరకు సవరణను సమర్థించింది. రాజ్యాంగాన్ని రూపొందించిన సభకు దాన్ని మార్చే అధికారం ఉందనీ స్పష్టంచేసింది.

సుదీర్ఘ కాలం దేశాన్ని పాలించిన కాంగ్రెస్‌ను విమర్శించటానికి చాలా విషయాలు ఉన్నాయి. స్వాతంత్ర్య ఉద్యమం సందర్భంగా ఇచ్చిన హామీలతో, ప్రకటించిన లక్ష్యాలతో సాధించిన ప్రగతిని తూకంవేస్తే కాంగ్రెస్ వెలుగునీడలు స్పష్టంగా కనపడతాయి. పరిమితులెన్ని ఉన్నా మొదటి రాజ్యాంగ సవరణ మొత్తాన్ని తప్పుపట్టలేం. కనీసస్థాయి ప్రగతిశీల దృక్పథంతో చూసినా అదే తేలుతుంది. సామాజిక, ఆర్థిక న్యాయ సాధనలో ఆనాటికి అదొక ముందడుగు. ఆ అడుగు అడుగే కాదనీ మొత్తం రాజ్యాంగ సవరణనే మహాపాపంగా చూస్తే పటేల్, అంబేడ్కర్‌ల పాత్రనూ అందులో తోసిపుచ్చలేం! పాక్షిక దృష్టితో చరిత్రను చూడటం ఎప్పుడూ తేలికే! సమగ్ర దృష్టితో చూడటం ఎప్పుడూ కష్టమే!

(ఆంధ్రజ్యోతి ఎడిటర్)



> పరిమితులెన్ని ఉన్నా మొదటి రాజ్యాంగ సవరణ మొత్తాన్ని తప్పుపట్టలేం. కనీసస్థాయి ప్రగతిశీల దృక్పథంతో చూసినా అదే తేలుతుంది. సామాజిక, ఆర్థిక న్యాయ సాధనలో ఆనాటికి అదొక ముందడుగు. ఆ అడుగు అడుగే కాదనీ మొత్తం రాజ్యాంగ సవరణనే మహాపాపంగా చూస్తే పటేల్, అంబేడ్కర్‌ల పాత్రనూ అందులో తోసిపుచ్చలేం! పాక్షిక దృష్టితో చరిత్రను చూడటం ఎప్పుడూ తేలికే! సమగ్ర దృష్టితో చూడటం ఎప్పుడూ కష్టమే!



▪ రాహుల్ కుమార్

> రాజ్యాంగ సవరణల పాపమంతా కాంగ్రెస్‌దేనని మోదీ బలంగానే వాదించారు. అందుకోసం 75 ఏళ్ల రాజ్యాంగ చరిత్ర నుంచి చాలా విషయాలను తవ్వితీశారు. రాజ్యాంగ మొదటి సవరణనే మహాపాపంగా వర్ణించారు.

కుల గణన : సమన్యాయానికి తొలి అడుగు

గత కొన్ని సంవత్సరాలుగా కుల గణన చేపట్టాలి అనే వాదన దేశంలో చాలా గట్టిగా ముందుకొచ్చింది. ఈ మధ్యే ముగిసిన లోక్‌సభ ఎన్నికల్లో ఈ కీలక అంశంగా చర్చకు వచ్చింది. పౌరసమాజం, మేధావులు, సామాజిక శాస్త్రవేత్తలు, రాజకీయ నాయకులు ఇలా అందరూ కుల గణనకు సంపూర్ణ మద్దతు తెలిపారు. అయితే బీజేపీ, ఆ పార్టీ భావజాలంతో సత్సంబంధాలు కలిగినవారు మాత్రం ఇది దేశాన్ని విభజిస్తుందని ఒక అర్థం లేని వాదన ముందుకు తెస్తున్నారు. కుల గణన అనేది ప్రపంచవ్యాప్తంగా, ముఖ్యంగా ప్రజాస్వామిక దేశాలు నిర్వహిస్తున్నాయి. అలా నిర్వహించడం వల్ల దేశంలోని వివిధ సాంస్కృతిక, సామాజిక–ఆర్థిక విభజనలు, వైరుధ్యాలు తేటతెల్లం అవుతాయి. ప్రజాస్వామిక దేశాల్లో ఉన్న జాతి, లింగ, భాష, మత, ప్రాంతం వంటి అనేక విషయాలకు సంబంధించి సమాచారం సేకరిస్తారు. అలా సేకరించిన సమాచారంతో ఏ వర్గానికి ఎలాంటి చట్టాలు అవసరమో అవి చేయవచ్చు. అమెరికాలో జాత్యాంతర వివాహాలకి సంబంధించి స్పష్టమైన గణాంకాలు ఉన్నాయి. అలాంటి గణాంకాలు దేశంలో జాతి వివక్ష తగ్గుదల గురించి ప్రజలకి ఒక అవగాహన, చైతన్యాన్ని తీసుకొచ్చేందుకు తోడ్పడతాయి అంటారు ప్రముఖ సామాజిక శాస్త్రవేత్త గేయిల్ ఓంవెట్.

భారతదేశం కొన్ని వందల సంవత్సరాలుగా కులాల ఆధారంగా విభజించబడిన సమాజం. బ్రిటిష్ వారి పాలనలో కులం ఒడిదొడుకులకి లోనైంది. కుల గణన మొదటిసారి బ్రిటిష్ ప్రభుత్వం నిర్వహించింది. దీంతో కులాల సమీకరణలు మారిపోయాయి. అప్పటివరకు గుర్తించబడని కులాలు, సముదాయాలు వెలుగులోకి వచ్చాయి. ప్రభుత్వ విధానాల్లో తమ వాటా, ప్రాతినిధ్యం, గుర్తింపు మొదలైన విషయాలపై విన్నపాలు సమర్పించుకున్నారు. ఆ సందర్భంలోనే కుల గణన దళితులని చైతన్యం చేసేందుకు ఉపయోగపడింది అని గేయిల్ ఓంవెట్ వివరించారు. డా. బి.ఆర్. అంబేడ్కర్ కుల గణన ముఖ్యమైనది, తప్పనిసరి అన్నారు.

దేవెగౌడ ప్రభుత్వం (1996–97) కుల గణనకి అనుకూలంగా తీర్మానం చేసింది, కానీ 2001లో కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కుల గణన చేసే అవకాశం ఉండి కూడా చెయ్యలేదు. వాస్తవానికి దీని వల్ల కులతత్వం పెరుగుతుందని వాజపేయి ఆ తీర్మానాన్ని పక్కన పెట్టేసారు.

స్వతంత్ర భారతదేశ చరిత్రలో నేర్చుకోవాల్సిన పాఠం ఏమిటంటే, కుల నిర్మూలన కులం గురించిన అవగాహనతోనే వస్తుంది అని సోషియాలజీ ప్రొఫెసర్ సతీష్ దేశ్‌పాండే అన్నారు. కులాన్ని గణించకపోతే కులం బయటకి కనిపించదు. కాబట్టి కులం అంతరించిపోతుంది అనే ఒక భ్రమలో కాలం గడిచిపోయింది. ఈ భ్రమ ఇప్పటిది కాదు, ఇరవయ్యవ శతాబ్దం మొదటి నుంచి ఉంది. ముఖ్యంగా ఇది సాంస్కృతిక పెత్తందారులు చేసే వాదన. కులాన్ని గణిస్తే కులం పెరుగుతుంది అని వారి వాదన. స్వాతంత్ర్యానంతరం కూడా కులం అప్రస్తుతం, గణన అవసరం లేదు అని వాదించారు. తాము బయటికి కులంతో గుర్తించబడం కాబట్టి, తమకు కులం లేదు అని వారు ప్రచారం చేసుకున్నారు. కింది కులాలు కూడ తమలాగే కులాన్ని వదిలి కుల రహితంగా జీవించాలని సూచించారు. కాని అది వాస్తవమేనా? కుల గణన చేస్తే ఆ సత్యం వాస్తవాలతో బయటకి వస్తుంది. ఏ కులంలో ఎంతమంది సంపన్నులు ఉన్నారో, పేదలున్నారో, భూమి, ఉద్యోగాలు మొదలైన సమాచారం ప్రజల్లోకి వెడుతుంది. కుల గణన వ్యతిరేకించే వాళ్ళదంతా ఈ భయమే, తమ రహస్య సంపద అక్రమార్జన బయటపడతాయి అనే. అక్రమాల గుట్టు తెలిసినప్పుడు ప్రజలకి జవాబు చెప్పాలి, తమవి కానివి పంచెయ్యాలి. ఇదే వారి అసలు భయం, అంతే కాని వారికేమీ దేశం మీద ప్రేమ కాదు. ఇవన్నీ కాకుండా తమ కులం చెప్పకూడదు అనుకునేవాళ్ళు వారి కులం చెప్పుకోనక్కర్లేదు, అలా వాదించే వారిలో ఎంతమంది ఆ సౌలభ్యాన్ని వదులుకుంటారో తెలుస్తుంది అంటారు సతీష్ దేశ్‌పాండే. కులాన్ని గణించకపోవడం వల్ల జరిగింది మేలు కాదు, వెనకబడ్డ కులాలకి నష్టం, తీరని అన్యాయం.

తెలంగాణలో 2023లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ, ఎలక్షన్ కోడ్, లోక్‌సభ ఎన్నికలు ముగిశాక, కుల గణనకి శ్రీకారం చుట్టింది. రాష్ట్ర హైకోర్ట్ ఆదేశాల ప్రకారం ప్రజలు కులం, మతం లేదు అని చెప్పుకునే అవకాశం కూడా ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం కుల గణన ప్రారంభిస్తున్న సందర్భంలో, కాంగ్రెస్ ప్రముఖనేత రాహుల్‌గాంధీ దేశంలో కుల వివక్ష మహమ్మారిని గురించి ఆందోళన వ్యక్తం చేశారు. కులం అనేది టైటానిక్ సినిమాలో ఐస్‌బర్గ్ లాంటిదని, కంటికి ఉపరితలం మాత్రమే కనిపిస్తుంది కాని, కులం చేసే విధ్వంసం వేదన కేవలం భారత ప్రజలకే కాదు, భారత రాజ్యాంగానికి, భరత జాతికి కూడా అని వ్యాఖ్యానించారు. ఆ వ్యాఖ్యలలో వాస్తవం లేకపోలేదు. వెనుకబడ్డ నిమ్న వర్గాలకు కులం ఈ దేశంలో అడుగడుగునా ఎదురవుతుంది. చదువుకోవాలన్నా, ఉద్యోగం సంపాదించాలన్నా, కనీస సౌకర్యాలతో బతకాలన్నా కులం కేవలం సామాజికంగానే కాక సాంస్కృతికంగా, ఆర్థికంగా ఒక పెద్ద అడ్డుగోడగా నిలుస్తుంది. చదువుకొనే స్తోమత లేకపోవడం, చదువు మధ్యలో వదిలెయ్యడం, నాణ్యతలేని చదువుల వల్ల ఉద్యోగావకాశాలు అందుకోలేకపోవడం జరుగుతుంది.

కులానికి, ఆర్థిక స్తోమతకి, జెండర్‌కి ముడి ఉంది. దీన్నే ఇంటర్సెక్షనాలిటి అంటారు. అటువంటి వారి జీవితం ఇంకా ఘోరంగా ఉంటుంది. అందుకే కింది కులాల నుంచి మహిళల, లింగ అల్పసంఖ్యాక వర్గాల ప్రాతినిధ్యం చాలా తక్కువ ఉంటుంది. కాబట్టి, కుల గణన ఈ అంతరాలని రూపుమాపే క్రమంలో తొలి అడుగు. కుల గణన దేశాన్ని విభజించదు ఏకీకరిస్తుంది, బహిష్కరించబడ్డ వారిని కలుపుకోవడానికి తోడ్పడుతుంది, దేశాన్ని అభివృద్ధి వైపు నడిపిస్తుంది.

ప్రస్తుతం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో జరుగుతున్న కుల గణన దేశానికి ఒక రోల్ మోడల్‌గా నిలుస్తుంది. దేశవ్యాప్తంగా కూడా జనగణనలో అన్ని కులాలని నమోదు చేసి, వెనకబడిన కులాలకు, అట్టడుగు వర్గాలకు ఏ విధంగా సామాజిక, ఆర్థిక న్యాయం చేయాలో ఆ విధంగా ప్రభుత్వాలు సమగ్ర సామాజిక, ఆర్థిక కార్యాచరణని రూపొందించుకొని దేశాన్ని అన్ని వర్గాల భాగస్వామ్యంతో ప్రగతిపథంలో నడిపించాలి.



> అమెరికాలో జాత్యంతర వివాహాలకి సంబంధించి స్పష్టమైన గణాంకాలు ఉన్నాయి. అలాంటి గణాంకాలు జాతి వివక్ష తగ్గుదల గురించి ప్రజలకి ఒక అవగాహన, చైతన్యాన్ని తీసుకొచ్చేందుకు తోడ్పడతాయని ప్రముఖ సామాజిక శాస్త్రవేత్త గేయిల్ ఓంవెట్ అన్నారు. స్వతంత్ర భారతదేశ చరిత్రలో నేర్చుకోవాల్సిన పాఠం ఏమిటంటే, కుల నిర్మూలన కులం గురించిన అవగాహనతోనే వస్తుంది అని మరో సామాజిక శాస్త్రవేత్త సతీష్ దేశ్‌పాండే అన్నారు.

• తోట లక్ష్మీకాంతరావు
ఎమ్మెల్యే, జుక్కల్

ప్రత్యేక మహిళా జైళ్లు ఏర్పాటు చేయాలి

కొట్లాడి సాధించుకున్న రాష్ట్రంలో అన్ని రంగాల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర రక్షణ వ్యవస్థలో నేరాలను అదుపు చేయడం, నేరస్తులలో పరివర్తన తీసుకురావడంలో పోలీస్ శాఖతో పాటు జైళ్ల శాఖ కూడా ముఖ్యమైనదే. ఉమ్మడి రాష్ట్రంలో జైళ్ల శాఖలో అనేక ఇబ్బందులు ఎదురైనాయి. స్వరాష్ట్రంలో కూడా ఇంకా కొన్ని సమస్యలు తీరడం లేదు. జనాభాకి తగ్గట్టుగా రాష్ట్రంలో జైళ్ల అభివృద్ధి కూడా అవసరం. ప్రస్తుతం మహిళలకు ప్రత్యేక జైలు కేవలం హైదరాబాద్ నగరంలో మాత్రమే ఉంది. వరంగల్ జైలు కూల్చివేసిన తర్వాత మహిళా ఖైదీలను వరంగల్ నుంచి హైదరాబాద్‌కు తరలించడంతో స్పెషల్ మహిళా జైలులో ఖైదీల సంఖ్య పెరిగింది. జైళ్ల శాఖ అధికారులు నర్సంపేటలో సబ్ జైలుని మహిళలకి కేటాయించినా, వరంగల్ జైలు కూల్చివేసిన నష్టాన్ని అది భర్తీ చేయలేకపోతున్నది. హైదరాబాద్ రేంజ్‌లో ఉన్న ప్రత్యేక మహిళా జైలు చుట్టుపక్కల జిల్లాల వారికి, సిబ్బందికి ఖైదీలకు సౌకర్యంగా ఉంది. వరంగల్ రేంజ్‌లో ప్రత్యేక మహిళా జైలు లేకపోవడంతో ఉమ్మడి నిజామాబాద్, అదిలాబాద్, కరీంనగర్ వంటి జిల్లాల సిబ్బందికి, ఖైదీలకు తీవ్ర అన్యాయం జరుగుతున్నది. ఇక్కడ శిక్ష పడిన ఖైదీలను హైదరాబాద్‌కు తరలించడంలో అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. నర్సంపేటలో మహిళల కోసం సబ్‌జైల్ ఏర్పాటు చేసినా అది చాలా దూరంగా ఉంది. కాబట్టి కరీంనగర్ లేదా నిజామాబాద్‌లో ప్రత్యేక మహిళా సెంట్రల్ జైలు ఏర్పాటు చేస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

– ముచ్కుర్ సుమన్‌గౌడ్
సామాజిక కార్యకర్త

'జమిలి'తో అధికారాల ఏకీకరణ

'ఒకే దేశం, ఒకే ఎన్నిక' నినాదంతో జమిలి ఎన్నికలకు రంగాన్ని సిద్ధం చేయడానికి మోదీ ప్రభుత్వం పార్లమెంటులో బిల్లులను ప్రవేశపెట్టింది. ఇవి ఆమోదం పొందితే పార్లమెంటుకు, అన్ని రాష్ట్రాల అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు జరుగుతాయి. సహజంగానే ఈ అంశంపై కూడా అటు అధికార పక్షం, ఇటు ప్రతిపక్షం వాదోపవాదాలు చేస్తున్నాయి. అయితే సాధారణ ప్రజల స్పందన భిన్నంగా ఉంది. ప్రజాస్వామ్య సూత్రాలు, విలువలు, వాటి స్ఫూర్తి, ఆచరణ ప్రాధాన్యతను కోల్పోయి కేవలం మనీ, మీడియా, మూక బలాలు ప్రాబల్యం వహిస్తూ, మొత్తం ఎన్నికల ప్రక్రియే ఒక ప్రహసనంగా మారిన ప్రస్తుత పరిస్థితులలో ఎన్నికలు ఏ రూపంలో జరిగినా ఏం ఫాయిదా? అనే ప్రతిస్పందన వినిపిస్తుంది. అసలు జమిలి అంశం నేడు ఎందుకు ముందుకు వస్తోంది? దీని వెనుకనున్న అసలు ఉద్దేశ్యాలేమిటి? వంటి ముఖ్య ప్రశ్నలు వేయడం చాలా అవసరం.

జమిలి ఎన్నికలకు అనుకూలంగా మూడు వాదనలు ప్రధానంగా వినిపిస్తున్నాయి. పలుమార్లు జరిగే ఎన్నికల వలన అధిక ఆర్థిక వ్యయం అవుతోందని, జమిలితో గణనీయంగా ఎన్నికల ఖర్చును తగ్గించవచ్చునని, దేశ జీడీపీలో అదనంగా 10 శాతం వృద్ధి ఉంటుందని అధికార వర్గాలు చెబుతున్నాయి. కానీ వీరు ఈ వాదనకు తగిన పరిశోధనలనుగానీ, సముచిత డాటా ఆధారిత రుజువులనుగానీ చూపించలేదు. కేవలం సాధారణ తర్కాన్ని ఉపయోగించడం, కొన్ని దేశాల ఎన్నికలను ఉదహరించడం జరిగింది. వాస్తవానికి ఎన్నికల నిర్వహణకు అయ్యే ప్రభుత్వ ఖర్చుకంటే బడా పార్టీలు ఓటర్లకు ఎరవేయడానికి అనేక రెట్లు ఎక్కువ ఖర్చు చేసే వేల కోట్ల రూపాయల అక్రమ ధనాన్ని అరికట్టే చర్యలు చేపడితే అందరూ హర్షిస్తారు. అలాగే ఎక్కువసార్లు ఎన్నికల షెడ్యూళ్ళను ప్రకటించే సందర్భాలలో అమలుచేసే ఎన్నికల ప్రవర్తనా నియమావళి (మోరల్ కోడ్ ఆఫ్ కాండక్ట్–ఎంసీసీ) వలన ప్రభుత్వ పాలనకు, అభివృద్ధి కార్యక్రమాల అమలుకు అనేక ఆటంకాలు వస్తున్నాయని కూడా చెప్పడం జరుగుతోంది. అయితే వాస్తవం ఏమిటి? ఎన్నికల షెడ్యూళ్ళను ప్రకటించిన తరువాత ఓటర్లను ప్రలోభపెట్టే కొత్త పథకాలు, ప్రాజెక్టుల ప్రకటనలను మాత్రమే ఎంసీసీ నిషేధిస్తుంది. అంతేకాని అప్పటికే అమలులోనున్న వాటిపై ఎలాంటి పరిమితులను విధించదు. ఇక ఎన్నికల సందర్భంగా చేపట్టే ఏర్పాట్లు, భద్రతా చర్యలు, పోలీసు లేదా సైనిక దళాలను నియమించడం తదితర విషయాలలో ఒకేసారి జరిగినా, ఎక్కువసార్లు జరిగినా పెద్ద మార్పేమీ ఉండదు.

ఇవన్నీ ప్రజలను ఒప్పించడానికి పైకి చెబుతున్న వాదనలు. వీటి సత్యాసత్యాలను అటుంచి, మనదేశ సామాజిక వ్యవస్థ నిర్మాణంలోని వైవిధ్యాన్ని, బహుళత్వాన్ని, ప్రాంతీయ వ్యత్యాసాలను దృష్టిలో పెట్టుకొని జమిలి ఎన్నికల అంశాన్ని పరిశీలిస్తే అసలు విషయం స్పష్టమవుతుంది. అది జాతీయ పెట్టుబడి ఆధిపత్యానికి, ప్రాంతీయ పెట్టుబడి ఆకాంక్షలకు మధ్యనున్న వైరుధ్యం. దీని రాజకీయ వ్యక్తీకరణే జాతీయ స్థాయిలోని పార్టీలకు ప్రాంతీయ పార్టీలకు మధ్య పోటీలు, ఘర్షణలు, బేరసారాలు, లొంగుబాట్లు, కాళ్ళబేరాలు. ఈ వైరుధ్యం మన దేశ ఆర్థిక అభివృద్ధిలో, రాజకీయ పరిణామంలో వివిధ దశల గుండా పయనిస్తూ వస్తోంది. మొదట స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలో ప్రాంతీయ పెట్టుబడి ఒక శక్తిగా రూపొందని కాలంలో జాతీయ పెట్టుబడి ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహించిన కాంగ్రెస్ పార్టీ రాజకీయంగా ఏకచత్రాధిపత్యం వహించింది. అనంతర కాలంలో ముఖ్యంగా 1970 దశకం పూర్వార్థం నుంచి ప్రాంతీయ పెట్టుబడుల ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహించే పార్టీలు రాజకీయ రంగంలో ఆవిర్భవించి, రాష్ట్రాల ఎన్నికల పోటీలో గెలిచి అధికారాన్ని చేపట్టాయి. అప్పటి నుంచి ఈ వైరుధ్యం తీవ్ర రూపం దాల్చడం కనిపిస్తుంది. అప్పటికి జాతీయంగానూ, దాదాపు అన్ని రాష్ట్రాలలోనూ సుదీర్ఘంగా పాలించిన కాంగ్రెస్ అపఖ్యాతిపాలు కాగా, దానికి ప్రత్యామ్నాయంగా అదే జాతీయ పెట్టుబడికి ప్రాతినిధ్యం వహించే మరొక జాతీయ పార్టీ ఆవిర్భావానికి జనతా పార్టీ రూపంలో చేసిన ప్రయోగం కూడా ఆ వైరుధ్యాన్ని టాకిల్ చేసే క్రమంలో జరిగింది. దీని ద్వారా అమెరికా, ఇంగ్లండ్‌ల తరహాలో ద్విపార్టీ పాలనను ప్రతిష్ఠించే ప్రయత్నం ప్రారంభమైంది. అంటే ఒక జాతీయ పార్టీ ప్రజల్లో పరపతిని కోల్పోయినప్పుడు మరొక జాతీయ పార్టీని ఛాంపియన్‌గా ఆకాశానికెత్తి అధికారంలోకి తేవడం.

తదనంతర కాలంలో 'కోయిలేషన్ పాలిటిక్స్' అనే ఒక కొత్త దశ అవతరించింది. ప్రపంచ పరిణామాలలో వచ్చిన పెను మార్పులలో భాగంగా 90లలో ప్రారంభమైన పెట్టుబడిదారీ ప్రపంచీకరణ విధానాల నిరాటంక అమలుకు ఈ కోయిలేషన్ పాలిటిక్స్‌లోని పరస్పర ఒత్తిళ్ళు, అధికార పెనుగులాటలు అవరోధాలుగా పరిణమించాయి. ప్రభుత్వాలు ఏర్పడడం, కూలిపోవడం, మధ్యంతర ఎన్నికలు రావడం వలన జాతీయ పెట్టుబడి, ప్రాంతీయ పెట్టుబడి రెండింటికీ అనేక చికాకులను తెచ్చి పెట్టాయి. ఎందుకంటే అప్పటికి ప్రాంతీయ పెట్టుబడికి చెందిన కొన్ని శక్తులు జాతీయ గుత్త పెట్టుబడిదారీ సంస్థలతో జతకట్టి జాతీయ, అంతర్జాతీయ మార్కెట్‌లోని కొన్ని రంగాలలో పాత్రను పోషించే స్థాయికి చేరుకున్నాయి. ఈ నేపథ్యంలోనే ప్రపంచీకరణను నిర్దేశించే ఆర్థిక, పారిశ్రామిక ఉత్పత్తి 'సంస్కరణల' అమలు సజావుగా, శీఘ్రంగా, వేగంగా ముందుకు సాగాలంటే ఎన్నికల్లో ఒకే పార్టీకి సంపూర్ణ ఆధిక్యం ఉండాలనే అభిప్రాయాన్ని ఒక పథకం ప్రకారం కూడగట్టడం జరిగింది. ఇదే ధోరణిని 2014, 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల ఫలితాలు ప్రతిబింబించాయి.

ఈ పదేళ్ళ కాలంలో రాజ్యం పాలనాంగాలు గుత్త పెట్టుబడి ప్రయోజనాలను నెరవేర్చడమే ఏకైక ధ్యేయంగా పనిచేయడం కనిపిస్తుంది. ఈ క్రమంలో జాతీయ–ప్రాంతీయ పెట్టుబడుల మధ్య వైరుధ్యాన్ని నయానో, భయానో అణగదొక్కి, పూర్తిగా జాతీయ గుత్త పెట్టుబడికి, ప్రాంతీయ పెట్టుబడి పూర్తిగా లోబడిపోయి, దాసోహం అయ్యేలా చేసే చర్యలు ముమ్మరమయ్యాయి. ఇప్పటికే బీజేపీ ప్రభుత్వం 'ఒకే దేశం–ఒకే పన్ను' నినాదంతో జీఎస్టీని తీసుకువచ్చి ఆర్థిక కేంద్రీకరణను మరింతగా పెంచింది. ఆదాయ రాబడులకై రాష్ట్రాలు కేంద్రంపై ఎక్కువగా ఆధారపడే విధంగా చేసింది. ప్రస్తుతం ఒకవైపు రెండు ప్రధాన పార్టీల మధ్య పోలరైజేషన్ చేసే ద్విపార్టీ రాజకీయ ప్రయోగాన్ని సజీవంగా ఉంచుతూనే, మరోవైపు ఏక పార్టీ స్వైర విహారానికి పావులు కదపడం కూడా జాతీయ గుత్త పెట్టుబడి ముందు ఒక ముఖ్య ఎజెండాగా ఉంది. అందుకుగాను 'ఒకే దేశం, ఒకే ఎన్నిక' నినాదంతో రాజకీయ అధికారం యావత్తు ఏకీకరణ, కేంద్రీకరణ చేయడం అత్యంత అవసరం. గుత్త పెట్టుబడి ప్రయోజనాలను మరింతగా నెరవేర్చే ఆర్థిక, రాజకీయ కేంద్రీకరణ విధానం యెడల బీజేపీ, కాంగ్రెస్‌ల మధ్య పెద్ద విబేధమేమీ లేదు. అందుకే చాలా నేర్పుగా జమిలి బిల్లులను జాయింట్ పార్లమెంటరీ కమిటీకి పంపారు.

జమిలి ఎన్నికలు సాధ్యం కావాలంటే భారత రాజ్యాంగానికి ఐదు సవరణలు అవసరమని న్యాయకోవిదులు భావిస్తున్నారు. రాజ్యాంగం నిర్మాణ చట్రంలో ఫెడరల్ స్వరూపం ఒక మౌలిక అంశం. ఈ ఫెడరల్ స్వరూపాన్ని దెబ్బతీయకుండా సవరణలు చేయడం సాధ్యం కాదు. ఎందుకంటే పార్లమెంటు ఎన్నికలతో అసెంబ్లీ ఎన్నికలను ముడిపెట్టినప్పుడు రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన అనేక రాష్ట్ర ప్రభుత్వాల పదవీ కాలాన్ని అర్థాంతరంగా కుదించవలసి వస్తుంది. అప్పటి రాజ్యాంగ పరిషత్ సభ్యుడైన శిబ్బన్ లాలా సక్సేనా ఒక సందర్భంలో ఇలా అన్నారు: "మన రాజ్యాంగంలో అన్ని ఎన్నికలు ఏక కాలంలో జరగడానికి వీలు లేదు. ఎందుకంటే వివిధ చట్ట సభలలో అవిశ్వాస తీర్మానాన్ని ఆమోదించినప్పుడు శాసన సభలు రద్దవుతాయి. అందుకు అనుగుణంగా ఎన్నికలు వేర్వేరు సమయాల్లో ఉంటాయి." గతంలో 1967 వరకు నాలుగుసార్లు జమిలి ఎన్నికలు జరిగిన మాట నిజమే. అయితే ఈ సంప్రదాయం ఉల్లంఘనకు బూర్జువా రాజకీయాలలోని నైతిక పతనం, అధికార దాహం ప్రధాన కారణాలు కాదా? అధికార పార్టీ ప్రతిపక్ష ప్రభుత్వాలను బర్తరఫ్ చేయడం, ఫిరాయింపులతో కూల్చడం వంటి అప్రజాస్వామ్య చర్యలకు ఒడిగడుతున్నది బడా బూర్జువా పార్టీలు కాదా? వీటిని ప్రస్తుతం మరింతగా ప్రోత్సహిస్తున్న బీజేపీ పార్టీ జమిలి ఎన్నికల ద్వారా ఈ దిగజారుడును అరికట్టగలుగుతుందని ఆశించగలమా? అలాగే జమిలి వల్ల తలెత్తే పర్యవసానం మరొకటి ఉంది. సాధారణంగా పార్లమెంటు ఎన్నికలలో జాతీయ అంశాలకు ప్రాధాన్యత ఉంటుంది. అసెంబ్లీ ఎన్నికలలో స్థానిక, ప్రాంతీయ సమస్యలు చర్చకు వస్తాయి. జమిలిగా ఎన్నికలు జరిగితే జాతీయ అంశాల ప్రభావంలో స్థానిక, ప్రాంతీయ సమస్యలు మరుగున పడే అవకాశం ఉంటుంది. అదే విధంగా ప్రాంతీయ పార్టీల ప్రభావం, వైవిధ్యం క్రమంగా తగ్గిపోయి దేశ రాజకీయ వ్యవస్థ ఏకశిలా సదృశంగా మారడానికి భూమిక ఏర్పడుతుంది.

> జమిలి ఎన్నికలు సాధ్యం కావాలంటే భారత రాజ్యాంగానికి ఐదు సవరణలు అవసరమని న్యాయకోవిదులు భావిస్తున్నారు. రాజ్యాంగం నిర్మాణ చట్రంలో ఫెడరల్ స్వరూపం ఒక మౌలిక అంశం. ఈ ఫెడరల్ స్వరూపాన్ని దెబ్బతీయకుండా సవరణలు చేయడం సాధ్యం కాదు.



▪ ఎస్. గోవిందరాజులు

పేట్రేగిపోతున్న పొలిటికల్ రౌడీలు



వరంగల్ క్రైం, డిసెంబర్ 23 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలో పొలిటికల్ రౌడీలు పేట్రేగిపోతున్నారు. తెర ముందు రాజకీయ నాయకుడిగా ప్రజల్లో చెలామణి అవుతూ.. తెర వెనుకాల పోలీసుల అండదండలతో సెటిల్‌మెంట్స్, బెదిరింపులకు పాల్పడుతూ ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నారు. రౌడీయిజం నేపథ్యంతో రాజకీయాల్లోకి వచ్చి పోలీసులను చెప్పుచేతుల్లోకి తెచ్చుకొని వారి ఆడిందే ఆట పాడిందే పాటగా సాగిస్తున్నారు. ఈ పొలిటికల్ రౌడీలకు పోలీసులంటే ఏ మాత్రం భయం ఉండదు. వీళ్లకే పోలీసులు మర్యాద ఇవ్వాలి. లేదంటే అధికార అహంకారంతో వారిపై పెత్తనం చేస్తుంటారు. ఒకప్పుడు రాణా మెట్లు ఎక్కాలంటే చేతులు కట్టుకొని కౌన్సెలింగ్‌కు హాజరైన రౌడీషీటర్లు.. రాజకీయ ఆరంగేట్రంతో పోలీసులను శాసించే స్థాయికి చేరుకున్నారు. ఈ రాజకీయ దాదాలు తమ పరిధిలోని రౌడీషీటర్లపై సైతం పెత్తనం చేస్తున్నారు. వారి సెటిల్‌మెంట్‌లకు అడ్డువచ్చే వారిని పోలీసు అధికారుల సాయంతో బెదిరింపులకు గురి చేస్తున్నారు. పీడీ యాక్టు పెట్టిస్తానని చెప్పు చేతుల్లో పెట్టుకుంటున్నారు.

- ముఖ్యనేతలకు అనుచరులుగా ఉంటూ దందాలు
- పోలీసుల అండదండలతో సెటిల్‌మెంట్లు, బెదిరింపులు
- కొందరు ఎమ్మెల్యేల వత్తాసు వాళ్లకే..
- కౌన్సెలింగ్‌లు, వారం వారం హాజరుకు డుమ్మా
- నగరంలో వి ఎతిమీరిపోతున్న రాజకీయ దాదాల ఆగడాలు
- వారి కదలికలపై కానరాని పోలీసుల నిఘా

గ్రేటర్‌లో హల్‌చల్

గ్రేటర్ పరిధిలోని హనుమకొండ, వరంగల్, మామునూరు, కాజీపేట డివిజన్‌లలోని పొలిటికల్ రౌడీలు సెటిల్‌మెంట్లు, భూ కబ్జాలు, లైంగిక వేధింపులు, బెదిరింపులకు పాల్పడుతూ సామాన్య ప్రజలను హింసిస్తున్నారు. ప్రజా ప్రతినిధుల ప్రధాన అనుచరులుగా ఉంటూ స్థానిక పోలీసులను తమ కనుసన్నల్లో పెట్టుకుంటున్నారు. తాము చెప్పిన పని చేయకపోతే పోస్టింగ్‌కే ఎసరు వస్తుందని బెదిరింపులకు పాల్పడుతున్నారు. వారు చేసే దందాల్లో జోక్యం చేసుకోకుండా ముందస్తు బెదిరింపులకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా హనుమకొండ, వరంగల్ పోలీస్ డివిజన్‌లలోని ప్రజాప్రతినిధులకు ప్రధాన అనుచరులైన పొలిటికల్ రౌడీలను నియంత్రిస్తేనే నగరం ప్రశాంతంగా ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. వరంగల్‌లోని ఓ ప్రజాప్రతినిధి అనుచరుడు ఏకంగా ఓ సీఐపైకి దాడికి దిగగా, తాజాగా హనుమకొండలో నేరచరిత్ర ఉన్న డివిజన్ స్థాయి ప్రజాప్రతినిధి ఎమ్మెల్యే సమక్షంలో ఓ కార్పొరేషన్ చైర్మన్‌కు బెదిరింపులకు పాల్పడటం చర్చనీయాంశమైంది.

జోన్ల వారీగా రౌడీషీటర్ల సంఖ్య	
సెంట్రల్ జోన్	292
ఈస్ట్ జోన్	264
వెస్ట్‌జోన్	143
మొత్తం	699

కౌన్సెలింగ్‌లకు డుమ్మా

వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో 699 మంది రౌడీషీటర్లు ఉన్నారు. ఆ జాబితాలో ప్రస్తుతం ప్రజాప్రతినిధులుగా ఉన్న చాలామంది ఉన్నారు. వీరందరూ పోలీసులు ఇచ్చే కౌన్సెలింగ్ సమావేశాలకు గైర్హాజరవుతున్నారు. రాణాల్లో వేసే శిక్షలు, వారంలో ఒక్క రోజు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో హాజరయ్యే పద్ధతికి దూరంగా ఉంటున్నారు. అయితే పోలీసులు మాత్రం ప్రతీ కౌన్సెలింగ్‌కు హాజరవుతున్నట్లు రికార్డులు సృష్టిస్తున్నారు. మీడియాకు ప్రకటనలు ఇస్తున్నారు. ప్రతీ ఏటా చివరి మాసంలో సత్ప్రవర్తన కలిగిన రౌడీషీటర్లపై సస్పెక్టు షీట్, రౌడీషీట్ తొలిగిస్తామని రాణాలకు పిలిపించి పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. అయితే ఇందులో రాజకీయ నాయకులుగా చెలామణి అయ్యే రౌడీలను వదిలేసి మిగతా వారికి కౌన్సెలింగ్ నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే కౌన్సెలింగ్ సమాచారాన్ని పొలిటికల్ రౌడీలకు సాయంత్రానికే కొంతమంది పోలీసు అధికారులు చేరవేస్తారని ఆరోపణలున్నాయి.



జాబితాలో పలువురు..

కమిషనరేట్‌లో ఉన్న 699 రౌడీషీటర్ల జాబితాలో గ్రామ స్థాయిలోని సర్పంచ్, గ్రేటర్ వరంగల్‌లోని కార్పొరేటర్లు, కార్పొరేటర్ల భర్తల నుంచి చివరికి రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ చైర్మన్‌ల వరకు ఉన్నారు. ఏ ఒక్క రోజూ వారిని పోలీస్‌స్టేషన్‌లకు పిలిచిందీ లేదు. రౌడీషీటర్లగా గుర్తించిందీ లేదు. వారిని వీఐపీలకు ఇచ్చే మర్యాద ఇస్తుంటారనే ఆపవాదు పోలీసులపై ఉంది. ఈ పొలిటికల్ రౌడీల ప్రసన్నం కోసం కొందరు పోలీసులు వారికి మర్యాదలు కల్పిస్తూ వారి చేసే సెటిల్‌మెంట్స్‌లో వాటాను తీసుకుంటున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. కొంత మంది అయితే తాను ఇక్కడ నివాసం ఉండడం లేనని, తనకు అనుకూలంగా ఉండే పోలీస్‌స్టేషన్‌లకు రౌడీషీట్‌ను మార్చుకొని, అక్కడి అధికారుల అండదండలతో పలు వివాదాల్లో దూరుతున్నట్లు తెలుస్తోంది.

అధికారులపై ఒత్తిడి

రాజకీయ ముసుగులో రౌడీయిజం చేసే వ్యక్తి బెండు తీద్దామని నిజాయితీగా పని చేసే ఎవరైనా ఓ అధికారి రాణాకు తీసుకువస్తే చాలు.. ప్రజాప్రతిధులు నుంచి ఒకటే ఫోన్లు వస్తుంటాయని కొంత మంది పోలీసు అధికారులు వెల్లడిస్తున్నారు. ఇటీవల వరంగల్ డివిజన్ పోలీసులు ఓ ప్రజాప్రతినిధి భర్తను కౌన్సెలింగ్‌కు పిలవగా, ఓ ఎమ్మెల్యే కలుగజేసుకుని తమ నాయకుడిని వదిలిపెట్టాలని హుకుం జారీ చేసినట్లు తెలుస్తోంది. సదరు రౌడీషీటర్ సైతం.. తాను మామునూరు పోలీసు డివిజన్ పరిధిలో నివాసం ఉంటున్నానని, మీరెందుకు పట్టుకువచ్చారని పోలీసులపై చిందులేసినట్లు తెలిసింది. ఇంకోసారి తన దగ్గరికి వరంగల్ పోలీసులు రాకొద్దని, మామునూరు డివిజన్‌లోకే తన పై ఉన్న రౌడీషీట్‌ను మార్పించుకుంటానని పోలీసులకు వార్నింగ్ ఇచ్చినంత పనిచేశాడని తెలుస్తోంది.

ఏసుక్రీస్తు బోధనలు సర్వ మానవాళికి మార్గదర్శకం

- అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖమంత్రి కొండా సురేఖ
- క్యాంపు కార్యాలయంలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు



క్రిస్‌మస్ కేక్ కట్ చేస్తున్న మంత్రి కొండా సురేఖ, మేయర్ సుధారాణి, కలెక్టర్ సత్యశారద

వరంగల్‌సిటీ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఏసుక్రీస్తు బోధనలు సర్వ మానవాళికి మార్గదర్శకమని అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సోమవారం ఓ సిటీలోని మంత్రి కొండా సురేఖ క్యాంపు కార్యాలయంలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి కొండా సురేఖ, గౌరవ అతిథులుగా మేయర్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్ సత్య శారద హాజరై కేక్ కట్ చేసి దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం మంత్రి సురేఖ మాట్లాడుతూ.. ఏసుక్రీస్తు బోధనలు ఒక మతానికి సంబంధించినవి కావని, యావత్తు మానవాళికి మార్గదర్శకంగా నిలిచేవన్నారు. అందరినీ ప్రేమించాలి, మంచి మార్గంలో నడవాలి, స్నేహభావంతో మెలగాలని ఏసుకీస్తు బోధించారన్నారు. క్రిస్టియన్‌ల కోసం సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను తీసుకువచ్చామన్నారు. లేబర్‌కాలనీ సీబీసీ చర్చి అభివృద్ధి కోసం రూ.కోటి మంజూరు చేసిందని, అందుకు సంబంధించిన జీవో కాపీని పాస్టర్లకు అందజేశారు. మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ.. నగర పరిధిలో 220 చర్చిలను గుర్తించి క్రిస్మస్ సందర్భంగా విద్యుత్ లైటింగ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. జంక్షన్లలో విద్యుత్ లైటింగ్ ఏర్పాటు చేయిస్తున్నామని తెలిపారు. కలెక్టర్ సత్యశారద మాట్లాడుతూ.. వినయం, కరుణ ఆచరించి చూపింది ఏసుక్రీస్తని కొనియాడారు. ఈ సందర్భంగా వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని పాస్టర్లందరికీ మంత్రి తన సొంత ఖర్చులతో దుస్తులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు గుండు చందన పూర్ణచందర్, పల్లం పద్మ, భోగి సువర్ణ, బైరబోయిన ఉమా, సురేష్ జోషి, చింతాకుల అనిల్, పోశాల పద్మ, కావటి కవిత, మరుపల్ల రవి, బాలినేని సురేష్, సోమిశెట్టి ప్రవీణ్, తహసీల్దార్ ఎక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

అమిత్ షాను బర్తరఫ్ చేయాలి

- అంబేద్కర్‌ను కించపరిచిన ఆయన క్షమాపణలు చెప్పాలి
- కులాలు, మతాల పేరుతో రెచ్చగొట్టడమే బీజేపీ అజెండా
- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి
- క్షమాపణలు చెప్పేదాక నిరసనలు : ఎంపీ కావ్య
- బీజేపీ జిల్లా నేతలు ముక్కు నేలకు రాయాలి : ఎమ్మెల్యే నాగరాజు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, చిత్రంలో ఎంపీ కావ్య, ఎమ్మెల్యే నాగరాజు, ఎర్రబెల్లి స్వర్ణ తదితరులు

హనుమకొండ సిటీ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను కించపరిచిన కేంద్ర మంత్రి అమిత్ షాను వెంటనే బర్తరఫ్ చేయాలని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బాధ్యత గల హోదాలో ఉన్న అమిత్ షా.. అంబేద్కర్‌ను కించపరుస్తూ మాట్లాడడాన్ని ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజాస్వామ్యవాదులంతా అమిత్‌షా వాఖ్యలను ముక్తకంఠంతో ఖండించాలని కోరారు. డబ్బు, అధికార అహంతో అమిత్ షా మాట్లాడారని దుయ్యబట్టారు. కులం, మతం పేరిట విద్వేషాలు రెచ్చగొట్టడమే అజెండాగా బీజేపీ పాలన సాగుతోందన్నారు. అమిత్ షా వ్యాఖ్యలను నిరసిస్తూ మంగళవారం హనుమకొండ అంబేద్కర్ జంక్షన్ వద్ద నిరసన చేపట్టనున్నట్లు రాజేందర్‌రెడ్డి వెల్లడించారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తామన్నారు.

ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ.. దేశమంతా నిరసనలు వెల్లువెత్తుతున్న తరుణంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్పందించకపోవడం శోచనీయమని అన్నారు. అమిత్ షాను పదవి నుంచి బర్తరఫ్ చేయడంతో పాటు పార్టీ నుంచి కూడా సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. తక్షణమే అమిత్ షా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. దళిత, ముస్లిం, మైనారిటీలకు వ్యతిరేకంగా బీజేపీ పాలన ఉందని ఆరోపించారు. అదానీ వంటి కార్పొరేట్ పెద్దలను నెత్తిన ఎత్తుకుంటూ రాజ్యాంగ నిర్మాణ అంబేద్కర్‌ను కించపరచడం ఆవేదన కలిగిస్తోందన్నారు. కులాలు, మతాలు, వర్గాలను విభజించి, విద్వేషాలకు ఉరికొల్పే భయానక పాలనను బీజేపీ కొనసాగిస్తోందన్నారు. రాజ్యాంగాన్నే మారుస్తామన్న బీజేపీకి ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పారన్నారు. విర్రవీగిన బీజేపీకి 300 సీట్లు కూడా రాలేదన్నారు. ఇంత కాలం పరోక్షంగా అంబేద్కర్‌పై దురుసుగా మాట్లాడిన బీజేపీ ప్రజాప్రతినిధులు.. ఇప్పుడు ప్రత్యక్షంగానే అవమానిస్తున్నారని మండిపడ్డారు. 'వన్ నేషన్.. వన్ ఎలక్షన్' నినాదంతో జమిలీ ఎన్నికలు జరపాలనే కేంద్ర ప్రభుత్వ తీరును రాష్ట్రాలు వ్యతిరేకించాయన్నారు. ఈ బిల్లుపై మెజారిటీ రాలేదని, అందుకే జేపీపీ ముందు పెట్టాల్సి వచ్చిందన్నారు. బిల్లుపై జరిగిన ఓటింగ్‌లో కాంగ్రెస్‌కు 190 ఓట్లు వచ్చాయని కావ్య వివరించారు. జమిలీ ఎన్నికల ద్వారా రాష్ట్రాలు ఉనికిని కోల్పోతాయన్నారు. రాష్ట్రాల ఎన్నికలే ఒకే రోజు జరగని పరిస్థితి ఉన్న క్రమంలో.. దేశమంతా ఒకేసారి ఎన్నికలు ఎలా సమర్థనీయమని ప్రశ్నించారు. అమిత్ షా క్షమాపణలు చెప్పే వరకు దేశ వ్యాప్తంగా నిరసనలు కొనసాగిస్తామని ఎంపీ కడియం కావ్య స్పష్టం చేశారు.

వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ.. ప్రపంచమే అంబేద్కర్ గొప్పతనాన్ని గౌరవిస్తే బీజేపీ నేతలు కించపరుస్తున్నారని వ్యాఖ్యానించారు. రాముడు అందరికీ దేవుడని, తాము కూడా పూజిస్తామన్నారు. అమిత్ షా, మోదీ ముందుగా స్వర్గం, నరకాన్ని చూసి వచ్చి తమకు చెబితే బాగుంటుందన్నారు. తక్షణమే అమిత్‌షా తన వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వరంగల్ జిల్లా బీజేపీ నేతలు హనుమకొండలోని అంబేద్కర్ జంక్షన్ వద్ద ముక్కు నేలకు రాయాలని డిమాండ్ చేశారు.

వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ మాట్లాడుతూ.. కేంద్ర మంత్రి అమిత్ షాకు పిచ్చి ముదిరిందని, అందుకే అంబేద్కర్‌ను కించపరిచేలా వ్యాఖ్యలు చేశారని విమర్శించారు. గాడ్సే గొప్పవాడని గాంధీని అవమానించారని, ఇప్పుడు అంబేద్కర్‌ను అవమానిస్తూ బీజేపీ ప్రజాప్రతినిధులు, నాయకులు అహంకారాన్ని ప్రదర్శిస్తున్నారని మండిపడ్డారు. అమిత్ షా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జీడబ్ల్యూఎంసీ ఫ్లోర్ లీడర్ తోట వెంకన్న, కార్పొరేటర్ శ్రీమాన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్‌ఖాన్ కాంగ్రెస్ నాయకులు బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఈవీ శ్రీనివాస్, బత్తిని శ్రీనివాస్, బొమ్మతి విక్రమ్, డాక్టర్ అనిల్‌కుమార్, మార్క విజయ్, కరాబ్ రాజేశ్వర్, కూర వెంకట్, విజయ్‌కుమార్, రమణారెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.

ప్రజల విజ్ఞప్తుల పరిష్కారంలో వేగం పెంచండి



గ్రీవెన్స్‌లో ఫిర్యాదులను స్వీకరిస్తున్న బల్దియా అధికారులు

- బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే
- కార్పొరేషన్ ప్రజావాణిలో 78 ఫిర్యాదుల స్వీకరణ

6

వినతుల విషయంలో నిర్లక్ష్యం తగదు



గ్రీవెన్స్‌లో ఫిర్యాదులను స్వీకరిస్తున్న వరంగల్ కలెక్టర్ సత్య శారద

- వరంగల్ కలెక్టర్ సత్య శారద
- ప్రజావాణిలో మొత్తం 163 అర్జీలు

6

ప్రజావాణి ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి



గ్రీవెన్స్‌లో ఫిర్యాదులను స్వీకరిస్తున్న హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య

- హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య
- వివిధ సమస్యలపై 175 ఫిర్యాదులు

6



ఏకశిల పార్కు వద్ద సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న సమ్మెకు సంఘీభావం తెలిపి మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

రేవంత్‌రెడ్డి మాట మీద నిలబడాలి..

- సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి
- మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్
- హనుమకొండలో దీక్షలకు సంఘీభావం

హనుమకొండ టౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట మీద నిలబడి సర్వశిక్ష అభియాన్ ఉద్యోగుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కు ముందు సమగ్ర శిక్ష ఉద్యోగులు 17 రోజులుగా చేస్తున్న సమ్మెకు హాజరై సంఘీభావం

మిగతా 6వ పేజీలో...



సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి సందర్శించిన అనంతరం మాట్లాడుతున్న హరీశ్‌రావు

సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిపై ప్రభుత్వ నిర్లక్ష్యం

- కక్ష పూరితంగా నిర్మాణాన్ని ఆలస్యం చేశారు
- యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలి
- ఆస్పత్రిని సందర్శించినమాజీ మంత్రి హరీశ్‌రావు

7

వంగరను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం

- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- పీవీ వర్ధంతి సభ.. ఘన నివాళులు



పీవీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, పలువురు ప్రముఖులు

భీమదేవరపల్లి, డిసెంబరు23 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ హయాంలో అర్థాంతరంగా ఆగిపోయిన అభివృద్ధి పనులను పూర్తిచేసి వంగరను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సోమవారం మాజీ ప్రధాని పీవీ స్వగ్రామమైన వంగరలో పీవీ నర్సింహారావు 20వ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా పీవీ విగ్రహానికి మంత్రి పొన్నం ప్రభాకర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం వంగరలో వివిధ అభివృద్ధి పనులను రూ.15కోట్లతో ప్రారంభించిందన్నారు. కానీ జన విజ్ఞాన వేదిక పేరుతో నిర్మించిన పలు అభివృద్ధి పనులు అర్థాంతరంగా ఆగిపోయాయన్నారు. నిధులు మంజూరు చేయించి ఆగిపోయిన అభివృద్ధి పనులను పూర్తి చేయిస్తానన్నారు. నవోదయ విద్యాలయాలకు అధ్యుడు పీవీ నర్సింహారావు అన్నారు. నవోదయ విద్యాలయాన్ని వంగరకు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఇందు కోసం ప్రధాని మోదీకి లేఖ రాశానన్నారు. హనుమకొండ జిల్లాలో నవోదయ విద్యాలయాలు లేవని, అది వంగరకు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నానన్నారు. ఇందుకు అవసరమైన భూమిని ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. వంగరలో లో లెవల్ బ్రిడ్జితో గ్రామస్థులు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనిని హైలెవల్ బ్రిడ్జిగా మార్చేందుకు నిధులు కేటాయించి పూర్తి చేయిస్తానన్నారు. పీవీ నర్సింహారావు చూపిన మార్గం దేశానికే ఆదర్శనీయంగా ఉందని కితాబునిచ్చారు. ఈ సమావేశంలో పీవీ కుమారుడు పీవీ ప్రభాకర్ రావు, పీవీ కూతురు ఎమ్మెల్సీ సురభి వాణిదేవి, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, సీపీ అంబర్ కిశోర్ ఝా, ఆర్డీవో రమేష్ రాథోడ్, తహసీల్దార్ ప్రవీణ్, ఎంపీడీవో వీరేశం, వొడితెల ప్రణవ్, పీవీ మదన్ మోహన్ రావు, చిట్టంపల్లి ఐలయ్య, ఆర్ వెంకటర్‌రెడ్డి, వొల్లాల రమేష్ పాల్గొన్నారు.

ప్రజల విజ్ఞప్తుల పరిష్కారంలో వేగం పెంచండి

• బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ కార్పొరేషన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ ప్రజావాణిలో ప్రజలు అందిస్తున్న విజ్ఞప్తుల పరిష్కారంలో వేగం పెంచాలని వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులకు సూచించారు. సోమవారం గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయం కౌన్సిల్‌హాల్‌లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ప్రజల సమస్యలపై స్పందించని అధికారులు, సిబ్బందిని ఇకపై సహించేది లేదన్నారు. విధుల్లో అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని కమిషనర్ హెచ్చరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. బల్దియాలోని కొన్ని శాఖల నుంచి తరుచుగా ఫిర్యాదులు వస్తున్నాయని, ఇకపై ఫిర్యాదులు రాకుండా చూడాలని అన్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగిన గ్రీవెన్స్‌లో 78 ఫిర్యాదులు స్వీకరించినట్టు కమిషనర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, సీఎంహెచ్‌వో డాక్టర్ బొమ్మన రాజారెడ్డి, డీఎఫ్‌వో శంకర్‌లింగం, టీవో బిర్రు శ్రీనివాస్, హెచ్‌వో రమేష్, సెక్రెటరి అలివేలు, ఎంహెచ్‌వో డాక్టర్ రాజేశ్‌తో పాటు వివిధ విభాగాల వింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫిర్యాదులు	
ఇంజనీరింగ్	- 15
హెల్త్, శానిటేషన్	- 05
ప్రాపర్టీ ట్యాక్స్, రెవెన్యూ	- 06
టౌన్‌ప్లానింగ్	- 51
తాగునీటి సరఫరా	- 01
మొత్తం	- 78



బల్దియాకు పోటెత్తిన ఫిర్యాదుదారులు

ఫిర్యాదులు ఇలా..

- హనుమకొండ ఏకశిల పార్కులో పబ్లిక్ టాయిలెట్స్ లేకపోవడం వల్ల వాకర్లకు ఇబ్బంది అవుతోంది. ప్రస్తుతం ఇక్కడ ఉన్న పబ్లిక్ టాయిలెట్స్ రెండేళ్లుగా మూతబడి ఉన్నాయి. రోజు 2000 మంది వాకర్స్ నడుస్తారని, వెంటనే కొత్త టాయిలెట్స్ నిర్మించాలని వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వంగ రాజిరెడ్డి, ఎల్లగౌడ్, దశరథరామిరెడ్డి, సోమయ్య, సారంగపాణి కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.
- వరంగల్ మట్టెవాడలో చాలా కాలంగా వేసిన సీసీ రోడ్డు ధ్వంసమై గుంతలుగా ఏర్పడ్డాయని, వెంటనే సీసీ రోడ్లు వేయాలని హరిహరపుర అభివృద్ధి కమిటీ కమిషనర్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. ప్రధానంగా పాత సీసీఎస్ పోలీసు స్టేషన్ రోడ్డు వేయాలని వారు కోరారు.
- గొర్రెకుంట కోటిలింగాల ప్రాంతంలో సుమారు 150 ఇండ్లు నిర్మించుకుని ఉంటున్నాం. సుమారు 100 ఇండ్లకు ఇంటి పన్ను కడుతున్నాం. మా కాలనీలో ఇప్పటి వరకు రోడ్లు, డ్రైనేజీ కాల్వలు నిర్మించక పోవడంతో చాలా ఇబ్బంది పడుతున్నాం. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని, లేదంటే ఇంటి పన్ను, నల్లా పన్ను చెల్లించమని కాలనీవాసులు కమిషనర్‌ను కోరారు.
- హనుమకొండ 55వ డివిజన్ భీమారంలో సీసీ రోడ్డు వేసేందుకు స్థానిక కార్పొరేటర్ సహాయంతో 20 ఫీట్ల రోడ్డును వదిలి పనులు జరుగుతున్నాయి. అయితే అదే ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి సీసీ రోడ్డును వేయకుండా అడ్డుకుంటున్నాడని కాలనీవాసులు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. నిత్యం ఆ రోడ్డు గుండా విద్యార్థులు, ఉద్యోగులు వెళ్లాలంటే ఇబ్బందిగా ఉందని, ఈ సమస్య పరిష్కరించాలని కోరారు.
- తన భూమిని ఓ కార్పొరేటర్ కబ్జా చేశాడని, 20 సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, అంగవైకల్యం ఉన్న తన ను ఎవరూ పట్టించుకో వడం లేదని హనుమ కొండకు చెందిన బత్తిని సరోజన అనే వృద్ధురాలు కమిషనర్‌ను వేడుకుంది. ఇప్పటికైనా తనకు న్యాయం చేయాలని వేడుకుంది.

వినతుల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు

ప్రజావాణిలో కలెక్టర్ సత్య శారద

వరంగల్ కలెక్టరేట్, డిసెంబరు 23 : (ఆంధ్రజ్యోతి): ప్ర జావాణిలో అందించిన వినతుల పట్ల అలసత్వం వహించకుండా వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. వరంగల్ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వచ్చిన వినతులను పరిశీలించి సంబంధిత శాఖల అధి కారులకు సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణిలో మొత్తం 163 వినతులు అందగా, శాఖల వారి గా ఎండార్స్ చేశారు. భూ సంబంధిత సమస్యలు, ఉద్యోగ ఉపాధి అవకాశాలపై అధిక సంఖ్యలో దరఖాస్తులు వస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి, డీఆర్‌ఓ విజయలక్ష్మీ, వరంగల్, నర్సంపేట ఆర్డీవోలు సత్యపాల్‌రెడ్డి, ఉమారాణి, జిల్లా పరి షత్ సీఈవో రామిరెడ్డి, కలెక్టరేట్ ఏఓ శ్రీకాంత్, వ్యవ సాయ అధికారి అనురాధ, డీసీఓ నీరజ, డీపీవో కల్పన, ఎల్‌డీఎం రాజు, ఉపాధి అధికారి ఉమారాణి పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలి

సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేసి అజంజాహి మిల్లు భూమిలోనే ఇంటి స్థలాలు కేటాయించాలని అజంజాహి మిల్స్ మాడిఫైడ్ వాలంటరీ రిటైర్డ్ (2002) వర్కర్స్ అసోసియేషన్ కార్మికులు, కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. తప్పుడు పత్రాలు సృష్టించి కబ్జాకు పాల్పడి కార్మిక భవనాన్ని కూల్చిన వస్త్ర వ్యాపారిపై చర్యలు తీసుకోవాలి. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

ఐఆర్ఆర్ బైపాస్ రోడ్డును రద్దు చేయాలి

రైతులకు, పేద, మధ్య తరగతి ప్రజలకు తీవ్ర నష్టం చేకూర్చేలా ఉన్న పైడిపల్లి, ఆరెపల్లి, కొత్తపేట క్రాస్ వరకు ప్రతిపాదించిన ఇంటర్నల్ రింగ్ రోడ్డు (ఐఆర్ఆర్) రద్దు చేయాలి. జీవనాధారమైన రెండు పంటలు పండే విలువైన పంటలపొలాలు రోడ్డు నిర్మాణంలో పోయే ప్రమాదం ఉంది. ఇప్పటికే నేషనల్ హైవే కింద అనేక మంది రైతులు తమ విలువైన భూములను కోల్పోయారు. ప్రస్తుతం ఐఆర్ఆర్ బైపాస్ 200 ఫీట్ల రోడ్డుకోసం, ఓఆర్ఆర్ 300 ఫీట్ల రోడ్డు కోసం ప్రతిపాదనలు చేయడంతో అధిక సంఖ్యలో రైతులు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. వెంటనే ఐఆర్ఆర్ బైపాస్ రోడ్డును రద్దు చేయాలి.

ప్రజావాణి ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

● హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ కలెక్టరేట్, డిసెంబరు 23 (ఆం ధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని జిల్లా వ్యాప్తంగా ప్రజావాణికి ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య సంబంధిత అధికారులను ఆదే శించారు. హనుమకొండ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి జిల్లా వ్యాప్తంగా 175 ఫిర్యా దులు వచ్చాయి. కలెక్టర్ ప్రావీణ్య బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి సంబంధిత శాఖ అధికారులను పిలిచి ఫిర్యాదును పరిశీలించి పరిష్కరించా లన్నారు. ఎక్కువ ఫిర్యాదులు రెవెన్యూ కు సంబంధించినవి వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. అధికారులు సమస్యల పరిష్కారంలో అలసత్వం వహించొద్దని, ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులను వెం టనే పరిశీలిస్తే ప్రజలకు ప్రజావాణిపై, ప్రభుత్వంపై నమ్మకం కలుగుతుందన్నారు. నూతన జాతీయ విద్యా విధానాన్ని ఉపసంహరించుకోవాలని ఏఐఎఫ్‌డీఎస్ నాయకులు కలెక్టర్ ప్రావీణ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వై.వి గణేష్, హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్, సీపీఓ సత్యనారాయణరెడ్డి, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్లాత్ బ్యాగులను పరిశీలించిన కలెక్టర్

జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన క్లాత్‌బ్యాగులను సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులకు కలెక్టర్ ప్రావీణ్య పలు సూచనలు చేశారు.

జిల్లా కోర్టు ప్రాంగణంలో
క్రిస్మస్ వేడుకలు

వరంగల్ లీగల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని హనుమకొండ, వరంగల్ జిల్లాల బార్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సోమవారం కోర్టు ప్రాంగణంలోని బార్ అసోసియేషన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమానికి రెవరెండ్, పాస్టర్ తాటికొండ జోసఫ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏసుక్రీస్తు శాంతి, సామరస్య సమాజం కోసం బోధనలు చేశారని అణగారిన ప్రజల సంక్షేమంకోసం తన జీవితాన్ని ధారబోశారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ, వరంగల్ జిల్లాల బార్ అసోసియేషన్ అధ్యక్షులు మాతంగి రమేష్‌బాబు, తీగల జీవన్ గౌడ్, ప్రధాన కార్యదర్శులు లాదె రమేష్, ముదసిర్ అహ్మద్, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు బైరపాక జయాకర్, కార్యక్రమ నిర్వాహకులు డేవిడ్ రాజ్‌కుమార్, నాగభూషణం, చిరంజీవి, న్యాయవాదులు వొద్దిరాజు వెంకటేశ్వర్‌రావు, చిల్ల రాజేంద్రప్రసాద్, పులి సత్యనారాయణ, సాంబశివరాజు, ప్రవీనా, నిర్మలజ్యోతి, ఇందూ వేదవతి, ఇంద్ర వైశాలి, శశిరేఖ , శ్రీలత, ఆశీర్వాదం, షడ్రక్, మహేందర్, సుభాష్ పాల్గొన్నారు.

సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి ప్రత్యేక అధికారులు

వరంగల్ మెడికల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి ప్రత్యేక అధికారులుగా టీజీఎంఎస్ఐడీసీ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ కె.కౌటిల్య, సీఈ దేవేందర్‌లను ప్రభుత్వం నియ మించింది. ఈ మేరకు వైద్య, ఆరోగ్యశాఖ కార్యదర్శి మెమో విడుదల చేశారు. అదే విధంగా ఎంజీఎం ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా డాక్టర్ కిశోర్ కుమార్‌ను నియమించారు. రోడ్లు, భవనాలు, ఆర్థికశాఖ, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ సమన్వయంతో పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొంది.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సత్యశారద

మత్తు పదార్థాల నియంత్రణకు పటిష్ట చర్యలు

వరంగల్ కలెక్టరేట్, డిసెంబరు 23: (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల నిరోధానికి సమష్టి కృషి చేసి యువత, విద్యార్థుల భవిష్యత్‌ను కాపాడాలని జిల్లా కలెక్టర్ సత్యశారద అన్నారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో సోమవారం మత్తు పదార్థాల నియంత్రణపై డీసీపీ రవీందర్‌తో కలిసి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. యువత చెడు వ్యసనాలకు గురి కాకుండా చూడాలన్నారు. విద్యాసంస్థల సమీపంలోని కిరాణా షాపులు వేదికగా గంజాయి, ఇతర మత్తు పదార్థాలు విక్రయించడం, అనుమానాస్పద ప్రాంతాల్లో నిఘా వేసి తరుచూ పెట్రోలింగ్ చేయాలని సూచించారు. ఇంటర్మీడియట్ కాలేజీలలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లుగా విద్యార్థులను ఏర్పాటు చేసి కాలేజీ విద్యార్థుల ప్రవర్తనను గుర్తించేలా శిక్షణ ఇవ్వాలని డీఐఈవోను ఆదేశించారు. మారుమూల ప్రాంతాల రైతులు గంజాయి సాగు చేయకుండా తనిఖీ నిర్వహిస్తూ కౌన్సెలింగ్ ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. అనంతరం మత్తు పదార్థాల నియంత్రణపై రూపొందించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో వరంగల్, నర్సంపేట ఆర్డీవోలు సత్యపాల్‌రెడ్డి, ఉమారాణి, ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్, ఏసీపీలు తిరుపతి, సైదులు, కిరణ్ కుమార్, డీఎంహెచ్‌వో డాక్టర్ సాంబశివరావు, ఇన్‌చార్జి డీఐఈవో మాధవరావు, వ్యవసాయ అధికారి అనురాధ పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి మాట మీద నిలబడాలి..

(5వ పేజీ తరువాయి)

తెలిపారు. ఈ సందర్భంగా హరీష్‌రావు మాట్లాడుతూ.. కిందటేడు ఏకశిల పార్కు వద్ద సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలకు అప్పటి ప్రతిపక్ష పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి హాజరై 'చాయ్ తాగేలోపు మీ సమస్య పరిష్కారం చేస్తా..' అని గొప్పలు చెప్పాడని, అధికారంలోకి వచ్చి యేడాదైనా ఉద్యోగులను ఎందుకు రెగ్యులరైజ్ చేయడం లేదని దుయ్యబట్టారు. ఉద్యోగులకు అండగా బీఆర్ఎస్ ప్రభుత్వం ఉంటుందని హరీష్‌రావు పేర్కొన్నారు.

బీఆర్ఎస్ హయాంలో రైతులకు ఎలాంటి పనిముట్లు రాయితీ మీద ఇవ్వలేదని చెబుతున్న ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క చర్చకు సిద్ధమేనా అని మాజీ హరీష్‌రావు సవాల్ విసిరారు. మేము రైతులకు ఎలాంటి పనిముట్లు ఇవ్వలేదని తేలితే రాజీనామా చేస్తామని, ఇచ్చినట్లు తేలితే మంత్రి భట్టి విక్రమార్క రాజీనామా చేస్తారా..? అని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.7లక్షల కోట్లు అప్పు చేసిందని అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి అబద్ధాలు చెబుతున్నాడని, బీఆర్ఎస్ చేసింది కేవలం రూ.4లక్షల 17 వేల కోట్లేనని అన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ విధానాలను ప్రశ్నిస్తే కేసులు, నిలదీస్తే కేసులు పెడుతున్నారని అన్నారు. 54 మంది హాస్టల్ విద్యార్థులు కాంగ్రెస్ ప్రభుత్వంలో చనిపోయారని విమర్శించారు. లగచర్ల రైతులకు బేడీలు వేస్తే ప్రజా పాలన అవుతుందా? అని హరీష్‌రావు అన్నారు. సినీ హీరో అల్లు అర్జున్ గురించి అసెంబ్లీలో బాగా మాట్లాడిన సీఎం రేవంత్‌రెడ్డి.. తన స్వగ్రామంలోని తన తమ్ముడు తిరుపతిరెడ్డి వేధింపులు తాళలేక ఆత్మహత్య చేసుకున్న మాజీ సర్పంచ్ సాయిరెడ్డి ఘటనపై ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. సినీ హీరో అల్లు అర్జున్ అరెస్టు చేసినట్లుగా తిరుపతిరెడ్డిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, హనుమకొండ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, మాజీ ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, రైతు రుణ విమోచన కమిషన్ రాష్ట్ర మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు, కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ఏనుగుల రాకేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చాయ్ గ్లాస్‌తో..

హనుమకొండలోని సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె శిబిరం వద్ద బీఆర్ఎస్ నేతలు గ్లాస్‌లో చాయ్ తాగుతూ మద్దతు తెలిపారు. చాయ్ తాగేంతలోపే సమస్య పరిష్కరిస్తా.. అని రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఇలా వ్యంగ్యంగా ప్రదర్శన ఇచ్చారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీష్‌రావు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి భార్య చాయ్ ఇచ్చే ముందు ఒకసారి ఇయన ఇచ్చిన హామీని గుర్తు చేయాలని అన్నారు.

ఫోరెన్సిక్ సైన్స్‌పై న్యాయవాదులకు అవగాహన ఉండాలి
జిల్లా జడ్జి నిర్మల గీతాంబ

వరంగల్ లీగల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): భారత సాక్ష్యాల చట్టం (భారత సాక్షియ అధినియం)లో క్రియాశీలక పాత్ర పోషిస్తున్న ఫోరెన్సిక్ సైన్స్ ఎంతో ప్రాధాన్యత కలిగి ఉందని వరంగల్ జిల్లా జడ్జి నిర్మల గీతాంబ అన్నారు. సోమవారం నూతన బార్ అసోసియేషన్‌లో ఫోరెన్సిక్‌పై నిర్వహించిన సెమినార్‌కు ఆమె ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ కార్యక్రమంలో ప్రోబ్‌లాబ్ ఫోరెన్సిక్ డైరెక్టర్ మోహన్ ఎర్రగొల్ల ఫోరెన్సిక్‌పై న్యాయవాదులకు అవగాహన కల్పించారు. క్రిమినల్ కేసుల నిర్వహణలో ఇటీవలి కాలంలో ఫోరెన్సిక్ అత్యంత అవసరంగా ఏర్పడిందని దీనిపట్ల న్యాయవాదులు నైపుణ్యం కలిగి ఉండాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మాతంగి రమేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి లాదె రమేష్, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు బైరపాక జయాకర్, దుస్స జనార్దన్, సీనియర్ , జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

మహిళా వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి

బాలసముద్రం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వస్తువులను కొనుగోలు చేసే సమయంలో మహిళా వినియోగదారులు జాగ్రత్తగా ఉండాలని ఆల్ ఇండియా కన్జూమర్ వెల్ఫేర్ కౌన్సిల్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడ డాక్టర్ పల్లెపాడు దామోదర్ అన్నారు. సోమవారం హనుమకొండలోని జిల్లా వినియోగదారుల సలహా సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన వినియోగదారుల చైతన్య సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సమాజంలో నిత్యావసర సరుకులు బట్టలు, బంగారం, గృహోపకరణ వస్తువులు మహిళా వినియోగదారులే ఎక్కువ కొనుగోలు చేస్తారని, కొనుగోలు చేసే వస్తువుల నాణ్యతపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. వస్తువులపై ప్రభుత్వ రంగ సంస్థలు ముద్రించిన ఐఎస్ఐ, హాల్‌మార్క్ గుర్తులను పరిశీలించి కొనుగోలు చేయాలన్నారు. నష్టపోయిన వినియోగదారులు వినియోగదారుల సంఘాల ప్రతినిధులను ఆశ్రయించవచ్చని సెల్ నంబర్ :98493 46491ను సంప్రదించి సలహాలు తీసుకోవాలని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఎస్.హైమావతి, ఎ.శ్రీదేవి, జిల్లా వినియోగదారుల సలహా సంఘం సభ్యులు జ్యోస్నా, సౌమ్యమమత, కవిరాజ్,సతీష్, నరేష్, మహిళలు పాల్గొన్నారు.

అక్రమాలను అరికట్టవచ్చు

వినియోగదారులు చైతన్యవంతులై ప్రశ్నించే తత్వాన్ని అలవాటు చేసుకోవాలని ఆల్ ఇండియా కన్జూమర్ వెల్ఫేర్ కౌన్సిల్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు డాక్టర్ పల్లెపాడు దామోదర్ అన్నారు. సోమవారం హనుమకొండ రాంనగర్‌లో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. డిసెంబరు 24న జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1986 నుంచి భారత దేశంలో వినియోగదారుల రక్షణ చట్టం అమలులో ఉన్నప్పటికీ, ప్రభుత్వం ఎంత ప్రచారం చేసిన వినియోగదారుల సంఘాలు ఎన్ని కార్యక్రమాలు నిర్వహించినప్పటికీ వినియోగదారులు చైతన్యవంతులు కావడం లేదన్నారు. కొత్త చట్టంలో పరిధి పెరగడం ముఖ్యంగా ఆన్‌లైన్ మార్కెటింగ్, అబద్దపు వ్యాపార ప్రకటనలు అరికట్టేందుకు జాతీయ స్థాయిలో సెంట్రల్ కన్జూమర్ ప్రొటెక్షన్ అథారిటీ(సీసీపీ) ఏర్పాటు చేయడంతో వినియోగదారులకు మేలు జరుగుతుందని అన్నారు. రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో వినియోగదారుల పరిరక్షణ కమిటీలను ఏర్పాటు చేసి చట్టం అమలుకు కృషి చేస్తామని, వినియోగదారులకు సలహాలు, సూచనలు ఇవ్వడానికి ప్రత్యేక కార్యా లయాల్లో టోల్ ఫ్రీ నంబర్లు ఏర్పాటు చేస్తామని ఆయన అన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దామోదర్



కార్యక్రమంలో మాట్లాడుతున్న కేయూ వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి

మాదకద్రవ్యాలకు యువత బానిసలు కావొద్దు

వరంగల్ ఎడ్యుకేషన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలకు యువత బానిసలు కావొద్దని కాకతీయ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి సూచించారు. ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ సంయుక్తంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్. జ్యోతి అధ్యక్షతన సోమవారం యాంటీ డ్రగ్స్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆధునిక సమాజంలో మత్తు పదార్థాలకు యువత ఆకర్షితులవుతూ వారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు మత్తుకు దూరంగా ఉంటూ చదువుపై శ్రద్ధపెడితేనే ప్రయోజకులుగా మారుతారన్నారు. వరంగల్ సీపీ అంబర్ కిషోర్‌ఝా మాట్లాడుతూ.. మత్తు పదార్థాలు విక్రయించినా, వినియోగించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులు మత్తుకు బానిసలై జీవితాలను నాశం చేసుకోవద్దని సూచించారు. మాదక ద్రవ్యాలకు అలవాటుపడిన వారికి పోలీసులు మూడు విధాలా కార్యక్రమాలను చేపడుతున్నార న్నారు. అనంతరం విద్యార్థులతో మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కేయూ పాలకమండలి సభ్యురాలు డాక్టర్ కె.అనితరెడ్డి, యాంటీ నార్కొటిక్స్ డీఎస్పీ సైదులు, డాక్టర్ జగదీష్‌బాబు, కేయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కేయూ సౌత్ జోన్ ఇంటర్ వర్సిటీ పవర్ లిఫ్టింగ్ జట్టు ఎంపిక

కేయూ క్యాంపస్, డిసెంబరు 23, (ఆంధ్రజ్యోతి): జనవరి 6 నుంచి 11 వరకు కర్నాటకలోని గుర్బర్గా యూనివర్సిటీలో జరిగే సౌత్ జోన్ ఇంటర్ వర్సిటీ మహిళల పవర్‌లిఫ్టింగ్ టోర్నమెంట్‌కు కేయూ జట్టును 2024-25 ఏడాదికి గాను సోమవారం ఎంపిక చేసినట్లు కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ వై.వెంకయ్య తెలిపారు. ఎంపికైన క్రీడాకారులలో మహిళ విభాగం నుంచి బి. చిన్మయి (కేయూ మహిళ ఇంజనీరింగ్ కళాశాల, కేయూ క్యాంపస్)ను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఈ జట్టుకు కోచ్, మేనేజర్‌గా సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్. పి.బాస్కర్ వ్యవహరిస్తారని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, డైరెక్టర్ ప్రొఫెసర్ వై.వెంకయ్య, మహిళ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భిక్షాలు, అధ్యాపకులు టి. వెంకటేష్, వేణుగోపాల్‌రెడ్డి, పీవీ వైష్ణవి, కె. సాయి తరుణ్, స్వప్న, సాహితీ, రచన,డాక్టర్ ఎన్. వీణ,దీప్తి, సిబ్బంది వీరు నాయక్‌లు చిన్మయిని అభినందించారు. డిసెంబరు 24 నుంచి 27 వరకు భువనేశ్వర్‌లోని కళింగ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో జరిగే సౌత్ జోన్ ఇంటర్ వర్సిటీ మహిళలు, పురుషుల ఆర్చెరీ పోటీలకు కేయూ 2024-25 ఏడాదికి గాను జట్టును ఎంపిక చేశారు. పురుషుల విభాగం నుంచి ఇ.సంపత్ (ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కళాశాల, ఖమ్మం), సీహెచ్. త్రిశూల్ (సమత డిగ్రీ కళాశాల, తొర్రూరు.), ఇ. ఆనంద్ (ప్రభుత్వ డిగ్రీ కళాశాల, భద్రాచలం) మహిళల విభాగం ఎం.స్ఫూర్తి, (సమత డిగ్రీ కళాశాల తొర్రూరు), తన్వీర్ కౌసర్ (సీకేఎం ఆర్ట్స్ అండ్‌సైన్స్ కళాశాల, వరంగల్), మన్సూరా హసీబ్ (పద్మావతి డిగ్రీ కళాశాల, వరంగల్)లున్నట్లు పేర్కొన్నారు. ఈ జట్టుకు కోచ్, మేనేజర్‌గా హనుమకొండలోని న్యూ సైన్స్ డిగ్రీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ పి. రాజేశ్ వ్యవహరిస్తారని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, డైరెక్టర్ ప్రొఫెసర్ వై.వెంకయ్యలు అభినందించారు.



ఎంపికైన చిన్మయితో ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్, ఇతర అధ్యాపకులు

మార్కెట్‌కు రెండురోజులు సెలవులు

వరంగల్ వ్యవసాయం, డిసెంబరు23 (ఆంధ్రజ్యోతి): ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు రెండు రోజుల పాటు సెలవులు ప్రకటిస్తున్నట్లు ఆ మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి పోలెపాక నిర్మల సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. 25వ తేదీ బుధవారం క్రిస్మస్ వేడుకల సందర్భంగా సెలవు, 26 బాక్సింగ్ డే సందర్భంగా సెలవులు ప్రకటించినట్లు, తిరిగి 27 శుక్రవారం మార్కెట్లో యథావిధిగా క్రయ విక్రయాలు నిర్వహిస్తామని తెలిపారు. రైతులు, వ్యాపారులు, కార్మికులు మార్కెట్ కమిటీకి సహకరించాలని ఆ ప్రకటనలో పోలెపాక నిర్మల కోరారు.

వరంగల్ మార్కెట్ ధరలు (రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	-	-
పల్లికాయ (సూక)	6900	3000
పల్లికాయ (పచ్చిది)	5350	4500
కందులు	-	-
పెసళ్లు	7612	4000
పత్తి	6970	5800
పసుపు (కాడి)	11002	10235
పసుపు (గోల)	10952	9565
తేజ మిర్చి	12000	9000
తేజ మిర్చి (కొత్తది)	16000	12000
తేజ ఏసీ	15200	14000
వండర్‌హాట్ ఏసీ	14500	13000
యూఎస్341ఏసీ	13500	11000
దేశీ ఏసీ	-	-
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం

- రంగును బట్టి కలపకు మార్కెట్లో డిమాండ్
- కిలో ధర రూ. 2 వేల నుంచి రూ. 2500 వరకు
- పడవలు, సంగీత వాయిద్యాలు, ఔషధాల తయారీకి వినియోగం

సిరులు కురిపించే మహోగని

'డబ్బుల చెట్ల' పెంపకం చేపట్టిన పాలకుర్తి మండల రైతులు



కోతులబాదులో రైతు రాములు పెంచుతున్న చెట్లు

పాలకుర్తి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఇంట్లో అమ్మనో.. నాన్ననో.. డబ్బులు అడుగినప్పుడల్లా డబ్బులేమైన చెట్లకు కాస్తున్నాయా? అంటుంటారు. చెట్లకు డబ్బులు కాయకపోయినప్పటికీ.. సిరులు కురిపించే చెట్లు ఉన్నాయి. అలాంటి చెట్లను పెంచాలనాన్న.. సిరులు సొంతం చేసుకోవాలన్నా.. చేయాల్సింది ఒకటే. మనకున్న స్థలంలో అది కొద్దిపాటిదైనా ఆ మొక్కలను నాటి.. 12ఏళ్లు సాకితే చాలు అవే ధనవంతులను చేస్తాయి. ఆ చెట్ల ద్వారా రూ.లక్షల్లో ఆదాయం వస్తుంది. ఎందుకంటే వాటి కున్న విలువ అలాంటింది. ఇంతకీ ఆ చెట్టేంటంటా.. మహోగని చెట్లు. డబ్బుల చెట్లుగా చెప్పుకొంటున్న ఆ చెట్లను పాలకుర్తి మండలంలోని బమ్మెర, కోతులబాద్ గ్రామాలకు చెందిన ఇద్దరు రైతులు పెంచుతున్నారు. బమ్మెరకు చెందిన నర్సింహారెడ్డి పదెకరాల్లో, కోతులబాదుకు చెందిన మరో రైతు చురకంటి రాములు నాలుగు ఎకరాల్లో ఈ చెట్లను వేశారు. హైదరాబాద్ నుంచి మూడేళ్ల క్రితం మొక్కలు (చతుర్వేద) కంపెనీకి చెందిన ఎకరానికి 50 మొక్కల చొప్పున 400 మొక్కలు కొనుగోలు చేశారు. ఒక్కో మొక్క రూ.40 నుంచి రూ.200వరకు ధర ఉండగా.. ఎకరంలో మొక్కలు నాటేందుకు రూ.50వేల నుంచి రూ. 60 వేలు ఖర్చు అవుతుంది. 9 అడుగులకు ఒక మొక్క చొప్పున ఈ మొక్కలు నాటాలి. మూడు నెలలకోసారి ఎకరానికి ఒక బస్తా డీఏపీ, యూరియాను చల్లాలి. ప్రభుత్వం ఈ మహోగని చెట్ల పెంపకానికి ఎలాంటి సబ్సిడీ ఇవ్వలేదు. డ్రిప్ సాయంతో నీటిని ఎక్కువగా అందించాలి. ముఖ్యంగా వేసవిలో నీటిని ఎక్కువగా అందిస్తే చెట్లు ఏపుగా పెరగడానికి దోహదపడుతాయి. ఈ క్రమంలో సదరు రైతులు ఇప్పటి వరకు ఎకరానికి రూ.1లక్ష చొప్పున ఖర్చు చేశారు. ఈ చెట్లు పరిపక్వం చెందడానికి 12 సంవత్సరాలు పడుతుంది. ఐదేళ్లకోసారి విత్తనాలను ఉత్పత్తి చేస్తాయి. హైదరాబాద్, మహారాష్ట్రలో లభించే ఈ మహోగని చెట్లను పెంచిన రైతులు 12 ఏళ్లలో లక్షాధికారులు అవుతారని చెబుతున్నారు.

గుట్టల ప్రాంతాల్లో కాకుండా..

ఈ మహోగని చెట్లు గుట్టల ప్రాంతాల్లో కాకుండా అన్ని నేలల్లో సాగుచేసుకొవచ్చు. ఈ చెట్టు కలప రంగును బట్టి మార్కెట్లో గిరాకీ ఉంటుంది. ఎరుపు రంగులో ఉన్న కలప ధర క్యూబిక్ ఫీట్‌కు రూ.1,300 నుంచి రూ. 2,500 వరకు మార్కెట్లో పలుకుతుంది. ఒక్కో చెట్టు 60 నుంచి 80 అడుగులు పెరుగుతుంది. దీనిని బట్టి చూస్తే ఈ చెట్టు 40క్యూబిక్ అడుగులు పెరుగుతుంది. క్యూబిక్ ఫీట్‌కు ధర రూ. 1,500 అనుకున్నప్పటికి ఒక చెట్టు రూ. 60 వేల వరకు అమ్ముడవుతుంది. ఈ చెట్ల పెంపకంపై ఆసక్తి చూపేందుకు రైతులు ఇప్పుడిప్పుడే ముందుకు వస్తున్నారు.

మహోగని కలప, వినియోగం..

మహోగని కలప సముద్రాల్లో పడవలకు, సంగీత వాయిద్యాలకు విగ్రహాల తయారీలోనూ, వాటర్ క్రాఫ్ట్ అలంకార ఉత్పత్తుల్లోనూ ఉపయోగిస్తారు. అంతే కాకుండా వి త్తనాలను కొన్ని ఔషధాల తయారీలో ఉపయోగిస్తారు. ముఖ్యంగా షుగర్, క్యాన్సర్, బీపీ లాంటి రుగ్మతల నివారణకు వాడే వైద్యంలో ఈ ఔషధాలను ఉపయోగిస్తారని చెబుతున్నారు. ఈ చెట్ల ఆకులు వ్యవసాయ పురుగు మందులుగా ఉపయోగిస్తారని కూడా చెబుతున్నారు. దీని ఆకులు పెద్దవిగా ఉంటాయని, 40 మిల్లీ మీటర్ల పొడవు వరకు మెరుస్తూ ఉంటాయి. సబ్బులు, పెయింట్ లాంటి తయారీలో కూడా మహోగని చెట్ల నుంచి తీసిన నూనెలను వినియోగిస్తారు. ఈ చెట్టుకు సంబంధించిన ప్రతీ భాగం ఏదోఒక విధంగా ఉపయోగపడుతుంది.



మహోగని చెట్ల పెంపకంతో భారీ లాభాలు గడించొచ్చు

మహోగని ఆకులను మందుల తయారీకి ఉపయోగిస్తారు. క్యాన్సర్, షుగర్ లాంటి మాత్రల్లో వీటిని ఉపయోగిస్తారు. ఈ చెట్ల పెంపకం వల్ల ఆర్థికంగా అధిక లాభాలు గడిస్తారు. కానీ అందుకు 12 సంవత్సరాల సమయం పడుతుంది. ఆ తర్వాత ఎకరం, రెండెకరాలు సాగు చేసిన లక్షల్లో ఆదాయం ఉంటుంది. రైతులు ఇలాంటి చెట్లను సాగు చేసేందుకు దృష్టి పెట్టాలి. ఈ కలపను పడవల తయారీకి కూడా ఉపయోగిస్తారు.

- కాక రవిదొర, ఫారెస్టు బీట్ ఆఫీసర్ పాలకుర్తి

ఇప్పటి వరకు రూ.4లక్షల చేశా



మూడేళ్ల క్రితం హైదరాబాద్ నుంచి మహోగని మొక్కలు తెచ్చి నాలుగు ఎకరాల్లో నాటాను. నాటేందుకు, యూరియా, కూలీల ఖర్చుతో పాటు నీటి కోసం డ్రిప్ పైపులు కూడా తీసుకువచ్చాను. మూడు నెలలకు ఒక సారి డీఏపీ, యూరియా చల్లుతున్నా. ఇప్పటి వరకు అన్ని ఖర్చులు చూసుకుంటే రూ.4లక్షలు ఖర్చు చేశాను. ఈ చెట్లు అమ్మకానికి రావడానికి 12 సంవత్సరాలు పడుతుంది. ఆదాయం బాగానే వస్తుందని ఆశాభావంతో ఉన్నా.

- చురకంటి రాములు, కోతులబాదు, పాలకుర్తి మండలం

12 ఏళ్ల తర్వాత ఆదాయం



కొత్త రకమైన పంట అని మహోగని చెట్లను పది ఎకరాల్లో సాగుచేశా. హైదరాబాద్ నుంచి ఒక్కో మొక్క రూ.100చొప్పున కొనుగోలు చేసి నాటించాను. ఇప్పటి వరకు రూ.6లక్షలు ఖర్చు చేశా. నెలకు ఒకసారి కూలీలతో చెట్లు మొదట్లో ఉన్న గడ్డిని తొలగించాలి. డ్రిప్ ద్వారా నీటిని అందిస్తున్నాం. ఇంకా ఏడు సంవత్సరాలు వరకు ఈ పంటను కంటికి రెప్పలా కాపాడుకోవాలి. ఆ తర్వాతే ఆదాయం ఎంత వస్తుందని తెలుస్తుంది.

- ముస్కు నర్సింహారెడ్డి, బమ్మెర మండలం పాలకుర్తి

సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిపై ప్రభుత్వ నిర్లక్ష్యం



- కక్షపూరితంగా నిర్మాణం ఆలస్యం చేశారు..
- యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలి
- ఆస్పత్రిని సందర్శించిన మాజీ మంత్రి హరీశ్‌రావు



సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో మాజీ మంత్రి హరీశ్‌రావు, బీఆర్ఎస్ నేతలు

వరంగల్ మెడికల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లో పేద రోగుల వైద్య సేవల కోసం నిర్మించతలపెట్టిన మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిపై కాంగ్రెస్ ప్రభుత్వం వివక్ష చూపుతోందని బీఆర్ఎస్ నాయకుడు, మాజీ మంత్రి టి.హరీశ్‌రావు ఆరోపించారు. వరంగల్ సెంట్రల్ జైలు ప్రాంగణంలో 24 అంతస్థులతో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని మాజీ మంత్రి హరీశ్‌రావు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వంలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పనులు 84శాతం పూర్తి అయ్యాయని, కేవలం 16శాతం పనులను కాంగ్రెస్ ప్రభుత్వం 14 నెలలు పూర్తవుతున్నప్పటికీ పూర్తి చేయకపోవడం సరికాదన్నారు. కక్షపూరితంగా నిర్మాణం ఆలస్యం చేస్తున్నారని, యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని కోరారు. పేదలకు సూపర్ వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో కేసీఆర్ వరంగల్ కేంద్ర కారాగారంలో 24 అంతస్థుల్లో ఆస్పత్రి పనులు ప్రారంభిస్తే.. వాటిని పూర్తి చేయాల్సిన రేవంత్‌రెడ్డి సర్కారు నిర్లక్ష్యం వహించడం సరికాదన్నారు. 2024 జూన్ వరకు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పనులు పూర్తి కావాలని ప్రతిపాదనలు చేశామని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అభివృద్ధి గాలికి వదిలారని విమర్శించారు. 14 అంతస్థుల్లో హాస్పిటల్, మరో 10 అంతస్థుల్లో అడ్మినిస్ట్రేషన్ భవనాలు నిర్మించాలని గత ప్రభుత్వం సంకల్పంతో ముందుకు వెళితే.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పేదలను దోచుకునే పనిలో ఉందన్నారు. కేవలం కేసీఆర్‌కు మంచిపేరు వస్తుందనే దురుద్దేశంతో మల్టీ సూపర్ స్పెషాలిటీ సేవలను ప్రజలకు దూరం చేస్తున్నారని హరీశ్‌రావు విమర్శించారు.



ఆస్పత్రిని నిర్మాణాన్ని పరిశీలిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

ఎంజీఎం ఆస్పత్రిలో రోగులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని హరీశ్‌రావు ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఏడాది కాలంపాటు ఓర్పుతో వ్యవహరించామని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం గాలికి వదిలేసిందని ఎద్దేవా చేశారు. రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ నాయకులను తొక్కి సీఎం అయ్యాడని, ప్రశ్నించే వారిపై కేసులు పెట్టడమే వారి పనిగా పెట్టుకున్న ట్లు మాజీ మంత్రి టి.హరీశ్‌రావు తెలిపారు.

ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, మాజీ ఎంపీ వినోద్‌కుమార్, బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్, మాజీ ఎమ్మెల్యేలు నన్నపునేని నరేందర్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

'బ్లాక్‌బెర్రీ'ని సందర్శించిన మంత్రి సీతక్క

దీవిలో పర్యాటకుల సౌకర్యాలు పరిశీలన



క్యాంప్‌ఫైర్ వద్ద మంత్రి సీతక్క, ఎంపీ బలరాంనాయక్, ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, కలెక్టర్ దివాకర, తదితర అధికారులు, నాయకులు

మేడారం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పర్యాటకంగా అభివృద్ధి చేస్తున్న ములుగు జిల్లా తాడ్వాయి మండలం అటవీ ప్రాంతం మొండ్యాలతోగు పరిసరాల్లోని బ్లాక్ బెర్రీ దీవిని రాష్ట్ర పంచాయితీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క సందర్శించారు. ఎంపీ బలరాం నాయక్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, ములుగు కలెక్టర్ దివాకర, ఐటీడీఏ పీవో చిత్రా మిశ్రాలతో కలిసి మంత్రి పర్యటించారు. ఈ ఐలాండ్‌లో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించి ట్రయల్ రన్ చేశారు. కనులవిందు కలిగే అడవి మధ్యలో బ్లాక్ బెర్రీ దీవిలో వసతులు, సౌకర్యాలు ఉన్నాయని మంత్రి అన్నారు. కలెక్టర్ క్రూషల్ నిధులతో అటవీశాఖ, పర్యాటక శాఖల ఆధ్వర్యంలో పకృతిని గుర్తించామని, ఈ ఐలాండ్ త్వరలో అందుబాటులోకి రానుందన్నారు. పస్రా తాడ్వాయి 163 జాతీయ రహదారికి కిలోమీటర్ దూరంలో ఉండడం పర్యాటకులకు అందుబాటులో ఉందన్నారు. ఐలాండ్ అందాలను ప్రతీ ఒక్కరు కుటుంబ సమేతంగా వచ్చి చూడాలని సూచించారు. పిల్లలకు వినోదాత్మకంగా ఆట వస్తువులు, పర్యాటకులు వినోదానికి వాలీబాల్, బ్యాట్‌మెంటన్ క్రీడా ప్రాంగణాలు, ఎత్తైన మంచె, వసతి గృహాలు, క్యాంప్‌ఫైర్ ఏర్పాట్లు, భోజన సౌకర్యాలు ఏర్పాటు చేశారన్నారు. ఐలాండ్ చుట్టూ వాగు మధ్యలో ఐదెకరాల స్థలంలో ఇసుక దిబ్బగా ఉండి బ్లాక్ బెర్రీ చెట్లతో పకృతి అందాలున్నాయని వివరించారు. ములుగు జిల్లాలో మరిన్ని పర్యాటక కేంద్రాలను గుర్తించి అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారి జాదవ్, గ్రంథాలయ చైర్మన్ రవి చందర్, కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు బోల్లెపల్లి రాజేందర్ గౌడ్, జిలా నాయకుడు పోషాలు యాదవ్, తాడ్వాయి అటవీశాఖ, పర్యాటక శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పారా త్రోబాల్ క్రీడాకారిణి భాగ్యను ఆదుకుంటాం

ప్రభుత్వవిప్ బీర్ల ఐలయ్య కురుమ



గూడూరులో భాగ్యను అభినందిస్తున్న బీర్ల ఐలయ్య

గూడూరు (మహబూబాబాద్ జిల్లా), డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ పారా త్రోబాల్ క్రీడల్లో గోల్డ్‌మెడల్ సాధించిన దివ్యాంగ క్రీడాకారిణి దయ్యాల భాగ్య కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని ప్రభుత్వవిప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య కురుమ, మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ భరోసా ఇచ్చారు. సోమవారం గూడూరు మండల కేంద్రంలో దొడ్డి కొమురయ్య విగ్రహావిష్కరణ సభకు ఐలయ్యతో పాటు ఎమ్మెల్యే, తెలంగాణ అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలు విమలక్క, కురుమ కులస్థుల షెపార్డ్, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ కంచ ఐలయ్య ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ క్రమంలో భాగ్య గోల్డ్‌మెడల్ సాధించిన విషయాన్ని విమలక్క వేదికపైనున్న వారి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిభకు అంగవైకల్యం అడ్డుకాదని గూడూరు శివారు గొల్లగూడెంకు చెందిన దయ్యాల కొమురయ్య- కొమురమ్మ కుమార్తె భాగ్య నిరూపించిందన్నారు. అంతర్జాతీయ స్థాయిలో భారతదేశం నుంచి ప్రాతినిధ్యం వహించి, అత్యంత ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్ సాధించడం అభినందనీయమన్నారు. డిసెంబర్ 2వ తేదీ నుంచి 5వరకు కాంబోడియాలో జరిగిన అంతర్జాతీ య పారా త్రోబాల్ పోటీల్లో ప్రతిభ ను చాటి, బంగారుపతకం సాధించడం హర్షనీయమన్నారు.

అంతర్జాతీయ స్థాయిలో గోల్డ్‌మెడల్ సాధించి, మహబూబాబాద్ జిల్లాకు మంచి పేరు తీసుకువచ్చిన భాగ్యను సీఎం రేవంత్‌రెడ్డి వద్దకు తీసుకువెళ్లి, ప్రభుత్వ పరంగా లబ్ధిని చేకూర్చేలా కృషి చేస్తామన్నారు. భాగ్యకు ఇంటిస్థలంతో పాటు ప్రభుత్వ ఉద్యోగం కల్పించేలా కృషి చేస్తామని వారు హామీ ఇచ్చారు.

కేయూలో పీహెచ్‌డీ అశావహుల ఆందోళనలు

- వీసీ చాంబర్‌లో బైఠాయింపు
- అడ్డుకున్న పోలీసులు.. స్టేషన్‌కు తరలింపు..



చాంబర్‌లో బైఠాయించి నిరసన చేస్తున్న మంద నరేశ్, అనిల్, తిరుపతి తదితరులు

కేయూ క్యాంపస్ డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీలో పీహెచ్‌డీ అడ్మిషన్ల గొడవ రచ్చకెక్కింది. సోమవారం ఏబీఎస్ఎఫ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మంద నరేశ్ నేతృత్వంలో పీహెచ్‌డీ అశావహులు తమకు అడ్మిషన్లు కల్పించాలని వైస్‌చాన్స్‌లర్ చాంబర్‌లో బైఠాయించారు. తాము అమరణ నిరాహార దీక్షలు చేపడుతున్నట్లు ప్రకటించారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డితో తమకు అడ్మిషన్లు ఇప్పించాలని వాగ్వాదం చేశారు. గొడవ విషయం తెలుసుకున్న కేయూ పోలీసులు విద్యార్థులను, అధికారులను సమూదాయించారు. దీంతో విద్యార్థులు వర్సిటీ పరిపాలన భవనం గేట్ల వద్ద బైఠాయించారు. తమకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. వర్సిటీ పరిపాలన భవనం గేటు వద్ద నిరసన దీక్షల్లో ఉన్న అశా వహులను సీఐ రవికుమార్ దీక్షలు విరమించాలని హెచ్చరించారు. తర్వాత పోలీసు వాహనాల్లో స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా మంద నరేశ్, సోరపాక అనిల్, మాలోతు తిరుపతిలు మాట్లాడుతూ.. 2021-22 అడ్మిషన్ల నోటిఫికేషన్‌లో సీట్లు తక్కువగా చూపించి రెండేళ్ల తర్వాత ఉన్న సీట్లను పెంచి రిటైరైన ప్రొఫెసర్లకు గైడ్‌షిప్‌లు కల్పించారని చెప్పారు. దీంతో వర్సిటీలో పీహెచ్‌డీ అడ్మిషన్ల సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. అయితే పీహెచ్ అడ్మిషన్ల కోసం ఎటువంటి సప్లిమెం టరీ నోటిఫికేషన్ జారీ చేయకపోవడంతో వి ౹గతా అభ్యర్థులందరికీ అడ్మిషన్లు లేదని చెప్పారు. వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ మల్లారెడ్డిలు తమకు న్యా యం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఉన్నత విద్యాశాఖఅధికారులకు పీహెచ్‌డీ అడ్మిషన్ల కోసం వర్సిటీ అధికారులు లేఖలు రాశామని చెప్పినట్లు పీహెచ్‌డీ అశా వహులు తెలిపారు. త్వరలోనే తమకు న్యాయం జరుగుతుందని అధికారులు హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కేయూ సీఐ రవికుమార్ ఆందోళనకు దిగిన విద్యార్థులను అదుపులోకి తీసుకుని పోలీస్ వాహనంలో స్టేషన్‌కు తరలించారు. సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. కాగా, విద్యార్థులకు న్యాయం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మంద శ్రీకాంత్ నేతృత్వంలో వీసీ కర్నాటి ప్రతాప్‌రెడ్డిని కలిశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు విష్ణు, గౌతమ్, జశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

కురుమలు కష్టాన్ని నమ్ముకున్నోళ్లు

రజాకార్లను ఎదిరించిన యోధుడు దొడ్డి కొమురయ్య

- ఆయన పేరు శాశ్వతంగా గుర్తుండేలా చర్యలు తీసుకుంటాం
- ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య
- గూడూరులో కొమురయ్య విగ్రహావిష్కరణ



విగ్రహావిష్కరణ సభలో మాట్లాడుతున్న ఐలయ్య

గూడూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : కురుమలు అత్యంత నమ్మకస్తులని, ఎంతో నిజాయితీ పరులని, కష్టాన్ని నమ్ముకున్నోళ్లని ప్రభుత్వవిప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకురుమ కొనియాడారు. సోమవారం గూడూరు మం డల కేంద్రంలో దొడ్డి కొమురయ్య విగ్రహావిష్కరణ కార్యక్రమానికి హాజరైన ఆయన బహిరంగ సభలో మాట్లాడారు. ఊర్లో భూమి అమ్ముకోవాలంటే ముందు కురుమలకు అమ్ముకోవాలని తాను చెబుతున్నానని, వారికి భూమి అమ్మితే డబ్బు నడుముకు కట్టుకుని తెచ్చిస్తారన్నారు. పార్లమెంట్ లోనూ కురుమ సోదరుల ప్రాతినిధ్యం పెంచుతామని వివరించారు. రజాకార్లను గ్రామాల్లోకి రాకుండా దొరల పెత్తానాన్ని అడ్డుకోవడానికి దొడ్డు కర్రల సంఘం పెట్టి, పోరాడిన గొప్ప యోధుడు దొడ్డి కొమురయ్యని పేర్కొన్నారు. దొరలు, దేశ్‌ముఖ్‌లు, పెత్తదారులకు వ్యతిరేకంగా జరిగిన తెలంగాణ సాయుధ పోరాటంలో దొడ్డి కొమురయ్య అమరత్వం పొందారని, దొరలకు వ్యతిరేకంగా పోరాడటమంటే సులువైన వ్యవహారం కాదన్నారు. బడుగుబలహీన వర్గాల ప్రజలను ఐక్యం చేసి, వెట్టి చాకిరి లాంటి సామాజిక దురాచారాలను ఎదురించిన వీరుడు కొమురయ్య అన్నారు. ఆయన జీవిత చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా అరుణోదయ కళాకారులు ఆలపించిన గీతాలు అకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో దొడ్డి కొమురయ్య వారసుడు దొడ్డి చంద్రం, క్యామ మల్లేశం, చీర భిక్షపతి, చెవేళ్ల సంపత్‌కుమార్, నర్సింహా, కె.శ్రీనివాస్, మంత్రి సుభాష్, ఆరె వీరన్న, చిట్టి వెంకటేశ్వర్లు, ముదురు సాంబయ్య, నూనావత్ రమేష్‌నాయక్, వాంకుడోతు కొమ్మాలు నాయక్, కోరె రాంబాబు, చీర అశోక్, మండల ఉపేందర్, కుండె కిషన్, పోతరాజు రవి, కోరె దేవేందర్, మల్లేష్, శ్రీనివాస్, కుమారస్వామి, అనిల్, బీరయ్య, పాపయ్య, కుమారస్వామి, కుమారస్వామి పాల్గొన్నారు.

హక్కుల కోసం ఉద్యమించాలి : విమలక్క



కురుమ కులస్థులు ఐక్యంగా ఉండి హక్కులను సాధించుకుని రాజ్యాధికారం వైపు అడుగులు వేయాలని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలు విమలక్క పిలుపునిచ్చారు. కురుమ కులస్థులు తమ పిల్లలను బాగా చదివించాలని, చదువుతోనే అన్ని సాధ్యమవుతాయన్నారు. జనాభా దామాషా ప్రకారం విద్యా, ఉద్యోగ, రాజకీయాల్లో న్యాయమైన వాటా కోసం పోరాడాలన్నారు. పాలకవర్గాలు కులాలను విభజించేందుకు కుటిల ప్రయత్నాలు చేస్తున్నాయని, అందరు ఐక్యంగా ఉండి తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు.

కురుమలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

- ప్రొఫెసర్ కంచ ఐలయ్య

కురుమ సామాజిక వర్గానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కురుమ కులస్థుల షెపార్డ్, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ కంచ ఐలయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కురుమ సామాజిక వర్గం ఎన్నో ఏళ్లుగా ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబాటుకు గురైందని చెప్పారు. రాష్ట్రంలో పది శాతం ఉన్న కురుమలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసేలా ఉద్యమాలు నిర్వహించాలన్నారు. విద్యా, ఉద్యోగం, ఉపాధి అవకాశాలను సాధించుకోవాలని పిలుపునిచ్చారు.

నమ్మకానికి మారుపేరు

- మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

కురుమలు రాష్ట్ర పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలని మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ పిలుపునిచ్చారు. నమ్మకానికి మారుపేరు, మృధుస్వభావులు కురుమ సోదరులని, అలాంటి సామాజిక వర్గంనుంచి వచ్చిన పోరాటయోధుడు దొడ్డి కొమురయ్య. సాయుధ రైతాంగ పోరాటాన్ని ముందుండి నడిపిన వ్యక్తని కొనియాడారు. కురుమల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, తనవంతుగా గూడూరులో కురుమ కమ్యూనిటీహాల్ నిర్మాణానికి రూ.10లక్షలు కేటాయిస్తానని హామీ ఇచ్చారు.



సభలో పాల్గొన్న కురుమలు

ఎస్ఎస్ కాంట్రాక్టు ఉద్యోగుల అర్ధనగ్న ప్రదర్శన



దీక్షల వద్ద అర్ధనగ్న ప్రదర్శనలో ఎస్ఎస్ కాంట్రాక్టు ఉద్యోగులు

హనుమకొండ టౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : సర్వశిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగులు చేస్తున్న నిరవధిక సమ్మె దీక్షలు 18వ రోజుకు చేరాయి. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ఎస్ఎస్ కాంట్రాక్ట్ ఉద్యోగులు సోమవారం అర్ధనగ్న ప్రదర్శనను నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వం వెంటనే స్పందించి మినిమం టైం స్కేలు ఇచ్చే విధంగా స్పష్టమైన హామీ ఇవ్వాలన్నారు. ఉద్యోగ భద్రత కోసం రెగ్యులైజ్ ప్రక్రియ చేపట్టి ఎస్ఎస్ కాంట్రాక్ట్ ఉగ్యోగులను విద్యాశాఖలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జాక్ బాధ్యులు దొనికెల శ్రీధర్‌గౌడ్, షఫీ, కరుణశ్రీ, కుమార్, రమేష్, మనోజ, స్వాతి, మంజుల తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలి



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న ఉప్పు సమ్మయ్య

వడ్డెపల్లి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఈపీఎస్-95 పెన్షనర్లకు, మినిమం పెన్షన్ రూ.7,500, డీఏ ఇచ్చి దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని టీఎస్-ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ వరంగల్ రీజియన్ అధ్యక్షుడు ఉప్పు సమ్మయ్య, ప్రధాన కార్యదర్శి పీఎల్ఎన్ రావు, కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎన్.నర్సింగరావులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈపీఎస్-95 పెన్షనర్‌తో పాటు వారి జీవిత భాగస్వామికి సైతం ఉచిత వైద్య సౌకర్యం కల్పించాలని కోరారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఈనెల 26న హనుమకొండ పబ్లిక్ గార్డెన్ ప్రాంతంలోని టీటీడీ కల్యాణ మండపంలో ఉదయం 10 గంటలకు నిర్వహించే మహా సభకు పెన్షనర్లు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు. సమావేశంలో అసోసియేషన్ జిల్లా నాయకులు బి.నారాయణ, మాధవరావు, కుడికాల కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

.హోం మంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలి



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శనలో మాట్లాడుతున్న వీరన్న

వడ్డెపల్లి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్‌ను అవమానపర్చిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా తన పదవికి వెంటనే రాజీనామా చేయాలని సీపీఎం హనుమకొండ పశ్చిమ మండల కార్యదర్శి వాంకుడోతు వీరన్నడిమాండ్ చేశారు. అమిత్‌షాపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ హనుమకొండ పబ్లిక్ గార్డెన్ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా వీరన్న మాట్లాడుతూ ప్రధాని మోదీ అమిత్‌షాను సమర్థించడం దుర్మార్గమని దుయ్యబట్టారు. నిరసన ప్రదర్శనలో సీపీఎం జిల్లా కమిటీ నేతలు ఎల్.దీప, వల్లెపు రాజు, బొంత కొమురెల్లి, కుక్కమూడి రవీందర్, రవీంద్రాచారి, డి.రమేష్, లాలూ, సాంబయ్య, ప్రభాకర్, రమ, మానస, విజయ, బిల్కిస్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి



ఆవిర్భావ దినోత్సవ సభలో మాట్లాడుతున్న ప్రకాశ్‌చారి, సత్యనారాయణ

వడ్డెపల్లి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులకు వన్ ర్యాంక్ వన్ పెన్షన్‌తో పాటు మెడికల్ పరిమితి రూ.8 లక్షల నుంచి రూ.15 లక్షలకు పెంచి దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సింగరేణి రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ప్రకాశ్‌చారి, జిల్లా ప్రధాన కార్యదర్శి చిదురాల సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లో సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులు సింగరేణి 136వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సీనియర్ సభ్యులు సీహెచ్.సదానందం, జి.సాంబయ్య, పి.శ్రీనివాస్‌రెడ్డిలకు శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులకు తెల్ల రేషన్ కార్డులు ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో యూనియన్ జిల్లా నాయకులు నలుబాల దామోదర్, వి.రవీందర్‌రావు, మాధవరావు, ఎల్.సత్యనారాయణ, వి.చంద్రమౌళి, ఎస్‌కే హసన్ తదితరులు పాల్గొన్నారు.

యేసుప్రభు బోధనలు అనుసరణీయం



క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న హాస్టల్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్‌కుమార్

కేయూ క్యాంపస్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): యేసుప్రభు బోధనలు అనుసరణీయని కేయూ హాస్టల్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్‌కుమార్ ఉద్ఘాటించారు. సోమవారం కేయూక్యాంపస్‌లోని హాస్టల్స్ ఆఫీస్‌లో వర్సిటీ హాస్టల్స్ కేర్ టేకర్లు, ఉద్యోగులతో కలిసి ఘనంగా క్రిస్మస్ వేడుకలను జరిపారు. క్రిస్మస్ కేక్‌ను డైరెక్టర్ ఎల్‌పీ రాజ్‌కుమార్ కట్ చేసి ఉద్యోగులకు, విద్యార్థులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కేయూ నాల్గవ ఉద్యోగుల సంఘం రీక్రియేషన్ సెక్రటరీ పిండి వేణుయాదవ్, జనరల్ సెక్రటరీ సెక్రటరీ పి.కోర్నెల్, వర్సిటీ హాస్టల్స్ కేర్‌టేకర్లు నుంచు పాల్గొన్నారు.

కేయూ ఫార్మసీ కళాశాలలో..

కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ కళాశాలలో ఎం ఫార్మసీ, బీ ఫార్మసీ విద్యార్థుల సమక్షంలో ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేయూ ఫార్మసీ డీన్ ప్రొఫెసర్ గాదె సమ్మయ్య ముఖ్యఅతిథిగా హాజరై కేక్ చేసి అధ్యాపకులకు, విద్యార్థులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. డాక్టర్ సునిత, డాక్టర్ సుకన్య, డాక్టర్ ప్రియాంక, డాక్టర్ సూర్యనారాయణ, డాక్టర్ శశిధర్‌తో పాటు విద్యార్థులు పాటలు అద్భుతంగా పాటలు పాడారు. ఫార్మసీ కళాశాల ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పీవీ సేవలు చిరస్మరణీయం





కేయూలో పీవీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి, మల్లారెడ్డి, రామచంద్రం, బీఆర్ఎస్ కార్యాలయంలో పీవీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వినయ్‌భాస్కర్

వర్ధంతి కార్యక్రమంలో ఎమ్మెల్యే నాయిని

హనుమకొండ సిటీ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : భారత ప్రధాన మంత్రిగా పీవీ నర్సింహారావు సేవలు చిరస్మరణీయమని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కొనియాడారు.సోమవారం హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో మాజీ ప్రధాన మంత్రి పీవీ నర్సింహారావు వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వరం గల్ ఎంపీ కడియం కావ్య, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు తదితర కాంగ్రెస్ నాయకులు పీవీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజేందర్‌రెడ్డి పీవీ నర్సింహారావు సేవలను స్మరించారు. అనంతరం హనుమకొండ బస్‌స్టేషన్ జంక్షన్‌లోని పీవీ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళర్పించారు. కార్యక్రమంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, జీడబ్ల్యూఎంసీ ఫ్లోర్‌లీడర్ తోట వెంకన్న, టీపీసీసీ నాయకులు బత్తిని శ్రీనివాస్, ఈవీ శ్రీనివాస్, బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, బొమ్మతి విక్రమ్, వీసం సురేందర్‌రెడ్డి, మార్క విజయ్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్థిక సంస్కరణల పితామహుడు పీవీ

కేయూ క్యాంపస్: దేశంలోని ఆర్థిక సంస్కరణలకు పితామహుడు మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు అని కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి ఉద్ఘాటించారు. సోమవారం కేయూ రాజనీతి శాస్త్ర విభాగంలో కేయూ పీవీ నాలెడ్జ్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ జి.కృష్ణయ్య అధ్యక్షతన పీవీ 20వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా పీవీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలుగువాడైన పీవీ నర్సింహారావు క్లిష్ట పరిస్థితుల్లో దేశాన్ని గట్టెక్కించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కేయూపాలక మండలి సభ్యులు, వర్సిటీ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్, డాక్టర్ చిర్రా రాజు, డాక్టర్ కరకాల అనితారెడ్డి, దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరు రామచంద్రం, కేయూ రిటైర్డు ప్రొఫెసర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ప్రొఫెసర్ ఎ.సదానందం, ప్రొఫెసర్ వడ్డె రవీందర్, ప్రొఫెసర్ కందకట్ల సుధాకర్, పొలిటికల్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ సంకినేని వెంకట్, సోసియాలజీ విభాగాధిపతి స్వర్ణలత, హిస్టరీ అండ్ టూరిజం విభాగాధిపతి డాక్టర్ చిలువేరు రాజ్‌కుమార్. అధ్యాపకులు డాక్టర్ మంథని శంకర్, స్కాలర్లు కల్లెపల్లి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షోభంలోనూ సమర్థవంత పాలన

హనుమకొండ టౌన్: రాజకీయ సంక్షోభ సమయంలో దేశంలో సమర్థవంత పాలనను అందించిన పరిపాలన దక్షుడు, బహుభాషా కోవిదుడు, మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు అని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ కొనియాడారు. సోమవారం హనుమకొండ బీఆర్ఎస్ కార్యాలయంలో పీవీ నర్సింహారావు 20వ వర్ధంతి వేడుకను దాస్యం వినయ్ భాస్కర్ పాల్గొని నిర్వహించారు. పీవీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి, మాజీ కార్పొరేటర్ మేకల బాబురావు, నాయకులు నయీమొద్దీన్, సుంచు కృష్ణ, డివిజన్ అధ్యక్షుడు సదాంత్, సుహాస్, ఖలీల్, హరినాథ్, నాయకులు రవీందర్ రావు, పరశురాములు, జానకీరాములు పాల్గొన్నారు.

విద్యార్థినిని వేధిస్తున్న వ్యక్తిపై కేసు

మడికొండ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థినిని వేధిస్తున్న యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ తెలిపిన వివరాల మేరకు.. మడికొండకు చెందిన ఓ విద్యార్థిని కాలేజీకి వెళ్తుండగా ఇదే గ్రామానికి చెందిన ఆకుల అఖిల్ అనే ఆటోడ్రైవర్ వెంటపడుతూ తనను ప్రేమించాలంటూ వేధింపులకు గురిచేస్తున్నాడు. సోమవారం కాలేజీకి వెళ్తున్న క్రమంలో దారిలో తనను ప్రేమించాలని, లేకపోతే చంపేస్తా.. అని బెదిరించాడు. అతడి వేధింపులకు తట్టుకోలేక విద్యార్థిని సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా, అఖిల్‌కు ఇంతకు ముందే మరో మహిళతో వివాహం జరిగి విడాకులయ్యాయని, అలాగే మరో మహిళను ప్రేమ పేరుతో మోసం చేశాడని ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు.

కేయూ టీఎస్ఐసెట్ కార్యాలయంలో చోరీ

ఆఫీస్‌కు సీల్ వేయించిన రిజిస్ట్రార్ మల్లారెడ్డి

కేయూ క్యాంపస్ డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీలోని కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగంలో ఉన్న టీఎస్ ఐసెట్ కార్యాలయంలో ఫర్నిచర్ దొంగతనం జరిగిందనే సమాచారం తెలుసుకున్న కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి కార్యాలయానికి సీల్ వేయించారు. ఈ సంఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. దీనిపై సమాచారం అందుకున్న రిజిస్ట్రార్ మల్లారెడ్డి ఐసెట్ కార్యాలయాన్ని తనిఖీలు చేశారు. ఫర్నిచర్‌తో పాటు ఇతర వస్తువుల వివరాలను రికార్డు చేసే స్టాక్ రిజిస్టర్ కోసం ఆరా తీశారు. కార్యాలయంలో స్టాక్ రిజిస్టర్ నిర్వహించలేదని గుర్తించారు. వెంటనే ఐసెట్ కార్యాలయానికి సీల్ వేసి కళాశాల ప్రిన్సిపాల్ అమరవేణికి అప్పగించారు.

వీధి కుక్కల దాడిలో 20 మేకలు మృతి



హసన్‌పర్తి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వీధి కుక్కల దాడిలో 20 మేకలు మృతి చెందిన ఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనలో బాధిత రైతు తోట రాకేష్‌కు రూ.1.50 లక్షల ఆర్థిక నష్టం వాటిల్లినట్లు తోటి రైతులు పేర్కొన్నారు. వివరాల్లోకి వెళితే.. గ్రేటర్ 66వ డివిజన్‌కు చెందిన తోట రాకేష్ అనే రైతు హసన్‌పర్తి శివారు బొత్తలకుంట శివారులో మేకలు, గొర్లను పెంచుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఎప్పటిలాగే ఆదివారం కూడా ఊరు శివారు బొత్తలకుంట సమీపంలో ఏర్పాటు చేసిన మందలో గొర్లు, మేకలను చుట్టూ కంచె ఏర్పాటు చేశారు. ఆదివారం రాత్రి వీధి కుక్కలు గొర్ల మందపై దాడి చేయగా 20 మేకలు అక్కడికక్కడే మృతి చెందినట్లు రైతు రాకేష్ ఆవేదన వ్యక్తం చేశారు. తనకు జరిగిన నష్టాన్ని ప్రభుత్వం అంచనా వేసి నష్టపరిహారం అందించి ఆదుకోవాలని వేడుకుంటున్నాడు. విషయం తెలిసిన మండల పశువైద్యాధికారి డాక్టర్ క్రాంతి ఘటన స్థలానికి చేరుకొని చనిపోయిన మేకలకు పోస్టుమార్టం నిర్వహించి బాధిత రైతుకు అప్పగించినట్లు తెలిపారు.

రెడ్డి సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



రవీందర్‌రెడ్డి అధ్యక్షుడు



సునిల్‌రెడ్డి కార్యదర్శి

మడికొండ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మడికొండలోని రెడ్డి ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం రెడ్డి సంక్షేమ సంఘం వరంగల్ జిల్లా నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సంఘం అధ్యక్షుడు మాదిరెడ్డి రవీందర్‌రెడ్డి తెలిపారు. 2024-27 సంవత్సరాలకు గాను అధ్యక్షుడిగా మాదిరెడ్డి రవిందర్‌రెడ్డి, కార్యదర్శిగా చాడ సునిల్ రెడ్డి, కోశాధికారిగా మెరుగు హనుమా రెడ్డి, ఉపాధ్యక్షులుగా కుందూరు కరుణాకర్‌రెడ్డి, కాసర్ల వసుంధర, చందుపట్ల సత్యనారాయణరెడ్డి, సహకార్యదర్శులుగా ముద్దసాని పద్మనాభరెడ్డి, లెక్క రజినీకాంత్‌రెడ్డి ఎన్నికైనట్లు రవీందర్‌రెడ్డి తెలిపారు. అలాగే జనవరి, 5, 2024న ఉదయం 10.30 గంటలకు మడికొండలోని రెడ్డి సంక్షేమ సంఘం ఫంక్షన్ హాల్‌లో రెడ్డి సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశం, నూతన సంవత్సర క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ కార్యక్రమంలో అందరూ సకాలంలో పాల్గొనాలని కోరారు.

టీహబ్‌ను తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో అప్పయ్య

వరంగల్ మెడికల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎ.అప్పయ్య సోమవారం హనుమకొండ ప్రసూతి ఆస్పత్రి ఆవరణలోని టీహబ్, బ్లడ్ బ్యాంకు, వెల్‌నెస్ సెంటర్‌ను తనిఖీ చేశారు. టీహబ్‌కు వస్తున్న శాంపిల్స్ పరీక్షల నిర్వహణ, రిపోర్టులను ఆయన పరిశీలించారు. రేడియాలజీ, పాథాలజీ ల్యాబ్‌లను, పరికాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. వెల్‌నెస్ సెంటర్‌లో ఇటీవల డాక్టర్లు అందుబాటులో లేకపోవడం వల్ల ఏర్పడిన ఇబ్బందులను గమనించి కలెక్టర్ అనుమతితో ఇద్దరు డాక్టర్లను నియమించామన్నారు. ఉద్యోగస్తులు, పెన్షనర్లు, జర్నలిస్టులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్‌వో అప్పయ్య ఆదేశించారు.

ఏకశిల స్కూల్‌లో ప్రీ క్రిస్మస్ వేడుకలు





ఏకశిల కాన్సెప్ట్ పాఠశాలలో వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు, ఎస్సీ కార్పొరేషన్‌లో క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి

రెడ్డికాలనీ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ రెడ్డికాలనీలోని ఏకశిల కాన్సెప్ట్ పాఠశాలలో సోమవారం ముందస్తుగా క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు సంయుక్తంగా గడ్డితో పాకను నిర్మించి ఏసుక్రీస్తు ప్రతిమను పెట్టి పండగను జరుపుకున్నారు. ఈసందర్భంగా ఏకశిల విద్యాసంస్థల చైర్మన్ గౌరు తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. ఏసుక్రీస్తు బోధనలు నేటితరానికి నిత్య అనుసరణీయమన్నారు. ఇలాంటి విశిష్టతను విద్యార్థులకు తెలియజేసేందుకు పాఠశాలలో అన్ని మంతాల పండగలను నిర్వహించుకునేలా ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ స్వప్నరెడ్డి, ఉపాధ్యాయులు శోభ, పావని, సుమాంజలి, హరిత, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బల్దియాలో ప్రీ క్రిస్మస్ వేడుకలు

వరంగల్ కార్పొరేషన్: యేసు క్రీస్తు బోధనలు ఆచరణీయమని గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ సీఎంహెచ్‌వో డాక్టర్ బొమ్మన రాజారెడ్డి అభిప్రాయపడ్డారు. బల్దియా కార్యాలయంలోని శానిటేషన్ వింగ్‌లో సోమవారం ప్రీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాజారెడ్డి హాజరై మాట్లాడారు. క్రిస్మస్ పర్వదినం సందర్భంగా బల్దియా పరిధిలోని 66 డివిజన్‌లలో అన్ని పారిశుధ్య పనులకు సంబంధించిన అన్ని ఏర్పాటు చేశామన్నారు ఈ కార్యక్రమంలో బల్దియా జేఏసీ అధ్యక్షుడు బొట్ల రమేష్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ రాజారపు భాస్కర్, తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర కో- ఆర్డినేటర్ జన్ను భాస్కర్, సీపీఎం నాయకుడు సింగారపు బాబురావు, శానిటరి ఇన్‌స్పెక్టర్లు పోలెపాక అనీల్, పెండ్యాల అనీల్, సంపత్‌రెడ్డి, ప్రజాసంఘాల నాయకులు కన్నం సునీల్, రాజేశ్‌ఖన్నా, కందికొండ గౌతమి పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో..

హనుమకొండ కలెక్టరేట్: హనుమకొండ కలెక్టరేట్‌లోని ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ఘనంగా క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ కార్పొరేషన్ హనుమకొండ జిల్లా ఈడీ రాపెల్లి బాలరాజు కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఈడీ బాలరాజు మాట్లాడుతూ.. క్రిస్మస్ వేడుకలను సంతోషంగా జరుపుకోవాలన్నారు. వేడుకలలో కలెక్టరేట్ డిప్యూటీ తహశీల్దార్‌లు సంగీత, సునిల్ గవాస్కర్, వరంగల్ డిప్యూటీ తహశీల్దార్ రాజ్‌ప్రకాశ్, ఎస్సీ కార్పొరేషన్ సీనియర్ అసిస్టెంట్ జన్ను జయరాజు, పాస్టర్ రవిపాల్, ఏఈవో ఎల్.వీరేశం, ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కుల గణనలో పాల్గొన్న ఉపాధ్యాయులకు సీసీఎల్స్ ఇవ్వాలి

వరంగల్ ఎడ్యుకేషన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కుల గణనలో పాల్గొన్న ఉపాధ్యాయులకు సీసీఎల్స్ ఇవ్వాలని యూటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి పెండెం రాజు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం డీఈవో వాసంతికి వినతి పత్రం అందజేశారు. సాధారణ సెలవు దినాల్లో కుల గణనలో పాల్గొన్నారని, వాటికి సీసీఎల్స్‌ను మంజూరు చేయాలని ఆమెను కోరినట్లు రాజు చెప్పారు. ఈ కార్యక్రమంలో సంఘం కోశాధికారి డి.కిరణ్‌కుమార్, కార్యదర్శులు మల్లిక్, లింగారావు తదితరులు పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

హసన్‌పర్తి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని మండల విద్యాశాఖ కార్యాలయ ఆవరణలో సోమవారం టీఎస్‌యూటీఎఫ్ 6వ రాష్ట్ర విద్యా వైజ్ఞానిక మహాసభల పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దారు చల్ల ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కోశాధికారి డి.కిరణ్, మండల అధ్యక్షురాలు ఎ.శోభారాణి, ప్రధాన కార్యదర్శి టి.నరేష్, కోశాధికారి పెద్దమ్మ నాగరాజు, కార్యదర్శులు రాధాకృష్ణ, హేమలత పాల్గొన్నారు.

టీఎస్ ఐసెట్-24 నిర్వహణను కేయూకు ఇప్పించాలి

కేయూ క్యాంపస్ డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఈ దఫా కాకతీయ యూనివర్సిటీకే రాష్ట్ర టీఎస్ ఐసెట్-2025 నిర్వహణ బాధ్యతలు అప్పగించేలా చొరవ తీసుకోవాలని ప్రజా వేదిక రాష్ట్ర చైర్మన్ తిరుణహరి శేషు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు సోమవారం హనుమకొండ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలిసి వినతి పత్రాన్ని అందచేశారు. 2012 నుంచి కేయూ టీఎస్‌ఐసెట్ ప్రవేశ పరీక్షలను నిర్వహించగా ఇప్పటి నిర్వహణ బాధ్యతలు తప్పించినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో రెండో అతిపెద్ద వర్సిటీగా పేరొందిన కేయూకు మళ్లీ అవకాశం కల్పించేలా చూడాలని విన్నవించారు. సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ దృష్టికి తీసుకుపోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎర్రబొజ్జ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ వ్యవస్థకు కొమ్ముకాస్తున్న బీజేపీ ప్రభుత్వం

హనుమకొండ కలెక్టరేట్, డిసెంబరు 23 (ఆంధజ్యోతి) : కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం రైతు నల్ల చట్టాలను తుంగలో తొక్కి కార్పొరేట్ వ్యవస్థకు కొమ్ముకాస్తోందని ఏఐకేఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌రెడ్డి హంసారెడ్డి ఆరోపించారు. వ్యవసాయ మార్కెటింగ్‌పై కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన పాలసీ పత్రాలను సోమవారం ఏఐకేఎఫ్ నాయకులు సుబేదారిలోని కీర్తిస్థూపం ముందు దగ్ధం చేశారు. ఈ సందర్భంగా హంసారెడ్డి మాట్లాడుతూ.. వెంటనే కేంద్ర ప్రభుత్వం నూతన వ్యవసాయ మార్కెట్ విధానాలను ఉపసంహరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎఫ్ జిల్లా బాధ్యులు ఎం.చుక్కయ్య, ప్రైడి, ఉట్కూరి రాములు, కొడగాని శివాజీ, కిషన్, రవీందర్, శ్రీనివాస్, ఇందు, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

కాంపౌండ్ కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలి

కాజీపేట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : గతంలో ఇందిరమ్మ పథకంలో మంజూరైన ఇంటికి కాంపౌండ్ కట్టుకుంటే కూల్చిన మునిసిపల్ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం కమిషనర్ అశ్విని తానాజీ వాకడేకు సోమిడికి చెందిన మంతుర్తి చేరాలు యాదవ్ వినతిప్రం సమర్పించారు. తమకు 2009 సంత్సరంలో ఇందిరమ్మ ఇల్లు మంజూరైందనీ, దానికి ఆరు నెలల క్రితం కంపౌండ్ కట్టుకున్నామని, తమకు సమాచారం లేకుండా, తాము ఇంట్లో లేని సమయంలో శుక్రవారం అధికారులు కంపౌండ్ కూల్చారని వినతిపత్రంలో పేర్కొన్నారు. సీసీ కెమెరాలు ధ్వంసం చేసి ఆస్థి నష్టం చేశారు. అకారణంగా గోడకూల్చి, ఆస్తి నష్టం చేసిన సిబ్బంది పై చర్యలు తీసుకుని తమకు నష్టపరిహారం చెల్లించాలని బాధితులు వినతిప్రతంలో పేర్కొన్నారు.

ఐటీ కంపెనీలో రక్తదాన శిబిరం

మడికొండ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మడికొండ ఐటీ సెజ్‌లోని క్వాడ్రంట్ ఐటీ కంపెనీలో క్వాడ్రంట్ కంపెనీ వ్యవస్థాపకుడు కంచరకుంట్ల వంశీరెడ్డి కూతురు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని వంశీరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఐఆర్ సీఎస్ సౌజన్యంతో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని వంశీరెడ్డి తల్లి కంచరకుంట్ల మణి మాల-మురళీధర్ రెడ్డి ప్రారంభించారు. 110 మంది శిబిరంలో పాల్గొని రక్తదానం చేశారు. కార్యక్రమలో ఆర్టీసీ డిప్యూటీ రీజినల్ మేనేజర్ భాను, డిపో మేనేజర్ మోహన్‌రావు, ఐఆర్‌సీఎస్ సభ్యులు పుల్లూరు వేణు, ఈవీవీ శ్రీనివాస్, బిల్ల రమణారెడ్డి, బొద్దిరెడ్డి దామోదర్‌రెడ్డి, గంగాపురం వేణుమాధవ్, రావుల రాజ్‌కుమార్, బానోతు వెంకన్న పాల్గొని రక్తదానం పై అవగాహన కల్పించారు.

ఆరోపణలపై తక్షణమే విచారణ చేపట్టాలి

హసన్‌పర్తి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తెలంగాణ బాలికల గురుకుల కళాశాల హసన్‌పర్తి ప్రిన్సిపాల్ ఇందుమతిపై వచ్చిన ఆరోపణలపై తక్షణమే విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ వీహెచ్‌పీ జాతీయ అధికార ప్రతినిధి డాక్టర్ రావినూతల శశిధర్ సోమవారం హైదరాబాద్‌లోని టీజీఆర్ఈఐటీ సొసైటీ సెక్రటరి రమణకుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర విద్యా శాఖ నిబంధనలకు విరుద్ధంగా 21 సంవత్సరాలుగా ఒకే విద్యా సంస్థలో కొనసాగుతున్నారనీ ఈ విషయంపై కూడా విచారణ చేయాలని వినతి పత్రంలో కోరారు అంతేకాకుండా ప్రిన్సిపాల్‌తో పాటు ప్రిన్సిపాల్‌ను ప్రోత్సహిస్తున్న శక్తులు ఎంతటి వారైనా సరే వారిపై కూడా తక్షణమే విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

ఏబీవీపీ రాష్ట్ర జనరల్ సెక్రటరీగా రాంబాబు



కేయూ క్యాంపస్ డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) రాష్ట్ర జనరల్ సెక్రటరీగా మాచర్ల రాంబాబు ఎన్నికయ్యారు. సిద్దిపేటలో నిర్వహిస్తున్న ఏబీవీపీ రాష్ట్ర మహాసభల్లో రాంబాబును ఎన్నుకున్నట్లు ఏబీవీపీ రాష్ట్ర ప్రధాన నేతలు సోమవారం ప్రకటించారు. రాష్ట్ర జనరల్ సెక్రటరీగా ఎన్నికైన రాంబాబును వర్సిటీ విద్యార్థి సంఘాల నేతలు, స్కాలర్లు అభినందించారు.

ఎల్కతుర్తి తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలి

హనుమకొండ కలెక్టరేట్, డిసెంబరు 23 (ఆంధజ్యోతి): ఎల్కతుర్తి తహసీల్దార్ జగత్‌సింగ్‌పై చర్యలు తీసుకోవాలని ఎల్కతుర్తి మండలంలోని ఇందిరానగర్‌కు చెందిన జల్లి సారయ్య సోమవారం కలెక్టర్ ప్రావీణ్యకు ఫిర్యాదు చేశాడు. ఎల్కతుర్తి శివారులోకాస్తులో ఉన్న తన భూమికి సొంతంగా బాట వేయించుకున్నానని, అయితే దామెర శివారు సర్వే నెంబర్ 716 భూమి యజమాని డాక్టర్ తివ్వని సుధాకర్ పలుకుబడితో స్వార్థ ప్రయోజనాల కోసం ఎల్కతుర్తి మాజీ ఎంపీపీ తంగెడ మహేందర్, సాతూరి చంద్రమౌళిలు.. తహసీల్దార్ జగత్‌సింగ్‌తో కుమ్మక్కై తన బాటను వారి బాటగా చేశారని సారయ్య కలెక్టర్‌కు తెలిపారు. అంతేకాకుండా తన సమస్య పరిష్కరించాలని తహసీల్దార్‌ను కలిస్తే రూ.2లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాడని, తనకు మాజీ ఎంపీ బోయినపెల్లి వినోద్ కుమార్, మాజీ ఎమ్మెల్యే ఒడితెల సతీష్‌బాబు అండ ఉందని తహసీల్దార్ బెదిరిస్తున్నాడని కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో సారయ్య పేర్కొన్నాడు. జగత్‌సింగ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరాడు.





కిడ్నీ కేర్

మూత్రపిండాలు ఇలా క్షేమం



మధుమేహం, అధిక రక్తపోటు, అస్తవ్యస్థ ఆహార, జీవనశైలులు... ఇవన్నీ మూత్రపిండాలను దెబ్బతీసేవే! అయితే చాప కింద నీరులా నిశ్శబ్దంగా, రహస్యంగా జబ్బుపడే తత్వం మూత్రపిండాలకు ఉంటుంది. కాబట్టి ముందస్తు పరీక్షలతో వాటి పనితీరు మీద ఓ కన్నేసి ఉంచాలంటున్నారు వైద్యులు.

మూత్రపిండాలు నిరంతరంగా రక్తాన్ని వడగడుతూ, దాన్లోని పోషకాలను శరీరం శోషించుకునేలా చేస్తాయి. అంతటి సమర్థమైన మూత్రపిండాలు పనిచేయడానికి మొండికేస్తే, పోషకాల శోషణ తగ్గడమే కాకుండా, ఒంట్లో విషాలు పేరుకుపోతాయి. అయితే ఈ పరిస్థితిని పసిగట్టగలిగే లక్షణాలు మూత్రపిండాల ప్రారంభ దశలో బయల్పడవు. కానీ మూడో దశ నుంచి కొన్ని లక్షణాలు బయల్పడడం మొదలుపెడతాయి. అవేంటంటే...

- మూత్రంలో నురగ
- అధిక రక్తపోటు
- వాపు మీద వేలితో ఒత్తి చూస్తే, గుంట పడుతుంది.
- కాళ్లు, కళ్ల దిగువన వాపు కనిపిస్తుంది.

మూత్రపిండాలు పాడైతే...

- అధిక రక్తపోటు. మూత్రపిండాలకు రక్తప్రసరణ మందగించి, రక్తంలో వెనక్కి గుండె వైపు ప్రసరిస్తూ, రక్తంలో ఒత్తిడిని పెంచుతుంది. దాంతో రక్తపోటు పెరిగిపోతుంది. ఈ పరిస్థితి గుండెకూ, మూత్రపిండాలకు చేటు చేస్తుంది.
- అలసట. రోజంతా అలసట ఆవరించి ఉంటుంది. ఇందుకు కారణం అవసరానికి మించి యూరియా రక్తంలో పేరుకుపోవడమే!

> **నీళ్లు తాగాలి**
>
> మూత్రపిండాలు ఆరోగ్యంగా ఉండాలంటే సరిపడా నీళ్లు తాగాలనే విషయం అందరికీ తెలిసిందే! మూత్రపిండాలు జబ్బుపడిన తొలి దశలో వీలైనన్ని ఎక్కువ నీళ్లు తాగాలి. అయితే అందుకు కూడా ఒక పద్ధతి పాటించాలి. ఒకేసారి ఏకబిగిన నీళ్లన్నీ తాగేయకుండా రెండు గంటల వ్యత్యాసంతో తరచూ నీళ్లు తాగుతూ ఉండాలి. మూత్రం ఎంత పలుచగా పారదర్శకంగా ఉంటే, మూత్రపిండాలు అంత ఆరోగ్యంగా ఉన్నాయని అర్థం. కాబట్టి సరిపడా నీళ్లు తాగుతూ మూత్రం పారదర్శకంగా ఉండేలా చూసుకోవాలి. అయితే మూత్రపిండాల వ్యాధి ముదిరి కాళ్ల వాపులు మొదలైన పక్షంలో ఉప్పుతో పాటు తాగే నీటి మోతాదు కూడా తగ్గించాల్సి ఉంటుంది.

- మూత్రంలో ప్రొటీన్ నష్టం. మూత్ర పరీక్ష చేయించుకుంటే, ఎక్కువ మోతాదుల్లో ప్రొటీన్ కనిపిస్తుంది. మూత్రపిండాల్లోని ఫిల్టర్ల ద్వారా ఎక్కువ మోతాదుల్లో ప్రొటీన్ నష్టం జరుగుతుంది.
- ఆమ్లత్వంతో కూడిన మూత్రం. శరీరంలో ఆమ్లత్వం పెరిగిపోతుంది. శరీరంలోని అమ్మోనియాలో అసమతౌల్యం ఏర్పడడం మూలంగా శరీర పిహెచ్ విలువలు పెరిగిపోతాయి. ఒకవేళ మధుమేహులైతే, చక్కెర స్థాయిలు అదుపు తప్పుతాయి. ఈ పరిస్థితిని పసిగట్టడంలో విఫలమైతే, 'కీటోఅసిడోసిస్' అనే సమస్య మొదలవుతుంది. మధుమేహులై ఉండి, చక్కెర మందులు వాడకుండా ఉన్నా, చక్కెర మెతాదులను అదుపులో ఉంచుకోకపోయినా, కీటోఅసిడోసిస్ తలెత్తుతుంది.
- శరీరంలో విటమిన్ డి మోతాదు తగ్గిపోతుంది. మూత్రపిండాలు డి విటమిన్‌ను శరీరానికి ఉపయోగపడేలా, యాక్టివ్ డి విటమిన్‌గా మారుస్తాయి. మూత్రపిండాలు దెబ్బతింటే విటమిన్ డి లోపం ఏర్పడుతుంది. దాంతో క్యాల్షియం శోషణ సమస్య ఏర్పడి, గుండె రక్తనాళాల్లో క్యాల్షియం పేరుకోవడం మొదలవుతుంది. మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడతాయి.

> **తీవ్ర కిడ్నీ వ్యాధులు**
>
> దాదాపు 17% భారత జనాభా తీవ్ర మూత్రపిండాల వ్యాధులతో బాధ పడుతోంది. కొన్ని రాష్ట్రాల్లో ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్, తెలంగాణాల్లో 20% జనాభా తీవ్ర మూత్రపిండాల వ్యాధులకు గురవుతోంది. ప్రతి ఏటా దేశవ్యాప్తంగా దాదాపు 5 లక్షల మందికి పైగా ప్రజలు డయాలసిస్ స్థితికి చేరుకుంటున్నారు. వీళ్లలో కేవలం 20 వేల మందికి మాత్రమే మూత్రపిండాల మార్పిడి సదుపాయం లభిస్తోంది.

ముప్పు ఎవరికి?

మధుమేహం, మూత్రపిండాల్లో ఇన్‌ఫ్లమేషన్, అధిక రక్తపోటు, మూత్రపిండాల్లో రాళ్లు, మూత్రనాళ ఇన్‌ఫెక్షన్లు, నొప్పి నివారణ మందులు, ఊబకాయులు, కుటుంబ చరిత్రలో తీవ్ర మూత్రపిండాల వ్యాధులున్న వాళ్లకు మూత్రపిండాలు పాడయ్యే, విఫలమయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. కొందర్లో పుట్టుకతోనే మూత్రపిండాల్లో సిస్టులు ఉంటాయి. ఇవి వయసుతో పాటు పెరుగుతూ మూత్రపిండాలను దెబ్బ తీస్తాయి. అయితే మూత్రపిండాలకు సంబంధించిన ఎలాంటి రుగ్మత అయినా ప్రారంభంలో ఎలాంటి లక్షణాలను కనబరచకపోవడం వల్ల, మూత్రపిండాల జబ్బు తీవ్రతరమయ్యే పరిస్థితి తలెత్తుతూ ఉంటుంది. ఇలాంటి దశలో డయాలసిస్, మూత్రపిండాల మార్పిడి అవసరమవుతుంది. ఈ పరిస్థితి తలెత్తకుండా ఉండాలంటే మూత్రపిండాల వ్యాధులకు గురయ్యే అవకాశం ఉన్నవాళ్లందరూ ఏడాదికోసారి ఎస్టిమేటెడ్ జిఎఫ్ఆర్ (గ్లోమెర్యులార్ ఫిల్ట్రేషన్ రేట్), మూత్రంలో ప్రొటీన్ పరీక్షలు చేయించుకోవాలి. ఈ పరీక్షలతో ప్రారంభ దశలో ఉన్న మూత్రపిండాల వ్యాధులను కనిపెట్టి, వ్యాధి తీవ్రమవకుండా అరికట్టే మందులను మొదలుపెట్టుకోవచ్చు.

సమర్థమైన మందులతో...

మూత్రపిండాలు జబ్బుపడినప్పుడు మూత్రంలో ప్రొటీన్ నష్టం ప్రధాన సూచన. ఆరోగ్యకరమైన వ్యక్తుల్లో ఒక రోజులో మూత్రం ద్వారా 100మి.గ్రా ప్రొటీన్ నష్టం జరుగుతూ ఉంటుంది. కానీ మూత్రపిండాల వ్యాధులున్న వారిలో ప్రొటీన్ నష్టం, 500 నుంచి 1000 మి.గ్రా ఉంటుంది. ఈ నష్టానికి అడ్డుకట్ట వేసే సమర్థమైన మందులు ఇప్పుడు అందుబాటులో ఉన్నాయి. కాబట్టి ప్రారంభంలోనే ప్రొటీన్ నష్టాన్ని కనిపెట్టి, వెంటనే మందులు వాడుకోవడం మొదలుపెడితే, మూత్రంలో ప్రొటీన్ నష్టం తగ్గడంతో పాటు మూత్రపిండాల వ్యాధి ఒక దశ నుంచి తర్వాతి దశకు పెరగకుండా ఉంటుంది.

> **మూత్రపిండాలు ఇలా క్షేమం**
>
> - ఉప్పు తగ్గించాలి
> - మూత్రంలో ప్రొటీన్ నష్టాన్ని తొలి దశలోనే గుర్తించి, మందులు వాడుకోవాలి
> - ధూమపానం, మద్యపానం మానేయాలి
> - మధుమేహం, అధిక రక్తపోటు అదుపులో ఉంచుకోవాలి
> - రెడ్ మీట్ మానేయాలి
> - శరీర బరువు అదుపులో ఉంచుకోవాలి.

మూత్రపిండాల మార్పిడి

జీవితాంతం డయాలసిస్ మీద ఆధారపడడం కంటే మూత్రపిండాల మార్పిడితో శాశ్వత పరిష్కారాన్ని ఎంచుకోవడం ఉత్తమం. కుటుంబసభ్యుల నుంచి సేకరించిన మూత్రపిండంతో శరీరం ఆ అవయవాన్ని వ్యతిరేకించే తీవ్రత తక్కువగా ఉంటుంది. కాబట్టి వ్యాధినిరోధకశక్తిను తగ్గించే మందులను కూడా పరిమితంగా వాడుకునే వెసులుబాటు ఉంటుంది. మూత్రపిండాన్ని దానం చేయడం వల్ల శరీరానికి అదనంగా ఒరిగే నష్టం కూడా ఉండదు. ఒక కన్ను లేకపోతే, రెండో కన్నుతో జీవితాంతం బ్రతకగలిగినట్టే, ఒక మూత్రపిండంతో కూడా నిండు నూరేళ్లూ ఆరోగ్యంగా జీవించవచ్చు. అలాగే బ్లడ్ గ్రూపులు కలవకపోయినా, మూత్రపిండాలను మార్పిడి చేసే వెసులుబాటు కూడా ఉంది.

డాక్టర్ రాజశేఖర చక్రవర్తి,
సీనియర్ నెఫ్రాలజిస్ట్ అండ్ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ స్పెషలిస్ట్,
యశోద హాస్పిటల్స్,
హైటెక్ సిటీ, హైదరాబాద్.



అవగాహన

జీర్ణకోశ సమస్యలకు శత్రువులు

ఇరిటబుల్ బోవెల్ సిండ్రోమ్... ఈ జీర్ణకోశ సమస్య పెద్ద పేగులకు సంబంధించినది. ఈ సమస్య ఉన్నవాళ్లు తరచూ పొట్ట నొప్పి, అసౌకర్యం, మలబద్ధకం, విరోచనాలతో బాధపడుతూ ఉంటారు. అయితే ఐబిఎస్ ఉన్నవాళ్లు కొన్ని ఆహార నియమాలు పాటిస్తే సమస్య అదుపులో ఉండే వీలుంది. వీళ్లు తినకూడదని పదార్థాలు ఏవంటే...



- **బీన్స్:** సెనగలు, పప్పులు, బీన్స్ ఐబిఎస్ సమస్యను పెంచుతాయి. వీటి నుంచి వెలువడే వాయువులు జీర్ణ ప్రక్రియను బాధాకరంగా మారుస్తాయి. కాబట్టి వీటిని తీసుకోకపోవడమే మేలు. ఒకవేళ తినాలనిపిస్తే, తేలికగా అరిగేలా, మెత్తని ముద్ద రూపంలో తీసుకోవాలి.



- **వేపుళ్లు:** వీటిని కొవ్వు ఎక్కువ కాబట్టి కడుపు ఉబ్బరిస్తుంది. కొన్ని సందర్భాల్లో విరోచనాలూ వేధిస్తాయి. కాబట్టి ఫ్రెంచ్ ఫ్రైస్ లాంటివి తినాలనిపిస్తే వాటిని బేక్ చేయడం లేదా, గ్రిల్లింగ్ చేయాలి.



- **క్రూసిఫెరస్ కూరగాయలు:** ఈ జాతికి చెందిన కూరగాయల్లో పీచు ఎక్కువ. నిజానికి జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉండాలంటే పీచు ఎక్కువగా ఉండే కూరగాయలకే ప్రాధాన్యం ఇవ్వాలి. కానీ ఐబిఎస్ ఉన్నవాళ్లు ఈ రకం కూరగాయలు తినడం వల్ల, వాటిలో 'రాఫినోస్' అనే జీర్ణం కాని చక్కెరతో సమస్య మరింత పెరుగుతుంది. కాబట్టి క్యాబేజీ, కాలీఫ్లవర్, బ్రొకొలి కూరగాయలకు దూరంగా ఉండాలి.



- **చక్కెర ప్రత్యామ్నాయాలు:** చక్కెరకు ప్రత్యామ్నాయంగా వాడుకునే స్వీటెనర్లతో ఐబిఎస్ లక్షణాల తీవ్రత పెరుగుతుంది. పాలియోల్, సార్బిటాల్, క్జైలిటాల్, మానిటాల్ మొదలైన స్వీటెనర్లు రెడీమేడ్ ఫుడ్స్‌లో ఉంటాయి. ఇవన్నీ ఐబిఎస్ లక్షణాలను రెట్టింపు చేసేవే. కాబట్టి 'షుగర్ ఫ్రీ' అనే లేబుల్ ఉన్న

ఆరోగ్యం



వాపు నొప్పులకు అడ్డు కట్ట

శరీరంలో వాపులు నొప్పులను తగ్గించే పదార్థాలను ఆహారంలో జోడించడం ద్వారా ఇన్‌ఫ్లమేషన్ ముప్పు నుంచి తప్పించుకోవచ్చు. అవేంటంటే...

బ్లూబెర్రీస్

వీటిలో సహజసిద్ధ రసాయనాలైన పాలిఫినాల్స్ ఉంటాయి. వీటిలో ఉండే యాంథోసయానిన్ పాలిఫినాల్స్ వల్లే బ్లూబెర్రీస్‌కు నీలి రంగు సమకూరుతుంది. ఈ పాలీఫినాల్స్ శరీరంలోని వాపు, నొప్పులను తగ్గించి ఇన్‌ఫ్లమేషన్‌ను అరికడతాయి.

వాల్‌నట్స్

వీటిలోని అత్యధిక ఒమేగా3 ఫ్యాటీ యాసిడ్లు, ఆల్ఫా లినోలిక్ యాసిడ్లు, ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గిస్తాయి. వాల్‌నట్స్‌లో ఉండే సి రియాక్టివ్ ప్రొటీన్, క్యాల్షియం, మెగ్నీషియం, జింక్, విటమిన్ ఇ పోషకాలు కీళ్ల సంబంధ వాపులు, నొప్పులను తగ్గించడానికి సహాయపడతాయి.

డార్క్ చాక్లెట్

వీటిలో సమృద్ధిగా ఉండే ఫ్లేవనాయిడ్స్ వాపులను తగ్గిస్తాయి. చాక్లెట్ ఎంత ముదురు రంగులో ఉంటే దాన్లో అంత ఎక్కువ ఫ్లేవనాయిడ్స్ ఉంటాయి. కాబట్టి 70% కోకో, అతి తక్కువ చక్కెరలను కలిగి ఉండే డార్క్ చాక్లెట్‌ను ఎంచుకోవాలి. అలాగే డార్క్ చాక్లెట్ సెరటోనిన్ హార్మోన్ ఉత్పత్తిని పెంచి, కంటి నిండా నిద్ర పట్టడానికి సహాయపడుతుంది.

ఫిట్‌నెస్

చలి కాలం వ్యాయామం!

చలికాలం పొగమంచుతో ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్లు వేధించడం సహజం. కాబట్టి ఉదయం వేళ నడక సాధ్యపడకపోవచ్చు. జిమ్‌కు వెళ్లి వ్యాయామాలు చేసే అలవాటున్న వాళ్లకు ఇతరుల నుంచి జలుబు, దగ్గు వ్యాపించే అవకాశాలు కూడా ఎక్కువే! ఈ ఇబ్బందులేవీ ఎదుర్కోకుండా ఉండాలంటే ఇంటి పట్టునే వ్యాయామాలు చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు.

ఎలాంటి వ్యాయామం మొదలుపెట్టాలన్నా మొదట శరీరాన్ని వ్యాయామానికి సిద్ధం చేయాలి. ఇందుకోసం స్ట్రెచింగ్ వ్యాయామాలు చేయాలి. ఆ తర్వాతే అసలైన వ్యాయామాలను మొదలుపెట్టాలి. ఇందుకోసం నిలబడిన చోటే స్పాట్ జాగింగ్ చేయాలి. ఆ తర్వాత...

కాంబో వర్కవుట్!

- హై నీస్: కాళ్ల మధ్య అడుగు దూరం ఉండేలా నిలబడాలి. మోకాళ్లను మడిచి నడుము దగ్గరకు మార్చి, మార్చి లేపుతూ ఉండాలి. ఇలా కాళ్లను లేపినప్పుడు చేతులతో మోకాళ్లను తాకుతూ ఉండాలి. ఇలా 30 సెకండ్ల పాటు చేయాలి.
- బర్పీ: రెండు చేతులు గాల్లోకి లేపి ఎగరాలి. వెంటనే ముందుకు నేల మీద పడుకోవాలి. ఆలస్యం చేయకుండా లేచి నిలబడి మళ్లీ గాల్లోకి లేవాలి. ఇలా 30 సెకండ్ల పాటు చేయాలి.
- మౌంటెయిన్ క్లైంబ్: చేతులు, పాదాల ఆసరాతో నేల మీద బోర్లా పడుకోవాలి. ఈ భంగిమలో విగతా శరీరం నేలను తాకకూడదు. ఈ భంగిమలో ఉండి, పర్వతం ఎక్కుతున్నట్టుగా కాళ్లను నడుము దగ్గరకు, కిందకూ మార్చి, మార్చి కదిలించాలి. ఇలా 30 సెకండ్ల పాటు చేయాలి.
- ప్లాంక్: మోచేతులు, పాదాల ఆసరాతో నేల మీద బోర్లా పడుకోవాలి. ఈ భంగిమలో మిగతా శరీరం



నేలను తాకకూడదు. ఇలా 30 సెకండ్లు ఉండాలి. ఈ వ్యాయామాలు 3 సెట్లు చేయాలి.

పొత్తికడుపు వ్యాయామాలు!

- క్రంచెస్: నేల మీద వెల్లకిలా పడుకుని, రెండు చేతులు తల దగ్గర ఉంచి, నడుము పైభాగాన్ని వీలైనంతగా ముందుకు లేపే వ్యాయామం ఇది. ఇలా 25 క్రంచెస్ 3 సెట్లు చేయాలి.
- లెగ్ రైజ్: వెల్లకిలా పడుకుని, కాళ్లు రెండూ ఒకేసారి నిటారుగా పైకి లేపి, నడుముకు సమాంతరంగా తీసుకువచ్చి, మళ్లీ దింపేయాలి. ఇలా 25 సార్లు, మూడు సెట్లు చేయాలి.
- సైడ్ ఆబ్లిక క్రంచెస్: పక్కకు తిరిగి పడుకుని, కాళ్లు మడవాలి. చేతులను తల వెనకకు తీసుకువచ్చి, మెడకు ఆసరాగా ఉంచాలి. ఈ భంగిమలో నడుము పైభాగాన్ని పక్కకు లేపే ప్రయత్నం చేయాలి. ఇలా 25 సార్లు, మూడు సెట్లు చేయాలి.
- ఇలా మొత్తం వ్యాయామాలకు కనీసం 45 నిమిషాలు కేటాయించాలి. ఒక్కొక వ్యాయామానికి మధ్య 30 సెకండ్ల పాటు విరామం తీసుకోవచ్చు. ఈ వ్యాయామాలు చేస్తున్నప్పుడు ఫ్యాన్ లేదా ఏసి వేసుకోకూడదు.

స్ట్రెచింగ్!

వ్యాయామాలు ముగిసిన తర్వాత శరీరాన్ని తిరిగి స్ట్రెచ్ చేసుకోవాలి. ఇందుకోసం నేల మీద వెల్లకిలా పడుకుని, చేతులు తల వెనకకు చాపి, నడుపు పైభాగాన్ని పైకీ, నడుము కింద భాగాన్ని కిందకూ సాగదీసినట్టు స్ట్రెచ్ చేయాలి.

సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం కావాలి!



శరీరం ఆరోగ్యంగా ఉంటే సరిపోతుందా? మానసిక ఆరోగ్యం సంగతేమిటి? ఇవి రెండు సరిగ్గా లేకపోతే సంపూర్ణ ఆరోగ్యం సాధించటం సాధ్యమవుతుందా? ఇలాంటి అనేక ప్రశ్నలు చాలామందిలో ఉత్పన్నమవుతూ ఉంటాయి. "సంపూర్ణ ఆరోగ్యమంటే కేవలం శరీరం మాత్రమే కాదు.. మనస్సు, ఆత్మ- అన్నీ ఆనందంగా ఉండాలి. అప్పుడే నిజమైన ఆరోగ్యాన్ని సాధించగలుగుతాం. వీటిని ఎలా సాధించగలుగుతామనే విషయాన్ని ఆయుర్వేద గ్రంథాల్లో స్పష్టంగా వివరించారు" అంటారు శ్రీవర్మ ఆయుర్వేద ఆసుపత్రుల వ్యవస్థాపాకుడు డాక్టర్ శ్రీవర్మ. ఆయుర్వేదాన్ని జీవనంగా మార్చుకొని వైద్యవృత్తిని పరంపరగా సాగిస్తున్న కేరళకు చెందిన తిరువైథన్‌కోడ్ సంప్రదాయంలో 9వ తరం వాడైన శ్రీవర్మ- ఆ వైద్య విధానానికి సంబంధించిన అనేక అంశాలను 'డాక్టర్'తో పంచుకున్నారు.

ఒక వ్యక్తి సంపూర్ణ ఆరోగ్యవంతుడు కావటానికి 'ప్రసన్న ఆత్మేంద్రియానాం' అనే సూత్రాన్ని అనుసరించాలని ఆయుర్వేదం చెబుతుంది. శరీరం, మనస్సు, ఆత్మ.. ఈ మూడు ఒకదానితో మరొకటి స్నేహంగా ఉన్నప్పుడు ఒక వ్యక్తి పరిపూర్ణ ఆరోగ్యవంతుడవుతాడు. ఆనందంగా జీవించగలుగుతాడు. ఈ సూత్రాన్ని మరింతగా విశ్లేషిద్దాం. ఎవరైనా నా దగ్గరకు వచ్చినప్పుడు అతణ్ణి - "ఆహారం తినగలుగుతున్నారా?", "దినచర్యలు తీర్చుకోలుగుతున్నారా?", "నిద్ర సరిగ్గా పడుతోందా?", "శరీరంలో ఏ భాగంలోనైనా నొప్పులు ఉన్నాయా?" లాంటి ప్రశ్నలు మొదట అడుగుతాను. ఇవన్నీ శరీరానికి సంబంధించినవి. వీటితో పాటు- "ఏవైనా ప్రతికూల ఆలోచనలు వస్తున్నాయా"? "రాత్రి ఎలాంటి కలలు వస్తున్నాయి" లాంటి ప్రశ్నలు కూడా అడుగుతాను. ఇవి మానసిక స్థితికి సంబంధించినవి. ఈ రెండింటితో పాటుగా- "మీరు ప్రతి రోజూ ధ్యానం చేస్తారా?" లాంటి ప్రశ్నలకు సమాధానాలు రాబడతాను. ఇవి మన ఆధ్యాత్మిక స్థితికి సంబంధించినవి. ఈ మూడు సరిగ్గా ఉంటే ఆ మనిషి సంపూర్ణ ఆరోగ్యవంతుడే! అయితే ఈ మూడు సంపూర్ణంగా ఉండే వారు అతి కొద్ది మంది మాత్రమే ఉంటారు. ఇలా సంపూర్ణమైన ఆరోగ్యం సాధించటానికి ఆయుర్వేదం మరో రెండు సూత్రాలు చెబుతుంది. మొదటిది 'దినచర్య'. రెండోది 'ఋతుచర్య'. ఇవి రెండు ఒక దానిపై మరొకటి ఆధారపడి ఉంటాయి.

> **ఆయుర్వేదం మాంసాహారాన్ని తినవద్దని చెప్పదు. రుతువులకు తగినట్లుగా తినమని చెబుతుంది. ఉదాహరణకు శీతాకాలంలో చికెన్ ఎక్కువగా తినమని చెబుతారు. చేపలు, మటన్ తక్కువ తినమని చెబుతారు. వేసవిలో చేపలు ఎక్కువగా తినమని చెబుతారు.**

రెండూ ముఖ్యమే...

ఉదయం లేచిన తర్వాత ఎంత సేపు వ్యాయామం చేస్తున్నాం? ఎలాంటి ఆహార పదార్థాలు తింటున్నాం? ఎన్ని నీళ్లు తాగుతున్నాం? ఎంత సేపు నిద్ర పోతున్నాం?- ఇవన్నీ మన దినచర్యలో భాగాలు. మనం ఏ రుతువులో ఉన్నాం? ఆ రుతువులో ఎలాంటి పదార్థాలు తినాలి? లాంటివి రుతుచర్యలోకి వస్తాయి. ఒక వ్యక్తి శరీర లక్షణాలను గుర్తించిన తర్వాత- పైన పేర్కొన్న 'దినచర్య', 'రుతుచర్య'లను సమన్వయం చేసుకొని, అవసరమైతేనే మందులను ఇవ్వాల్సి ఉంటుంది. మన ప్రాచీన ఆయుర్వేద గ్రంథాల ప్రకారం- మన శరీరానికి రుగ్మతలు ఒక రోజులో రావు. దాని వెనుక ఒక దీర్ఘకాలిక కారణం ఉంటుంది. ఒక రుతువులో తినే ఆహారపదార్థాలు, దినచర్య- ఆ తరువాతి రుతువులో కూడా ప్రభావం చూపిస్తాయి. ఉదాహరణకు శీతాకాలం తీసుకుందాం. శీతాకాలం చల్లగా ఉంటుంది.. ఇన్‌ఫెక్షన్లు ఎక్కువగా వస్తూ ఉంటాయి. దీనికి కారణం తేమ. శాస్త్ర ప్రకారం బయట ఉండే తేమ శరీర కణాలలోకి కూడా చేరుతుంది. ఎండకాలం వచ్చినప్పుడు ఈ తేమ శరీరంపై చర్మ వ్యాధుల రూపంలో బయటకు వస్తుంది. చాలామందికి వేసవిలో చర్మవ్యాధులు ఎక్కువగా వస్తాయి. దీనికి కారణం వేసవి కాలంలో 'దినచర్య' కాదు, శీతాకాలం నుంచి వెంటాడిన 'రుతుచర్య'.



ఈ కాలంలో పనికొస్తాయా?

ఆయుర్వేదం పురాతన శాస్త్రం కదా... ఈ ఆధునిక యుగంలో పనికొస్తుందా? ఆయుర్వేద మందులు పనిచేస్తాయా? అనే ప్రశ్నలు తరచూ ఉత్పన్నమవుతూ ఉంటాయి. ఆయుర్వేదంలో 'ఒకస్మాతియం' అనే సూత్రం ఉంటుంది. మన శరీరానికి పరిస్థితులకు అనుగుణంగా మారగలిగే తత్వం ఉందని దీని అర్థం. మన శరీరంలోని కణాలు పరిస్థితులకు తగిన రీతిలో మారుతూ ఉంటాయి. ఉదాహరణకు ఒక వ్యక్తి 20 ఏళ్ల వరకు కేవలం శాకాహార భోజనమే చేశాడనుకుందాం. శరీరంలోని అవయవాలన్నీ ఆ ఆహారాన్ని జీర్ణం చేయటానికి, దాని నుంచి శక్తిని గ్రహించటానికి అలవాటు పడి ఉంటాయి. కొన్ని పరిస్థితుల వల్ల అతను మాంసాహారానికి మారాడనుకుందాం. అప్పుడు అతని శరీరంలోని అవయవాలన్నీ మాంసాహారానికి అలవాటు పడతాయి. ఇదే విధంగా ఆయుర్వేద సూత్రాలు అన్ని వాతావరణాలలోను, అన్ని పరిస్థితులలోను పనిచేస్తాయి. ఇక్కడ మనం ఇంకో విషయాన్ని కూడా చెప్పుకోవాలి. ఆయుర్వేదం ప్రతి వ్యక్తి ఏడాదికి ఒకసారి తన శరీరాన్ని పునరుత్తేజితం చేయాలని సూచిస్తుంది. పునరుత్తేజం అంటే మన శరీరంలోని అన్ని భాగాలను శుద్ధి చేసుకోవటం. శాస్త్ర గ్రంథాల ప్రకారం- మానవ శరీరంలో అన్నమయ్య కోశం (జీర్ణ వ్యవస్థ), ప్రాణమయ కోశం (శ్వాస), మనోమయ కోశం (మానసిక స్థితిగతులు), విజ్ఞానమయ కోశం (మెదడు దాని సంబంధమైన చర్యలు), ఆనందమయ కోశం(ప్రాణశక్తి) ఉంటాయి. వీటిని ఏడాదికి ఒకసారి శుద్ధి చేసుకోవాలి. ఇలా శుద్ధి చేసుకుంటే శరీరంలో పేరుకుపోయిన మలినాలన్నీ తొలగిపోతాయి. ఏడాదిలో మిగిలిన సమయమంతా సంపూర్ణ ఆరోగ్యంతో గడపవచ్చు.

> **మన శరీరంలోని అవయవాలకు పునర్జీశక్తి ఉందని ఆయుర్వేదం నమ్ముతుంది. ఆయుర్వేదం ప్రకారం- ప్రకృతితో మమేకం అయి చికిత్స చేయించుకుంటే దీర్ఘకాలిక రోగాలు కూడా నయమవుతాయి.**

అధికంగా టిక్కెట్లు అమ్ముడైన సినిమాలు

ఈ ఏడాదిలో విడుదలైన చాలా చిత్రాలు ప్రేక్షకులను అలరించాయి. కల్కి 2898, పుష్ప-2, దేవర, భూల్ భులయ్యా-3 వంటి చిత్రాలు బాక్సాఫీసు వద్ద భారీ వసూళ్లను రాబట్టాయి. బుక్ మై షోలో అత్యధిక టిక్కెట్లు అమ్ముడైన చిత్రంగా పుష్ప-2 రికార్డు సృష్టించింది. ఈ నేపథ్యంలో 2024లో విడుదల రోజున అత్యధిక సంఖ్యలో టిక్కెట్లు అమ్మిన చిత్రాలేమిటో చూద్దాం...!





పుష్ప-2: అల్లు అర్జున్, రష్మిక మందన్న జంటగా సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రమిది. వరల్డ్ వైడ్‌గా డిసెంబరు 5న విడుదలై భారీ కలెక్షన్లతో రికార్డును బ్రేక్ చేస్తోంది. విడుదల రోజున ఒక్క గంటలో సుమారుగా లక్షకు పైగా టిక్కెట్లు అమ్ముడవడం విశేషం.



కల్కి 2898: ప్రభాస్ నటించిన ఈ చిత్రం జూన్ 27న విడుదలైంది. తొలి రోజు గంటకు 96 వేలకు పైగా టిక్కెట్లు సేల్ అయ్యాయి.



దేవర: జూనియర్ ఎన్టీఆర్, జాన్వీకపూర్ జంటగా నటించిన ఈ చిత్రం పాన్ ఇండియా స్థాయిలో సెప్టెంబరు 27న విడుదలైంది. మొదటి రోజు సుమారు 15 లక్షలకు పైగా టిక్కెట్లను విక్రయించారు.



స్త్రీ-2: ఆగస్టు 15న విడుదలైన ఈ హిందీ సినిమా మొదటి రోజు సుమారు లక్షా ఇరవై నాలుగు వేలకు పైగా టిక్కెట్లు అమ్ముడు పోయాయి.



భూల్‌భులయ్యా-3: ఈ హిందీ చిత్రం నవంబరు 1న విడుదలైంది. కార్తీక్ ఆర్యన్, విద్యా బాలన్, మాధురి దీక్షిత్ ప్రధాన తారాగణం. చిత్రం ఓపెనింగ్ రోజు 2,29,558 టిక్కెట్లు అమ్మారు. బాక్సాఫీ వద్ద అత్యధిక వసూళ్లు చేసిన రెండో హిందీ చిత్రం, ఐదో భారతీయ సినిమాగా నిలిచింది.



అమరన్: శివకార్తికేయన్, సాయిపల్లవి జంటగా నటించిన ఈ చిత్రం అక్టోబరు 31న విడుదలైంది. చిత్రం విడుదల రోజున తొలి నాలుగు గంటల్లో 1,36, 890 టిక్కెట్లు విక్రయించారు.



ఫైటర్: హృతిక్ రోషన్, దీపికా పదుకొనే జంటగా నటించిన ఈ హిందీ చిత్రం జనవరి 25 విడులైంది. తొలి రోజు 2,79,00 టిక్కెట్లు విక్రయించారు.



హనుమాన్: తేజ సజ్జా, అమృత అయ్యర్ జంటగా ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో తెరకెక్కింది. జనవరి 12న విడుదల కాగా తొలిరోజున 3,36,000 టిక్కెట్లు అమ్మారు.



ద గోట్: విజయ్ నటించిన ఈ సినిమా సెప్టెంబరు 5న విడుదలైంది. తొలి రోజు ఒక్క తమిళనాడులోనే ఆరు లక్షలకు పైగా టిక్కెట్లు విక్రయించారు.



ద సింగమ్ ఎగైన్: అజయ్ దేవ్‌గన్, రణ్‌వీర్ సింగ్, దీపికా పదుకొనే ప్రధాన తారాగణంగా నటించిన ఈ మూవీ నవంబరు 1న విడుదలైంది. 2,26,000 టిక్కెట్లు విక్రయించారు.



అమెరికాలో 'గేమ్‌ఛేంజర్' ప్రీరిలీజ్ ఈవెంట్ పూర్తి చేసుకున్న రామ్‌చరణ్, డైరెక్టర్ సానా బుచ్చిబాబు దుబాయ్ వెళ్లారు. 'వార్2' సుదీర్ఘ షెడ్యూల్‌ను ముగించుకున్న ఎన్టీఆర్ కూడా దుబాయ్ చేరుకున్నారు. వీరు ముగ్గురు అక్కడ కలుసుకున్న ఫొటోను సంగీత దర్శకుడు తమన్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ప్రస్తుతం ఇది వైరల్ అవుతోంది.

సరికొత్త బాలకృష్ణను చూస్తారు

బాలకృష్ణ కథానాయకుడిగా బాబీ కొల్లి దర్శకత్వంలో నటించిన చిత్రం 'డాకూ మహారాజ్'. సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మించిన ఈ చిత్రం వచ్చే ఏడాది జనవరి 12న విడుదలవుతోంది. ఈ సందర్భంగా దర్శకుడు బాబీ కొల్లి, నిర్మాత సూర్యదేవర నాగవంశీ మీడియాతో చిత్ర విశేషాలను పంచుకున్నారు. దర్శకుడు బాబీ కొల్లి మాట్లాడుతూ "ఈ సినిమా పనులన్నీ దాదాపు పూర్తయ్యాయి. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ చివరి దశలో ఉన్న ఈ చిత్రం అద్భుతంగా వచ్చింది. బాలకృష్ణ నుంచి అభిమానులు కోరుకునే అన్ని అంశాలు ఇందులో ఉంటాయి. విజువల్‌గా ప్రేక్షకులకు మంచి అనుభూతిని ఇస్తుంది. యాక్షన్ సన్నివేశాలు ఊహించిన దాని కంటే గొప్పగా ఉంటాయి. దాదాపు వందకు పైగా సినిమాల్లో ఎన్నో వైవిధ్యమైన పాత్రలు పోషించిన బాలకృష్ణను 'డాకూ మహారాజ్' సరికొత్తగా చూపిస్తుంది" అని చెప్పారు. నిర్మాత నాగవంశీ మాట్లాడుతూ "ఈ సినిమా ఘనవిజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది. బాలకృష్ణ కెరీర్‌లోనే ఓ మైలురాయిగా నిలిచిపోతుంది. సినిమా ఫస్ట్ హాఫ్ చూశాను. గూస్ బంప్స్ వచ్చాయి. కచ్చితంగా ప్రేక్షకులంతా గొప్ప సినిమాను చూసిన అనుభూతి పొందుతారు. భావోద్వేగాలు, వినోదం, యాక్షన్ అన్నీ అదిరిపోయే రేంజ్‌లో ఉన్న సినిమా ఇది. తమన్ నెక్స్ట్ లెవల్ సంగీతం ఇచ్చారు. 30 ఏళ్లుగా బాలకృష్ణను ఎవరూ చూపని విధంగా ఇందులో వింటేజ్ లుక్‌లో



చూపిస్తున్నాం. నిర్మాతగా నా కెరీర్ మొదలుపెట్టినప్పటి నుంచి బాలకృష్ణతో సినిమా చేయాలని ప్రయత్నిస్తూనే ఉన్నా. ఇప్పటికి అది కుదిరింది. జనవరి 2న హైదరాబాద్‌లో ట్రైలర్ విడుదల చేస్తాం. జనవరి 8న యూఎస్‌లో ప్రీ రిలీజ్ వేడుక చేసి ఓ సాంగ్ విడుదల చేస్తాం. అలాగే, జనవరి 8న ఆంధ్రప్రదేశ్‌లో ప్రీ రిలీజ్ ప్లాన్ చేస్తున్నాం" అని అన్నారు.

సంక్రాంతి స్పెషల్

వెంకటేశ్, మీనాక్షీ చౌదరి, ఐశ్వర్య రాజేశ్ నటిస్తున్న ట్రయాంగులర్ క్రైమ్ కామెడీ 'సంక్రాంతికి వస్తున్నాం'. అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాను దిల్‌రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన రెండు పాటలు అందరినీ ఆకట్టుకున్నాయి. తాజాగా, ఈ సినిమాలో మూడో పాటను రామోజీ ఫిల్మ్ సిటీలో వెంకటేశ్, మీనాక్షీ చౌదరి, ఐశ్వర్య రాజేశ్‌లపై చిత్రీకరిస్తున్నారు. ఈ పాట సంక్రాంతి స్పెషల్‌గా.. సినిమాకే హైలైట్‌గా ఉంటుందని మేకర్స్ తెలిపారు. ఈ పాటకు భానుమాస్టర్ కొరియోగ్రఫీ అందిస్తున్నారు. ఒక మాజీ పోలీసు.. మాజీ ప్రేయసి.. అద్భుతమైన భార్య మధ్య జరిగే అందమైన ప్రయాణంగా రూపొందుతున్న ఈ సినిమా వచ్చే ఏడాది జనవరి 14న చిత్రం విడుదల కానుంది. కాగా, వెంకటేశ్, దర్శకుడు అనిల్ రావిపూడి కలయికలో ఇది వరకు వచ్చిన 'ఎఫ్ 2'.. 'ఎఫ్ 3' చిత్రాలు మంచి విజయం సాధించాయి.



తెలంగాణ ఆత్మను వెండితెరపై ఆవిష్కరించిన దర్శకుడు

'నాకు ఇప్పుడు 90 ఏళ్లు వచ్చాయి. ఆరోగ్యంగానే ఉన్నా. ప్రస్తుతం రెండు మూడు ప్రాజెక్టులకు వర్క్ చేస్తున్నా. శరీరం, మనసు సహకరించినంత కాలం సినిమాలు తీయాలన్నది నా కోరిక' అని కొద్ది రోజుల క్రితమే తన పుట్టినరోజు (డిసెంబర్ 14) సందర్భంగా తనని కలిసిన మీడియా ప్రతినిధులతో మాట్లాడిన శ్యామ్ బెనగల్ ఇక లేరు. తెలంగాణ ఆత్మను వెండితెరపై అద్భుతంగా ఆవిష్కరించిన దర్శకుడు ఆయన. రెగ్యులర్ కమర్షియల్ చిత్రాల జోలికి పోకుండా సామాజిక సమస్యలు, ఆర్థిక అసమానతలను చర్చిస్తూ శ్యామ్ తీసిన చిత్రాలు ఓ వర్గం ప్రేక్షకులను విపరీతంగా ఆకర్షించాయి. ఆయన రూపొందించిన 'అంకుర్', 'నిషాంత్', 'సుస్మన్', 'మండి', 'వెల్ డన్ అబ్బా' చిత్రాల నేపథ్యం తెలంగాణ కావడం విశేషం. పేరున్న నటీనటుల జోలికి పోకుండా కొత్త తారలకు అవకాశాలు ఇస్తూ సినిమాలు రూపొందించారు శ్యామ్ బెనగల్. స్మితా పాటిల్, షబానా అజ్మీ, నసీరుద్దీన్ షా, ఓం పురి వంటి తారలు శ్యామ్ బెనగల్ చిత్రాలతోనే గుర్తింపు తెచ్చుకున్నారు. అవార్డులు పొందారు.

పన్నెండేళ్ల వయసులోనే ..

శ్యామ్ పూర్తి పేరు బెనగళ్ల శ్యామసుందర్‌రావు. ఆయన తండ్రి శ్రీధర్ బెనగల్ కర్నాటకకు చెందిన వారు. కొంకణి మాట్లాడే చిత్రాపూర్ సారస్వత బ్రాహ్మణ కుటుంబం వారిది. చిన్నతనం నుంచి శ్యామ్‌కు సినిమాల మీద ఆసక్తి. అది గమనించి ఆయన తండ్రి ఓ కెమెరా కొనిచ్చారు. ఆ కెమెరాతోనే పన్నెండేళ్ల వయసులో ఓ లఘు చిత్రం తీశారు. సికింద్రాబాద్ తిరుమలగిరిలో ఒక స్టూడియో కూడా ఉంది. ఓల్డ్ అల్వాల్‌లో ఉన్న ఇంట్లో కొన్ని రోజులు గడిపారు శ్యామ్. ప్రస్తుతం ఆ ఇల్లు శిధిలావస్థలో ఉంది. శ్యామ్ సోదరుడి కుమారుడు శ్రీధర్ ఇప్పుడు అల్వాల్‌లోనే ఉంటున్నారు. శ్యామ్ బెనగల్ అల్వాల్ నుంచి రోజూ సైకిల్ మీద బషీర్‌బాగ్‌లోని నిజాం కళాశాలకు వెళ్లేవారు. అలా సైకిల్ తొక్కడంలో అనుభవాన్ని సంపాదించిన ఆయన సైకిల్ పోటీల్లోనూ ఛాంపియన్‌గా నిలిచారు.

కాపీ రైటర్‌గా కెరీర్ ప్రారంభించి..

ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఎకనామిక్స్‌లో మాస్టర్ డిగ్రీ పొందిన శ్యామ్ బెనగల్ మొదట ముంబైలోని ఓ యాడ్ ఏజెన్సీలో కాపీ రైటర్‌గా పని చేశారు. ఆ తర్వాత క్రియేటివ్ హెడ్‌గా మారారు. 1962లో తొలిసారిగా ఆయన గుజరాతీలో 'ఘేర్ బేఠాగంగ' పేరుతో డాక్యుమెంటరీ తీశారు. ఇక అక్కడి నుంచి సినిమాకు దర్శకత్వం వహించడానికి ఆయనకు దశాబ్ద కాలం పట్టింది. ఆ సినిమా 'అంకుర్'. ఈ సినిమాతోనే షబానా అజ్మీ, అనంత్



నాగ్ పరిచయమయ్యారు. తెలంగాణలో ఆర్థిక అసమానతలు, లైంగిక వేధింపుల గురించి శ్యామ్ తీసిన చిత్రమిది. ఈ చిత్రం షూటింగ్ చాలా వరకూ అల్వాల్, మచ్చ బొల్లారం, తిరుమలగిరి ప్రాంతాల్లో జరగడం విశేషం. జాతీయ ద్వితీయ ఉత్తమ చిత్రంగా 'అంకుర్' అవార్డ్ పొందింది. ఇందులో నటించిన షబానా అజ్మీ జాతీయ ఉత్తమ నటిగా ఎంపికయ్యారు.

పారలల్ సినిమాకు ఆద్యుడు

'అంకుర్' చిత్ర విజయం అందించిన ప్రోత్సాహంతో 1970-80ల దశకంలో పారలల్ సినిమాకు ఊపిరి పోశారు శ్యామ్. ఆ తర్వాత నిషాంత్ (1975), మంథన్ (1976), భూమిక(1977) వంటి చిత్రాలను రూపొందించారు. వీటిల్లో 'మంథన్' చిత్రం గురించి ప్రత్యేకంగా చెప్పాలి. గుజరాత్‌లోని పాడి పరిశ్రమ అభివృద్ధి గురించి తీసిన సినిమా ఇది. ఈ చిత్రకథ విన్న ఐదు లక్షల మంది గుజరాత్ రైతులు తలో రెండు రూపాయలు పెట్టుబడి పెట్టి ఈ చిత్ర నిర్మాతలుగా మారడం విశేషం.శ్యామ్ రూపొందించిన 'భూమిక' చిత్రంతో స్మితా పాటిల్ ఉత్తమ నటిగా తొలిసారి జాతీయ అవార్డ్ పొందారు.

సుభాష్‌చంద్రబోస్ పై సినిమా

శ్యామ్ బెనగల్ 2004లో భారత స్వాతంత్ర్య యోధుడు సుభాష్ చంద్ర బోస్ గురించి 'నేతాజీ సుభాష్‌చంద్రబోస్.. ద ఫర్‌గాటెన్ హీరో' పేరుతో తీసిన చిత్రం ప్రశంసలు పొందింది. అలాగే బంగ్లాదేశ్ తొలి అధ్యక్షుడు షేక్ ముజిబుర్ రెహమాన్ జీవిత కథను కూడా సినిమాగా రూపొందించారు. ఇదే ఆయన చివరి చిత్రం.

తీరని లోటు : సీఎం రేవంత్ రెడ్డి

చలన చిత్రం రంగంలో కొత్త ఒరవడిని సృష్టించిన శ్యామ్ బెనగల్ మరణం సినీ ప్రపంచానికి తీరని లోటు అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. భారతీయ వాస్తవిక సినిమా విశ్వరూపాన్ని ప్రదర్శించిన దర్శకుడు, మట్టి మనుషుల జీవితకథలను వెండితెరపై దృశ్యమానం చేసిన దిగ్గజ దర్శకుడు శ్యామ్ బెనగల్ అని తెలంగాణ సినిమాటోగ్రాఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. ఆయన మరణం పట్ల మంత్రి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శ్యామ్ బెనగల్ సినిమాలు సామాజిక సమస్యలను, మానవ సంబంధాల లోతును, మట్టిమనుషుల జీవిత కథలను కళ్లకు కట్టినట్టు చూపిస్తాయని ఆయన ప్రశంసించారు.

తెలుగులో ఒకే ఒక్క చిత్రం



శ్యామ్ బెనగల్ తెలుగు వాడైనా తెలుగులో ఒకే ఒక్క చిత్రం తీయడం గమనార్హం. ఆ సినిమా 'అనుగ్రహం'(1978). ఆ నాటి అగ్ర కథానాయిక వాణిశ్రీ పారలల్ సినిమాలో తను కూడా నటించాలనే తపనతో మేకప్ లేకుండా ఈ చిత్రంలో నటించారు. తెలుగు, హిందీ భాషల్లో ఈ చిత్రాన్ని రూపొందించారు శ్యామ్ బెనగల్. మరాఠీలో వచ్చిన 'కొండోరా' నవల ఆధారంగా రూపుదిద్దుకున్న ఈ చిత్రంలో అనంత్ నాగ్, రావుగోపాల రావు, స్మితా పాటిల్ తదితరులు నటించారు. ఈ చిత్రం షూటింగ్ లో ఒక తమాషా సంఘటన జరిగింది. వాణిశ్రీకి కొన్ని హిందీ డైలాగులు ఇచ్చి, నేను చెప్పినట్లు హిందీలో వీటిని చెబితే నీకు రూ. ఐదు కోట్లు ఇస్తానని దర్శకుడు శ్యామ్ బెనగల్ వాణిశ్రీ కి సవాల్ విసిరారు. దాన్ని స్వీకరించి ఐదే ఐదు నిముషాల్లో ఆ డైలాగులను హిందీ లో శ్యామ్ బెనగల్ చెప్పినట్లే చెప్పారు వాణిశ్రీ. శ్యామ్ బెనగల్ షాక్ అయ్యారు. వాణిశ్రీ గర్వంగా ఆయన వంక చూసి డబ్బు ఇవ్వండి అన్నట్లు చేతులు చాపారు. శ్యామ్ తన జేబులో చెయ్యి పెట్టారు. యూనిట్ లో అందరూ ఆయన వంకే చూస్తున్నారు. క్షణం లో జేబు లోంచి ఐదు పైసల నాణెం తీసి వాణిశ్రీ చేతిలో పెట్టి ఇదే ఐదు కోట్లు అనుకో..అని నవ్వేశారు శ్యామ్.

ఇన్ ప్రోగ్రెస్

ఇలాంటి చిత్రాలు అరుదుగా వస్తుంటాయి



వీర్ రెడ్డి, దయానంద్ రెడ్డి, ఢిల్లీ గణేశ్, గిరిధర్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'లీగల్లీ వీర్'. రవి గోగుల దర్శకత్వంలో శాంతమ్మ మలికిరెడ్డి నిర్మించారు. ఈ నెల 27న సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం ప్రీ రిలీజ్ ఫంక్షన్ ఏర్పాటు చేసింది. కార్యక్రమంలో హీరో వీర్ రెడ్డి మాట్లాడుతూ "తెలుగులో లీగల్ థ్రిల్లర్‌లు తక్కువగా వస్తుంటాయి. రియల్ కోర్టు డ్రామా ఎలా ఉంటుందో ఈ సినిమాలో అద్భుతంగా చూపించాం" అని చెప్పారు. దర్శకుడు రవి మాట్లాడుతూ "ఇలాంటి సబ్జెక్ట్‌తో తెరకెక్కిన చిత్రాలు అరుదుగా వస్తుంటాయి. తప్పకుండా సినిమా అందరికీ నచ్చుతుంది" అని చెప్పారు.

యూత్‌ను ఆకట్టుకుంటుంది



ధర్మ, ఐశ్వర్య శర్మ జంటగా నటించిన యూత్‌ఫుల్ ఎంటర్టైనర్ 'డ్రింకర్ సాయి'. 'బ్రాండ్ ఆఫ్ బ్యాడ్ బాయ్స్' అనేది ఉపశీర్షిక. కిరణ్ తిరుమలశెట్టి దర్శకత్వంలో బసవరాజు లహరిధర్, బసవరాజు శ్రీనివాస్, ఇస్మాయిల్ షేక్ సంయుక్తంగా నిర్మించారు. ఈ నెల 27న సినిమా విడుదలవుతోన్న సందర్భంగా నిర్మాత లహరిధర్ మీడియాతో ముచ్చటించారు.

"ఈ సినిమా కథను దర్శకుడు కిరణ్ చెప్పగానే చాలా నచ్చేసింది. నాన్న శ్రీనివాస్ ఈ సినిమా కథను చిరంజీవికి చెప్పి ఆయన అభిప్రాయం అడిగారు. ఆయన, ఓకే.. ప్రొసీడ్ అన్నారు. అలా చిరంజీవి ప్రోత్సాహంతో ఈ సినిమా ప్రారంభమైంది. ఈ సినిమాను ఎక్కడా రాజీ పడకుండా నిర్మించాం. ధర్మ, ఐశ్వర్య అద్భుతంగా నటించారు. సినిమాలో వారు చేసిన ప్రదర్శన అందరికీ గుర్తుండిపోతుంది. ఈ సినిమాకు మ్యూజిక్, క్లైమాక్స్ ప్రధానాకర్షణ. యూత్‌ను విపరీతంగా ఆకట్టుకుంటుంది" అని చెప్పారు.

వాయిస్, ఎస్ఎంఎస్‌లకే
రీచార్జ్ వోచర్లు : ట్రాయ్

న్యూఢిల్లీ: టెలికాం ఆపరేటర్ల టారిఫ్ వోచర్ల నిబంధనలనూ టెలికాం నియంత్రణ మండలి ట్రాయ్ సవరించింది. కంపెనీలు ఇక డేటా అవసరం లేని చందాదారులకు వాయిస్, ఎస్ఎంఎస్‌లకు ప్రత్యేక రీచార్జ్ వోచర్లు జారీ చేయాలని స్పష్టం చేసింది. స్పెషల్ రీచార్జ్ కూపన్ల గడువును కూడా ప్రస్తుత 90 రోజుల నుంచి 365 రోజుకు పెంచింది. ప్రతి టెలికాం ఆపరేటర్ 365 రోజుల చెల్లుబాటయ్యేలా వాయిస్, ఎస్ఎంఎస్‌ల కోసం తప్పనిసరిగా కనీసం ఒక ప్రత్యేక టారిఫ్ వోచర్ జారీ చేయాలని స్పష్టం చేసింది. డేటా అవసరం ఉన్నా లేకపోయినా కంపెనీలు వాయిస్, ఎస్ఎంఎస్‌లతో కలిపి తమకు అంటగడుతున్నాయని చందాదారుల నుంచి ఫిర్యాదులు రావడంతో ట్రాయ్ ఈ చర్య తీసుకుంది.

ఏపీ, తెలంగాణ ఎంఎస్ఎంఈలపై దృష్టి

శ్రీరామ్ ఫైనాన్స్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): శ్రీరామ్ గ్రూప్ కంపెనీ శ్రీరామ్ ఫైనాన్స్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా ఎంటర్‌ప్రైజెస్ (ఎంఎస్ఎంఈ)పై ప్రత్యేక దృష్టి పెడుతోంది. ఇందులో భాగంగా ఈ సంవత్సరం సెప్టెంబరు నాటికి ఏపీలోని ఎంఎస్ఎంఈలకు రూ.4,907.89 కోట్లు, తెలంగాణలోని ఎంఎస్ఎంఈలకు రూ.4,666.20 కోట్లు రుణాలుగా మంజూరు చేసింది. ఇవి అన్ని రంగాలకు కలిపి ఇచ్చిన తమ మొత్తం రుణాల్లో 13.29 శాతానికి సమానమని తెలిపింది. రెండు రాష్ట్రాల్లోని తయారీ, సేవలు వాణిజ్య రంగాలకు చెందిన ఎంఎస్ఎంఈల రుణ అవసరాలపై శ్రీరామ్ ఫైనాన్స్ ప్రత్యేక దృష్టి పెట్టింది.

శ్రేయాస్‌కు మహా కుంభ మేళా ప్రకటనల హక్కులు

హైదరాబాద్: వచ్చే నెల 13 నుంచి ఫిబ్రవరి 26 వరకు ఉత్తర ప్రదేశ్‌లోని ప్రయాగ్ రాజ్‌లో జరిగే 'మహా కుంభ మేళా-2025' ప్రకటనల హక్కులు హైదరాబాద్ కంపెనీ చేజిక్కించుకుంది. ఆద్యశ్రీ ఇన్ఫోటైన్‌మెంట్‌నకు చెందిన శ్రేయాస్ మీడియా సంస్థ ఈ హక్కులు దక్కించుకుంది. ప్రకనలతో పాటు వెండింగ్ జోన్లు, అమ్యూజ్‌మెంట్ జోన్, ఫుడ్ కోర్టుల ఏర్పాటు హక్కులు కూడా తమకే దక్కినట్టు తెలిపింది. దాదాపు 4,000 హెక్టార్ల ప్రాంతంలో జరిగే ఈ మహా కుంభ మేళాకు 50 కోట్ల మంది భక్తులు హాజరవుతారని అంచనా. ఈ మేళాలో తమ వస్తు, సేవల ప్రచార ప్రకటనల కోసం కార్పొరేట్ రంగం రూ.3,000 కోట్ల వరకు ఖర్చు చేస్తుందని అంచనా.

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	93	విజయవాడ	96
వరంగల్	93	గుంటూరు	99
కరీంనగర్	93	ఒంగోలు	99
మహబూబ్‌నగర్	93	చిత్తూరు	90
కర్నూలు	93	నెల్లూరు	90
విశాఖపట్నం	100	అనంతపురం	90
గోదావరి	96		

హోండా, నిస్సాన్ విలీనం

మేమూ మీతోనే: మిత్సుబిషి.. చేయి కలిపిన జపాన్ ఆటో దిగ్గజాలు



టోక్యో: జపాన్‌కు చెందిన ఆటో దిగ్గజాలు హోండా, నిస్సాన్ చేతులు కలిపాయి. మార్కెట్లో పోటీని తట్టుకుని, కార్ల మార్కెట్లో తమ స్థానం పటిష్ఠం చేసుకునేందుకు రెండు కంపెనీలు విలీనం కావాలని నిర్ణయించాయి. ఈ మేరకు ఉభయ కంపెనీల మధ్య ఒక అవగాహన ఒప్పందం కుదిరింది. నిస్సాన్‌తో ఇప్పటికే భాగస్వామ్యం ఉన్న మిత్సుబిషి కంపెనీ కూడా హోండా, నిస్సాన్‌లతో కలిసి ప్రయాణం చేయాలని నిర్ణయించినట్టు ప్రకటించింది. మూడు కంపెనీలతో ఒక జాయింట్ హోల్డింగ్ కంపెనీ ఏర్పాటు చేసేందుకు అవసరమైన విధివిధానాల రూపకల్పన కోసం చర్చలు ప్రారంభించాలని నిర్ణయించాయి. ఈ మేరకు హోండా సీఈఓ తోషిహిరో మైబ్, నిస్సాన్ సీఈఓ మకోటో ఉచిడా ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ప్రక్రియ పూర్తయితే విలీన కంపెనీ అమ్మకాల్లో ప్రపంచంలోనే మూడో స్థాయిలో నిలుస్తుంది.

మూడు కంపెనీల మార్కెట్ విలువను పరిగణనలోకి తీసుకుంటే అది 5,500 కోట్ల డాలర్ల (రూ.4.68 లక్షల కోట్లు) విలువ గల కంపెనీగా మారుతుంది. వాస్తవానికి హోండా, నిస్సాన్ కంపెనీల మధ్య ఈ ఏడాది మార్చి నుంచి పరిమిత భాగస్వామ్యం ఉంది. కొత్తతరం వాహన ఇంటెలిజెన్స్, విద్యుదీకరణలో సహకరించుకునేందుకు ఒక భాగస్వామ్యంపై రెండు కంపెనీలు మార్చి 15న ఎంఓయూ కుదుర్చుకున్నాయి. ఈ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత విస్తరించుకునేందుకు అంగీకరిస్తూ ఆగస్టు ఒకటో తేదీన మరో ఎంఓయూపై సంతకాలు చేశాయి. ఇప్పుడు తమ వ్యాపారాలను కూడా సమీకృతం చేసి ప్రపంచంలోనే ఆటో రంగంలో మూడో దిగ్గజంగా మారేందుకు సమాయత్తం అవుతున్నాయి. మరోపక్క నిస్సాన్ కంపెనీకి కూడా ఫ్రాన్స్‌కు చెందిన రెనోతో భాగస్వామ్యం ఉంది.

దీనివల్ల హోండా, నిస్సాన్, రెనో, మిత్సుబిషి నాలుగు కంపెనీ భాగస్వామ్యం జపాన్‌కు చెందిన ఆటో దిగ్గజం టయోటా, జర్మనీ ఆటో దిగ్గజం ఫోక్స్‌వేగన్‌కు కూడా గట్టి పోటీ ఇవ్వగలుగుతుందంటున్నారు. అయితే విలీనం తర్వాత కూడా టయోటానే మార్కెట్ నంబర్ వన్‌గా నిలుస్తుంది. 2023లో టయోటా 1.15 కోట్ల కార్లు తయారుచేసింది. కొత్తగా చేతులు కలిపిన మూడు కంపెనీలు ఉమ్మడిగా 80 లక్షల కార్లు (హోండా 40 లక్షలు, నిస్సాన్ 34 లక్షలు, మిత్సుబిషి 10 లక్షలు) మాత్రమే ఉత్పత్తి చేశాయి.

విలీన ప్రక్రియ ఎలా?

రెండు కంపెనీలకు మాతృ సంస్థగా వ్యవహరించేందుకు ఒక జాయింట్ హోల్డింగ్ కంపెనీ ఏర్పాటు చేస్తారు. వాటాదారులు, రెగ్యులేటరీ అధికారుల అనుమతులు లభించిన అనంతరం హోల్డింగ్ కంపెనీకి షేర్లను బదిలీ చేస్తాయి. అనంతరం నిస్సాన్ పునరుజ్జీవ ప్రక్రియను నిలకడగా అమలు పరుస్తారు. నిస్సాన్, హోండా రెండూ జాయింట్ హోల్డింగ్ కంపెనీకి అనుబంధ కంపెనీలుగా ఉంటాయి. 2026 ఆగస్టు నాటికి నిస్సాన్, హోండా కంపెనీల డీలిస్టింగ్ ప్రక్రియ పూర్తి చేసి జాయింట్ హోల్డింగ్ కంపెనీ షేర్లను టోక్యో స్టాక్ ఎక్స్ఛేంజీలో లిస్టింగ్ చేయాలని నిర్ణయించారు.

విలీనం ఎవరికి లాభం?

ప్రస్తుతం ప్రపంచం యావత్తు పెట్రో ఉత్పత్తులపై నడిచే కార్ల స్థానంలో పర్యావరణ అనుకూలమైన విద్యుత్ వాహనాలకే ప్రాధాన్యం ఇస్తోంది. ఈ నేపథ్యంలో ఆటోమొబైల్ కంపెనీలు కూడా ఈవీల తయారీకి ప్రాధాన్యం ఇచ్చే దిశగా వ్యూహాలు మార్చుకుంటున్నాయి. ఈ విభాగంలో జపాన్ ఆటో కంపెనీలు ప్రత్యర్థుల కన్నా చాలా వెనుకబడి ఉన్నాయి. చైనాకు చెందిన బీవైడీ, జీపెంగ్, నియో, లీ ఆటో వంటి కంపెనీలు తక్కువ ధరలో హైబ్రిడ్, విద్యుత్ కార్లు అందించడం ద్వారా జపాన్ ఆటో దిగ్గజాల మార్కెట్‌కు పెను సవాలు విసురుతున్నాయి. ఈవీల ఉత్పత్తిలో హోండా, నిస్సాన్ చాలా వెనుకబడి ఉన్నాయి.

ఈ రెండు కంపెనీలు భారత మార్కెట్లో త్వరలో ఈవీలు ప్రవేశపెట్టే ప్రయత్నంలో ఉన్నాయి. హోండా ఎలివేట్ ఎలక్ట్రిక్ ఎస్‌యూవీని, నిస్సాన్ అరియా ఎలక్ట్రిక్ ఎస్‌యూవీని వచ్చే ఏడాది మార్కెట్లో ప్రవేశపెట్టనున్నాయి. ఈ రెండు ఈవీలు ప్రస్తుత భాగస్వామ్యంలో భాగంగా ఉంటాయా లేదా అన్న విషయంలో ఇంకా స్పష్టత లేదు. అయినప్పటికీ హోండా, నిస్సాన్ కంపెనీలు తమ వనరులు సమీకృతం చేసుకునేందుకు, పరిశోధన, అభివృద్ధి వ్యయాలను తగ్గించుకునేందుకు, కొత్త టెక్నాలజీ కార్ల తయారీపై దృష్టి కేంద్రీకరించేందుకు ఈ విలీనం దోహదపడుతుందని నిపుణులంటున్నారు. మరోపక్క ఈ భాగస్వామ్యం ద్వారా నిస్సాన్ నుంచి హోండాకు భారీ ఎస్‌యూవీలకు అవసరమైన బాడీ ఫ్రేమ్ కూడా అందుబాటులోకి వస్తుంది. అంతే కాదు, బ్యాటరీ-విద్యుత్ వాహనాలు, గ్యాస్-విద్యుత్ హైబ్రిడ్ వాహనాల తయారీలో నిస్సాన్‌కు అనుభవం ఉంది. కొత్త తరం ఈవీలు, హైబ్రిడ్ వాహనాల తయారీలో ఈ అనుభవం ఉపయోగపడుతుంది.

ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆటోమొబైల్ కంపెనీగా అవతరణ

టయోటా, ఫోక్స్‌వేగన్ పోటీని తట్టుకునేందుకే...

భారత్‌లో అవకాశాలు అపారం

పెరుగుతున్న ఆదాయాలు, పట్టణీకరణ, మౌలిక వసతుల అభివృద్ధితో వర్ధమాన దేశాలైన భారత్, బ్రెజిల్ మార్కెట్లు ప్రపంచ ఆటోమొబైల్ కంపెనీలకు అపారమైన అవకాశాలు అందిస్తున్నాయి. సుజుకీ భాగస్వామ్యంలోని మారుతి సుజుకీ ఇప్పటికే భారత్‌లో మార్కెట్ లీడర్‌గా ఉంది. అందుబాటు ధరల్లో చక్కని ఇంధన సామర్థ్యం గల కార్లకు జపాన్ పెట్టింది పేరు. ఈ కారణంగానే టయోటా, హోండా, నిస్సాన్ కూడా భారత మార్కెట్లో మంచి వాటా కలిగి ఉన్నాయి. హోండా సిటీ సెడాన్‌తో 1998లో, నిస్సాన్ మైక్రా హ్యాచ్‌బాక్‌తో 2010లో భారత మార్కెట్లో ప్రవేశించాయి. భారత మార్కెట్లో ప్రవేశించి ఇంతకాలం అయినా రెండు కంపెనీలు తక్కువ పరిమిత ఉత్పత్తులతోనే నెట్టుకొస్తున్నాయి.

ప్రస్తుతం హోండా నుంచి సిటీతో పాటు అమేజ్ కాంపాక్ట్ సెడాన్, ఎలివేట్ ఎస్‌యూవీ మార్కెట్లో ఉండగా నిస్సాన్ నుంచి మాగ్నైట్, ఎక్స్‌ట్రయల్ మాత్రమే ఉన్నాయి. ఆటో డీలర్ల సంఘం (ఫాడా) గణాంకాల ప్రకారం నవంబరు నాటికి హోండా మార్కెట్ వాటా 1.39 శాతం ఉండగా నిస్సాన్ 0.73 శాతం ఉంది. ఈ విలీనంతో వారు మరిన్ని కొత్త కార్లను మార్కెట్లో ప్రవేశపెట్టే అవకాశం ఉంటుంది. ఇదిలా ఉండగా హోండా, నిస్సాన్‌ల విలీనం భారత ఆటో కంపెనీలకు సవాలు విసిరే ఆస్కారం సైతం ఉంది. ఆ సవాలును దీటుగా ఎదుర్కొనాలంటే భారత ఆటోమొబైల్ పరిశ్రమ కూడా సరికొత్త టెక్నాలజీలతో కస్టమర్లను ఆకట్టుకోవడానికి వ్యూహాత్మక భాగస్వామ్యాలు, ఇన్నోవేషన్ల దిశగా అడుగేయవలసి రావచ్చు.

ఐదు రోజుల నష్టాలకు తెర

సెన్సెక్స్ 499 పాయింట్లు అప్

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ల ఐదు రోజుల పతనానికి బ్రేక్ పడింది. కనిష్ఠ స్థాయిల వద్ద మదుపరులు పెద్దఎత్తున కొనుగోళ్లకు దిగటంతో పాటు అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మద్దతు లభించటంతో సోమవారం బెంచ్‌మార్క్ సూచీలు సెన్సెక్స్, నిఫ్టీ పరుగులు తీశాయి. బ్లూచిప్ షేర్లయిన ఐటీసీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్ల కొనుగోళ్లకు ఇన్వెస్టర్లు ఎగబడటం మార్కెట్లకు కలిసి వచ్చిందని ట్రేడర్లు తెలిపారు. సోమవారం బీఎస్ఈ సెన్సెక్స్ ఇంట్రాడేలో ఒక దశలో 876.53 పాయింట్లు దూసుకుపోయి 78,918.12 పాయింట్ల స్థాయిని తాకింది. చివరకు498.58 పాయింట్ల లాభంతో 78,540.17 పాయింట్ల వద్ద క్లోజైంది. మరోవైపు ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా 165.95 పాయింట్ల లాభంతో 23,753.45 పాయింట్ల వద్ద ముగిసింది. ఫైనాన్షియల్, ఐటీ రంగాల షేర్లు మంచి రికవరీ సాధించటం మార్కెట్లలో పాజిటివ్ సెంటిమెంట్‌ను నింపిందని మార్కెట్ విశ్లేషకులు తెలిపారు.

బడ్జెట్ రోజున స్టాక్ మార్కెట్లు పనిచేస్తాయ్: వచ్చే ఏడాది ఫిబ్రవరి 1 శనివారం అయినప్పటికీ స్టాక్ మార్కెట్లు యధావిధిగా పనిచేస్తాయని బీఎస్ఈ, ఎన్ఎస్ఈ ప్రకటించాయి. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆ రోజున 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సాధారణ బడ్జెట్ ప్రవేశపెట్టనుండటంతో మార్కెట్లలో ట్రేడింగ్ నిర్వహించాలని నిర్ణయించినట్లు బీఎస్ఈ, ఎన్ఎస్ఈ వెల్లడించాయి.

తగ్గిన నాన్-లైఫ్ క్లెయిమ్‌లు

2023-24లో రూ.1.72 లక్షల కోట్లుగా నమోదు

న్యూఢిల్లీ: నాన్-లైఫ్ బీమా రంగంలో క్లెయిమ్స్ తగ్గుతున్నాయి. 2023-24 ఆర్థిక సంవత్సరం ఈ రంగానికి చెందిన బీమా కంపెనీలు రూ.2.9 లక్షల కోట్ల మొత్తానికి అండర్‌రైట్ చేస్తే.. రూ.1.72 లక్షల కోట్ల మొత్తాన్ని పాలసీదారులు క్లెయిమ్ చేసుకున్నారు. ఇది మొత్తం అండర్ రైటింగ్‌లో 82.52 శాతానికి సమానం. అంతకు ముందు ఆర్థిక సంవత్సరంలో నమోదైన 82.95 శాతంతో పోలిస్తే ఇది 0.43 శాతం తక్కువ. నికర క్లెయిమ్‌ల పరంగా చూస్తే మాత్రం క్లెయిమ్‌ల మొత్తం 15.39 శాతం పెరిగి రూ.1.72 లక్షల కోట్లకు చేరినట్టు భారత బీమా నియంత్రణ, అభివృద్ధి మండలి (ఐఆర్‌డీఏఐ) 2023-24 ఆర్థిక సంవత్సర నివేదికలో వెల్లడించింది.

హైదరాబాద్‌లో అకార్డియన్ సెంటర్

న్యూయార్క్ కేంద్రంగా అంతర్జాతీయంగా పలు ప్రైవేటు ఈక్విటీ (పీఈ) సంస్థలకు ఆర్థిక సేవలు అందించే అకార్డియన్ అనే సంస్థ హైదరాబాద్‌లో 1,500 మంది పనిచేసేలా తన కార్యాలయాన్ని ఏర్పాటు చేసింది. ఇందుకోసం గత ఏడాది మే నెలలో కొనుగోలు చేసిన హైదరాబాద్ డేటా అనలిటిక్స్ కంపెనీ మెరిలిటిక్స్‌తో తన కార్యకలాపాలను అనుసంధానం చేసినట్టు తెలిపింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



24వ తేదీ			
హైదరాబాద్	580	విజయవాడ	590
వరంగల్	582	గోదావరి	590
చిత్తూరు	593	విశాఖపట్నం	595
		దజను గుడ్లు రూ. 84	

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	77,500 ▲	71,050 ▲	99,000 ▲
విజయవాడ	78,600 ▲	72,500 ▲	92,000 ▲
విశాఖపట్నం	76,370 ▼	70,010 ▼	89,120 ▲
రాజమండ్రి	77,450 ▲	71,000 ▲	90,000 ▲
ప్రొద్దుటూరు	78,750 ▲	72,920 ▲	90,100 ▲
ముంబై	75,944 ▲	69,565 ▲	87,488 ▲

స్పోర్ట్స్

390.. ఊదేశారు

బెంగాల్ మహిళల జట్టు రికార్డు ఛేదన

రాజ్‌కోట్: మహిళల వన్డే క్రికెట్ చరిత్రలో అత్యధిక లక్ష్యాన్ని ఛేదించిన జట్టుగా బెంగాల్ రికార్డు సృష్టించింది. తనుశ్రీ సర్కార్ (113), ప్రియాంక బాల (88 నాటౌట్) అదరగొట్టడంతో.. సీనియర్ మహిళల వన్డే టోర్నీలో సోమవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో హరియాణా నిర్దేశించిన 390 పరుగుల లక్ష్యాన్ని బెంగాల్ మరో 5 బంతులు మిగిలుండగానే ఛేదించింది. ఈ క్రమంలో 2019లో న్యూజిలాండ్ దేశవాళీ క్రికెట్‌లో కాంటర్‌బరీతో మ్యాచ్‌లో నార్తరన్ డిస్ట్రిక్స్ టీమ్ 309 పరుగుల లక్ష్య ఛేదన రికార్డును బెంగాల్ బద్దలుకొట్టింది. అంతర్జాతీయ క్రికెట్‌లో సౌతాఫ్రికాతో మ్యాచ్‌లో శ్రీలంక 305 పరుగుల లక్ష్యాన్ని అధిగమించింది. తొలుత హరియాణా నిర్ణీత 50 ఓవర్లలో 389/5 స్కోరు చేసింది. భారత జట్టులో చోటు కోల్పోయిన షఫాలీ వర్మ (197) త్రుటిలో డబుల్ సెంచరీ చేజార్చుకొంది. అనంతరం లక్ష్యం కోసం బరిలోకి దిగిన బెంగాల్ 49.1 ఓవర్లలో 5 వికెట్లకు 390 పరుగులు చేసి గెలిచింది.

ఆసుపత్రిలో వినోద్ కాంబ్లీ



థానె: టీమిండియా మాజీ క్రికెటర్ వినోద్ కాంబ్లీ తీవ్ర అనారోగ్యం కారణంగా ఆసుపత్రిలో చేరాడు. మెదడులో రక్తం గడ్డకట్టడంతో ప్రస్తుతం అతను ఐసీయూలో చికిత్స పొందుతున్నాడు. అయితే చికిత్సకు కాంబ్లీ సహకరిస్తున్నాడనీ.. ప్రస్తుతం అతడి పరిస్థితి నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు. మూత్రంలో ఇన్ఫెక్షన్ సమస్యతో థానెలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చేరిన కాంబ్లీకి, పలు పరీక్షల అనంతరం మెదడులో సమస్యను గుర్తించినట్టు అతడికి చికిత్స అందిస్తున్న డాక్టర్ త్రివేది పేర్కొన్నాడు. మరోవైపు కాంబ్లీకి జీవితాంతం ఉచిత చికిత్స అందిస్తామని ఆస్పత్రి ఇన్‌చార్జి ఎస్ సింగ్ తెలిపినట్టు త్రివేది చెప్పాడు. సచిన్ టెండూల్కర్ చిన్ననాటి స్నేహితుడైన 52 ఏళ్ల కాంబ్లీ కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు.

సిరీస్‌పైనే గురి

జోష్‌లో హర్మన్ సేన

నేడు విండీస్‌తో రెండో వన్డే

మధ్యాహ్నం 1.30 నుంచి స్పోర్ట్స్18లో..



వడోదర: అన్ని విభాగాల్లో రాణిస్తోన్న భారత మహిళల క్రికెట్ జట్టు వరుసగా రెండో సిరీస్‌పై దృష్టి సారించింది. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా తొలి మ్యాచ్‌లో వెస్టిండీస్‌పై 211 పరుగుల భారీ తేడాతో నెగ్గిన హర్మన్‌ప్రీత్ బృందం రెట్టించిన ఉత్సాహంతో ఉంది. ఈ నేపథ్యంలో మంగళవారం ఇరుజట్ల మధ్య కీలక రెండో మ్యాచ్ జరుగనుంది. ఇందులో నెగ్గితే భారత్‌కు సిరీస్ దక్కుతుంది. ఇప్పటికే 3 టీ20ల సిరీస్‌ను భారత్ ఖాతాలో వేసుకున్న విషయం తెలిసిందే. వచ్చే ఏడాది స్వదేశంలోనే వరల్డ్‌కప్ ఉండడంతో ప్రతీ మ్యాచ్ భారత్‌కు సన్నాహకంగా మారనుంది. ఓపెనర్లు స్మృతి మంధాన, ప్రతీకతో పాటు బ్యాటింగ్ విభాగం సత్తా చాటుతోంది. ప్రత్యర్థి బ్యాటర్లను కుదురుకోనీయకుండా పేసర్ రేణుకా సింగ్‌తో కూడిన భారత బౌలింగ్ దళం చెలరేగుతోంది. ఇక ఆరంభ వన్డేలో చెత్త ఆటతీరుతో మూల్యం చెల్లించుకున్న విండీస్‌కు ఈ మ్యాచ్ గెలిస్తేనే సిరీస్‌పై ఆశలుంటాయి.

ఆఖరి వన్డేలోనూ పాక్‌దే గెలుపు

జొహాన్నెస్‌బర్గ్: దక్షిణాఫ్రికాతో మూడు వన్డేల సిరీస్‌ను పాకిస్థాన్ 3-0తో దక్కించుకుంది. దీంతో సఫారీ గడ్డపై ఆ జట్టును ఓ వన్డే సిరీస్‌లో అన్ని మ్యాచుల్లోనూ ఓడించిన తొలి జట్టుగా పాక్ నిలిచింది. ఆదివారం రాత్రి జరిగిన ఈ ఆఖరి వన్డేలో పాక్ డక్‌వర్త్ లూయిస్ పద్ధతిన 36 పరుగుల తేడాతో నెగ్గింది. వర్షం కారణంగా మ్యాచ్‌ను 47 ఓవర్లకు కుదించగా.. ముందుగా పాక్ 9 వికెట్లకు 308 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఓపెనర్ సయిామ్ అయూబ్ (101) తొలి శతకంతో పాటు కెప్టెన్ రిజ్వాన్ (53), బాబర్ (52) రాణించారు. రబాడకు మూడు.. ఫర్టూన్, జాన్సెన్‌లకు రెండేసి వికెట్లు లభించాయి. ఆ తర్వాత సౌతాఫ్రికా 42 ఓవర్లలో 271 రన్స్‌కు ఆలౌటైంది. క్లాసెన్ (81) ఆదుకునే ప్రయత్నం చేయగా, బోష్ (40), వాన్‌డర్ డుస్సెన్ (35) పర్వాలేదనిపించారు. ముఖీమ్‌కు నాలుగు.. నసీమ్, షహీన్ రెండేసి వికెట్లు తీశారు.

బాక్సింగ్ చాంపియన్ హుస్సామ్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): గాయంతో కొంతకాలంగా బాక్సింగ్‌కు దూరంగా ఉంటున్న హుస్సాముద్దీన్ తిరిగి రింగ్‌లో అడుగుపెట్టి సత్తా చాటాడు. సోమవారం హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల 55-60 కిలోల విభాగం ఫైనల్లో హుస్సామ్ (నిజామాబాద్) 5-0తో తరుణ్ (హైదరాబాద్)ను ఓడించి విజేతగా నిలిచాడు.

ఢిల్లీకి సెమీస్ బెర్త్

పుణె: ప్రొ కబడ్డీ లీగ్‌లో దబాంగ్ ఢిల్లీ జట్టు నేరుగా సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. సోమవారం జరిగిన తమ ఆఖరి లీగ్ మ్యాచ్‌లో ఢిల్లీ 45-31తో గుజరాత్ జెయింట్స్‌పై గెలిచింది. దీంతో మొత్తం 81 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచిన ఢిల్లీ సెమీస్ బెర్త్‌ను ఖరారు చేసుకొంది. స్టార్ రైడర్ అషు మాలిక్ 14 పాయింట్లతో అదరగొట్టాడు. మరో మ్యాచ్‌లో పుణెరి పల్టన్ 42-32తో తమిళ్ తలైవాస్‌పై గెలిచింది.

వాడేసిన పిచ్‌లా?



ప్రాక్టీస్ వికెట్లపై భారత్ అసంతృప్తి



రోహిత్

మెల్‌బోర్న్: నాలుగో టెస్ట్‌కు ముందు తమకు కల్పించిన ప్రాక్టీస్ పిచ్‌లపై భారత జట్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తంజేసింది. ఈ వికెట్‌పై అనూహ్య బౌన్స్ అయ్యిందని, అందువల్ల సాధన సందర్భంగా కెప్టెన్ రోహిత్‌కు మోకాలి గాయం అయిందని పేర్కొంది. కానీ మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్ (ఎంసీజీ) క్యూరేటర్ మ్యాట్ పేజ్ మాత్రం నిబంధనల మేరకే ప్రాక్టీస్ పిచ్‌లను ఏర్పాటు చేశామని సమర్థించుకున్నాడు. ఆదివారం సాధన సందర్భంగా త్రోడౌన్‌ను ఎదుర్కొనే క్రమంలో బంతి రోహిత్ ఎడమ మోకాలికి బలంగా తాకిన సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో భారత జట్టు సోమవారం ప్రాక్టీస్ చేయకూడదని నిర్ణయించుకుంది. నిబంధనలను అనుసరించి టెస్ట్ మ్యాచ్‌కు మూడు రోజుల ముందు మాత్రమే క్యూరేటర్ కొత్త ప్రాక్టీస్ పిచ్‌ను భారత్‌కు కేటాయించాల్సి ఉంది. భారత్-ఆస్ట్రేలియా మధ్య నాలుగో టెస్ట్ ఈనెల 26న ప్రారంభం కానున్న సంగతి తెలిసిందే. 'టెస్ట్ మూడు రోజుల్లోకి వచ్చేసింది. దాంతో కొత్త పిచ్‌లను రూపొందించా. మూడు రోజులకంటే ముందే జట్టు ప్రాక్టీస్‌కు వస్తే..ఉపయోగించిన పిచ్‌లనే కేటాయిస్తాం' అని పేజ్ వివరించాడు.

'ఎంసీజీ' పేసర్లకు అనుకూలం: పెర్త్, అడిలైడ్ వికెట్ల మాదిరి ఎంసీజీ పిచ్‌పై అంత బౌన్స్ ఉండదట. కానీ వికెట్‌పై ఆరు మి.మీ.మేర పచ్చిక ఉండడంతో పేసర్లకు అనుకూలించనుంది. స్పిన్నర్లకు సహకరించేలా పిచ్‌పై పగుళ్లు ఉండబోవని పేజ్ స్పష్టంజేశాడు. కొత్త బంతి మెరుపు తగ్గాక బ్యాటర్లకు సహకరిస్తుందని తెలిపాడు.

షమికి నిరాశ

భారత జట్టులో పునరాగమనం కోసం ఎదురుచూస్తున్న వెటరన్ పేసర్ షమికి మళ్లీ నిరాశే ఎదురైంది. అతడు పూర్తి ఫిట్‌నెస్ సాధించకపోవడంతో ఆస్ట్రేలియాతో చివరి రెండు టెస్ట్‌లకు అతడిని ఎంపిక చేయడంలేదని బీసీసీఐ సోమవారం ప్రకటించింది.

అశ్విన్ స్థానంలో తనుష్



ఎవరితను..?

అశ్విన్ స్థానంలో ముంబై ఆఫ్ స్పిన్నర్ తనుష్ కోటియన్ భారత జట్టులో చేరనున్నాడు. తనుష్ ప్రస్తుతం.. విజయ్ హజారే ట్రోఫీకోసం అహ్మదాబాద్‌లో ఉన్నాడు. మంగళవారం అతడు ముంబై నుంచి మెల్‌బోర్న్ బయల్దేరనున్నట్టు సమాచారం. వాస్తవంగా..కోటియన్‌కు బదులు లెఫ్టామ్ స్పిన్నర్ అక్షర్ పటేల్‌ను ఆస్ట్రేలియా పంపాలనుకున్నారు. అయితే హజారే టోర్నీ తొలి రెండు మ్యాచ్‌ల్లో ఆడించి అక్షర్‌ను ఆసీస్ పంపాలనుకున్నా.. కుటుంబ పనుల కారణంగా అతడు ఆ మ్యాచ్‌లకు దూరమయ్యాడు. దీంతో తనుష్‌కు చాన్స్ దక్కింది.

26 ఏళ్ల తనుష్ దేశవాళీ పోటీల్లో నికార్సయిన బౌలింగ్ ఆల్‌రౌండర్‌గా పేరు పొందాడు. 2023-24 రంజీ సీజన్‌లో 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ'గా నిలిచాడు. ముంబై జట్టు 42వ రంజీ ట్రోఫీ టైటిల్ గెలవడంలో కీలక భూమిక పోషించాడు. ఆ సీజన్‌లో 16.96 సగటుతో 29 వికెట్లు తీశాడు. 41.83 సగటుతో 502 పరుగులు చేశాడు. ఓవరాల్‌గా 33 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌ల్లో 101 వికెట్లు పడగొట్టాడు. రెండు శతకాలతో మొత్తం 1525 పరుగులు సాధించాడు. మెల్‌బోర్న్ గ్రౌండ్‌లో తనుష్‌కు మంచి రికార్డే ఉంది. ఇటీవలి పర్యటనలో భారత్ 'ఎ' తరఫున ఎనిమిదో నెంబర్‌లో బరిలోకి దిగి 44 పరుగులు చేశాడు.

భాకర్‌కు చోటు లేదా?

ఖేల్‌రత్న అవార్డు నామినేషన్లపై వివాదం



న్యూఢిల్లీ: దేశ క్రీడా రంగ ప్రతిష్ఠాత్మక అవార్డు ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న విజేతలను త్వరలో ప్రకటించనున్నారు. అయితే ఈ పురస్కారానికి సిఫారసు చేసిన జాబితాలో పారిస్ ఒలింపిక్స్‌లో రెండు పతకాలు సాధించిన స్టార్ షూటర్ మనూ భాకర్ పేరు లేకపోవడం సంచలనం రేపుతోంది. ఈసారి ఖేల్‌రత్న అవార్డుకు హాకీ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్, పారిస్ పారా ఒలింపిక్స్ హైజంప్‌లో స్వర్ణం నెగ్గిన ప్రవీణ్ కుమార్ తదితరుల పేర్లను సిఫారసు చేశారు. కానీ భాకర్ పేరు లేకపోవడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. అయితే మనూభాకర్ స్వంతంగాకానీ, భారత రైఫిల్ సంఘం (ఎన్ఆర్ఏఐ) కానీ ఈ పురస్కారానికి దరఖాస్తు చేయలేదని క్రీడాశాఖ స్పష్టంజేసింది. మరోవైపు ఖేల్‌రత్న అవార్డుకు దరఖాస్తు చేయాల్సిన బాధ్యత భాకర్‌దేనని ఎన్ఆర్ఏఐ చీఫ్ నారాయన్ సింగ్ దేవ్ తెలిపారు. ఆమె దరఖాస్తు చేయకపోవడంతో..భాకర్ పేరును జాబితాలో చేర్చాలని క్రీడాశాఖను కోరినట్టు కూడా దేవ్ చెప్పారు. మనూ భాకర్ తండ్రి రామ్‌కిషన్ భాకర్ మాత్రం తాము దరఖాస్తు చేశామని చెబుతుండడం గమనార్హం. కాగా..దేశ నాలుగో అత్యున్నత పౌర పురస్కారం పద్మశ్రీకి దరఖాస్తు చేయాలనుకుంటున్నందున, షూటర్ కుటుంబం ఖేల్‌రత్న దరఖాస్తును పట్టించుకోలేదనే వాదనా వినిపిస్తోంది. మరోవైపు, ఖేల్‌రత్న అవార్డీల పేర్లు ఖరారు కాలేదని, తన వద్దకు వచ్చిన జాబితాలో మనూభాకర్ పేరును మంత్రి మాండవీయ చేరుస్తారని క్రీడాశాఖ వర్గాలు వెల్లడించాయి. సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ రామసుబ్రమణియన్ నేతృత్వంలోని 12 మంది సభ్యుల కమిటీ క్రీడా అవార్డులకు అథ్లెట్లను ఎంపిక చేయనుంది.



రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో ఆదివారం రాత్రి జరిగిన వివాహ వేడుకలో వధూవరులు పీవీ సింధు, వెంకట దత్తసాయి

ధనుష్‌కు రజతం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): బధిర షూటర్ ధనుష్ శ్రీకాంత్ జాతీయ సీనియర్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో పతకం కొల్లగొట్టి సంచలనం సృష్టించాడు. బధిర పోటీల్లో కాకుండా ఓపెన్ పోటీల్లో అతడు పోటీ పడి పతకం సాధించడం విశేషం. సోమవారం భోపాల్‌లో జరిగిన 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఫైనల్లో హైదరాబాద్‌కు చెందిన ధనుష్ 252.1 పాయింట్లతో ద్వితీయ స్థానంలో నిలిచి రజతం దక్కించుకున్నాడు. 0.1 పాయింట్ తేడాతో ధనుష్ స్వర్ణం చేజార్చుకున్నాడు. షాహు తుషార్ మనే (రైల్వేస్- 252.2) పసిడి సాధించగా, యశవర్ధన్ (రాజస్థాన్) కాంస్యం గెలిచాడు.

హైదరాబాద్ ఓటమి

అహ్మదాబాద్: స్పిన్ ఉచ్చులో విలవిల్లాడిన హైదరాబాద్.. విజయ్ హజారే ట్రోఫీలో తొలి ఓటమిని చవిచూసింది. గ్రూప్-సిలో సోమవారం జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ 3 వికెట్లతో ముంబై చేతిలో ఓడింది. తొలుత హైదరాబాద్ 38.1 ఓవర్లలో 169 పరుగులకు కుప్పకూలింది. తన్మయ్ అగర్వాల్ (64), అవనీష్ (52) అర్ధ శతకాలు వృథా అయ్యాయి. అథర్వ 4, ఆయుష్ 3 వికెట్లు తీశారు. ఛేదనలో ముంబై 25.2 ఓవర్లలోనే 175/7 స్కోరు చేసి గెలిచింది. టాపార్డర్ విఫలమైనా కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ (44 నాటౌట్), తనుష్ కోటియన్ (39 నాటౌట్) దూకుడైన ఆటతో జట్టును గెలిపించారు. నిషాంత్ 3 వికెట్లు పడగొట్టాడు.

ఇందిరమ్మ రాజ్యంలో రైతన్నలకు ఉరికొయ్యలే

» సింగరేణి ప్రైవేటీకరణ యత్నాన్ని వ్యతిరేకిస్తాం: కేటీఆర్



హైదరాబాద్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): "అప్పుల తిప్పలుతో ఆరుగాలం శ్రమించి పంటలు పండిస్తే.. కొనుగోలు చేయాల్సిన ప్రభుత్వం అన్నదాతలను అరిగోస పెడుతోంది. కాంగ్రెస్ పాలనలో అన్నదాతల ఆక్రందనలు వారికి పట్టడంలేదు. ఇందిరమ్మ రాజ్యంలో రైతన్నకు ఉరికొయ్యలు, చెరసాలలే దిక్కయ్యాయి" అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. రుణమాఫీ కాదు.. రైతుభరోసా రాదని సోమవారం ఎక్స్ వేదికగా ఆయన విమర్శించారు. అధికారంకోసం అడ్డగోలు హామీలిచ్చి.. ఆ తర్వాత అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. క్వింటాలుకు రూ.500 బోనస్ దేవుడెరుగు.. మార్కెట్‌కు వచ్చిన ధాన్యాన్ని కొనే దిక్కులేకుండా పోయిందన్నారు. తెలంగాణలోని ఏరైతూ ధైర్యం కోల్పోవద్దని, కాంగ్రెస్ కుట్రలపై కలిసికట్టుగా ఉద్యమిద్దామని పిలుపునిచ్చారు. అదేవిధంగా వేలమంది కార్మికులకు ఉపాధి కల్పించడంతో పాటు దేశంలో విద్యుత్తు అవసరాలను తీర్చడంలో సింగరేణి సంస్థ మూల స్తంభంగా నిలిచిందన్నారు. ఆ సంస్థ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కార్మికులు, ఉద్యోగులకు ఎక్స్ వేదికగా కేటీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. కార్మికులపాలిట కల్పవల్లిగా ఉన్న సింగరేణి బొగ్గు గనులను ప్రైవేటీకరించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నిస్తే.. బీఆర్ఎస్ తరఫున వ్యతిరేకిస్తామని కేటీఆర్ పేర్కొన్నారు.

పీవీ తెలంగాణలో పుట్టడం గర్వకారణం

ఆర్థిక సంస్కరణలతో భారతదేశ ముఖచిత్రాన్ని మార్చిన మాజీ ప్రధాని పీవీ నరసింహారావు తెలంగాణలో పుట్టడం మనందరికి గర్వకారణమని కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో పీవీ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గడ్డుకాలంలోప్రధానిగా సేవలందించిన పీవీ.. ఆర్థిక సంక్షోభం నుంచి దేశాన్ని కాపాడి ఆధునిక భారతానికి బాటలు వేశారని కొనియాడారు.

ప్రజా సమస్యల కంటే అల్లు అర్జున్ విషయం ముఖ్యమా?:హరీశ్



మెదక్ అర్బన్/వరంగల్ మెడికల్/హనుమకొండ టౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజల సమస్యల కంటే అల్లు అర్జున్ విషయం ముఖ్యమా? అని సీఎం రేవంత్‌రెడ్డిని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు ప్రశ్నించారు. రాష్ట్రంలో ప్రశ్నించే వారిపై కేసులు పెట్టడమే పనిగా పెట్టుకున్నారని ఆరోపించారు. సోమవారం వరంగల్ సెంట్రల్ జైలు ప్రాంగణంలో 24 అంతస్థులతో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని, మెదక్ జిల్లా కేంద్రంలోని చర్చిని ఆయన సందర్శించారు. హనుమకొండలో, మెదక్ కలెక్టరేట్ వద్ద సమ్మె చేస్తున్న సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులతో మాట్లాడి.. వారి ఆందోళనకు మద్దతు పలికారు. ఆయా కార్యక్రమాల్లో పాల్గొన్న హరీశ్ రావు మాట్లాడుతూ.. సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులకు సీఎం రేవంత్ ఇచ్చిన హామీ ఏమైందని నిలదీశారు. వరంగల్‌లో నిర్మాణంలో ఉన్న మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిపై కాంగ్రెస్ ప్రభుత్వం వివక్ష చూపుతోందని ఆరోపించారు. సినీ హీరో అల్లు అర్జున్ గురించి అసెంబ్లీలో బాగా మాట్లాడిన సీఎం రేవంత్‌రెడ్డి.. స్వగ్రామంలోని తన తమ్ముడు తిరుపతిరెడ్డి వేధింపులు తాళలేక ఆత్మహత్య చేసుకున్న మాజీ సర్పంచ్ సాయిరెడ్డి గురించి ఎందుకు మాట్లాడడం లేదని నిలదీశారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయని ఆరోపించారు.

రేవంత్ పాలనలో కక్షలు తప్ప రక్షణ లేదు:కవిత

హైదరాబాద్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): "ప్రజాసమస్యలు పరిష్కరించడంపై ఏమాత్రం దృష్టిలేదు. ఎన్నికల హామీలు నెరవేర్చాలన్న ధ్యాసలేదు.. రేవంత్‌రెడ్డి పాలనలో కేవలం కక్షలు, వేధింపులు, కేసులు, అరెస్టులు తప్ప రక్షణ లేదు. ప్రజాప్రయోజన కార్యక్రమాలు అసలే లేవు" అని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. తెలంగాణ భవన్‌లో మీడియాతో ఆమె చిట్‌చాట్ నిర్వహించారు. కేసీఆర్, కేసీఆర్ కుటుంబం, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేయడమే పనిగా పెట్టుకున్నారని, దీంతో తమపార్టీ ప్రత్యేకంగా లీగల్‌సెల్ ఏర్పాటు చేసుకొని న్యాయపోరాటం సాగించాల్సి వస్తోందన్నారు. రాష్ట్రంలో కొనసాగుతున్నది కాంగ్రెస్ ప్రభుత్వమే అయినా.. దాన్ని నడుపుతున్నది బీజేపీ వాళ్లని ఆరోపించారు. ప్రతీకార పాలనకు తెరలేపిన సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ వెళ్లి బీజేపీ పెద్దలను కలిసిన తర్వాతనే కేటీఆర్‌పై కేసు నమోదుకు గవర్నర్ అనుమతి ఇచ్చారన్నారు. తదనంతరం ఏసీబీ కేసు నమోదు, మరుసటి రోజే ఈడీ కేసు నమోదు చేసిందని పేర్కొన్నారు. బీజేపీ, కాంగ్రెస్ కుట్రలతోనే కేటీఆర్‌పై కేసులు నమోదయ్యాయని ఆరోపించారు. కేసీఆర్ వంటి బలమైన నాయకులను దెబ్బకొట్టాలని ఆ రెండు పార్టీల ప్రయత్నం ఇక్కడ సాధ్యంకాదని చెప్పారు. సీఎం తెలంగాణను ప్రపంచ బ్యాంకుకు తాకట్టుపెడుతున్నారని, దీనిపై కమ్యూనిస్టులు ఎందుకు మౌనంగా ఉంటున్నారని ఆమె ప్రశ్నించారు.

10లోగా బీజేపీ మండల కమిటీలు

» పార్టీ నేతలకు రాష్ట్ర ఇన్‌చార్జి సునీల్ బన్సల్ పిలుపు

హైదరాబాద్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సంస్థాగత ఎన్నికల ప్రక్రియలో భాగంగా వచ్చే నెల 10లోగా మండల కమిటీల ఎన్నికలు పూర్తిచేయాలని బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జి సునీల్ బన్సల్ రాష్ట్ర పార్టీ నాయకులకు పిలుపునిచ్చారు. ఆ తర్వాత జిల్లా కమిటీల ఎన్నికలు కొనసాగించాలని అన్నారు. ఈ నెల 28లోగా క్రియాశీల సభ్యత్వం, పోలింగ్ బూత్ కమిటీల ఎన్నికలు నిర్వహించాలని సూచించారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో బన్సల్, పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి జిల్లాపార్టీ అధ్యక్షులు, రిటర్నింగ్ అధికారులు, జోనల్ పరిశీలకులు, జిల్లా సభ్యత్వ నమోదు ఇన్‌చార్జులతో సోమవారం సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బన్సల్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో 40 లక్షల సభ్యత్వం, 30 వేల క్రియాశీల సభ్యత్వం జరిగిందన్నారు. మండల, పోలింగ్ బూత్ కమిటీల ఏర్పాటుకు సంబంధించి పార్టీ నిబంధనావళి ప్రకారం పరిశీలకులు, రిటర్నింగ్ అధికారుల నియామకం కూడా పూర్తయ్యిందన్నారు. ఈ సందర్భంగా జిల్లా పార్టీ, రాష్ట్ర పార్టీలతో పాటు జాతీయ పార్టీకి ప్రత్యేకంగా అందిన నివేదికలను బన్సల్, కిషన్‌రెడ్డి సమీక్షించారు. .

నేడు కాంగ్రెస్ అంబేడ్కర్ సమ్మాన్ సప్తాహ్

» అమిత్‌షాను క్యాబినెట్ నుంచి తొలగించాలని కోరుతూ జిల్లా కలెక్టర్లకు వినతులు

» హైదరాబాద్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వనున్న భట్టి, మహేశ్ గౌడ్..

హైదరాబాద్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను కించపరిచేలా కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వ్యాఖ్యలకు నిరసనగా దేశవ్యాప్తంగా కాంగ్రెస్.. అంబేడ్కర్ సమ్మాన్ సప్తాహ్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీ వెల్లడించారు. మంగళవారం ప్రతి జిల్లా కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేసి.. ఆయా జిల్లాల కలెక్టర్లను కలవాలని, కేంద్ర మంత్రివర్గం నుంచి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలంటూ వినతిపత్రం ఇవ్వాలని పార్టీ నేతలు, కార్యకర్తలకు సూచించారు. సోమవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీడబ్ల్యూసీ సభ్యుడు కొప్పుల రాజు, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్‌లతో కలిసి ఆమె మాట్లాడారు. దేశ ప్రజలకు అమిత్‌షా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అవినీతి, ఇతర అంశాలపై బీజేపీని ప్రశ్నించినప్పుడల్లా దాన్ని పక్కదారి పట్టించడానికి బీజేపీ నేతలు ఇలాంటి విషయాలను తెరపైకి తీసుకువస్తారన్నారు. మహేశ్‌గౌడ్ మాట్లాడుతూ.. అమిత్‌షా వ్యాఖ్యలతో అంబేడ్కర్ పట్ల బీజేపీ వైఖరి మరోసారి బహిర్గతమైందని చెప్పారు. రాహుల్‌గాంధీ క్యారెక్టర్‌ను దెబ్బతీసేందుకే ఆయనపై హత్యాయత్నం కేసును నమోదు చేసిందని మండిపడ్డారు. కాగా, అంబేడ్కర్ సమ్మాన్ సప్తాహ్‌లో భాగంగా మంగళవారం హైదరాబాద్ కలెక్టర్‌కు డిప్యూటీ సీఎం భట్టి, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ వినతిపత్రం అందజేయనున్నారు. ముందుగా వారు ట్యాంక్‌బండ్ వద్దనున్న అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి.. లక్డీకాపూల్‌లోని హైదరాబాద్ కలెక్టరేట్ వరకు పాదయాత్ర నిర్వహించనున్నారు. అనంతరం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పిస్తారు. ఇందులో మంత్రులు, పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఏఐసీసీ నేతలు పాల్గొననున్నారు.

విచారణకు రండి

(మొదటిపేజీ తరువాయి)

పూచీకత్తుతో హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. అనంతరం.. ఈ దుర్ఘటనకు ప్రధాన కారణం అల్లు అర్జునేనని అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించడంతో.. అదే రోజు సాయంత్రం అల్లు అర్జున్ పత్రికా సమావేశం నిర్వహించి, తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని చెప్పిన విషయం విదితమే. అసలు రేవతి మరణం గురించి తనకు మర్నాటిదాకా తెలియదని.. ఆరోజు రాత్రి థియేటర్‌లో పోలీసులు తనవద్దకు రాలేదని బన్నీ చెప్పగా.. థియేటర్ నుంచి ఆరోజు రాత్రి ఆయన్ను తాము దగ్గరుండి బయటకు తీసుకువస్తున్న దృశ్యాలను పోలీసులు మీడియాకు విడుదల చేశారు. ఈ పరిణామాలన్నింటి నేపథ్యంలో.. అల్లు అర్జున్‌ను పోలీసులు విచారణకు పిలవడం గమనార్హం. జరిగిన దుర్ఘటన గురించి మర్నాడు ఉదయం వరకూ తనకు తెలియదని అల్లు అర్జున్ చెప్పిన నేపథ్యంలో.. ఆయన్ను ఎంతసేపు విచారిస్తారు? ఏయేప్రశ్నలు అడిగే అవకాశం ఉందనే అంశం ఆసక్తికరంగా మారింది. కాగా.. ఈ కేసు విషయమై పోలీసులు అల్లు అర్జున్‌ను మంగళవారం ఒక్కరోజే కాక.. రోజూ విచారణకు పిలిచే అవకాశం ఉందని విశ్వసనీయవర్గాల సమాచారం.

సినీ వర్గాల సమావేశం..

సంధ్య థియేటర్ దుర్ఘటన నేపథ్యంలో బెనిఫిట్ షోలకు, టికెట్ ధరల పెంపునకు అనుమతి ఇవ్వబోమని సీఎం రేవంత్, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రకటించిన నేపథ్యంలో దీనిపై ఫిలిం చాంబర్ సోమవారం కీలక సమావేశాన్ని నిర్వహించింది. ఈ సమావేశానికి నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లు హాజరై చర్చించారు. ఇకపై బెనిఫిట్ షోలకు అనుమతులు ఇవ్వబోమని.. టికెట్ రేట్లు పెంచబోమని అంటే ఎలా అని నిర్మాతలు ఆందోళన వ్యక్తం చేశారు. "సినిమాకు అనుకున్న బడ్జెట్‌కు మించి ఖర్చు అయినప్పుడు మాత్రమే టికెట్ రేట్లు పెంచాలని అడుగుతాం తప్ప.. ప్రతి సినిమాకూ అడగం" అని నిర్మాత నాగవంశీ అన్నారు. దీనిపై సీఎంను కలిసే ఆలోచన ఏమైనా ఉందా అని విలేకరులు ప్రశ్నించగా.. ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, ప్రముఖ నిర్మాత దిల్‌రాజు ప్రస్తుతం అమెరికాలో ఉన్నారని, ఆయన ఇక్కడికి వచ్చాక ముందు ఆయనతో సమావేశమై తదుపరి కార్యాచరణ నిర్ణయిస్తామని నాగవంశీ వెల్లడించారు. సినిమా ఇండస్ట్రీ ఆంధ్రప్రదేశ్‌కు తరలిపోదని ఆయన పేర్కొన్నారు. కాగా.. టికెట్ రేట్ల పెంపుపై ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ చైర్మన్ విజేందర్ రెడ్డి ప్రకటించారు. "సినిమా టికెట్ ధరలను పెంచడం వల్ల ప్రేక్షకులు కన్‌ఫ్యూజ్ అవుతున్నారు. పెరిగిన టికెట్ రేట్లతో మధ్య తరగతి ప్రేక్షకులు, విద్యార్థులు సినిమాలకు రాలేకపోతున్నారు. ఇది కలెక్షన్లపైనా ప్రభావం చూపుతోంది. టిక్కెట్ ధరలపై తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం" అని ఆయన చెప్పారు. "తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లే ఏపీ ప్రభుత్వమూ బెనిఫిట్ షోస్, టికెట్ ధరలు పెరగకుండా చర్యలు తీసుకుంటే బాగుంటుంది" అని ఆంధ్రప్రదేశ్ ఎగ్జిబిటర్స్ సెక్టార్ చైర్మన్ ఎస్.రామ్ ప్రసాద్ అన్నారు. "తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మంచి పరిణామం. సినిమాను ఎక్కువ థియేటర్స్‌లో విడుదల చేయడం ఎలా అనే దానిపై నిర్మాతలు దృష్టి పెట్టాలి" అని ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ సెక్రటరీ బాలగోవింద్ రాజ్ సూచించారు. టీఎఫ్‌పీసీ చైర్మన్ ప్రతాని రామకృష్ణ గౌడ్ కూడా.. టికెట్ ధరలపై తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు చెప్పారు. ఈ నిర్ణయం వల్ల చిన్న సినిమాలకు మంచి జరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. "పెద్ద సినిమాలకు టిక్కెట్ రేట్లు పెంచడం వల్ల చిన్న చిత్రాలపై భారం పడుతోంది. ఏడాదికి రిలీజయ్యే చిత్రాల్లో చిన్న చిత్రాలే 90 శాతం ఉన్నాయి. కేవలం 10 శాతం మాత్రమే పెద్ద చిత్రాలు ఉంటున్నాయి. చిన్న చిత్రాలకు డిజిటల్ రైట్స్ విషయంలో యూఎఫ్‌వో క్యూబ్ ధరలు అధికంగా ఉన్నాయి. మిగతా రాష్ట్రాల్లో రూ.1500 ఉంటే మన దగ్గర పది వేలు వారానికి వసూలు చేస్తున్నారు" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

నిర్మాతల సాయం..

సంధ్య థియేటర్ ఘటనలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీతేజ్‌ను 'పుష్ప-2' నిర్మాతలు నవీన్ యెర్నేని, రవిశంకర్.. తెలంగాణ సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో కలసి పరామర్శించారు. అతడి తండ్రికి రూ.50 లక్షల చెక్కు అందజేశారు. బాలుడికి అందిస్తున్న చికిత్స గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి.. "ఇక ఈ విషయాన్ని రాజకీయం చెయ్యొద్దు. సినీ హీరోల ఇళ్లపై దాడులు చెయ్యొద్దు. శ్రీతేజ్ త్వరగా కోలుకోవాలని దేవుడిని ప్రార్థిస్తున్నా" అన్నారు. సినీ పరిశ్రమ విషయంలో ప్రభుత్వం సానుకూల దృక్పథంతో ఉందని, పరిశ్రమ ఎక్కడికీ వెళ్లడం లేదని.. వదంతులను ఎవరూ నమ్మొద్దని ఆయన స్పష్టం చేశారు. అల్లు అర్జున్ ఇంటిపై ఓయూ జేఏసీ నేతల దాడిని ఆయన ఖండించారు. దాడులు చేస్తే చట్టం ఊరుకోదని మంత్రి హెచ్చరించారు. కాగా.. తొక్కిసలాటలో గాయపడ్డ శ్రీతేజ్ ఆరోగ్యం నిలకడగా ఉందని.. అతడు క్రమంగా కోలుకుంటున్నాడని, జ్వరం తగ్గుముఖం పడుతోందని కిమ్స్ ఆస్పత్రి వైద్యులు హెల్త్ బులెటిన్ ద్వారా తెలిపారు. కాగా.. జరిగిన ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్, మంత్రి కోమటి రెడ్డి స్పందించిన తీరు అభినందనీయమని తెలంగాణ రాష్ట్ర ఆర్య, వైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ అన్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీతేజ్‌ను పరామర్శించిన ఆయన.. రేవతి కుటుంబాన్ని, శ్రీతేజ్‌ను ఆదుకోవడానికి ఆర్య, వైశ్య మహాసభ ముందుంటుందని తెలిపారు. కాగా.. శ్రీతేజ్‌కు చికిత్స తామే చేయిస్తున్నామంటూ అల్లు అర్జున్ అబద్ధాలు మాట్లాడుతున్నారని, ఆ ఖర్చులన్నీ ప్రభుత్వమే భరిస్తోందని తెలంగాణ ఆర్య, వైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కల్వ సుజాత ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి రూ.25 లక్షలు ఇచ్చామని చెబుతున్న అల్లు అర్జున్ ఇప్పటికి ఇచ్చింది రూ.10 లక్షలేనన్నారు.



ఓయూ జేఏసీ నేతలకు బెయిల్

అల్లు అర్జున్ ఇంటి ఎదుట నిరసనకు దిగి, దాడికి పాల్పడిన ఆరుగురు ఓయూ జేఏసీ నేతలకు బెయిల్ మంజూరైంది. వారిని అరెస్టు చేసిన జూబ్లీహిల్స్ పోలీసులు.. వనస్థలిపురంలో ఉన్న న్యాయమూర్తి ఇంటికి తీసుకెళ్లి హాజరుపరచగా.. కేసు పూర్వాపరాలు విచారించిన న్యాయమూర్తి వారికి బెయిల్ మంజూరు చేశారు. ఒక్కొక్కరూ రూ.10 వేలు చొప్పున రెండు పూచీకత్తులు సమర్పించాలని ఆదేశించారు. అడ్డగూడూరుకు చెందిన బైరు నగేష్, దౌలతాబాద్‌కు చెందిన రెడ్డి శ్రీనివాస్, కొడంగల్‌కు చెందిన మోహన్, చౌటుప్పల్‌కు చెందిన బి.నాగరాజు, చర్లపల్లికి చెందిన ప్రేమ్‌కుమార్, షాద్‌నగర్‌కు చెందిన ప్రకాష్ జూబ్లీహిల్స్‌లోని అల్లు అర్జున్ ఇంటివద్ద ఆదివారం ఆందోళనకు దిగి పూలకుండీలు ధ్వంసం చేసిన సంగతి తెలిసిందే. సమాచారం అందుకున్న జూబ్లీహిల్స్ పోలీసులు అక్కడకు చేరుకొని ప్రతినిధులను అదుపులోకి తీసుకొని ఠాణాకు తరలించారు. అనంతరం న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు.

గాంధీభవన్‌కు అల్లు అర్జున్ మామ!

దీపాదాస్ మున్షీని కలిసిన కంచర్ల చంద్రశేఖర్‌రెడ్డి

హైదరాబాద్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): సినీ హీరో అల్లు అర్జున్ మామ.. కాంగ్రెస్ పార్టీ నేత కంచర్ల చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం గాంధీభవన్‌లో మెరిశారు. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీని కలిసి మాట్లాడారు. అల్లు అర్జున్ అరెస్టు వ్యవహారం.. అధికార, ప్రతిపక్షాల మధ్య వాద, ప్రతివాదాలకు దారి తీస్తున్న నేపథ్యంలో.. ఆయన పార్టీ కార్యాలయానికి వచ్చి మున్షీని కలవడం ఆసక్తికరంగా మారింది! అయితే.. దీపాదాస్ మున్షీకి ఆయన పరిచయం లేకపోవడంతో అతి కొద్ది నిమిషాలు మాత్రమే మాట్లాడి తిరిగి వెళ్లిపోయారు. తాను కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నానని, పార్టీ నేతలను కలిసేందుకు వచ్చానంటూ ఆయన మీడియా అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. చంద్రశేఖర్‌రెడ్డి దీపాదాస్ మున్షీని కలిసినప్పుడు టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పత్రికా సమావేశంలో ఉన్నారు. కంచర్ల చంద్రశేఖర్‌రెడ్డి వచ్చి వెళ్లి పోయారని తెలుసుకున్న ఆయన.. ఫోన్ చేసి మాట్లాడారు. అనంతరం మహేష్ కుమార్ గౌడ్ మీడియాతో మాట్లాడుతూ, కంచర్ల చంద్రశేఖర్‌రెడ్డి తనకు మంచి స్నేహితుడని, ఆయన వచ్చినప్పుడు మీడియా సమావేశంలో ఉన్నానని, దీంతో ఆయన దీపాదాస్ మున్షీని కలిశారని చెప్పారు. ఆమెతో చంద్రశేఖర్‌రెడ్డికి పరిచయం లేకపోవడంతో తొందరగా మాట్లాడి వెళ్లిపోయారని వెల్లడించారు. చంద్రశేఖర్‌కు తాను ఫోన్ చేశానని, ఒకటి, రెండు రోజుల్లో కూర్చుని మాట్లాడదామని చెప్పానని అన్నారు.



దీపాదాస్ మున్షీతో కంచర్ల చంద్రశేఖర్‌రెడ్డి

అల్లు అర్జున్‌పై కక్షసాధింపు: కిషన్ రెడ్డి

» తెలంగాణ సీఎం నిర్ణయాన్ని సమర్థిస్తున్నా: ఏపీ బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు

» బన్నీ ఇంటిపై దాడి ఘటనలో నలుగురు కొడంగల్‌వాసులు: డీకే అరుణ



హైదరాబాద్ సిటీ, విశాఖపట్నం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సంధ్య థియేటర్ ఘటనకు సంబంధించి అల్లు అర్జున్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కక్షసాధింపుచర్యలకు పాల్పడుతోందని కేంద్ర మంత్రి, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు కిషన్ రెడ్డి విమర్శించారు. ఈ ఘటనలో పోలీసుల వైఫల్యమే ఉందని ఆరోపించారు. కాగా.. బెనిఫిట్ షోలు, రేట్ల పెంపు విషయంలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయాన్ని తాను సమర్థిస్తున్నానని ఏపీ బీజేపీ ఎమ్మెల్యే (విశాఖ ఉత్తర) విష్ణుకుమార్ రాజు అన్నారు. గతంలో ప్రజలకు ఉపయోగపడే పనులకు అవసరమైన నిధుల సేకరణ కోసమే బెనిఫిట్ షోలకు అనుమతించేవారని, ఇప్పుడు నిర్మాతల లాభాల కోసం, రేట్లు పెంచి ఇస్తున్నారని.. అది తగదని ఆయన అభిప్రాయపడ్డారు. ఇక.. అల్లు అర్జున్ ఇంటిపై దాడిని బీజేపీ ఎంపీ డీకే అరుణ ఖండించారు. దాడికి పాల్పడినవారిలో నలుగురు కొడంగల్‌వాసులు ఉన్నారని.. వారిలో ఒకరు కాంగ్రెస్ జడ్పీటీసీగా పోటీ చేశారని తెలిపారు. ఆ పార్టీ నేతలే ఈ దాడి చేయించారనే అనుమానం కలుగుతోందని ఆమె ధ్వజమెత్తారు.

శ్రీ తేజ కళ్లు తెరుస్తున్నాడు..

మూస్తున్నాడు

కానీ నన్ను గుర్తుపట్టే స్థితిలో లేడు

» నా కూతురు అమ్మ ఎక్కడా అని అడిగితే... ఊరెళ్లిందని చెబుతున్నా

» సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి అండగా నిలిచారు

» అల్లు అర్జున్ టీం 10 లక్షలు చెల్లించింది

» నెల ముందు నుంచే సినిమా చూడాలని ప్లాన్

» అర్జున్‌పై కేసు వాపసు తీసుకునేందుకు సిద్ధం: శ్రీ తేజ తండ్రి భాస్కర్

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సంధ్యా థియేటర్ తొక్కిసలాటలో తీవ్రంగా గాయపడి కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తన కుమారుడు శ్రీ తేజ కళ్లు తెరుస్తున్నాడు.. మూస్తున్నాడు కానీ తనను గుర్తుపట్టే స్థితిలో లేడని తండ్రి భాస్కర్ తెలిపారు. ఆసుపత్రిలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, శ్రీ తేజ కోలుకునేందుకు మరో రెండు నెలల సమయం పట్టే అవకాశముందని వైద్యులు చెబుతున్నారని అన్నారు. తన కూతురు అమ్మ ఎక్కడా అని అడిగితే ఊరెళ్లిందని చెబుతున్నానని కన్నీరు పెట్టుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డితో పాటు తెలంగాణ ప్రభుత్వం అండగా నిలవడం తమకు మరింత ధైర్యాన్ని ఇచ్చిందని చెప్పారు. మంత్రి కోమటిరెడ్డి ఫౌండేషన్ ద్వారా రూ.25 లక్షల చెక్కు అందచేశారని తెలిపారు. అల్లు అర్జున్ టీం రూ.10 లక్షల డీడీ ఇచ్చిందని, మరో రూ.15 లక్షలు ఇస్తామని చెప్పిందని వెల్లడించారు. ఘటన జరిగిన రోజు నుంచి ఆ బృందం సభ్యులు వైద్యులతో ప్రతిరోజూ మాట్లాడున్నారని చెప్పారు. తాను మొదటి రోజు ఆసుపత్రిలో రూ. 50 వేలు చెల్లించానని, ఆ తర్వాత నుంచి అల్లు అర్జున్ బృందం సభ్యులే అన్నీ చూసుకుంటున్నారని తెలిపారు. శ్రీ తేజకు అల్లు అర్జున్ అంటే చాలా ఇష్టమని, నెలరోజుల ముందు నుంచే ప్రీమియర్ షో చూసేందుకు కుటుంబమంతా ప్లాన్ చేసుకున్నామని వెల్లడించారు. మూడు రోజుల ముందు స్నేహితుల సహకారంతో సినిమా టికెట్లు తీసుకొని సినిమా చూసేందుకు వెళ్లినట్లు తెలిపారు. అనుకోకుండా థియేటర్‌లో ఈ ఘటన జరగడంతో ఒక్కసారిగా తమ కుటుంబం చిన్నాభిన్నమైందని ఆవేదన వ్యక్తం చేశారు. అల్లు అర్జున్‌పై కేసు వాపసు తీసుకునేందుకు తాను సిద్ధంగా ఉన్నట్లు శ్రీతేజ తండ్రి భాస్కర్ తెలిపారు.

పోలీసు బట్టలూడదీసిన

స్మగ్లర్ సినిమాకు జాతీయ అవార్డా?

నేర ప్రవృత్తిని ప్రోత్సహించే చిత్రమిది.. జైభీమ్ చిత్రాన్ని ఎందుకు విస్మరించారు?

» 'పుష్ప'పై మంత్రి ధనసరి సీతక్క వ్యాఖ్యలు

» సినీ తారలది రాతి హృదయం

» కాంగ్రెస్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

హైదరాబాద్/పీర్జాదిగూడ/ములుగు కలెక్టరేట్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పోలీసు అధికారి బట్టలూడదీసిన సినిమాకు కేంద్ర ప్రభుత్వం జాతీయ అవార్డు ఇచ్చిందని, ఇది దేనికి సంకేతమని మంత్రి ధనసరి సీతక్క ప్రశ్నించారు. బాధ్యతాయుత స్థానంలో ఉండే పోలీసు అధికారి హేళన అయ్యాడని, స్మగ్లర్ హీరో అయ్యాడని వ్యాఖ్యానించారు. ములుగులో సోమవారం జరిగిన క్రిస్మస్ వేడుకల్లో మంత్రి సీతక్క పాల్గొన్నారు. రాజ్యాంగ స్ఫూర్తితో తాను ఈ స్థాయికి ఎదగగలిగానని ఆమె చెప్పారు. ఉద్యమం నుంచి న్యాయ శాస్త్రాన్ని చదవడంతోపాటు ఇప్పుడు రాష్ట్రమంత్రిగా నిలబడ్డానన్నారు. అలాంటి అంబేడ్కర్ స్ఫూర్తితో ఓ న్యాయవాది చంకలో బిడ్డ, కడుపులో మరో బిడ్డతో అన్యాయానికి గురైన మహిళ కోసం పోరాడిన కథతో వచ్చిన సందేశాత్మక చిత్రం జైభీమ్‌కు అవార్డులు రాలేదు కానీ, పోలీసు వ్యవస్థను, రాజ్యాంగాన్ని కించపరుస్తూ ఓ స్మగ్లర్ కథతో వచ్చిన పుష్ప సినిమాకు జాతీయ పురస్కారం వచ్చిందని అన్నారు. పుష్ప సినిమా నేర ప్రవృత్తిని ప్రోత్సహించేలా ఉందని విమర్శించారు. సినిమాలు సమాజాన్ని సన్మార్గంలో నడిపించేలా ఉండాలని, మంచి సందేశంతో సినిమాలు నిర్మించాలని ఆమె సూచించారు.



ములుగులో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

మీకంటే సోనూ సూద్, సమంత మంచు లక్ష్మి నయం: యెన్నం

అల్లు అర్జున్ వివాదం నేపథ్యంలో సినీ పరిశ్రమపై కాంగ్రెస్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.30 వేల జీతం సంపాదించే అభిమాని రూ.3 వేలతో టికెట్ కొని సినీతారల స్టార్‌డం కాపాడుతున్నారని.. సూపర్ స్టార్లుగా పేర్కొనే నటులు వందల కోట్లు సంపాదిస్తున్నా.. సేవా కార్యక్రమాలకు రూపాయి కూడా ఖర్చు చేయరని ఆరోపించారు. సోమవారం ఆయన గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడారు. మన సూపర్ స్టార్‌లు ఏ గ్రామాన్నైనా, ఏదైనా ఒక ప్రభుత్వ ఆస్పత్రినైనా దత్తత తీసుకున్నారా? మంచి కార్యక్రమం చేయమని ఏనాడైనా అభిమానులకు పిలుపునిచ్చారా? అని ప్రశ్నించారు. బ్లడ్ బ్యాంక్ పేరుతో చిరంజీవి ఎంతో మందికి సేవ చేస్తూ అభిమానులతోనూ చేయిస్తుండగా.. ఆయన వారసులుగా చెప్పుకొనే కొంతమంది ఏనాడైనా పైసా సహాయం చేశారా? అని నిలదీశారు. సీఎం మాట్లాడిన మాటలు అబద్ధాలని అల్లు అర్జున్ భావిస్తున్నారా? అసెంబ్లీని అగౌరవపరుస్తున్నారా? అని మండిపడ్డారు. చిత్ర పరిశ్రమ నాలుగు కుటుంబాల చేతిలో నలిగిపోతోందని, తెలంగాణ వాళ్ల విషయంలో సినిమా ఇండస్ట్రీ ఎలా వ్యవహరిస్తుందో అందరికీ తెలుసని అన్నారు. సామాజిక అంశాలపై స్పందించడానికి కూడా సినీ నటులు డబ్బులు వసూలు చేసిన సందర్భాలు ఉన్నాయన్నారు. సినీ తారలు సినిమాల్లోనే కాదు నిజ జీవితంలోనూ నటిస్తున్నారని, పిల్లలకు పుస్తకాలు ఇద్దామని అంటే తనకేం వస్తుందని ఒక నటుడు అన్నాడని చెప్పారు. సినీతారలు రాతి హృదయంతో ఉంటారన్నారు. ప్రజలకు కష్టాలు వస్తే రామ్ చరణ్, అల్లు అర్జున్ వస్తారన్న నమ్మకం లేదని.. వీరి కంటే సోనూ సూద్, సమంత, మంచు లక్ష్మి నయం అని వ్యాఖ్యానించారు. వందల కోట్ల పారితోషికం తీసుకుంటూ కృత్రిమ సమాజంలో బతుకుతున్నారని.. అర్ధరాత్రి పబ్బుల్లో, గోవాలో పార్టీల్లో నటులు ఉంటారని ఆరోపించారు. ప్రజలకు ఇబ్బందులు వస్తే ఒక్కరు కూడా స్పందించరన్నారు. తమిళ నటులకు ఉన్న సామాజిక స్పృహ తెలుగు నటులకు లేదన్నారు. సినీ నటులు ఏనాడైనా ఉద్యమంలో పాల్గొన్నారా? అని శ్రీనివాస్‌రెడ్డి ప్రశ్నించారు.

వివాదాన్ని కొనసాగించే ఆలోచన కాంగ్రెస్‌కు లేదు: చామల

అల్లు అర్జున్‌కు, ప్రభుత్వానికి మధ్య ఎలాంటి వైరం లేదని, ఈ వివాదాన్ని కొనసాగించే ఆలోచన కాంగ్రెస్‌కు లేదని ఆ పార్టీ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. అసెంబ్లీలో ప్రతిపక్షాలు అడిగిన ప్రశ్నకు సీఎం రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పారన్నారు. సినీ పరిశ్రమకు కాంగ్రెస్ వ్యతిరేకం కాదన్నారు. సినీ నిర్మాతలు నష్టపోవద్దని, పరిశ్రమ బాగుండాలనే దిల్ రాజుకు ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇచ్చామని చెప్పారు. హైదరాబాద్‌లో చిత్రపరిశ్రమ అభివృద్ధి జరిగిందీ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే అని తెలిపారు.

బెయిలుపై ఉన్న అల్లు అర్జున్ ప్రెస్‌మీట్ ఎలా పెట్టాడు?: వీహెచ్

ఆస్పత్రిలో ఉన్న శ్రీతేజ్ కోలుకోవాలని మృత్యుంజయ యాగం చేయాలంటూ అల్లు అర్జున్‌కు కాంగ్రెస్ నేత వీహెచ్ సూచించారు. పుష్ప2 సినిమాకు వచ్చిన డబ్బులను యాదగిరిగుట్ట దగ్గర ఉన్న వెంకటేశ్వర స్వామి హుండీలో వేయాలన్నారు. బెయిల్‌పై ఉన్న అల్లు అర్జున్ ప్రెస్‌మీట్ ఎలా పెట్టాడని ప్రశ్నించారు. ఈ అంశంలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు శవాలపై పేలాలు ఏరుకున్నట్లుగా వ్యవహరిస్తున్నాయని ఆయన దుయ్యబట్టారు.

అర్జున్ చెప్పినవన్నీ అబద్ధాలే: రోహిన్‌రెడ్డి

అల్లు అర్జున్ చెప్పినవన్నీ అబద్ధాలేనని హైదరాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ.. థియేటర్ నుంచి వెళ్లిపొమ్మని పోలీసులు చెప్పినా అల్లు అర్జున్ అక్కడ్నుంచి వెళ్లేందుకు ససేమిరా అన్నారని చెప్పారు.

300 కోట్లలో 3 కోట్లు ఇవ్వడానికి మనసు రావట్లేదా?: చనగాని

పుష్ప2 సినిమాకు రూ.300 కోట్లు తీసుకున్న అల్లు అర్జున్‌కు అందులో నుంచి బాధిత కుటుంబానికి రూ.3 కోట్లు ఇవ్వడానికి మనసు రావట్లేదా అని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్‌గౌడ్ ప్రశ్నించారు. ఆయన నిర్లక్ష్యం వల్ల ఒక కుటుంబం చల్లాచెదురైందన్నారు. బీజేపీ నేతలకు అల్లు అర్జున్‌పై ఉన్న ప్రేమ.. చనిపోయిన రేవతి కుటుంబంపై లేదని చెప్పారు.

పుష్ప2 సినిమాపై ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఫిర్యాదు

పుష్ప2 సినిమాపై ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. థియేటర్‌కు వెళ్లి సినిమా చూశానని.. కొన్ని సన్నివేశాలు దారుణంగా ఉన్నాయని మల్లన్న చెప్పారు. గంధపు చెక్కల స్మగ్లర్ పెద్ద హీరోలా వచ్చి పోలీస్ అధికారి కారును ఢీకొట్టడం తదితర సన్నివేశాలు పోలీసులను అవమానించేలా ఉన్నాయన్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరినట్లు తెలిపారు.

చిన్న తప్పు.. వెయ్యి కోట్ల నష్టం చేస్తుంది!

- ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో పొరపాట్లు జరగొద్దు
- దరఖాస్తుల పరిశీలన జాగ్రత్తగా చేయాలి
- జిల్లాల కలెక్టర్లు, జీహెచ్ఎంసీ కమిషనర్‌కు.. గృహనిర్మాణ శాఖ ఎండీ గౌతమ్ సర్క్యులర్

హైదరాబాద్, డిసెంబర్ 23 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత జాగ్రత్తగా వ్యవహరిస్తోంది. గతంలో ఇళ్ల పథకంలో జరిగిన అవకతవకలను పరిగణనలోకి తీసుకుని.. ఈసారి ఎలాంటి పొరపాట్లు జరగకుండా పటిష్ఠ చర్యలు తీసుకుంటోంది. ఈ మేరకు గృహనిర్మాణ సంస్థ ఎండీ గౌతమ్ అన్ని జిల్లాల కలెక్టర్లు, జీహెచ్ఎంసీ కమిషనర్‌కు ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల పరిశీలనపై కీలక సూచనలు చేస్తూ సోమవారం ఒక సర్క్యులర్ పంపారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం రాష్ట్రవ్యాప్తంగా 80.50 లక్షల దరఖాస్తులు వచ్చాయని, యాప్ ద్వారా వీటిని పరిశీలించే క్రమంలో అత్యంత జాగ్రత్త వహించాలని సూచించారు. గత ప్రభుత్వాల హయాంలో అమలు చేసిన ఇళ్ల పథకానికి సంబంధించి లబ్ధిదారుల ఎంపికలో పొరపాట్లు జరిగాయని గుర్తుచేశారు. అలాంటి తప్పులకు ఏమాత్రం అవకాశం ఇవ్వకూడదన్నారు. ప్రభుత్వం కోట్ల రూపాయల ఖర్చుతో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని, క్షేత్ర స్థాయిలో పరిశీలకులు చిన్న తప్పు చేసినా.. అది రూ.వెయ్యి కోట్ల నష్టాన్ని కలిగిస్తుందని పేర్కొన్నారు. ఈ దృష్ట్యా దరఖాస్తుదారుల్లో అర్హులను జాగ్రత్తగా ఎంపిక చేయాల్సి ఉందన్నారు. దరఖాస్తుదారులు పేర్కొన్న స్థలం సరైనదేనా, లేదా అనే విషయాన్ని పరిశీలకులే నిర్ధారించాలన్నారు. యాప్‌లో నమోదైన వివరాలపై 360 డిగ్రీల సాఫ్ట్‌వేర్‌తో మరోసారి ఉన్నతస్థాయిలో పరిశీలన జరుగుతుందని తెలిపారు. సొంత ఇంటిని నిర్మించుకోవాలనే ఆలోచనతో కొంత మంది స్థలం లేకపోయినా పక్క వారి భూమి లేదా ప్రభుత్వ భూమిని తమకు చెందినదిగా చూపించే అవకాశాలు లేకపోలేదని ఎండీ అన్నారు. ఈ నేపథ్యంలో పరిశీలకులు చాలా జాగ్రత్తగా ఆ స్థలాన్ని నిర్ధారించిన తరువాతే యాప్‌లో నమోదు చేయాలన్నారు. దరఖాస్తుదారు ఫొటో దిగిన సమయంలో ఆ స్థలం జియో ట్యాగింగ్ అవుతుందని పేర్కొన్నారు. ఇక స్థానిక ఎంపీడీవోలకు సూపర్ పవర్ చెకింగ్ అధికారాన్ని ఇస్తున్నట్లు తెలిపారు.

గృహజ్యోతికి రూ.172.58 కోట్లు

- డిసెంబరు నెలకు విడుదల చేసిన ప్రభుత్వం

హైదరాబాద్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 200 యూనిట్ల దాకా గృహ విద్యుత్తును వినియోగించే వారి కరెంట్ బిల్లుల కోసం ప్రభుత్వం రూ.172.58 కోట్లను విడుదల చేసింది. ఈ మేరకు ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలో దారిద్ర్య రేఖకు దిగువన ఉండి 200 యూనిట్ల దాకా కరెంట్ వాడే వారికి ఈ ఏడాది మార్చి 1 నుంచి గృహజ్యోతి పథకం కింద ప్రభుత్వం ఉచితంగా విద్యుత్తును అందిస్తున్న విషయం తెలిసిందే. అందులో భాగంగానే డిసెంబరు నెలకు గాను విద్యుత్ సంస్థలకు ఈ నిధులను విడుదల చేసింది.

మహిళా గ్రూపులతో 231 ఎకరాల్లో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయించండి: సీఎస్

హైదరాబాద్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని స్వయం సహాయక బృందాల(ఎస్‌హెచ్‌జీ) మహిళలతో దాదాపు 231 ఎకరాల్లో సోలార్ పవర్ ప్లాంట్లు ఏర్పాటు చేయించడానికి చర్యలు చేపట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న పలు పథకాలపై సోమవారం ఆమె సచివాలయంలో సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అయిదు జిల్లాల్లో తొలివిడతలో భాగంగా వచ్చే ఆరు నెలల కాలంలో 231 ఎకరాల్లో సోలార్ పవర్ ప్లాంట్‌లను ఏర్పాటు చేయాలన్నారు. ఖాళీగా ఉన్న దేవాదాయ భూములను లీజుకు తీసుకుని, వాటిలో ప్లాంట్లను ఏర్పాటు చేయాలని చెప్పారు. అలాగే మహిళా సంఘాల ద్వారా 150 ఎలక్ట్రిక్ బస్సులను సేకరించి, వాటి నిర్వహణ బాధ్యతలను ఆర్టీసీకి అప్పగించాలని ఆమె పేర్కొన్నారు.

జనవరి 31లోగా విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి: విద్యాశాఖ

హైదరాబాద్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సంబంధించిన వివరాలను వచ్చే జనవరి 31వ తేదీలోగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఇందుకు డీఈవోలు, ఎంఈవోలు, హెడ్‌మాస్టర్లను బాధ్యులుగా చేస్తూ తాజాగా విద్యాశాఖ డైరెక్టర్ ఉత్తర్వులిచ్చారు. విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు వీలుగా కొంతకాలంగా ప్రభుత్వం ప్రయత్నం చేస్తోంది. అయితే రాష్ట్రంలో ఇప్పటి వరకు కేవలం 3శాతమే ఇది పూర్తయింది. దీంతో ఈ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని ఉన్నతాధికారులు నిర్ణయించడంతో తాజా ఆదేశాలు జారీ అయ్యాయి.

డిగ్రీ కాలేజ్ టీచర్స్ అసోసియేషన్‌కు కొత్త కార్యవర్గం

తెలంగాణ డిగ్రీ కాలేజ్ టీచర్స్ అసోసియేషన్‌కు కొత్త కార్యవర్గం ఏర్పాటైంది. అధ్యక్షుడిగా శ్రీనివాస్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా సౌందర్య బ్రిసెఫ్, మహిళా కార్యదర్శిగా భవాని, ఆర్థిక కార్యదర్శిగా గంగాధర్ ఎన్నికయ్యారు.

మిషన్ భగీరథకు టోల్‌ఫ్రీ నంబర్

హైదరాబాద్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మిషన్ భగీరథ మంచినీటిపై నమ్మకాన్ని పెంచి.. వారు ఆ నీటిని వినియోగించేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. అందులో భాగంగానే.. మిషన్ భగీరథ నీటికి సంబంధించిన సమస్యలపై ప్రజల నుంచి ఫిర్యాదులను సేకరించి.. వాటిని తక్షణం పరిష్కరించేందుకు టోల్ ఫ్రీ నంబర్ 1800-599-4007ను ఏర్పాటు చేసింది. మంత్రి ధనసరి అనసూయసీతక్క ఆదేశం మేరకు ఎర్రమంజిల్‌లోని మిషన్ భగీరథ ఈఎన్‌సీ ప్రధాన కార్యాలయంలో సిద్ధం చేసిన కాల్ సెంటర్‌ను సోమవారం ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు. టోల్‌ఫ్రీ నంబర్ ద్వారా అందే ఫిర్యాదులను క్షేత్రస్థాయికి చేర్చి పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నారు.

'భూభారతి'తో భూ సమస్యలకు పరిష్కారం

- నల్లగొండ జిల్లా రైతులతో ముఖాముఖిలో చట్టం రూపకర్తలు సునీల్, లచ్చిరెడ్డి

చందంపేట, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): భూభారతి చట్టం- 2024తో రాష్ట్రంలో భూ సమస్యలు పరిష్కారమవుతాయని ఈ చట్టం రూపకర్తలు సునీల్, లచ్చిరెడ్డి తెలిపారు. రైతు దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం నల్లగొండ జిల్లా చందంపేట మండలం కంబాలపల్లి గ్రామంలో రైతుసేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'భూభారతి' చట్టంపై రైతులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న సునీల్ మాట్లాడుతూ 'ధరణి' వెబ్‌సైట్‌తో రాష్ట్రంలో 18 లక్షల ఎకరాల భూములకు సంబంధించిన రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని అన్నారు.ఈ సందర్భంగా కంబాలపల్లి, పొగిళ్ల పరిసర గ్రామాల రైతులు.. 50 సంవత్సరాలుగా భూములను సాగు చేసుకుంటున్నా అటవీ అధికారులు భూ హక్కులు కల్పించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వెలిబుచ్చారు. తాము సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు, పాస్ పుస్తకాలు ఇచ్చి తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. స్పందించిన దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్.. భూభారతి చట్టం ద్వారా దేవరకొండ నియోజకవర్గంలోని గిరిజన తండాలు, గ్రామాల్లో నెలకొన్న అటవీ, రెవెన్యూ భూసమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని తెలిపారు.

వీఆర్‌వో, వీఆర్‌ఏల నుంచి ఐచ్ఛికాలు కోరిన ప్రభుత్వం

హైదరాబాద్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గ్రామ రెవెన్యూ వ్యవస్థను పునరుద్ధరించాలని నిర్ణయించిన ప్రభుత్వం ఆమేరకు కార్యాచరణ ప్రారంభించింది. భూభారతి చట్టం-2024 చట్టసభల్లో ఆమోదం పొందిన తరుణంలో గ్రామస్థాయి సిబ్బంది నియామకంపై ప్రభుత్వం దృష్టి సారించింది. గతంలో పనిచేసిన వీఆర్‌వో, వీఆర్‌ఏల నుంచే గ్రామ రెవెన్యూ పాలకులను ఎంపిక చేయాలని నిర్ణయించింది. ప్రస్తుతం జిల్లాల్లో పనిచేస్తున్న వారి నుంచి గూగుల్ ఫాంలో అభిప్రాయాలు సేకరించి పంపాలని కలెక్టర్లకు భూ పరిపాలన ప్రధాన కమిషనర్ నవీన్ మిట్టల్ నుంచి సోమవారం సర్క్యులర్ వెళ్లింది. ఆసక్తి ఉన్న అభ్యర్థుల నుంచి డిసెంబరు 28 లోపల ప్రతిపాదనలు పంపాలని అందులో పేర్కొన్నారు.

సాగు, సంక్షేమ రంగాలకు త్వరలో భారీగా నిధుల విడుదల

- వ్యవసాయ రుణాల పంపిణీలో వేగం పెంచాలి
- ఏటా రూ.20 వేల కోట్ల వడ్డీలేని రుణాలిచ్చే లక్ష్యం
- కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే యోచన
- బ్యాంకర్ల భేటీలో డిప్యూటీ సీఎం భట్టి



హైదరాబాద్, డిసెంబరు23(ఆంధ్రజ్యోతి): వ్యవసాయం, సంక్షేమ రంగాలకు త్వరలో పెద్ద ఎత్తున నిధులను విడుదల చేయనున్నామని రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. విస్తృతమైన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో రాబోయే రోజుల్లో వైబ్రెంట్ తెలంగాణ్‌ను చూస్తారని సోమవారం ప్రజాభవన్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమావేశం(ఎస్‌ఎల్‌బీసీ)లో తెలిపారు. రైతులకు రైతు భరోసా ద్వారా, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు సంక్షేమ పథకాల రూపంలో ప్రభుత్వం రానున్న రోజుల్లో రూ.వేల కోట్లు విడుదల చేయనుందని తెలిపారు. ప్రభుత్వ సబ్సిడీ, మ్యాచింగ్ గ్రాంట్ పథకాలకు బ్యాంకర్లు పెద్ద మొత్తంలో రుణాలిచ్చేందుకు ఎతెలంగాణ రైజింగ్ కోణంలో ఆలోచించి ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలన్నారు. వ్యవసాయ రుణాల పంపిణీలో వేగం పెంచాలని, రైతులకు సకాలంలో రుణాలు ఇవ్వకపోతే ప్రయోజనం ఉండదన్నారు. ప్రభుత్వం రెండు నెలల వ్యవధిలోనే రూ.21 వేల కోట్ల రుణ మాఫీ నిధులను బ్యాంకులకు అందజేసిందని, ఈ దృష్ట్యా పంట రుణాలను కూడా లక్ష్యం మేర పూర్తి చేస్తే బాగుంటుందని అన్నారు. మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ప్రతి సంవత్సరం రూ.20 వేల కోట్ల వడ్డీలేని రుణాలివ్వాలన్నది ప్రభుత్వ లక్ష్యమని భట్టి తెలిపారు. ఐదేళ్లలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. స్వయం సహాయక సంఘాల(ఎస్‌హెచ్‌జీ) సభ్యుల ద్వారా 1000 మెగావాట్ల సోలార్ పవర్ ఉత్పత్తికి ప్రభుత్వం ఒప్పందం చేసుకుందని తెలిపారు. గ్రీన్ పవర్ ఉత్పత్తికి బ్యాంకర్లు పెట్టుబడులు సమకూర్చాలని అన్నారు.

రైతు ప్రయోజనాల కోసమే రుణ లక్ష్యాలుండాలి: తుమ్మల

రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని బ్యాంకర్లు రుణ లక్ష్యాలను నిర్దేశించుకోవాలని ఇదే సమావేశంలో ప్రసంగించిన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. వ్యవసాయ యాంత్రీకరణ ప్రదర్శన ప్రాజెక్టును బ్యాంకర్లు సొంతంగా నిర్వహించే ఏర్పాట్లు చేయాలన్నారు. వ్యవసాయ రంగంలో డ్రోన్‌లను వినియోగించే ప్రణాళికలను రూపొందించుకోవాలన్నారు. ప్రభుత్వపరంగా చేపట్టే అన్ని రకాల పథకాలు, కార్యక్రమాలకు బ్యాంకర్లు తోడ్పాటునందించాలన్నారు.

సంక్రాంతికి వస్తున్నాం!

(మొదటిపేజీ తరువాయి)



మాఫీ చేసింది. దీంతో పాటు ఏడాదిలో ఒక విడత రైతు బంధు నిధులు కూడా విడుదల చేసింది. కేసీఆర్ ప్రభుత్వం 2023-24 సంవత్సరంలో ఒక పంటకు రైతు బంధు ఇచ్చి, రెండో పంటకు ఎగ్గొట్టిందని, తాము తొలి ఏడాదిలో ఒక పంటకు పాతలెక్క ప్రకారం ఎకరానికి రూ.5 వేల చొప్పున రూ.7,500 కోట్లు రైతుబంధు ఇచ్చామని రేవంత్ సర్కారు వెల్లడించింది. ఇక రైతు భరోసా విధి విధానాలు ఖరారు చేసి రెండో పంటకు ఎకరానికి రూ.7,500 చొప్పున పంపిణీ చేస్తామని ప్రకటించింది.

ఉపసంఘం నివేదిక రాగానే రైతు భరోసా..

రైతు భరోసా పథకాన్ని సంక్రాంతికి అమలు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తాజాగా ప్రకటించిన విషయం విదితమే! శాసనసభ, శాసనమండలిలో ఇటీవల రైతు భరోసాపై చర్చ కూడా పెట్టారు. దీనిపై ప్రతిపక్ష పార్టీల నుంచి అభిప్రాయాలు సేకరించారు. ఇప్పటికే డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క నేతృత్వంలో ఏర్పాటుచేసిన మంత్రివర్గ ఉపసంఘం కొన్ని జిల్లాల్లో ప్రజాభిప్రాయ సేకరణ చేసింది. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకొని.. ఒకటి, రెండు సార్లు ఉపసంఘం భేటీ నిర్వహించి తుది నివేదిక ఇవ్వనుంది. అనంతరం దానిపై రాష్ట్ర మంత్రివర్గంలో చర్చించి ఆమోదించనున్నారు. మార్గదర్శకాలు ఖరారు చేసి... ఉత్తర్వులు జారీచేయనున్నారు. జనవరి 10 లోగా ఈ ప్రక్రియను పూర్తిచేయనున్నారు. అయితే యాసంగి సీజన్ ఇప్పుడిప్పుడే ప్రారంభమైంది. రైతులు వరి నార్లు పోశారు. అక్కడక్కడ నాట్లు వేస్తున్నారు. ఆరుతడి పంటలు సాగుచేసే రైతులు ఇప్పటికే విత్తనాలు వేశారు. ఈ నేపథ్యంలో విధివిధానాలు ఖరారుచేసి.. యాసంగి సాగు ఊపందుకోకముందే.. రైతుభరోసా డబ్బులు రైతుల ఖాతాల్లో వేయాలని ప్రభుత్వం భావిస్తోంది. గతంలో ఎకరానికి రూ. 5 వేలు చెల్లించగా... ఇప్పుడు 50 శాతం పెంచి, ఎకరానికి రూ. 7,500 చొప్పున పంపిణీ చేయనున్నారు. అంటే రెండు పంటలకు కలిపి ఏడాదికి ఎకరానికి రూ.15 వేలు రైతుభరోసా పథకంలో చెల్లిస్తారు. సంక్రాంతి నుంచి ఈ పథకం అమలులోకి వస్తుండటం గమనార్హం.

యాసంగి నుంచి వ్యవసాయ యాంత్రీకరణ

కేసీఆర్ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి రాగానే... వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని నిలిపివేసింది. 2018 నుంచి 2023 వరకు రైతులకు ఏ పనిముట్లు కూడా సబ్సిడీపై పంపిణీ చేయలేదు. విత్తన సబ్సిడీలను కూడా ఎత్తివేసింది. కేవలం రైతుబంధు, రైతుబీమా పథకాలకే పరిమితమైంది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ యాసంగి సీజన్ నుంచి వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని అమలుచేయాలని నిర్ణయించింది. కేంద్రప్రభుత్వ మద్దతుతో యాంత్రీకరణ పథకాన్ని అమలుచేయనుంది. రాష్ట్రీయ కృషి వికాస్ యోజన(ఆర్‌కేవీవై) పథకంలో కేంద్ర ప్రభుత్వం 60 శాతం ఆర్థిక సాయం చేస్తోంది. 40 శాతం రాష్ట్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంటు చెల్లిస్తే సరిపోతుంది. ఈమేరకు 2024-25 ఆర్థిక సంవత్సరానికి కేంద్రం రూ.26 కోట్లు కేటాయించింది. రాష్ట్ర ప్రభుత్వం రూ.20 కోట్లు తన వాటాగా జమ చేసింది. మొత్తం రూ. 46 కోట్లతో యాంత్రీకరణ పథకం యాసంగి నుంచి పట్టాలెక్కనుంది. వ్యవసాయ అనుబంధ కార్పొరేషన్ల ద్వారా కాకుండా.. నేరుగా వ్యవసాయశాఖ ద్వారా యాంత్రీకరణ పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రొటోవేటర్లు, పవర్ టిల్లర్లు, తైవాన్ స్ప్రేయర్లు, పసుపు ఉడకబెట్టే బాయిలర్లు, మొక్కజొన్నలు ఒలిచే మెషిన్లు, హార్వెస్టర్లు, పత్తి తీసే యంత్రాలు, గడ్డి కత్తిరించే యంత్రాలు, మామిడి కాయలు కోసే యంత్రాలు, గడ్డికట్టలు కట్టే బేలర్లు, ఎంబీ నాగళ్లు.. తదితర పనిముట్లను రైతులకు సబ్సిడీపై పంపిణీ చేయనున్నారు. వారం, పది రోజుల్లో మార్గదర్శకాలు రూపొందించి సంక్రాంతికి పథకాన్ని ప్రారంభించనున్నారు.

కొత్త రేషన్‌కార్డులూ సంక్రాంతికే...

కొత్త రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియను కూడా సంక్రాంతి నుంచే ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇటీవల ఉభయసభల్లో ప్రకటించారు. కొత్త రేషన్ కార్డులకు సుమారు 10 లక్షల దరఖాస్తులు రాగా, ఇప్పటికే ఉన్నకార్డు ల్లో అదనంగా సభ్యుల చేర్పులకు 26 లక్షల దరఖాస్తులు వచ్చాయి. వీటిపై కసరత్తు చేసి సంక్రాంతి నుంచి కొత్త కార్డులు పంపిణీ చేయనున్నారు. గతంలో ఉన్న మార్గదర్శకాల్లో మార్పులు, చేర్పులు చేసి, క్యాబినెట్‌లో నిర్ణయం తీసుకొని డిజిటల్ కార్డులను పంపిణీకి చర్యలు చేపట్టనున్నారు.

30న క్యాబినెట్ భేటీ

రాష్ట్ర మంత్రివర్గం ఈ నెల 30న సమావేశం కానుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో ఈ భేటీ నిర్వహించనున్నారు. ఇటీవల తన పుట్టినరోజున ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి యాదగిరిగుట్టకు వెళ్లి.. లక్ష్మీనరసింహస్వామిని దర్శనం చేసుకున్నారు. యాదగిరిగుట్టకు బోర్డును ఏర్పాటుచేస్తామని ప్రకటించారు. 20 మందితో బోర్డు ఏర్పాటుచేయాలని ఇప్పటికే ప్రాథమిక నిర్ణయం తీసుకోగా.. మంత్రివర్గ సమావేశంలో చర్చించి బోర్డు ఏర్పాటుకు ఆమోదముద్ర వేయనున్నారు. అదే క్రమంలో కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, వ్యవసాయ యాంత్రీకరణ.. తదితర సంక్షేమ పథకాలపై కేబినేట్ భేటీలో చర్చించనున్నారు.

రాజీవ్ స్వగృహ ఇళ్లు వేలం.!

గృహ నిర్మాణ శాఖకు అనుమతి

- రూ. 1,500 కోట్ల ఆదాయం అంచనా
- నేడు మంత్రి పొంగులేటి సమీక్ష

హైదరాబాద్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ పరిధిలోని ఇళ్లు, భూములను వేలం వేసేందుకు రంగం సిద్ధమైంది. వేలం వేసేందుకు గృహ నిర్మాణ సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతినిచ్చింది. వీటి వేలం ద్వారా రూ.1,500 కోట్లకు పైగా ఆదాయం వస్తుందని అంచనా వేస్తున్నారు. కొన్ని ఇళ్లు అసంపూర్తిగా వివిధ దశల్లో ఉన్నాయి. పలు జిల్లాల్లో భూములు కూడా ఉన్నాయి. వివిధ దశల్లో ఉన్న ఇళ్లను వేలం వేయాలంటే ఏ పద్ధతి అనుసరించాలి? ధర ఎంత నిర్ణయించాలి? అనే దానిపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. ప్లాట్లు, భూముల ధరలను నిర్ణయించేందుకు ఇప్పటికే కమిటీలు వేశారు. వాటి నుంచి నివేదికలు వస్తాయి. 2007లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ ఏర్పాటు చేశారు. ఇళ్ల నిర్మాణంతో పాటు, ప్లాట్ల విక్రయాలను చేపట్టాలని నిర్ణయించారు. హైదరాబాద్‌తో పాటు, జిల్లాల పరిధిల్లోనూ భూములను సేకరించి, కార్పొరేషన్‌కు బదలాయించారు. కొన్నిచోట్ల నిర్మాణాలు చేపట్టారు. కొన్నిచోట్ల భూములు అలాగే ఉండిపోయాయి. జీహెచ్ఎంసీ పరిధిలో పోచారం, గాజుల రామారం, జవహర్ నగర్‌లో 26 టవర్లు, ఖమ్మం నగరంలో 8 టవర్లు ఉన్నాయి. ఇక అసంపూర్తిగా ఉన్న ఇళ్లు, ఖాళీ ప్లాట్లు కలిపి 1,703, నల్గొండ, ఆసిఫాబాద్, వికారాబాద్‌తో పాటు పలు జిల్లాల్లో 1,300 ఉన్నట్టు తేలింది. 135-140 ఎకరాల భూమి కూడా ఉంది. హౌసింగ్ బోర్డు బకాయిలపైనా ప్రభుత్వం దృష్టి సారించింది. ఎట్టి పరిస్థితుల్లో వాటిని వసూలు చేయాలని నిర్ణయించారు. జాయింట్ వెంచర్ల కింద స్థలాలు తీసుకుని, ప్రభుత్వ వాటాను చెల్లించని పలు సంస్థలకు నోటీసులు ఇచ్చింది. ఆయా సంస్థలకు ఇచ్చిన భూముల్లో నిర్మాణాలు జరగకుండా ఖాళీగా ఉన్న వాటిని స్వాధీనం చేసుకుంది. మధుకాన్, ఇందూ ప్రాజెక్టు, యూనివర్సల్ సహా 8 ప్రాజెక్టులకు అధికారులు నోటీసులు ఇచ్చారు. కోట్ల రూపాయల బకాయిలు రావాల్సి ఉందని తేల్చారు. బకాయిల వసూలుకు తీవ్రంగా కృషి చేస్తున్నారు. గత ప్రభుత్వం అమలుచేసిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పథకం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకాలను మంత్రి పొంగులేటి. శ్రీనివాసరెడ్డి మంగళవారం సమీక్షించనున్నారు. రాజీవ్ స్వగృహ పరిధిలోని ఇళ్లు, భూములు వేలం, హౌసింగ్ బోర్డు బకాయిల వసూళ్లకు సంబంధించి అధికారులకు మంత్రి కీలక ఆదేశాలు ఇవ్వనున్నట్లు సమాచారం.

ఉపాధిని వాడుకుంటేనే ఆర్థిక భరోసా!

భూమిలేని పేదలకు ఇదే ప్రాతిపదిక

- 100 రోజులు పూర్తి చేస్తే తొలి ప్రాధాన్యం
- 28న ఖాతాల్లో డబ్బులు వేస్తామన్న సర్కారు
- ఒకట్రెండు కుంటల భూమి ఉంటే ఇవ్వరా?
- మార్గదర్శకాలు వెల్లడించకపోవడంపై ఆందోళన

హైదరాబాద్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): భూమి లేని వ్యవసాయ కూలీలకు ఏటా రూ.12 వేల చొప్పున ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పథకానికి లబ్ధిదారుల ఎంపికకు ఉపాధి హామీ జాబ్ కార్డునే ప్రాతిపదికగా తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలేవీ విడుదల కాకపోయినా క్షేత్ర స్థాయిలో ఇప్పటికే 'జాతీయ గ్రామీణ ఉపాధి హామీ' పథకాన్ని ఉపయోగించుకున్న భూమి లేని పేదల సమాచారాన్ని ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి సేకరిస్తున్నారు. కాంగ్రెస్ వ్యవస్థాపక దినమైన ఈ నెల 28 తేదీన లబ్ధిదారుల ఖాతాల్లో తొలి విడత ఆరు వేల రూపాయలు వేస్తామని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. తొలి విడతలో వంద రోజుల ఉపాధి హామీ పని పూర్తి చేసిన వారికి అవకాశం ఇస్తారని తెలుస్తోంది. మార్గదర్శకాలేవీ విడుదల చేయకుండానే కసరత్తు చేస్తుండటంతో వ్యవసాయ కూలీలు, రైతు సంఘాల్లో కాస్త ఆందోళన నెలకొంది.

మూడింటి వడపోత

రాష్ట్రంలో వ్యవసాయ భూమి ఉన్న రైతులకు ఏదో ఒక పథకం ప్రభుత్వం నుంచి అందుతోంది. భూమి లేని వ్యవసాయ కూలీలకు ఏ సాయమూ అందడం లేదు. కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఉపాధి హామీ పథకంతో రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కూలీలు లబ్ధి పొందుతున్నారు. ప్రత్యేకంగా వ్యవసాయ కూలీలకు సంక్షేమ పథకాన్ని ప్రవేశపెట్టాలని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిర్ణయించింది. ఏడాదికి రూ. 12 వేలు ఇస్తామని, అదీ రెండు విడతలుగా ఇస్తామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఇటీవలే ప్రకటించారు. రాష్ట్ర బడ్జెట్లో ఈ పథకానికి రూ.1,200 కోట్లు కేటాయించారు కూడా. లబ్ధిదారుల ఎంపికను గ్రామీణాభివృద్ధి శాఖ చేపడుతోంది. ఉపాధి హామీ పథకంలో ఉన్న జాబ్ కార్డులు, ఆధార్ కార్డులు, పట్టాదారు పాస్ పుస్తకాలు... మూడింటిని కలిపి వడపోసి లబ్ధిదారులను ఎంపిక చేస్తారు. ఉపాధి హామీ ఫీల్డు అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్ల ద్వారా వివరాలు సేకరిస్తున్నారు. మండల కంప్యూటర్ సెంటర్‌లో డేటా ఎంట్రీ ఆపరేటర్లు సమాచారాన్ని క్రోడీకరిస్తున్నారు. జాబ్ కార్డు నెంబర్ల వారీగా ఈ ఏడాది 100 రోజుల పని దినాలు పూర్తి చేసుకున్న వారి వివరాలు తీస్తున్నారు. వారిలో భూమి ఉన్నవాళ్లు ఎవరైనా ఉన్నారా? పరిశీలించి ఏరేస్తారు. గడిచిన ఆర్థిక సంవత్సరాల్లో కూడా 100 రోజులు పూర్తి చేశారా? లేదా? అనేది చూస్తారు. తొలి విడత బ్యాంకు ఖాతాల్లో డబ్బులు వేయడానికి ఈ విధంగా వడపోత నిర్వహిస్తారు. ఇదే పద్ధతిలో 90 రోజులు, 80 రోజులు, 70 రోజులు... ఇలా అవరోహణ క్రమంలో ఎక్కువ పని దినాలు పూర్తి చేసిన వారి జాబితాలు విడివిడిగా రూపొందిస్తారు. విడతల వారీగా చెల్లింపులు చేస్తారు. 15 లక్షల మంది వ్యవసాయ కూలీలకు ఆర్థిక భరోసా కల్పిస్తామని ఇటీవల రెవెన్యూ మంత్రి పొంగులేటి ప్రకటించారు. రూ.900 కోట్లు తొలి విడతలో విడుదల చేయనున్నారు. వారం రోజుల్లో అమలు చేయబోయే పథకానికి విధివిధానాలు ప్రకటించక పోవటంపై రైతు సంఘాల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. రకరకాల కారణాలతో 100 రోజుల పని దినాలు పూర్తి చేయని వారు ఉంటారని, వారిని ఎందుకు పరిగణనలోకి తీసుకోరనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఏ పథకానికీ నోచుకోని ఒంటరి మహిళలకు ఇందులో అవకాశం కల్పించాలని విజ్ఞప్తులు వస్తున్నాయి. గుంట, రెండు గుంటల భూమి ఉన్న చిన్న రైతులకు రైతు భరోసాలో ఏమీ రాదని, అలాంటి వారిని కూడా వ్యవసాయ కూలీలుగా పరిగణించి ఆర్థిక భరోసా ఇవ్వాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

సర్కారీ ఆసుపత్రుల్లో మరమ్మతులపై దృష్టి

- నిధుల కేటాయింపుపై కసరత్తు
- నివేదికివ్వాలన్న మంత్రి దామోదర



హైదరాబాద్, డిసెంబరు23(ఆంధ్రజ్యోతి): సర్కారీ ఆసుపత్రుల్లో మరమ్మతులపై వైద్యఆరోగ్యశాఖ ప్రత్యేక దృష్టి సారించింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి ప్రాంతీయ ఆస్పత్రి వరకు, జిల్లా ఆస్పత్రి నుంచి బోధనాస్పత్రి వరకు రిపేర్లకు అయ్యే ఖర్చుల లెక్కలు తీయాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. సోమవారం రాజీవ్ ఆరోగ్యశ్రీ కార్యాలయంలో ఆ శాఖ ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ప్రతీ ఆస్పత్రికి ఏడాదికి ఎంత ఖర్చు అవుతుందో అంచనా వేయాలని, అందుకు వైద్యవిద్య సంచాలకులు, తెలంగాణ వైద్యవిధాన పరిషత్ కమిషనర్, ప్రజారోగ్య సంచాలకులతో ఒక కమిటీ వేయాలని మంత్రి ఆదేశించారు. కమిటీ క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి తమకు ఒక నివేదికివ్వాలని మంత్రి కోరారు. వారిచ్చే నివేదిక ఆధారంగా ప్రతీ ఆస్పత్రికి నిర్వహణ వ్యయం కింద ఏడాదికి కొంత మొత్తాన్ని కేటాయించేందుకు వీలు కలుగుతుందని మంత్రి అధికారులకు సూచించారు. మరికొద్ది రోజుల్లో సాధారణ బడ్జెట్ ప్రతిపాదనలు పంపాల్సిన నేపథ్యంలో విభాగాధిపతుల వారీగా అంచనాలను ఇవ్వాలని మంత్రి కోరారు. అలాగే ఇండియన్ పబ్లిక్ హెల్త్ స్టాండర్డ్స్ మార్గదర్శకాల మేరకు ప్రతి ఆస్పత్రిలో ఎంతమంది డాక్టర్లు, నర్సులు, ఇతర పారామెడికల్ సిబ్బంది ఉండాలో కూడా వివరాలను ఇవ్వాలని మంత్రి ఆదేశించారు. ఐపీహెచ్ఎస్ గైడ్‌లైన్స్ ప్రకారం ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు ఎక్విప్‌మెంట్, సిబ్బంది కొరత అలాగే, వైద్యుల కొరత రాకుండా ఉండేందుకు అవసరమయ్యే వివరాలను అందిస్తే మెడికల్ బోర్డు ద్వారా నియామకాలను చేపడతామని సూచించారు.

మలేషియా పెట్టుబడులకు ప్రోత్సాహం

మహిళా సంఘాల ఉత్పత్తుల ఎగుమతులపై దృష్టి .. మలేషియా వాణిజ్య ప్రతినిధులతో మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రిక్ వాహనాల తయారీ, పారిశ్రామిక, వాణిజ్య రంగాల్లో పెట్టుబడులకు తెలంగాణాలో అత్యంత అనుకూలమైన వాతావరణం నెలకొల్పామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. సోమవారం ఆయన సచివాలయంలో జరిగిన మలేషియా వాణిజ్య ప్రతినిధుల సమావేశంలో మంత్రులు తుమ్మల నాగేశ్వర్ రావు, జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్సీ, పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్‌తో కలిసి పాల్గొన్నారు. రాష్ట్రంలో సౌర విద్యుత్తు రంగం, డ్రైపోర్టుల నిర్మాణం, మురుగు నీటి శుద్ధి ప్లాంట్ల ఏర్పాటు, మహిళా పారిశ్రామికవేత్తలు, అంకుర సంస్థలకు విదేశాల్లో మార్కెటింగ్ సౌకర్యం కల్పించే విషయాలను మంత్రి వారితో చర్చించారు. పామాయిల్ సేద్యంలో సహకరించడం, పర్యాటక రంగంలో పెట్టుబడులు, సహకారం లాంటి అంశాలను మంత్రులు ప్రతినిధి బృందానికి వివరించారు. వివిధ రంగాలకు చెందిన దాదాపు 20 మంది మలేషియా ప్రతినిధులు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో తెలంగాణలో అవకాశాలు సమృద్ధిగా ఉన్నాయన్నారు. హుస్సేన్‌సాగర్ జలాశయంలో పూడికతీత, అందులోకి చేరుతున్న మురుగు నీటిని శుద్ధి చేయడంలో అత్యాధునిక సీవరేజ్ ప్లాంట్ల ఏర్పాటులో ప్రతినిధులు పాలు పంచుకోవాలని కోరారు. రాష్ట్రంలో ఇప్పటికే ఒక డ్రై పోర్టు పనులు జరుగుతుండగా మరో రెండు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సంకల్పించిందని, వాటి నిర్మాణంలో భాగస్వాములు కావాలన్నారు. కిన్నెరసాని, శ్రీశైలం బ్యాక్ వాటర్స్‌ను పర్యాటక ఆకర్షణీయ కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు రిసార్టులు నిర్మించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో 64 లక్షల మంది మహిళలు స్వయం సహాయక బృందాల సభ్యులుగా ఉన్నారని, వారు



మలేషియాతో ఒప్పంద కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు

తయారు చేసే ఉత్పత్తులు మలేషియాకు ఎగుమతులు చేయాలని, అక్కడ మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటు, ఇక్కడి ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పించేందుకు మలేషియా ప్రభుత్వంతో వి-హబ్ ఒప్పందం కుదుర్చుకుంది.

పామాయిల్ విత్తనాలు అందించాలి: మంత్రి తుమ్మల

ప్రస్తుతం మలేషియా నుంచి పామాయిల్ మొలకలు దిగుమతి చేసుకుంటున్నామని, అలా కాకుండా విత్తనాలు సరఫరా చేయాలని, లేదా ఇక్కడే నర్సరీ ఏర్పాటు చేయడానికి ముందుకొస్తే సహకరిస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు తెలిపారు. ఎక్కువ ఎత్తు పెరగని, తక్కువ పొడవున్న ఆకులు ఉండే రకాలను అభివృద్ధి చేయాలని కోరారు. పామాయిల్ నుంచి ఉప ఉత్పత్తులను తయారు చేయడంలో సహకరించాలని ఆయన విన్నవించారు.

28న చర్లపల్లి రైల్వే స్టేషన్ ప్రారంభం

ఈనెల 28న చర్లపల్లి రైల్వేస్టేషన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో ఐటీ, పరిశ్రమల మంత్రి శ్రీధర్ బాబు సోమవారం తన నివాసంలో సమీక్షించారు. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, మాజీ ఎమ్మెల్యేలు బేతి సుభాష్ రెడ్డి, ప్రభాకర్, తాడూరి శ్రీనివాస్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. స్టేషన్ విస్తరణకు అవసరమైన టీజీఐఐసీ, రెవెన్యూ, అటవీ భూములను కేటాయిస్తామని శ్రీధర్ బాబు వెల్లడించారు. రాంపల్లి వైపు రోడ్డు నిర్మాణం, లైట్ల ఏర్పాటును త్వరితగతిన పూర్తి చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబరిదిని మంత్రి ఆదేశించారు. మరో కార్యక్రమంలో అమీర్‌పేటలోని ఎంపీఎం గ్రాండ్ కాంప్లెక్స్‌లో వెల్ వర్క్ సంస్థ ఏర్పాటుచేసిన 400 సీట్ల కోవర్కింగ్ స్పేస్ కేంద్రాన్ని మంత్రి శ్రీధర్ బాబు ప్రారంభించారు.



ఇంటెలిజెన్స్ డీజీ కుమారుడి వివాహానికి సీఎం దంపతులు..

ఇంటెలిజెన్స్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి.శివధర్ రెడ్డి కుమారుడు కార్తీక్ వివాహం అర్పితో సోమవారం రాత్రి ఘనంగా జరిగింది. హైదరాబాద్ గండిపేటలోని గోల్కొండ రిసార్ట్స్‌లో జరిగిన ఈ వేడుకకు సీఎం రేవంత్ రెడ్డి దంపతులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. పలువురు మంత్రులు, రాజకీయ నాయకులు, పోలీసు శాఖతో పాటు ఇతర శాఖలకు చెందిన అధికారులు హాజరై వధూవరులను దీవించారు.

-ఆంధ్రజ్యోతి, హైదరాబాద్

చాక్లెట్ చదరంగం



ఒక గది విస్తీర్ణమంత చెస్ బోర్డు.. దానిపై మోహరించిన పావులు! ఇక ఎత్తుకు పై ఎత్తు వేయడమే తరువాయి అనుకుంటే పొరపాటే! ఎందుకంటే ఇది చదరంగం బోర్డులా కనిపించే భారీ చాక్లెట్! క్రిస్మస్ సందర్భంగా బేగంపేట లోని కలనరీ అకాడమీ.. ప్రపంచంలోనే అతిపెద్ద చెస్‌బోర్డును చాక్లెట్‌తో తయారు చేసింది. 16 అడుగుల వెడల్పు.. 16 అడుగుల పొడవు, 256 చదరపు అడుగుల విస్తీర్ణంలో దీన్ని తయారు చేశారు. ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్ పోటీల్లో గుకేశ్ సాధించిన విజయాన్ని స్ఫూర్తిగా తీసుకొని దీనిని తయారు చేసినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు.

-ఆంధ్రజ్యోతి, బేగంపేట

ఆ చెరువులపై నివేదిక ఇవ్వండి!

- కాలువల వెంట ఉన్న ఆక్రమణలు తొలగించాలని ఏవీ రంగనాథ్ ఆదేశం

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలోని పలు చెరువుల ఆక్రమణలు, వరద నీటి కాలువల మళ్లింపుపై రెవెన్యూ, నీటిపారుదల శాఖ, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏలతో కలిసి క్షేత్రస్థాయిలో సర్వే చేయాలని అధికారులను ఏవీ రంగనాథ్ ఆదేశించారు. నేషనల్ రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీ, సర్వే ఆఫ్ ఇండియా, తెలంగాణ విభాగాలకు చెందిన మ్యాపులను పూర్తిస్థాయిలో పరిశీలించి వారం రోజుల్లోపు సమగ్ర నివేదిక ఇవ్వాలని సూచించారు. సోమవారం నానక్‌రాంగూడలోని తౌతోని కుంట, భగీరథమ్మ, నార్సింగ్ నెక్నాంపూర్ చెరువులు, మూసీ నదిని రంగనాథ్ పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులు, ప్రజాప్రతినిధుల నుంచి వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో ఆయా చెరువుల ఆక్రమణ ఇంకా కొనసాగుతుండడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. నానక్‌రాంగూడలో వరద నీటి కాలువలపై ఉన్న అక్రమ నిర్మాణాలు, దుకాణాలు తొలగించాలని సూచించారు. నదిలో కొన్ని నిర్మాణ సంస్థలు మట్టి పోసినట్టు గుర్తించిన రంగనాథ్.. దానిని తొలగించాలని, బఫర్ జోన్‌లో మట్టి పోస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాగా, మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ వర్సిటీ ఖాళీ స్థలంలో వర్షపు నీరు వెళ్లే ప్రవాహ వ్యవస్థ మూసుకుపోవడంతో అపార్ట్‌మెంట్‌లోకి వరద నీరు చేరుతోందంటూ వచ్చిన ఫిర్యాదును పరిష్కరిస్తామని తెలిపారు.



రైల్వేమంత్రి చేతుల మీదుగా అవార్డును అందుకుంటున్న జీఎం అరుణ్‌కుమార్, ఇతర ఉన్నతాధికారులు

దక్షిణ మధ్య రైల్వేకు ఆలిండియా పెర్ఫార్మెన్స్ ఎఫిషియెన్సీ అవార్డు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే సివిల్ ఇంజనీరింగ్ విభాగానికి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. ఈ విభాగం ప్రదర్శించిన అత్యుత్తమ పనితీరుకు గుర్తింపుగా ఆల్ ఇండియా పెర్ఫార్మెన్స్ ఎఫిషియెన్సీ అవార్డు వరించింది. రైల్వే వారోత్సవాల సందర్భంగా రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఈ అవార్డు షీల్డ్‌ను దక్షిణమధ్యరైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్‌కు అందజేశారు. అలాగే జోన్ పరిధిలోని వివిధ డివిజన్లలో అత్యుత్తమ సేవలందించిన అధికారులు జవ్వాది వెంకట అనూష, వావిలపల్లి రాంబాబు, సుమిత్ శర్మ, ఆంథోనీ దొరైరాజ్, ఆదినారాయణ, కామారపు వినోద్‌లకు అతివిశిష్ట సేవా పురస్కారాలను అందజేశారు.

ఎల్ఈడీ బల్బులతో.. 'నైరోబీ ఫ్లై' కీటకాలకు చెక్

- హెచ్‌సీయూ హాస్టళ్లలో.. ఫిజిక్స్ విద్యార్థి పరిశోధన
- విద్యార్థిని అభినందించిన వర్సిటీ వీసీ బీజేరావు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మీ ఇంట్లో నైరోబీ(యాసిడ్) ఫ్లై కీటకాల బెడద ఉందా? ఆ కీటకాలు ఒంటిపై పాకితే విడుదలయ్యే హేమోలింఫ్‌తో చర్మంపై పొక్కులు, దద్దుర్లు వస్తున్నాయా? ఇంట్లో ఎల్ఈడీ బల్బులను వాడితే నైరోబీ ఫ్లై కీటకాల బెడదే ఉండదట.! హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం(హెచ్‌సీయూ) భౌతిక శాస్త్ర విద్యార్థి తేజస్ ఆంటో కనంపుళ జరిపిన పరిశోధనలో ఈ విషయం వెల్లడైంది. హెచ్‌సీయూలోని హాస్టళ్లలో నైరోబీ ఫ్లై బెడద ఎక్కువే. ఈ సమస్యను గుర్తించిన తేజస్.. వర్సిటీలోని స్కూల్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ బీఆర్ శ్యామన్నను సంప్రదించారు. హాస్టళ్లలోని సీఎఫ్ఎల్ బల్బులు, ట్యూబ్‌లైట్ల స్థానంలో ఎల్ఈడీ బల్బులను ఉపయోగించడం వల్ల సమస్యకు పరిష్కారం లభించవచ్చనే అంశంపై వీరిద్దరూ పరిశోధన ప్రారంభించారు. వర్సిటీ హాస్టళ్లలో 2,090 మంది విద్యార్థులుండగా.. వారిలో 209(10%) మందిపై తేజస్ తన పరిశోధన జరిపారు. వీరు ఉంటున్న హాస్టళ్లలో సగం గదుల్లో ఎల్ఈడీ బల్బులను అమర్చారు. రెండున్నర నెలల పాటు అధ్యయనాన్ని కొనసాగించారు. ఈ రెండున్నర నెలల్లో.. సీఎఫ్ఎల్, ట్యూబ్‌లైట్‌లు ఉన్న హాస్టల్ గదుల్లో ఉండే విద్యార్థుల్లో 39% మంది నైరోబీ ఫ్లై బారిన పడగా.. ఎల్ఈడీ బల్బులున్న గదుల్లోని విద్యార్థుల్లో బాధితులు 9శాతంగా ఉన్నారు. ఎల్ఈడీ బల్బుల ద్వారా 'అతినీల లోహిత కిరణాలు-ఏ' రేడియేషన్‌ను తగ్గించవచ్చని, దీని వల్ల నైరోబీ ఫ్లై దాడులకు చెక్‌పడుతుందని తేజస్ వివరించారు. ఎన్నో ఏళ్లుగా వర్సిటీలో హాస్టల్ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యకు పరిష్కారాన్ని కనుగొన్న తేజస్‌ను, అతనికి సహకరించిన ప్రొఫెసర్ శ్యామన్నను హెచ్‌సీయూ వీసీ బీజే రావు అభినందించారు.

తాండూరులో ఏసీబీ దాడులు

- రూ.5 లక్షలతో పట్టుబడ్డ సబ్‌కలెక్టర్ కార్యాలయ సిబ్బంది

తాండూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : వికారాబాద్ జిల్లా తాండూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) దాడులు కలకలం సృష్టించాయి. సోమవారం రాత్రి సబ్‌కలెక్టర్ కార్యాలయంలో దాడులు నిర్వహించి రూ. 5 లక్షల లంచం తీసుకుంటున్న అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్(ఏవో) దానయ్య, సీనియర్ అసిస్టెంట్ మాణిక్‌రావులను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కొడంగల్ నియోజకవర్గం దుద్యాల గ్రామంలోని సర్వే నంబరు 369లో 6 ఎకరాల 26 గుంటల పట్టా భూమికి సంబంధించి ఎల్ఎఫ్(ల్యాండ్ ఫామ్) రోడ్డు నుంచి పట్టా భూమికి మార్పిడి చేసేందుకు 5 లక్షల లంచం డిమాండ్ చేసినట్టు ఏసీబీ అధికారులు వెల్లడించారు. హైదరాబాద్ సిటీ యూనిట్-1కి చెందిన ఏసీబీ అధికారులు సోమవారం సాయంత్రం 6.45 గంటల సమయంలో సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించి లంచం తీసుకుంటున్న అధికారులను పట్టుకున్నారు. ఏవో దానయ్య నుంచి లంచం మొత్తం రికవరీ చేసినట్లు వెల్లడించారు. ఏవో దానయ్య, సీనియర్ అసిస్టెంట్ మాణిక్ రావును అరెస్టు చేసి పీఆర్ఎల్ ఎదుట హాజరుపరిచారు.

జాతీయ మీడియాకు.. హైదరాబాద్ సీపీ ఆనంద్ క్షమాపణలు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జాతీయ మీడియా ప్రతినిధితో దురుసుగా మాట్లాడినందుకు హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ సీపీ ఆనంద్ క్షమాపణలు తెలిపారు. తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నట్లు వెల్లడించారు. సోమవారం ఈ మేరకు ఎక్స్‌లో ఓ పోస్టు చేశారు. "పుష్ప-2 ప్రీమియంషో సందర్భంగా సంధ్య థియేటర్‌లో జరిగిన ప్రమాద ఘటనపై జాతీయ మీడియా ప్రశ్నలు అడిగిన సందర్భంలో నేను సహనాన్ని కోల్పోయాను. జాతీయ మీడియా గురించి అనవసర వ్యాఖ్యలు చేశాను. నేను ప్రశాంతంగా ఉండాల్సింది. నా వ్యాఖ్యలకు చింతిస్తున్నాను. నా వ్యాఖ్యలను మనస్ఫూర్తిగా వెనక్కి తీసుకుంటున్నాను" అని ఆయన ఆ పోస్టులో పేర్కొన్నారు.

పోలవరం ముంపుపై సంయుక్త సర్వే!

ముర్రేడువాగు, కిన్నెరసాని వాగులకే పరిమితం!

- ఆంధ్రప్రదేశ్ నిర్ణయం.. నలుగురు అధికారులకు బాధ్యతలు
- సర్వేతో పాక్షిక ప్రయోజనమేనంటున్న తెలంగాణ
- బచావత్ ట్రిబ్యునల్ అనుమతులకు విరుద్ధంగా పోలవరండిజైన్ అని ఆరోపణ

హైదరాబాద్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టులో 150 అడుగుల గరిష్ఠ నీటిమట్టం (ఎఫ్ఆర్ఎల్) దాకా నీటిని నిల్వ చేస్తే.. తెలంగాణ భూభాగంలో ముంపునకు గురయ్యే ప్రాంతాలను గుర్తించడానికి (డీమార్కేషన్‌కు)గాను సర్వే చేసేందుకు ఆంధ్రప్రదేశ్ ముందుకొచ్చింది. ఇందుకోసం నలుగురు అధికారులకు బాధ్యతలు కట్టబెడుతూ ఆ సమాచారం తెలంగాణకు ఇచ్చింది. తెలంగాణ కూడా సమ్మతి తెలిపి, తగిన తేదీలు ప్రకటిస్తే వెనువెంటనే సర్వే, డీమార్కేషన్ ప్రక్రియ ముందుకు కదిలే అవకాశం ఉంది. పోలవరం ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటి నిల్వ ఉంటే.. తెలంగాణలోని కిన్నెరసాని, ముర్రేడు వాగు నదుల నీరు గోదావరిలోకి సాఫీగా ప్రవహించదు. గోదావరిలో కలిసేందుకు వీల్లేకపోతే ఈ వరద.. పంట పొలాలను ముంచెత్తుతుంది. దీంతో ఈ ముంపు ఏ మేరకు ఉంటుందో సర్వే చేసి.. తగిన చర్యలు తీసుకోవాలని జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్జీటీ) ఆదేశించిన విషయం విదితమే. సుప్రీంకోర్టు కూడా 2022 సెప్టెంబరు 6న ఇదే తీర్పు వెలువరించింది. దీనిపై కేంద్ర జలశక్తి శాఖ రంగంలోకి దిగి.. కేంద్ర జలవనరుల సంఘం(సీడబ్ల్యూసీ) ఆధ్వర్యంలో కమిటీని నియమించింది. ఆ తర్వాత సీడబ్ల్యూసీ పలు సమావేశాలు నిర్వహించి, ముంపు ప్రాంతాలను గుర్తించాల్సిందేనని ఆదేశాలిచ్చింది. మరోవైపు



2022లో భారీ వరదలతో ఈ సమస్య మరింత తీవ్రమయింది. వాస్తవానికి 2021 ఏప్రిల్ 17 నుంచి 29 దాకా జాయింట్ సర్వే జరిగినప్పటికీ క్షేత్ర స్థాయిలో ముంపు ప్రాంతాన్ని గుర్తిస్తూ డీమార్కింగ్ చేయలేదు. దాంతో తాజా నిర్ణయంతో మరోమారు సర్వేతోపాటు డీమార్కేషన్ ప్రక్రియ ముందుకు కదలనుంది.

పాక్షిక ప్రయోజనమే...

సంయుక్త సర్వే, డీమార్కేషన్‌తో పాక్షిక ప్రయోజనమే కలగనుంది. ముంపు ప్రభావం తీవ్రంగానే ఉండటంతో తెలంగాణ ప్రభుత్వం ఎప్పటికప్పుడు అభ్యంతరాలు వ్యక్తం చేస్తూనే ఉంది. 1986లో 27 లక్షల క్యూసెక్కుల వరద వస్తే.. భద్రాచలం వద్ద 76.5 అడుగుల ఎత్తుతో గోదావరి ప్రవహించిందని, తిరిగి 2022 ఆగస్టులో 24.50 లక్షల క్యూసెక్కుల వరద రాగా 71 అడుగుల ఎత్తుతో గోదావరి ప్రవహించిందని గుర్తు చేసింది. 1986 వరద కన్నా 2022లో వచ్చిన వరద తక్కువే ఉన్నప్పటికీ ముంపు తీవ్రత అధికంగా ఉందని, ఏకంగా 106 గ్రామాలు ముంపునకు గురయ్యాయని, 16 వేల ఇళ్లు నీటమునిగాయని తెలిపింది.

తెలంగాణ అభ్యంతరాలు ఇవీ..

- గోదావరి ఉపనదుల ప్రవాహాన్ని కూడా పోలవరం బ్యాక్‌వాటర్ అడ్డుకోనుంది. భద్రాచలం వద్ద గోదావరికి కుడి, ఎడమ వైపున ప్రవహించే కిన్నెరసాని, ముర్రేడువాగు, పెద్దవాగు, ఎద్దులవాగు, పాములేరువాగు, తుర్బాగవాగులు గోదావరిలో కలవకుండా ఆ ప్రవాహం వెనక్కితన్నితే వందలాది ఎకరాల మేర భూములు నీట మునుగుతాయి. 60 గ్రామాలపై ఆ ప్రభావం ఉంటుంది.
- పోలవరం ప్రాజెక్టును.. 36 లక్షల క్యూసెక్కుల నీటిని గేట్ల ద్వారా విడుదల చేసే సామర్థ్యంతో 140 అడుగుల ఎత్తులో కట్టేలా బచావత్ ట్రిబ్యునల్ అనుమతినిచ్చింది. కానీ, నిర్మాణంలో మాత్రం స్పిల్‌వే సామర్థ్యాన్ని 36 లక్షల నుంచి 50 లక్షలకు పెంచారు. అదీ 140 అడుగుల ఎత్తులో నుంచే 50 లక్షల క్యూసెక్కుల వరద వెళ్లేలా డిజైన్ చేశారు.
- 1988లో ఏపీఈఆర్ఎల్ (ఆంధ్రప్రదేశ్ ఇంజనీరింగ్ వాటర్ రీసెర్చ్ లేబొరేటరీ) నివేదికలో గోదావరికి 36 లక్షల క్యూసెక్కుల వరద మాత్రమే వస్తుందని ఉండగా, 2009లో సీకో నివేదికలో 40 లక్షల క్యూసెక్కుల దాకా వరద రావచ్చని ఉంది. అదే 2021లో సీడబ్ల్యూసీ మాత్రం 28 లక్షల నుంచి 36 లక్షల క్యూసెక్కుల దాకా వరద రావచ్చని నివేదిక ఇచ్చింది. 2019లో ఐఐటీ రూర్కీ నివేదిక 58 లక్షల క్యూసెక్కుల వరద రావచ్చునని పేర్కొంది. ఆయా సంస్థల నివేదికలు పరస్పర విరుద్ధంగా ఉన్నందున ముంపుపై స్వతంత్ర అధ్యయనం అవసరం.
- 1990కి ముందున్న నదీ స్వభావం ఆధారంగా ఉన్న పరిస్థితులతో అధ్యయనాలు జరిగాయి. కాలానుగుణంగా నదీ గర్భంలో మార్పులు చోటుచేసుకున్నాయి. వీటినీ పరిగణనలోకి తీసుకొని తాజాగా వరదపై అధ్యయనం జరగాలి. పోలవరం రిజర్వాయర్‌లో నీటి నిల్వ ఉన్న సమయంలో 50 లక్షల క్యూసెక్కుల వరద వస్తే.. పోలవరం ప్రాజెక్టు నుంచి వెనుకకు 146 కిలోమీటర్ల దూరంలో ఉన్న దుమ్ముగూడెం దాకా ముంపు ప్రభావం ఉంటుంది.

రాష్ట్రంలో 'డిటెన్షన్' ఇప్పుడే కాదు!

- అమలు చేస్తే డ్రాపౌట్లు పెరుగుతాయనే ఆందోళన

హైదరాబాద్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యలో 'నో డిటెన్షన్' విధానాన్ని రద్దు చేస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయం తెలంగాణలో ఇప్పుడే అమల్లోకి వచ్చే అవకాశం లేదు. ఈ నిర్ణయాన్ని రాష్ట్రంలో అమలు పరచకూడదని ప్రాథమికంగా ప్రభుత్వం నిర్ణయించినట్టు సమాచారం. ఇప్పటికిప్పుడు ఈ నిర్ణయాన్ని అమలు చేస్తే విద్యార్థులు నష్టపోతారని అంచనా వేస్తున్నారు. ఈ అంశంపై విస్తృతంగా చర్చించిన తర్వాతే తుది నిర్ణయం తీసుకోవాలని, అప్పటి వరకు పాత విధానాన్నే అమలు చేయాలని భావిస్తున్నారు. 5, 8వ తరగతుల్లో నో డిటెన్షన్ విధానాన్ని రద్దు చేస్తున్నట్టు కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్‌ను జారీ చేసింది. అంటే ఈ రెండు తరగతుల్లో వార్షిక పరీక్షల్లో పాసైన విద్యార్థులనే పై తరగతులకు పంపిస్తారు. ఒకవేళ ఫెయిల్ అయితే రెండు నెలల్లో నిర్వహించే పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. ఆ పరీక్షల్లోనూ ఫెయిలైతే మళ్లీ 5, లేదా 8వ తరగతులే చదవాల్సి ఉంటుంది. ఈ నిర్ణయం ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ పరిధిలోని స్కూళ్లకు వర్తించనుంది. ప్రస్తుతం ఉన్న సమాచారం ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పట్లో ఈ విధానాన్ని అమలు చేసే ఆలోచన చేయడం లేదు. కేంద్రం తీసుకున్న విధానాన్ని రాష్ట్రంలో అమలు పరిస్తే.. పాఠశాల విద్యలో డ్రాపౌట్ల సంఖ్య పెరిగే అవకాశం ఉంటుందని అంచనా వేస్తున్నారు. తద్వారా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల సంఖ్య పడిపోవడంతో పాటు పేద వర్గాలకు విద్య మరింత దూరమయ్యే ప్రమాదం ఉంటుందని భావిస్తున్నారు. కాగా, రాష్ట్రంలో డిటెన్షన్ విధానాన్ని అమలు చేస్తే పేదలు విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందని యూటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు జంగయ్య, చావ రవి అభిప్రాయపడ్డారు. కేంద్ర నిర్ణయాన్ని రాష్ట్రంలో అమలు చేస్తే ప్రభుత్వ విద్యా సంస్థల్లో డ్రాపౌట్స్ పెరుగుతారని సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

రైతు భరోసాపై బీఆర్ఎస్ కొత్త నాటకం

- పదేళ్లలో రైతులను ముంచేసి.. ఇప్పుడు డ్రామాలు
- రైతుబంధుతో 21వేల కోట్లు దుర్వినియోగం
- బహిరంగ లేఖలతో అన్నదాతలను గందరగోళపర్చే యత్నం: తుమ్మల



హైదరాబాద్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రైతు భరోసాపై బీఆర్ఎస్ నేతలు కొత్త నాటకాలకు తెరలేపుతున్నారని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆరోపించారు. అసెంబ్లీ సమావేశాల్లో రైతు భరోసాపై చర్చ పెట్టి అభిప్రాయాలు చెప్పాలని అడిగితే.. బీఆర్ఎస్‌కు చెందిన మాజీ మంత్రులు ఇప్పుడు నాటకాలు ఆడుతున్నారన్నారు. రైతు భరోసాపై ప్రభుత్వాన్ని నిలదీయాలని కేటీఆర్, హరీశ్ పిలుపునిచ్చిన నేపథ్యంలో.. మంత్రి తుమ్మల సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. గత ప్రభుత్వం ఇచ్చిన ఒకే ఒక రైతుబంధు'లో కూడా రూ.21 వేల కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని విమర్శించారు. అలాంటి వాళ్లు ఇప్పుడు తమ ప్రభుత్వం కొన్ని మార్పులు చేసి సాగులో ఉన్న భూమికి రైతు భరోసా ఇద్దామని అంటే కొత్త కొత్త నాటకాలకు తెర తీస్తున్నారని ధ్వజమెత్తారు. లేఖలతో రైతులను గందరగోళానికి గురిచేయాలని చూస్తున్నారన్నారు. గత పదేళ్లలో ఎన్నడూ లేని విధంగా రైతు సంక్షేమానికి బడ్జెట్‌లో 35 శాతం ప్రకటించి, ఖర్చు చేసినందుకా ఈ ప్రభుత్వాన్ని నిలదీయమంటున్నారు? అని ప్రశ్నించారు. రైతుబంధు పథకంలో 2019-20లో రెండు పంట కాలాల్లో మీరు పూర్తిగా డబ్బులు చెల్లించని మాట వాస్తవం కాదా? అని నిలదీశారు. 2023 యాసంగి రైతుబంధు రూ.7,600 కోట్లు ఎగ్గొట్టారని ఆరోపించారు. పంట నష్టం సంభవిస్తే పరిహారం ఇవ్వకపోగా.. కనీసం రైతులను పరామర్శించని వారు, నెల రోజుల్లోనే పంట నష్ట పరిహారం చెల్లించిన ఈ ప్రభుత్వాన్నా ప్రశ్నించమనేది? అని దుయ్యబట్టారు.

కార్పొరేషన్ల పనితీరు మార్చుకోవాలి!

ప్రతి కార్పొరేషన్ దీర్ఘకాలిక లక్ష్యాలను నిర్దేశించుకొని పని చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. కార్పొరేషన్ల ఆర్థిక పరిపుష్టికి కృషి చేయాలన్నారు. కార్పొరేషన్ల పనితీరు మార్చుకొని, ప్రభుత్వ ప్రాధమ్యాలకు అనుగుణంగా పనిచేయాలని సూచించారు. సోమవారం సచివాలయంలో వ్యవసాయ, చేనేత అనుబంధ కార్పొరేషన్ల ఎండీలు, అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఉద్యాన శాఖ ద్వారా హైదరాబాద్ నుంచి 100 కిలోమీటర్ల పరిధిలోని అన్ని జిల్లాల్లో పలు రకాల కూరగాయలు పండించడానికి, వాటి మార్కెటింగ్‌కు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

10 లక్షల ఉద్యోగాల హామీని నిలబెట్టుకున్నాం

- రోజ్‌గార్ మేళాలో కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్
- అభ్యర్థులకు నియామక పత్రాల అందజేత

బిట్స్‌పిలానీ, చార్మినార్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): దేశంలోని 10 లక్షల మంది యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని ఇచ్చిన హామీని తమ ప్రభుత్వం నిలబెట్టుకున్నదని కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ అన్నారు. సోమవారం రోజ్‌గార్ మేళా (ఉద్యోగ ఉపాధి) 14వ ఎడిషన్‌లో భాగంగా వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన కార్యక్రమాల్లో మంత్రులు పాల్గొని మాట్లాడారు. పాతబస్తీ చాంద్రాయణగుట్టలోని సీఆర్‌పీఎఫ్ గ్రూప్‌సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఉద్యోగ నియమక పత్రాల అందజేత కార్యక్రమంలో కిషన్‌రెడ్డి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగం, కుటుంబంతో పాటు దేశ సేవలో యువత నీతి నిజాయితీతో విధులు నిర్వహించాలన్నారు. అప్పుడే దేశం అన్ని రంగాల్లో



నియామక పత్రం అందజేస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

అభివృద్ధి సాధిస్తుందని పేర్కొన్నారు. మోదీ సూచన మేరకు 2020 అక్టోబరు నుంచి ప్రారంభించిన రోజ్‌గార్ మేళాలో, నేటి వరకు దాదాపు పది లక్షల మంది నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి కల్పించామని తెలిపారు. ఈ సందర్భంగా తెలుగు రాష్ట్రాలకు చెందిన దాదాపు 526 మంది యువతకు ఆయన నియమక పత్రాలను అందించారు. జవహర్ నగర్ కార్పొరేషన్ పరిధిలోని హకీంపేట్‌లోని సీఐఎస్ఎఫ్ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో బండి సంజయ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ రంగాలతో పాటు ప్రైవేట్ రంగంలోనూ భారీ సంఖ్యలో ఉద్యోగాల కల్పన కోసం కృషి చేస్తున్నామని హామీ ఇచ్చారు. మరో 75 వేల మందికి ఉద్యోగాలు కల్పిస్తే తమ లక్ష్యం పూర్తవుతుందన్నారు. ఇవే కాకుండా యువత స్వయం శక్తితో ఎదిగే విధంగా ప్రభుత్వ రుణాలను అందిస్తూ వారిని పారిశ్రామికవేత్తలుగా ఎదిగేలా ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. 2028 నాటికి ప్రపంచ దేశాలలో మన దేశం ఆర్థికంగా మూడో స్థానానికి చేరుతుందని వివరించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల్లో ఉద్యోగాలు పొందిన 348 మంది అభ్యర్థులకు నియామక పత్రాలను అందించారు.

దేశ నిర్మాణంలో పీవీ పాత్ర కీలకం

- కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే
- దేశాన్ని సంక్షోభం నుంచి ప్రగతి వైపు మళ్లించిన తెలంగాణ ముద్దుబిడ్డ: సీఎం
- పీవీ తెలంగాణలో పుట్టడం అదృష్టం: భట్టి
- పీవీ వర్ధంతి సందర్భంగా జ్ఞానభూమిలో మంత్రులు, వివిధ పార్టీల నేతల నివాళులు

న్యూఢిల్లీ/హైదరాబాద్/రాంగోపాల్‌పేట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): దేశ నిర్మాణంలో మాజీ ప్రధాని పీవీ నరసింహారావుది కీలక పాత్ర అని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కొనియాడారు. పీవీ ప్రధానిగా ఉన్న సమయంలో దేశం అనేక మైలురాళ్లను అధిగమించిందని గుర్తు చేశారు. పీవీ సాహసోపేతమైన ఆర్థిక సరళీకరణ విధానం మధ్య తరగతి వృద్ధి, సంక్షేమానికి ఎంతగానో ఉపయోగపడిందన్నారు. ఆయన పాలనలో మధ్య తరగతి రూపురేఖలను మార్చేశారని పేర్కొన్నారు. సోమవారం పీవీ వర్ధంతి సందర్భంగా పార్టీ చీఫ్ ఖర్గే, సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నివాళులర్పించాయి. ఆయన సేవలను గుర్తు చేసుకున్నాయి. 'సంక్షోభం నుండి సమున్నత శిఖరాలకు.. భారత ప్రస్థానానికి బాటలు వేసిన తెలంగాణ ముద్దుబిడ్డ. పీవీ నరసింహారావుకు ఘన నివాళి' అని సీఎం ఎక్స్‌లో పేర్కొన్నారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో పీవీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఇటు నెక్లెస్ రోడ్డు పీవీ మార్గ్‌లోని పీవీ జ్ఞానభూమిలో మంత్రులు, కాంగ్రెస్, వివిధ పార్టీల నేతలు వేర్వేరుగా నివాళులర్పించారు. పీవీ నరసింహారావు తెలంగాణలో పుట్టడం అందరి అదృష్టమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. పీవీ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తెచ్చిన అనేక సంస్కరణలు ఇప్పటికీ రాష్ట్ర పాలనలో ఉపయోగపడుతున్నాయన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలో ఉన్నప్పుడు ప్రధానిగా బాధ్యతలు చేపట్టి గ్లోబలైజేషన్, లిబరలైజేషన్ వంటి కార్యక్రమాలతో దేశాన్ని ప్రపంచంతో పోటీ పడే స్థాయికి తీసుకువెళ్లారని చెప్పారు. పీవీ అందరివాడని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కరీంనగర్ ముద్దుబిడ్డ పీవీ.. ఒక మారుమూల గ్రామంలో జన్మించి ప్రపంచ స్థాయి గుర్తింపు సాధించిన ఘనుడని కొనియాడారు. దేశ ఆర్థిక, సామాజిక వ్యవస్థను ప్రక్షాళన చేసేందుకు అన్ని విధాలుగా ప్రయత్నాలు చేసిన వ్యక్తి పీవీ అని మంత్రి శ్రీధర్ బాబు చెప్పారు. ఎకరా, రెండెకరాలున్న పేదలు



పీవీ ఘాట్‌వద్ద నివాళులు అర్పిస్తున్న భట్టి, చిత్రంలో తుమ్మల

కూడా వ్యవసాయం చేసుకోగలుగుతున్నారంటే అది పీవీ చలవేనని.. ఆయన తెచ్చిన భూసంస్కరణల వల్లే అది సాధ్యమైందని మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. ఆనాడు కేంద్ర మానవ వనరుల మంత్రిగా పీవీ తీసుకున్న నిర్ణయాల కారణంగానే విద్యావ్యవస్థ ప్రణాళికాబద్ధంగా నడుస్తోందని చెప్పారు.

పీవీవి విశేష సేవలు: కిషన్‌రెడ్డి

పీవీ దేశానికి విశేష సేవలు అందించారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు ప్రధానిగా బాధ్యతలు చేపట్టి అనేక రకాల ఆర్థిక సంస్కరణలు తెచ్చారని కొనియాడారు. కేంద్ర ప్రభుత్వం తరఫున ఆయనకు ఘన నివాళులన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ కూడా పీవీకి దేశంలోనే అతి పెద్ద పురస్కారం ప్రకటించి.. ఆయన చరిత్రను ముందుకు తీసుకువెళ్లారని చెప్పారు. పీవీకి నివాళులర్పించిన వారిలో బీజేపీ ఎంపీ లక్ష్మణ్, మాజీ మంత్రులు జానారెడ్డి, పొన్నాల లక్ష్మయ్య, తలసాని శ్రీనివాస్‌యాదవ్, మాజీ ఎంపీ కే.కేశవరావు, ఎమ్మెల్సీలు సురభి వాణీదేవి, బండా ప్రకాశ్, పీవీ కుటుంబ సభ్యులు, అభిమానులు ఉన్నారు.

అసెంబ్లీ లాంజ్‌లో.. గాంధీభవన్‌లో..

అసెంబ్లీలోని మెంబర్స్ లాంజ్‌లో పీవీకి స్పీకర్ ప్రసాద్‌కుమార్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి నివాళిని అర్పించారు. పీవీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఇందులో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, టీజేఎస్ ఎమ్మెల్సీ కోదండరాం తదితరులు పాల్గొన్నారు. మరోవైపు.. గాంధీభవన్‌లో పీవీ చిత్రపటానికి టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, ప్రభుత్వ సలహాదారు హర్కార వేణుగోపాల్, టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు కుమార్‌రావు తదితరులు నివాళులర్పించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.